వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 11 హైదరాబాద్ 112 నవంబర్ 2010 పేజీలు : 68 రు. 10

* ఫోకస్ : యాభై నాలుగేళ్ల ఆంధ్రప్రదేశ్
* బాబ్రీ మసీదు స్థలంపై హైకోర్టు తీర్పు
* ప్రాణాల్ని బలిగొంటున్న సూక్ష్మ రుణాలు
* ఆయేషా మీరా కేసు - సత్యంబాబుకు శిక్ష
* కాశ్మీర్‌పై ఢిల్లీ సభ - ఒక వక్త నివేదిక
* తెలంగాణ ప్రజాఫ్రంట్
* కాపిటల్ చదవబోయే ముందు

మన గురించి మనం తెలుసుకుందాం!
ప్రాంతాలనూ ప్రజలనూ అర్థం చేసుకుందాం!

ఎనిమిది సంవత్సరాలుగా తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న సంభాషణకు అద్దం పడుతూ, ప్రతిఫలిస్తూ, ఆ సంభాషణకు తనవంతుగా కొత్త అంశాలు చేరుస్తూ వస్తున్న వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక జనవరి 2011 సంచిక నుంచి ఒక కొత్త ప్రయత్నాన్ని ప్రారంభిస్తూ మీ అందరినీ అందులో భాగం పంచుకోవలసిందిగా కోరుతున్నది. తెలుగు సమాజంలో ఉన్న వనరులు ఏమిటి? ఆ వనరులు ఉపయోగపడవలసిన ప్రజలు ఎవరు? ఆ ప్రజల చరిత్ర ఏమిటి? ఆ ప్రజల మధ్య వైవిధ్యం గాని, వైరుధ్యాలు గాని ఎలా ఉన్నాయి? ఆ ప్రజలు తమ నిత్య జీవితంలో ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? ఆ సమస్యలకు మూల కారణాలు, ఆ సమస్యలను తీవ్రతరం చేస్తున్న కారణాలు ఏమిటి? ఆ సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు ఏయే ప్రయత్నాలు చేస్తున్నారు? ఆ ప్రయత్నాల ఫలితంగా తెలుగు సమాజంలో వస్తున్న మార్పులు ఏమిటి? రాజకీయార్థశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే ఇవాళ్టి తెలుగు సమాజంలో ఉన్న ఉత్పత్తి సాధనాలు ఏమిటి, ఉత్పత్తి శక్తుల స్థితి ఏమిటి, ఉత్పత్తి సంబంధాల స్థితి ఏమిటి? ఈ ప్రశ్నలకు వాస్తవ భౌతిక పునాది ఆధారంగా జవాబులు చెప్పుకుంటే మనకు మన గురించి అవగాహన పెరుగుతుంది. మనం ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చామో, ఇవాళ ఎక్కడ ఉన్నామో, రేపు ఎటు వెళ్లవలసి ఉందో, అక్కడికి చేరగల మార్గాలేమిటో తెలుస్తుంది.

ఈ కృషిలో భాగంగా వీక్షణం రాష్ట్రంలోని ఒక్కొక్క జిల్లాను ప్రాతిపదికగా తీసుకుని పరిశీలన జరపాలని అనుకుంటున్నది. ఆ జిల్లాలో

భౌతిక, ప్రకృతి వనరులు *(భూమి, అడవులు, నదులు, ఖనిజాలు, వ్యవసాయం, పరిశ్రమలు, వగైరా)*

ప్రజలు *(చరిత్ర, ఉత్పత్తి సంబంధాలలో మార్పులు, కుల-మత-వర్గ పొందిక, రవాణా, విద్య, వైద్యం, వగైరా)*

ప్రజాసమస్యలు *(సాధారణంగా అంతటా ఉన్న సామాజిక సమస్యలు, ప్రత్యేకంగా ఆ జిల్లాలోనే ఉన్న సమస్యలు)*

ప్రజా పోరాటాలు *(ప్రజల ఆకాంక్షలు, వాటి పరిష్కారం కోసం జరిపిన, జరుపుతున్న పోరాటాలు)*

ఈ పరిశీలనలో భాగమవుతాయి.

స్థూలంగా ప్రకృతి, ప్రజలు, ప్రజాసమస్యలు, ప్రజాపోరాటాలు అనే నాలుగు వ్యాసాలుగా గానీ, ఒకటి రెండు వ్యాసాలు అదనంగా గానీ ఈ పరిశీలన ఉంటుంది.

ఈ కృషిలో తెలుగు సమాజంలోని ఆలోచనాపరులు, ప్రజా ఉద్యమ కార్యకర్తలు, ప్రజల అభ్యున్నతి గురించి శ్రద్ధాసక్తులు ఉన్న ప్రతిఒక్కరూ పాల్గొనాలని వీక్షణం కోరిక. ఈ ప్రణాళిక గురించి చర్చించడానికి వీక్షణం కార్యాలయంలో నవంబర్ 13, శనివారం జరిగే సమావేశానికి అందరూ ఆహ్వానితులే.

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,

హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www:veekshanam.wordpress.com

112

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

నవంబర్ 2010
సంపుటి : 8
సంచిక : 11

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ /
సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
3 సంవత్సరాల చందా	రు.	350
5 సంవత్సరాల చందా	రు.	550
10 సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం అకౌంట్ నెంబర్ –
013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్,
హైదరాబాద్

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
92468 26191

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

మైక్రో ఫైనాన్స్‌కు జనాన్ని బలి ఇస్తున్నదెవరు?

'నిరుపేద ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచడంలో కీలక సాధనం' అని సూక్ష్మరుణ – మైక్రో ఫైనాన్స్ – వ్యవస్థను ఐక్యరాజ్య సమితి, ప్రపంచబ్యాంకు అభివర్ణిస్తున్న సమయంలోనే రాష్ట్రంలో ఆరు వారాలలో యాభై మంది నిరుపేదలు సూక్ష్మ రుణాలను తిరిగి చెల్లించలేని దుస్థితిలో ఆత్మహత్యలు చేసుకున్నారు. పేదరిక నిర్మూలనా పథకాలలో ఒకటిగా ఆర్భాటంతో ప్రారంభమైన సూక్ష్మ రుణాల పథకం పేదరికాన్ని నిర్మూలించకపోగా, పేదలనే నిర్మూలిస్తోందన్న మాట. నిరుపేద ప్రజానీకానికి తక్షణ అవసరాలకు తగిన చిన్న మొత్తాలను అందించడానికి ద్రవ్య సంస్థలు ముందుకు రావడం లేదని, అందువల్ల ఆ పని చేయడానికి స్వయం సహాయ సంస్థలు, సూక్ష్మరుణ సంస్థలు అవసరమని ఈ వ్యవస్థను ప్రారంభించారు. అది నిరుపేదల నుంచి కోట్లాది రూపాయల సంపదను పెద్దలకు బదిలీ చేసే మరొక వాహికగా మారిపోయింది. పేదలను కొట్టి పెద్దలకు వేసే పాలకవర్గాల, సంపన్నవర్గాల కుటిల నీతికి ఇంతకన్న వేరే నిదర్శనం అవసరం లేదు. అన్ని సందర్భాలలో జరిగినట్టుగానే ఈ వ్యవస్థను రూపొందించి, ప్రోత్సహించి, లాభపడుతూ, కాపాడుతున్న వర్గాలే – పాలకవర్గాలే, లేదా అందులోని కొన్ని ముఠాలే – ఇప్పుడు ఇల్లెక్కి అరుస్తున్నాయి. ఏ సామాజిక పరిణామమయినా సంచలనాత్మకమయితే తప్ప పట్టించుకోని ప్రచార సాధనాలు ఇదంతా ఇప్పుడే మొదలయినట్టు గగ్గోలుపెడుతున్నాయి. గడిచిన నెలన్నరలో ఈ సూక్ష్మరుణాల దుర్మార్గం పెద్ద ఎత్తున బయటపడిన మాట, మైక్రోఫైనాన్స్ సంస్థల కలెక్షన్ ఏజెంట్లు మాఫియాల లాగ మారి రుణగ్రహీతల మీద దాడులు చేసిన మాట, కనీసం రోజుకొకరు చొప్పున ఈ సూక్ష్మరుణ బాధితులు ఆత్మహత్యలు చేసుకున్న మాట నిజమే. కాని ఇదంతా ఈ ఆరు వారాల సమస్య మాత్రమే కాదు. మనరాష్ట్రం వరకే చూస్తే ప్రపంచబ్యాంకు నిర్దేశించిన ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఈ సూక్ష్మ రుణాల మహమ్మారి వ్యాపించింది. ప్రజల దగ్గరినుంచి మిగులును సేకరించి ధనికుల బొక్కసాలు నింపడమే పాలకవర్గాల వ్యూహం అనుకుంటే, ప్రస్తుత సూక్ష్మరుణ వ్యవస్థ మిగులును కూడ కాదు, ప్రజల నెత్తుటినీ చెమటనూ వడ్డీ రూపంలో దోచి దేశదేశాల సంపన్నులకు కట్టబెడుతోంది. ఈ వడ్డీకి మూలమైన అసలును, అప్పును కూడ చాల సందర్భాలలో ఆ ప్రజల జీవితావసరాల కోసం కాక, వారికి ఎంతమాత్రం అవసరంలేని బహుళజాతి సంస్థల సరుకులకు మార్కెట్లను సృష్టించడం కోసమే, వారిని ఆ సరుకుల ఆరాధనలో పడేట్టు చేయడం కోసమే ఇచ్చారు. కనుక అసలు రూపంలోనైనా, వడ్డీ రూపంలోనైనా ఇది పేదల నుంచి ధనికులకు సంపదను దోచిపెట్టే పథకమే. ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో అరవై లక్షలకు పైగా కుటుంబాలు దాదాపు పదివేల కోట్ల రూపాయలు ఈ మైక్రోఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పు తీసుకున్నాయని తెలుస్తోంది. ఆ పదివేల కోట్ల రూపాయలు ఏ సరుకులు కొనడానికి ఖర్చయి చివరికి ఎవరి బొక్కసాల్లోకి చేరాయనేది అలా ఉంచినా, ఈ పదివేల కోట్ల రూపాయల మీద వడ్డీ రూపంలోనే కనీస పక్షం నాలుగువేల కోట్ల రూపాయలు ఈ మైక్రోఫైనాన్స్ సంస్థలకు చేరుతున్నదన్నమాట. అసలు ఈ సూక్ష్మరుణాలలో మౌలికంగానే ఇంత దోపిడీ వ్యూహం ఉండగా, ఈ పథకం అమలులో మరిన్ని దోపిడీ పద్ధతులు కలిసి ఉండడం ఇంకా ఘోరం. ఇవాళ చర్చ అంతా ఆ మౌలిక పథకం గురించి కన్న ఎక్కువగా పైపైన ఉన్న దోపిడీ పద్ధతుల దుర్మార్గం గురించే జరుగుతోంది. ఆ దోపిడీ పద్ధతులను 'నువు అనుమతించావు' అంటే 'నువు అనుమతించావు' అని అప్పుడు అధికారంలో ఉండినవారూ, ఇప్పుడు అధికారంలో ఉన్నవారూ ఒకరి రంగు ఒకరు బయటపెట్టుకుంటున్నారు. మొత్తం మీద ఈ పాపంలో ఇద్దరికీ భాగస్వామ్యం ఉందని మనకు తెలియజెపుతున్నారు. అలా ఒక కచ్చితమైన ఆర్థిక వ్యూహంతో, రాజకీయ ప్రాపకంతో ప్రవేశించిన ఈ సూక్ష్మరుణ సంస్థలు ఆర్థిక వనరులు పెరుగుతున్న కొద్దీ మాఫియాల్లా మారిపోయాయి. ఎక్కువ వడ్డీ రేట్లు, బహుళ జాతి సరుకుల సంస్థలతో కలిసి ప్యాకేజీలు చేసి అనవసరమైన సరుకుల కోసం అప్పులు ఇచ్చే ఆశ చూపడం, స్వయం సహాయక బృందాల నాయకులను పట్టుకుని తమ మార్కెట్ ను విస్తరించుకోవడం, బ్యాంకుల నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి సేకరించిన నిధులను అక్రమ మార్గాలలోకి మళ్లించడం, ఇచ్చిన అప్పులమీద బీమాలు చేయించి తమ నిధులకు హామీ పొందిన తర్వాత కూడ రుణ గ్రహీతల మీద హింసాపూరిత ఒత్తిడి తేవడం, అసలు–వడ్డీల చెల్లింపులను రాబట్టడానికి గూండా బలగాలను పోషించడం, స్థానిక ప్రభుత్వాధికారులతో కుమ్మక్కయి రుణగ్రహీతల మీద బలప్రయోగం చేయడం లాంటి అనేక అక్రమాలకు ఈ సంస్థలు పాల్పడుతున్నాయి. ఈ అక్రమాలను అడ్డుకోవలసిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉంది. ఆత్మహత్యలు పెరిగిపోయి ఇక ఏదో ఒక చర్య తీసుకోక తప్పని స్థితి వచ్చాక తూతూమంత్రంగా ఒక ఆర్డినెన్స్ తెచ్చింది గాని ఆ తప్పులతడక ఆర్డినెన్స్ ను కూడ సవాలు చేస్తూ సూక్ష్మరుణ సంస్థల యాజమాన్యాలు న్యాయస్థానానికి వెళ్లాయి. అప్పటికి నలభై మంది దాకా ఆత్మహత్యలు చేసుకుని చనిపోయి ఉంటే, న్యాయస్థానానికి ఆ మరణాలకు కారకులను ప్రశ్నించడానికి నోరు రాలేదు. సూక్ష్మరుణ సంస్థలు బతకకపోతే ఎట్లా అని ప్రశ్నించి ఆ బకాసురుల బతుకు కొరకు రోజుకొక మనిషిని బలి ఇవ్వవలసిందేనని అంది. ఇలా అన్ని వ్యవస్థలూ పేదప్రజలకు, రుణగ్రహీతలకు వ్యతిరేకంగా ఉన్నాయని గుర్తించడం, సంక్షేమ రాజ్యాన్నని చెప్పుకుంటున్నందుకయినా ఈ ప్రజల కడగండ్లను తీర్చవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని నిలదీయడం ఇవాళ్టి అవసరం.

వీ

విలువల పతనానికి తాజా ఉదాహరణ కర్ణాటక రాజకీయాలు

కర్ణాటకలో తమ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర శాసనసభలో మూడు రోజుల్లో రెండుసార్లు బలపరీక్షను ఎదుర్కొని నెగ్గడం తమ నైతిక విజయమని, భారత ప్రజాస్వామ్యపు బలానికి చిహ్నమని భారతీయ జనతా పార్టీ ప్రకటిస్తోంది. కాని ఈ బలపరీక్షలు జరపవలసి వచ్చిన నేపథ్యం, బలపరీక్షలు జరిగిన తీరు, ఈ మొత్తం వ్యవహారంలో గవర్నర్, శాసనసభ స్పీకర్, రాష్ట్ర హైకోర్టు వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ప్రవర్తించిన తీరు, రాష్ట్రంలోని ప్రధాన పక్షాలు భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్, జనతాదళ్ (సెక్యులర్) ప్రవర్తన చూస్తే పార్లమెంటరీ రాజకీయాలలో ఉన్న కుళ్లు, అక్రమాలు, దుర్మార్గాలు, వెన్నుపోట్లు, ధన ప్రాబల్యం, మాఫియా శక్తులు, ప్రజలపట్ల పట్టింపులేని తనం స్పష్టంగా బయటపడ్డాయి. ఈ దేశంలో పాలకవర్గాల పార్లమెంటరీ రాజకీయాలకు కనీస నీతినియమాలు లేవనే వాస్తవాన్ని భిన్న రాజకీయపక్షాలు పదేపదే రుజువు చేస్తున్నాయి. కర్ణాటకలో గత ఐదు సంవత్సరాలలో జరిగిన పరిణామాలను పైపైన పరిశీలించినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మీద అసహ్యం పుట్టక తప్పదు. మరీ వెనక్కి వెళ్లకపోయినా ఈ అక్రమాల చరిత్రను 2004 ఎన్నికల దగ్గరినుంచే చూసినా, 2004 ఎన్నికలలో మొదటిసారిగా ఏ ఒక్క పార్టీకీ పూర్తి ఆధిక్యత రాని సందిగ్ధ స్థితి నెలకొంది. 224 సభ్యుల శాసనసభలో 79 స్థానాలతో భాజపా, 64 స్థానాలతో కాంగ్రెస్, 58 స్థానాలతో జనతాదళ్ (ఎస్) ఒంటరిగానైనా, స్వతంత్ర అభ్యర్థులందరినీ కూడగట్టుకున్నా అధికారానికి రాలేని స్థితి ఏర్పడింది. అప్పుడు మొదట కాంగ్రెస్ – జెడి (ఎస్) ల మధ్య కలయిక ఏర్పడి కాంగ్రెస్ నాయకత్వాన మిశ్రమ ప్రభుత్వం ఏర్పడింది. రెండు సంవత్సరాలు గడవకముందే జెడి (ఎస్) నాయకుడు కుమారస్వామి మంత్రివర్గం నుంచి రాజీనామా చేసి రాజకీయ సంక్షోభం సృష్టించి, భాజపాతో పొత్తు పెట్టుకుని తానే ముఖ్యమంత్రిగా కొత్త మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పరిచాడు. మిగిలిన కాలంలో రెండు పార్టీలూ చెరిసగం సమయం ముఖ్యమంత్రిగా ఉండాలని ఒప్పందం చేసుకున్నాయి. కాని ఏడాది తిరగకుండానే అధికార కుమ్ములాటలో భాగంగా ఆ పొత్తు భగ్నమై పోయి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన వచ్చి, మళ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సారి ఎన్నికలలో భాజపాకు ప్రభుత్వం ఏర్పరచడానికి తగిన ఆధిక్యత రాకున్నా అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో అధికారం చేపట్టింది. ఆ ఎన్నికలలో గాలి జనార్దనరెడ్డి వంటి గనుల మాఫియా శక్తులు విచ్చలవిడిగా డబ్బు ప్రవహింపజేసి, ఓటర్లను భయపెట్టి ఆమాత్రం స్థానాలు సంపాదించుకున్నారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రతిపక్షాల నుంచి సభ్యులను కొనుక్కొని, ఉపఎన్నికలలో గెలిపించుకుని ఆధిక్యత తెచ్చుకున్నారు. ఇప్పుడు అందులోంచి కొందరు సభ్యులు కుమారస్వామితో, కాంగ్రెస్ తో చేతులు కలిపి ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నిస్తే, స్పీకర్ చేత వారిని తొలగింపజేసి, ఆ తొలగింపు వ్యాజ్యం హైకోర్టులో విచారణ జరుగుతుండగానే బలపరీక్ష జరిపించుకుని, అటువంటి బలపరీక్షలో నెగ్గడమే గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇంత అనైతికంగా, అక్రమంగా నడుస్తున్న రాజకీయాలను గౌరవించవలసిందేనా?

ఒబామా చక్కబెట్టబోయేదేమిటి?

ఢిల్లీకి దేశంలోని పల్లెలకన్న మాస్కో, లండన్, వాషింగ్టన్ దగ్గరయ్యాయి. దేశ ప్రజల అవసరాలను తీర్చే బాధ్యత కన్న రష్యన్, బ్రిటిష్, అమెరికన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తల, బహుళజాతి సంస్థల ప్రయోజనాల హామీ ఒప్పందాలు కుదుర్చుకోవడమే ఢిల్లీకి ముఖ్యమైపోయింది. మార్చిలో రష్యా ప్రధాని వ్లాదిమిర్ పుతిన్ వచ్చాడు. యాభైవేల కోట్ల రూపాయల ఖరీదు చేసే విద్యుత్, రక్షణ, టెలికమ్యూనికేషన్ రంగాల సామగ్రి భారత ప్రభుత్వానికి అమ్మిపోయాడు. అందులో ఇరవై వేల కోట్ల రూపాయలు ఒక విమానవాహక యుద్ధనౌక, దాని పరికరాలు, శిక్షణ ఖరీదే. అదికాక ఇరవై మిగ్ యుద్ధ విమానాలు కూడ ఆ జాబితాలో ఉన్నాయి. జూలైలో బ్రిటిష్ ప్రధాని డేవిడ్ కామెరూన్ వచ్చి అమ్మిపోయిన సరుకులలో నాలుగువేల కోట్ల రూపాయలు ఖరీదుచేసే 57 హాక్ జెట్ యుద్ధ విమానాలతో పాటు మరెన్నో సరుకులు ఉన్నాయి. ఇక తన వ్యాపారం కూడ చేసుకోవడానికి అమెరికన్ ప్రభుత్వాధినేత బారక్ హుసేన్ ఒబామా నవంబర్ మొదటి వారంలో వస్తున్నాడు. ఈ పర్యటనకు రాజకీయ, వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని ప్రచార సాధనాలు బహిరంగంగానే రాస్తున్నాయి. భారత – అమెరికా పౌర అణు ఒప్పందాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ఒత్తిడి తేవడం, రక్షణ సామగ్రి కొనుగోళ్ళపై ఉన్నగరిష్ట పరిమితి తొలగించి ఇంకా ఎక్కువ ఆయుధాలు కొనడానికి ఒప్పించడం, భారత వైమానిక దళానికి అవసరమైన యాభై వేల కోట్ల రూపాయల యుద్ధవిమానాలను కొనిపించడం, అఫ్ఘనిస్తాన్ యుద్ధానికి సహాయం చేయడానికి ఒప్పించడం వంటి ఎజెండా గురించి పత్రికలు రాస్తున్నాయి. ఇప్పటిదాకా దేశంలోని చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశం మీద ఆంక్షలు ఉన్నందువల్ల వ్యాపార దిగ్గజం వాల్ మార్ట్ రాలేకపోతున్నదని, ప్రస్తుతం ఒబామా భారత ప్రధానిని ఒప్పించి ఆ ఆంక్షలు ఎత్తివేయిస్తాడనీ, ఆ పనికి తగిన సన్నాహాలు చేయడానికి వాల్ మార్ట్ అధినేత మైక్ డ్యూక్ వారం ముందరే వస్తున్నాడని వాణిజ్య పత్రికలు రాస్తున్నాయి. ఇదంతా చదువుతుంటే ఈ పర్యటనలు జరుపుతున్నవాళ్లు రాజకీయ, ప్రభుత్వాధినేతలని అనిపిస్తున్నదా? వ్యాపారవేత్తల బ్రోకర్లు, సేల్స్ మెన్ అనిపిస్తున్నదా? నిజంగా ఒక ప్రభుత్వాధినేత, రాజకీయ అధినేత మరొక దేశానికి అతిథిగా వెళ్లడంలో తప్పు పట్టవలసిందేమీలేదు. పరాయి దేశంలో తెలుసుకోవలసినవి ఎన్నో ఉండవచ్చు. అంతర్జాతీయ సమాజంలో సభ్యులుగా ఒక దేశాధినేత మరొక దేశాధినేతతో సంభాషించవలసిన అంశాలెన్నో ఉండవచ్చు. దౌత్య సంబంధాలు నెరపడానికైనా, పర్యటన కోసమైనా, స్నేహపూర్వకంగానైనా ఒక దేశాధినేత మరొక దేశానికి రావచ్చు. కాని ఈ మూడు పర్యటనలు చూస్తుంటే చాల స్పష్టంగా ఈ దేశాధినేతలు తమ దేశాల వ్యాపారుల ప్రయోజనాల కోసం, పచ్చిగా చెప్పాలంటే కోట్ల డాలర్ల వ్యాపార సరుకులు అమ్మడం కోసం మాత్రమే వస్తున్నారని అర్థమవుతోంది. ఈ దేశప్రజల అభిమతాన్ని తెలుసుకోవడం కోసం మాత్రమే వచ్చిన బ్రిటిష్ ప్రతినిధులు సైమన్ ను, క్రిప్స్ ను, అటువంటి ఎందరినో గో బ్యాక్ అని నినదించి, ప్రతిఘటించిన గొప్ప వారసత్వపు దేశం ఏమయిపోయింది? వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : యాభై నాలుగవ ఏట ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు

1956 నవంబర్ 1న జీవనయానం ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఒడిదుడుకులను దాటి అభివృద్ధి వెలుగు నీడలను నిక్షిప్తం చేసుకుంటూ బహుశా అతికొద్దిమందికి వెలుగునూ, కోట్లాది మందికి చీకటినీ పంచుతూ యాభై నాలుగేళ్లు సాగివచ్చింది. సరిగ్గా ఈ యాభై నాలుగో సంవత్సరమే దీని ఉనికి యథాతథంగా ఉంటుందా? అసలు ఆంధ్రప్రదేశ్ అనేదే కనుమరుగవుతుందా? అనే ఆందోళనలు చెలరేగాయి. శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు వల్ల ఆ ఆందోళనలు కొన్ని నెలలు వాయిదా పడినా, రానున్న సంవత్సరంలో అయినా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అటో ఇటో తేలిపోతుంది. భౌగోళికంగానూ, రాజకీయంగానూ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఏమైనా, సామాజికంగా మాత్రం ఈ అయిదున్నర దశాబ్దాల ప్రయాణాన్ని అంచనా కట్టడానికి చేసిన ప్రయత్నం ఈ నెల ఫోకస్. ఆంధ్రప్రదేశ్ సమాజపు అసమానతలకు, అసమగ్రతకు సూచికగానే ఈ మదింపు కూడా అసమానంగా, అసమగ్రంగా మిగిలిపోతోంది. కనీసం భవిష్యత్తు పునఃసమీక్షకు ఆధారంగా నిలవడానికయినా ఈ వ్యాసాలు.

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు.
'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు




చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్

(ఉ.10 నుంచి సా. 6 గం. వరకు) 040-66843495




- **చదువుల సారం – 1 – కథలు విందాం** – మంచి పుస్తకం – జన విజ్ఞాన వేదిక ప్రచురణ – 167 పేజీలు, 1/8 డెమీ, రు. 85
- **చదువుల సారం – 2 – ఆడుకుందాం** – మంచి పుస్తకం – జన విజ్ఞాన వేదిక ప్రచురణ – 107 పేజీలు, 1/8 డెమీ, రు. 55




  పై రెండు ప్రతులకు : జన విజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం, 162, విజయలక్ష్మి నగర్, నెల్లూరు – 524004; ఫోన్ : 9440503061; మంచి పుస్తకం, 12–13–450, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్ – 500017; ఫోన్: 9490746614;

  ఇమెయిల్ : info@manchipustakam.in, website : www.manchipustakam.in
- **మా బాలగోపాల్** – బులెటిన్ – 11 – మానవ హక్కుల వేదిక ప్రచురణ, 167 పేజీలు, 1/8 క్రౌన్, రు. 15
- **హక్కుల ఉద్యమం – తాత్విక దృక్పథం** – కె. బాలగోపాల్ – మానవ హక్కుల వేదిక ప్రచురణ, 248 పేజీలు, 1/8 డెమీ, రు. 100
- **డెమోక్రసీ – దయలాగ్స్ (సి.డి.)** – స్పీచెస్, ఇంటర్వ్యూస్ ఆఫ్ బాలగోపాల్ (ఇంగ్లిష్) వాల్యూమ్ 1, 2 – మానవ హక్కుల వేదిక ప్రచురణ, రు. 50

  పై రెండు ప్రతులకు, సి.డి.ల కోసం : ఎస్. జీవన్ కుమార్, 3–12–117/ఎ–2/1, పి.ఎస్. కాలనీ, గణేష్‌నగర్, రామంతపూర్, హైదరాబాద్ – 500013; ఫోన్: 040–27039519; ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్‌హౌస్; website : www.humanrightsforum.org; www.balagopal.org
- **మావోయిస్ట్స్ ఇన్ ఇండియా** (ఇంగ్లిష్) – రైటింగ్స్ అండ్ ఇంటర్వ్యూస్ – ఆజాద్ (ఇమెయిల్ friendsofazad@gmail.com)– ఫ్రెండ్స్ ఆఫ్ ఆజాద్ – 133 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పి. వరవరరావు, 203, లక్ష్మి అపార్ట్‌మెంట్స్, నల్గొండ్ క్రాస్ రోడ్స్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036.
- **కోస్తా కాలుష్య కాసారంలో నిప్పుకణికలై మండుతున్న... సోంపేటలు** – సి.పి.ఐ. (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ ప్రచురణ – 74 పేజీలు, 1/8 డెమీ, రు. 20
- **1948 సెప్టెంబర్ – 17 – విద్రోహం** – సి.పి.ఐ. (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ ప్రచురణ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 20

  పై రెండు ప్రతులకు : ప్రజాపంథా, మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ – 500044; సహచర బుక్‌మార్క్, దిశ బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, మైత్రీ బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్
- **కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా?** – పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ, ఒ.పి.డి.ఆర్. అధ్యయన బృందం నివేదిక – తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణ, 64 పేజీలు, 1/8 డెమీ, రు.15, ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ – 2, ఫోన్ : 9848631604
- **రామ్‌మనోహర్ లోహియా** – శతజయంతి సంచిక – సంకలనం : రావెల సోమయ్య – రామ్‌మనోహర్ లోహియా సమతా ట్రస్ట్ ప్రచురణ, డాక్టర్ లోహియా శతజయంతి ఉత్సవ సమితి,116 పేజీలు, 1/4 క్రౌన్, రు.200, ప్రతులకు : రావెల సోమయ్య, 101, గోదా నిలయం, మయూరి మార్గ్, బేగంపేట్, హైదరాబాద్ – 500016, ఫోన్ : 040 27760124, 8121898440




వీక్షణం అక్టోబర్ 2010 సంచికలో వచ్చిన 'స్విస్ బ్యాంక్ నిల్వలకు ప్రభుత్వ అండ' అనే అంశంపై కె.వి. కూర్మనాథ్ వ్యాసంలో నల్లధనం గురించి ఎన్నో విషయాలను తెలియజేసినారు. వారికి కృతజ్ఞతలు. నిజానికి వీక్షణం ఫిబ్రవరి 2009 సంచికలో 'స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సంపద' గురించి, ఢిల్లీకి చెందిన న్యాయవాది బిజన్ ఘోష్ భారత దేశ పాలకుల, ఉన్నతాధికారుల అక్రమ సంపాదనకు సంబంధించి రహస్య అక్రమ ఖాతా సొమ్ము, పోగుపడిన సంపద వివరాలు తెలియ చేసినారు. దీనికి స్పందించి దేశంలోని వివిధ పార్టీల నాయకులు అప్పటి ఎన్నికల సందర్భంలో వారి వారి ప్రసంగాలలో ప్రజలకు తమ పార్టీ అధికారంలోకి వస్తే స్విస్ బ్యాంక్‌లోని 'డెబ్భై ఐదు లక్షల కోట్ల రూపాయల' అక్రమ సొమ్మంతా తిరిగి వెనక్కి రప్పించి ప్రజల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని వాగ్దానం చేశారు. అది నమ్మి ప్రజలు అధికారాన్ని కట్టబెడితే ప్రజల ఓట్లతో ఎన్నికైన పాలకులు మాటమార్చి ప్రజల ఆశలను నీరుకార్చి, నమ్మకాన్ని వమ్ముచేశారు. ప్రస్తుతం పాలకులు చెపుతున్నదేమంటే స్విస్ బ్యాంకుల్లో దాచిన పాత డబ్బు గురించి కాదనీ, భవిష్యత్తులో పోగుపడే డబ్బు గురించి స్విస్ బ్యాంక్‌తో ఒప్పందాలు చేసికొంటామనీ పాలకులు మాట మార్చడంతో ప్రజలు మరొక్కసారి వంచనకు గురయ్యారు. వారి ఆనందం అంతా ఆవిరైపోయింది. ఇప్పటికైనా స్విస్ బ్యాంక్‌లోని భారత నల్లధనం, అక్రమ సంపాదన డెబ్భై ఐదు లక్షల కోట్ల రూపాయలు వెనక్కి రప్పించడానికి, ప్రజలతో ఎన్నుకోబడ్డ పాలకులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు వాళ్ళ శక్తియుక్తులను ఉపయోగించి దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– బోరెడ్డి మధుసూదన్ రెడ్డి
సిద్దిపేట, మెదక్

వీక్షణం అందింది. రెండు రోజుల్లోనే చదివేశాను. వారం వారం వస్తే బాగుండును. నా మెదడుకు మేత. అల్జీమర్ పాలిట పడకుండా, ఆలోచనల్ని నిరంతరాయంగా సృష్టిస్తోంది. 'అక్రమాల పుట్ట ఎ.పి.పి.ఎస్.సి.' అని శ్రీధరరావు దేశ్‌పాండే రాస్తుంటే ఇదే విషయంపై ముత్తేవి రవీంద్రనాథ్ అగ్రకులాల్ని అణచివేస్తూ బి.సి.లకు అధిక మార్కులు ఇచ్చి, సెలెక్షన్స్‌లో పెద్ద మోసం చేస్తున్నారని తెనాలి నుంచి రాస్తున్నారు. అణు పరిహారం ఎవరికోసం? ఈ లెవీ సేకరణ ఎవరి కోసం, కాశ్మీర్ రక్షణ ఎవరి కోసం? అడవి, భూమి, గనులు, ఆకాశం, నీరు, గాలి, వెలుతురు (విద్యుత్తు) అన్నీ ఎవరి కోసమో తెలియజేసే వ్యాసాలు వస్తున్నాయి. కానీ పత్రికను సామాన్యులు చదవలేరు. ఇంకా క్లుప్తంగా, తేలిక భాషలో రాస్తే (అంకెల గారడీలు చేయకుండా) మరి కొందరు చదువుతారు. ప్రతి నెలా నేను మరో ఇద్దరు మిత్రులకు వీక్షణం ఉచితంగా ఇచ్చి చదివింప జేస్తాను. డా. ఎం.ఎఫ్. గోపీనాథ్ 'కులాల ఆవిర్భావం కొనసాగింపు' చాలా చక్కగా చెప్పారు. రాజ్యాధికారం ఎవరిది? గోగు శ్యామల సీక్రెట్ కోడ్ గురించి చక్కగా చెప్పారు.

– ఎస్. హజరత్ అలీ
వేమూరు, గుంటూరు

అక్టోబర్ నెల వీక్షణం పత్రికలో 'రాజకీయ వ్యవస్థను బాగు చేయడం ఎలా?' అనే పేరు మీద కొన్ని వ్యాసాలు ప్రచురించారు. రాజకీయ వ్యవస్థను బాగు పర్చుకుందాం అనే శీర్షికతో బుర్ర రాములు ఒక వ్యాసం రాసారు. ఈ వ్యాసం అంతా ప్రశ్నలమయం. సంతృప్తి కలిగించే జవాబులు లేని, అసలే జవాబులు లేని వ్యాసం అది. ఈ సృష్టికి మొదలేది? ఈ ప్రశ్నకు బదులేది? అన్నట్లుంది వ్యాసం. ఇంకా చివరికి బుర్ర రాములు తన వ్యాసాన్ని – 'కాబట్టి రాజకీయ వ్యవస్థను బాగు చేయడం కాదు చేయాల్సింది, బాగు పరచుకోవడం కదా!' అంటూ ఆశ్చర్యకరమైన ప్రశ్నతోనే ముగించారు. ఈ విషయంలో మిగతా వ్యాసాలు కూడా విషయం ఎంత సీరియస్‌గా ఉందో అంత లోతుగా లేవు. రాజ్యానికి చెందిన అవగాహనా లోపం, సందర్భ రాహిత్యం కనిపిస్తుంది. ఇక వేణుగోపాల్ రాజకీయాలను బాగు చేయడం ఎలా? అనే వ్యాసంలో ఉపరితలం పునాదికి చెందిన విషయంలో సీరియస్ లోపం కనిపిస్తుంది. రాజ్యానికి, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఎవరి అవగాహన వారికి ఉండవచ్చు. కాని లెనిన్‌ను పేర్కొంటూ లెనిన్ చెప్పని విషయాన్ని చెప్పడం సరైంది కాదు. 'రాజకీయాలు అంటే ఆర్థిక వ్యవహారాల సాంద్ర వ్యక్తీకరణనే' అని లెనిన్ చెప్పాడు కావున 'ఆర్థిక వ్యవస్థలోని లోపాలను పరిష్కరించకుండా రాజకీయ వ్యవస్థను బాగుచేయడం సాధ్యంకాదు' అని నిర్ధారించడం అంటే లెనిన్‌ను పూర్తిగా చదవక పోవడమే, లెనిన్ ను పూర్తిగా తెలుసుకోక పోవడమే అవుతుంది. లెనిన్ తన జీవిత కాలంలో చేసిన పెద్ద పోరాటాలలో ఒకటి ఆర్థిక వాదంకు వ్యతిరేకంగా చేసిన పోరాటమే. లెనిన్ ఆ నిర్వచనం తో పాటు చెప్పిన విషయం ఏమిటంటే, 'ఇప్పటివరకు ప్రపంచంలో ఎక్కడ కూడా రాజకీయ వ్యవస్థలో తీవ్రమైన మార్పులు జరగకుండా ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి మౌలిక మార్పులు జరగలేదు'. 'ఏమి చేయాలి' అనే లెనిన్ పుస్తకాన్ని ఫుట్‌నోట్స్‌తో సహా చదవగలరని మనవి.

– పాపన్న
ఇ-మెయిల్ ద్వారా

అయోధ్య వివాదంపై అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ తీర్పు వెలువరించింది. 30 సెప్టెంబర్ 2010న వెలువరించిన తీర్పు ప్రకారం రామ్‌లాల విగ్రహాలున్న ప్రాంతం హిందువులకు, సీతా రసోయి (సీతమ్మవారి వంటశాల), రామ్ చబుత్ర (రాములవారు కూర్చున్న అరుగు) ఉన్న ప్రాంతం నిర్మోహి అఖాడా (మోహము లేనివారి అడ్డా)కు, మిగిలిన ప్రాంతం సున్నీ వక్ఫ్ బోర్డ్ (ముస్లింలు)కు చెందుతుంది. ఈ నేపథ్యంలో ఆలోచిస్తే ప్రకటించిన మూడు ప్రాంతాలలో రెండు ప్రాంతాలు హిందువులకు, ఒక ప్రాంతం ముస్లింలకు చెందుతుందని అర్థమవుతోంది. హిందూ మతానికి చెందిన సాధువులు, సన్యాసులు మన దేశంలో నిర్మోహిలుగా పిలువబడుతున్నారు. ఈ నిర్మోహిలు ఎలాంటి సంసార సంబంధ, సామాజిక బాధ్యతలు లేనివారు. ఎందుకయ్యా అంటే మాకు ప్రాపంచిక మోహాలు లేవన్నది వీరి జవాబు. లేదా వాదన. మరి రామజన్మ భూమి మీద వీరికి మోహం ఎందుకో? మన దేశంలో దేశ సంపద ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న రైల్వే తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రతి సంవత్సరం ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పి.ఎల్.బి.) ఇవ్వబడుతోంది. దేశ సంపద ఉత్పత్తిలో ఎటువంటి భాగస్వామ్యం లేని నిర్మోహిలకు రామజన్మ భూమిలో బోనస్‌గా (ఉచితంగా) భాగస్వామ్యం ఎందుకో? పోనీయండి, దానం ఇచ్చినాం అనుకుంటే, రామజన్మ భూమిలో భాగస్వామ్యం నిర్మోహిలకు ఇవ్వడం అపాత్ర దానం అవుతుంది. ఎందుకుంటే, ఆయోధ్యలో ఇండ్లు లేని అన్ని మతాలకు చెందిన పేద ప్రజలు ఎంతో మంది ఉన్నారు. వారికి ఇచ్చినా దానానికి ఒక ప్రయోజనం ఉంటుంది. రాజకీయ పార్టీలన్నీ అందరికి 'రోటీ, కపడా ఔర్ మకాన్' కావాలని నినాదాలు చేస్తున్నాయి. నిర్మోహిలకు ఈ విధంగా భూమి ఇవ్వడం ఎంత సబబు? 'వేర్ లా ఎండ్స్, దేర్ గాడ్ స్టార్ట్స్' అనేది ఒక ప్రపంచవ్యాప్త నానుడి. ప్రజలు వారి వారి కష్టాలు తీర్చుకోవడానికి భగవంతుడి మీద ఆధార పడడం మానవ నైజం. అది తప్పు కాదు. కానీ భగవంతుడి పేరున దోపిడీ మాత్రం ఆచరణీయం కాదు.

– ఆర్.ఎస్. చౌహాన్
కర్నూల్

గత 125 ఏళ్లుగా మరీ ముఖ్యంగా గత 60 ఏళ్లుగా వివాదంలో ఉన్న బాబ్రీ మసీదు స్థల యాజమాన్యానికి సంబంధించి సెప్టెంబర్ 30న అలహాబాద్ హైకోర్టు బెంచి ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల పట్ల ఉత్కంఠగా ఎదురు చూస్తున్న దేశ ప్రజానీకం 1992 డిసెంబర్ ఆరు తదుపరి అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అల్లర్లు, మతదాడులకు సంబంధించి ఎంతో కొంత భయాందోళనలతో ఉన్న మాట కూడా వాస్తవం. అయితే దేశ వ్యాప్తంగా ఎటువంటి అల్లర్లు జరగకపోవడం చాలా ముదావహమైన విషయం. ఇందుకు మనదేశంలోని సాధారణ ప్రజానీకం అభినందనీయులు. ముఖ్యంగా తమ పక్షాన నిర్ణయం లేదని, తమకు న్యాయం జరగలేదని బలంగా నమ్ముతున్న ముస్లిం ప్రజానీకపు ప్రతిస్పందన శాంతియుతంగా ఉంది. ఇందుకు వారు మరీ మరీ అభినందనీయులు.

అయితే హైకోర్టు తీర్పు మాత్రం ప్రజాస్వామిక సూత్రాలకు గానీ, శాస్త్రీయ ఆధారాలకు గానీ అనుగుణంగా లేదు. ఈ తీర్పులో అతి ముఖ్యమైన విషయం సరిగ్గా బాబ్రీమసీదు ఉన్న స్థలాన్నే రామ్‌లాలా జన్మస్థలమని నిర్ధారించి ఆ స్థలంలో మందిర నిర్మాణానికి అనుమతినివ్వడం. మీడియాలో పదేపదే చెబుతున్నట్టు మూడు భాగాలుగా విభజించడం, కొంతభాగం ముస్లింలకు కూడా మసీదుకోసం ఇవ్వడం వంటివన్నీ సర్ది చెప్పడానికి, న్యాయం ఎంతో కొంత జరిగినట్టుగా కనిపించేందుకు పనికివచ్చే కంటితుడుపు చర్య తప్ప ప్రజాస్వామిక న్యాయం కాదు.

మసీదును కట్టడానికి ఏ మందిరాన్ని కూలగొట్టలేదని జడ్జి ఖాన్ స్పష్టంగా పేర్కొనగా, గొప్ప రామమందిరాన్ని కూలగొట్టి మసీదును కట్టారని జడ్జి శర్మ పేర్కొన్నాడు. ఒకే పురావస్తు శాఖ రిపోర్టు పట్ల ఇంతటి సమైక్య అవగాహన!

వాదన కోసం ఏదైనా మందిరాన్ని కూలగొట్టి మసీదు కట్టారని అనుకున్నా ప్రజాస్వామిక దృక్పథం ఏమిలేని ఫ్యూడల్ వ్యవస్థలో జరిగిపోయిన చీకటి నేరంగా

(మిగతా 39వ పేజీలో...)

తెలంగాణ మరో గుజరాత్

ఢిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ మార్కెట్ అసెస్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సంస్థల సి.ఇ.ఒ.ల సమావేశంలో టి.ఆర్.ఎస్. అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విభజన తప్పదనీ, వచ్చే ఏడాది నుంచే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందనీ ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్త రాష్ట్రాన్ని సమూలంగా పునర్నిర్మించి, పెట్టుబడుల ఆకర్షణలో గుజరాత్ వంటి రాష్ట్రాల సరసన తెలంగాణను నిలబెడతానని అన్నారు. సుమారు డెబ్బైకు పైగా సి.ఇ.ఒ.లు, కంపెనీ ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సోంపేట : బెదిరింపులు... బాంబు పేలుడు

శ్రీకాకుళం జిల్లా సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు వై. కృష్ణమూర్తికి చెందిన ఆస్పత్రిలో సెప్టెంబర్ 22 మధ్యాహ్నం బాంబు పేలుడు సంభవించింది. థర్మల్ పవర్ ప్లాంట్ అనుకూలురే ఈ పని చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు నిరసనగా సోంపేటలో స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు.

కె.బి. తిలక్ కన్నుమూత

స్వాతంత్ర్య సమరయోధుడు, దర్శక, నిర్మాత కె.బి. తిలక్ (84) సెప్టెంబర్ 23 సాయంత్రం కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పూర్తిపేరు కొల్లిపర బాలగంగాధర తిలక్. ఆయన పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరులో 14 జనవరి 1926న జన్మించారు. ఆయన తండ్రి వెంకటాద్రి స్వాతంత్ర్య సమరయోధుడు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 1942లో జైలుకు వెళ్లారు. తర్వాత ప్రజా నాట్య మండలిలో పనిచేశారు. ఆ తరువాతి కాలంలో సినిమారంగంలోకి అడుగుపెట్టి నిర్మాతగా, దర్శకుడిగా అభ్యుదయ భావాలతో పలు మంచి చిత్రాలను రూపొందించారు.

అంతులేని అవినీతి

రాష్ట్రంలోని 22 గ్రామీణ జిల్లాల్లో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఇప్పటివరకూ ఈ పథకంలో పదమూడు వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. ఈ మొత్తంలో కూలీలకు వేతనంగా పది వేల ఐదు వందల కోట్ల రూపాయలను చెల్లించారు. ఇప్పటివరకూ సామాజిక తనిఖీలలో వంద కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు, అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ పథకంలో ఎలాంటి పనులు చేయకుండానే చేసినట్లు చూపి కోట్ల రూపాయలను కొల్లగొట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

సత్యం (బాబు)కు ఖైదు

కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని దుర్గా లేడీస్ హాస్టల్‌లో 27 డిసెంబర్ 2007న ఆయేషా మీరా హత్య జరిగింది. ఆమెపై అత్యాచారం కూడా జరిగింది. ఆ కేసుకు సంబంధించి 29 సెప్టెంబర్ 2010న మహిళా సెషన్స్ జడ్జ్ పి. శ్రీసుధ తీర్పు చెప్పారు. సత్యంబాబుకు ఐ.పి.సి. 302 సెక్షన్ కింద జీవిత ఖైదుతో పాటు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. అలాగే అత్యాచారం చేసినట్టు రుజువైనందున ఐ.పి.సి. 376 సెక్షన్ ప్రకారం మరో పదేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. యావజ్జీవం, పదేళ్ల శిక్ష ఏకకాలంలో అమలవుతాయని తీర్పులో పేర్కొన్నారు. ఇది 'ఫిక్స్‌డ్ జడ్జ్‌మెంట్' అంటూ, అన్యాయం జరిగిందంటూ సత్యంబాబు తల్లి, ఆయేషా మీరా తల్లిదండ్రులతో సహా ప్రజలూ, ప్రజాసంఘాలూ తమ నిరసనలు తెలిపారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావం

తెలంగాణ ప్రజా ఫ్రంట్ 9 అక్టోబర్ 2010న హైదరాబాద్ రెడ్ హిల్స్‌లోని మారుతి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆవిర్భవించింది. ఈ ఫ్రంట్‌కు అధ్యక్షుడుగా గద్దర్ ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. 84 మంది సభ్యులు స్టీరింగ్ కమిటీలో ఉంటారని ఈ సందర్భంగా గద్దర్ తెలిపారు. ఉద్యమాల ద్వారా తెలంగాణను సాధించే లక్ష్యంతో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు.

ఖైదీల విడుదలకు మళ్లీ బ్రేక్

గాంధీ జయంతి కోసం ఎంతో ఆశతో ఎదురు చూసిన జీవిత ఖైదీలకు, ఖైదీ కుటుంబీకులకు, శ్రేయోభిలాషులకు ఈ అక్టోబర్ 2 నిరాశే మిగిల్చింది. ఖైదీల విడుదలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన 2004 నిబంధనలకు, తెలుగుదేశం ప్రభుత్వం 2003లో రూపొందించిన నిబంధనలకు మధ్య ఖైదీల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 2003 మార్గదర్శకాలతో నలుగురు ఖైదీలు మాత్రమే విడుదలయ్యే అవకాశం ఉంది. 2004లో రూపొందించిన నిబంధనల ప్రకారం ఖైదీలను విడుదల చేయాలని కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్.ఆర్. శంకరన్ కన్నుమూత

మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి ఎస్.ఆర్. శంకరన్ (78) అక్టోబర్ 7న హైదరాబాద్‌లో తన నివాసంలో గుండెపోటుతో మరణించారు. జీవితాంతం పేదల ఉద్ధరణకే పరితపించారు. ఆంధ్ర కేడర్‌కు ఎంపికైన శంకరన్ స్వగ్రామం తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని సెరికల్తూర్. సివిల్ సర్వీస్ పరీక్షల్లో 1957 బ్యాచ్‌లో ఆయన టాపర్. తన అభిప్రాయాలకు, సామాజిక సేవకు అడ్డంకి అవుతుందనే ఉద్దేశంతో ఆయన వివాహం చేసుకోలేదు. ముప్పై అయిదేళ్ల పాటు ఐ.ఎ.ఎస్.గా పలు కీలక బాధ్యతల్లో ప్రజలకు సేవలు అందించారు. జీవించినంత కాలం దళిత, బడుగు, బలహీనవర్గాల కోసం నిజాయితీ, నిబద్ధతలతో పనిచేశారు. ప్రభుత్వానికీ, నక్సలైట్లకూ మధ్య చర్చలు జరగడంలో తన వంతు కృషి చేశారు.

ఆరు నెలలుగా జీతాలు లేవు

రోగులకు వైద్య సేవలు అందజేయడంలో వైద్యుల తరువాత నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది సేవలు కీలకం. ఇప్పటికీ వివిధ విభాగాల్లో ఇరవై అయిదు వేల వరకు ఖాళీలు ఉన్నా వాటిని భర్తీచేయకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులతో నడిపిస్తోంది ప్రభుత్వం. వీరిలో మూడు వేల రెండు వందల మంది పారా మెడికల్ సిబ్బందికి ఆరు నెలలుగా, మరో అయిదు వేల మంది నర్సింగ్ సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది. సర్వీసు క్రమబద్ధీకరణ సంగతి అలా ఉంచితే, సర్వీసు పొడిగింపుకూ ఉత్తర్వులు లేవు.

డి.ఎస్.సి. 2008 పోస్టులను భర్తీ చేయాలి!

నోటిఫికేషన్ ప్రకారం డి.ఎస్.సి. 2008 ఎస్.జి.టి. పోస్టులను భర్తీ చేయకుంటే అనూహ్య పోరాటాలకు దిగుతామని ఎ.పి.బి.ఇ.డి. విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అక్టోబర్ 15న ధర్నా చౌక్‌లో బి.ఇ.డి. విద్యార్థి సంఘం రిలే నిరాహార దీక్ష నిర్వహించింది.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు ఉండాలి

దేశంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు తప్పనిసరిగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని జాతీయ ఎస్.సి. కమిషన్ చైర్మన్ పి.ఎల్. పునియా పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడంతో పాటు, అమల్లోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అక్టోబర్ 20, 21 తేదీలలో రాష్ట్రంలో దళిత సంక్షేమ పథకాల అమలును ఆయన సమీక్షించారు.

ప్రైవేటీకరణ క్రమంలో ప్రభుత్వం సహకార, పరపతి రంగాల నుంచి వైదొలుగుతూ పోవడం, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు ఆ క్రమంలో బలపడడం నేటి విషాదస్థితికి కారణం అంటున్నారు **కొణతం దిలీప్**

మైక్రోరుణాలు ప్రపంచీకరణ శక్తుల సృష్టే!

సూక్ష్మ రుణసంస్థల వేధింపులు భరించలేక గత కొన్నివారాలుగా మన రాష్ట్రంలో పేదల ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. దాదాపు మూడేళ్లుగా మైక్రో రుణాల దుర్మార్గాలు మితిమీరుతున్నా ఇంతకాలం నిద్ర నటించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలూ ఇప్పుడే మేల్కొన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. మైక్రో ఫైనాన్స్ సంస్థలు వసూలు చేస్తున్న అధిక వడ్డీ నియంత్రించే అధికారం తనకు ఉందో లేదో కూడా తెలియని డోలాయమాన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంటే, తన హయాంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు వేళ్లూనుకునేందుకు ఇతోధికంగా సాయపడిన మాజీ ముఖ్యమంత్రి ఇప్పుడేమో ఏమీ ఎరగనట్టు ఈ సమస్యను పట్టుకుని రోడ్డెక్కారు. ప్రపంచంలోని పేదరికాన్ని మొత్తంగా రూపుమాపుతామని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన సూక్ష్మ రుణ సంస్థల అధిపతులు తమ జేబులు మాత్రం నింపుకుంటున్నారు.

పేదలను వడ్డీ వ్యాపారుల నుండి కాపాడడం, వారికి పూచీకత్తు లేని రుణాలు ఇవ్వడం అనే ఉన్నత ఆశయాలతో ముందుకు వచ్చిన సూక్ష రుణ సంస్థలు మార్గమధ్యంలో దారితప్పాయి. రుణగ్రహీతలనుండి అధిక వడ్డీలు గుంజడం, అప్పులు తిరిగి చెల్లించక పోతే రుణగ్రహీతను శారీరకంగా, మానసికంగా వేధించడం వంటి చర్యలతో ఇవ్వాళ మైక్రో ఫైనాన్స్ సంస్థలు వ్యవస్థీకృత వడ్డీ వ్యాపారుల్లాగా తయారయ్యాయి.

ఎంతో ఆశలు రేపిన ఈ రంగం ఇలా అస్తవ్యస్తంగా మారడానికి కారణాలేమిటని అలోచించే ముందు అసలు మైక్రో ఫైనాన్స్ రంగం ఇంత విస్తృతమవడానికి కారణాలు ఏమిటని ఆలోచించాలి.

అందులో మొదటిది, పౌరులకు అవసరమైన కనీస పరపతి సౌకర్యాలు కల్పించలేని మన ప్రభుత్వాల చేతగానితనం కాగా, రెండోది, అభివృద్ధి చెందిన దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రపంచీకరణ శక్తులు చేస్తున్న ప్రయత్నాలు.

2008లో భారత బ్యాంకింగ్ రంగంపై ప్రభుత్వం విడుదల చేసిన రఘురాం కమిటీ రిపోర్టు ప్రకారం మన దేశంలోని పేదల్లో కేవలం 9.6శాతం మందికి మాత్రమే బ్యాంక్‌ల నుండి అప్పులు అందుతున్నాయి. దీనికి ప్రధాన కారణాలుగా బ్యాంకులు అందుబాటులో లేకపోవడం, ఉన్నా అప్పులు ఇవ్వడానికి అవి ఏదైనా ఆస్తిని తనఖా అడగడం, చిన్న మొత్తలను అప్పులుగా ఇచ్చేందుకు బ్యాంకులు విముఖత చూపడం, వివిధ దశల్లో అవినీతి జరగడం అని తేల్చింది ఆ కమిటీ.

ప్రభుత్వరంగం నుండి పెద్దగా పరపతి సౌకర్యం లభించక పోవడం, ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో సహకార పరపతి వ్యవస్థ కూడా చిన్నాభిన్నం అవడంతో ప్రజలు తమ ఆర్థిక అవసరాల కొరకు వడ్డీ వ్యాపారులపై, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలపై ఆధారపడక తప్పని పరిస్థితి వచ్చింది. ఇదిగో ఇటువంటి నేపథ్యంలోనే మైక్రోఫైనాన్స్ కంపెనీలు రంగప్రవేశం చేశాయి.

1970లో అటు బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో గ్రామీణ్ బ్యాంకు, ఇటు గుజరాత్‌లో సేవ వంటి సంస్థలు పేద ప్రజలకు చిన్న చిన్న మొత్తాలను రుణంగా ఇవ్వడం ప్రారంభించాయి. వాణిజ్య బ్యాంకులు, సహకార సంఘాల్లో పూచీకత్తు ఇచ్చి అప్పు తీసుకోలేని పేదలను ఈ సంస్థలు ఆదుకున్నాయి. 1980ల్లో ఏర్పాటయిన మహిళా స్వయం సహాయక బృందాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్.జీ.ఒ.లను ఆకర్షించాయి.

మహిళలను స్వయం సహాయక బృందాలుగా తయారు చేసి వారు డబ్బులు పొదుపు చేసుకునేందుకు, బృందంలోను సభ్యులకు తక్కువ వడ్డీకి అప్పులు ఇచ్చే పద్ధతి 1990ల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలోనే మొదలైంది.

ఈ ప్రయోగానికి ప్రసార మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం రావడంతో దీనిపై ప్రపంచబ్యాంక్ కన్ను పడింది. 1990ల్లో తాను అప్పులిచ్చే దేశాల్లో పేదరిక నిర్మూలనకు మైక్రో రుణాలే దివ్య ఔషధమని ప్రపంచ బ్యాంకు ఊదరగొట్టడం మొదలైంది. తాను అప్పులిచ్చే దేశాల్లో ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు రంగానికి పెద్ద పీట వెయ్యాలనే ప్రపంచ బ్యాంకు వ్యూహంలో భాగంగానే మైక్రోఫైనాన్స్ సంస్థలను తెరమీదికి తేవడం జరిగింది. ప్రపంచబ్యాంక్‌కు మైక్రోఫైనాన్స్ రంగంతో ఉన్న అనుబంధం అంతా ఇంతా కాదు. ఏకంగా బ్యాంకు, ఇంకా దాని అనుబంధ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా అనేక మైక్రో ఫైనాన్స్ కంపెనీల్లో వందల కోట్లు పెట్టుబడి పెట్టాయి.

అప్పటిదాకా లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థల చేతిలో ఉన్న మైక్రో ఫైనాన్స్ లోకి ప్రపంచబ్యాంక్ ప్రోత్సాహం లభించగానే ప్రపంచీకరణ శక్తులు ప్రవేశించాయి. పేద ప్రజల రక్తమాంసాలే పెట్టుబడిగా నడిచే మైక్రోఫైనాన్స్ రంగంలో బహుళ జాతి ఆర్థిక సంస్థలు పెట్టుబడి పెట్టడం మొదలైంది. లాభాల కొరకు ఏ గడ్డి కరవడానికి అయినా వెనుకాడని సిటీ బ్యాంకు, స్టాండర్డ్ చార్టర్డ్ వంటి బ్యాంకులు ఈ రంగంలో పెట్టుబడి పెడుతున్నాయంటే, అక్రమ మార్గాల్లో సంపాదించిన డబ్బులను వ్యాపారాల్లో పెట్టేందుకు ఉపయోగపడే మారిషస్ వంటి దేశాల నుండి

ఎవరి 'స్వయం కృషి' ఇది?

ప్రపంచ బ్యాంక్ వెన్నుదన్నుతో విశ్వరూపం చూపిస్తున్న మైక్రో ఫైనాన్స్ రంగం అసలు స్వరూపం అర్థం చేసుకోవడానికి మన రాష్ట్రానికే చెందిన విక్రం ఆకుల మొదలు పెట్టిన స్వయం కృషి సంఘం చరిత్ర ఒకసారి తిరగేస్తే చాలు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విక్రం అమెరికాలో విద్యాభ్యాసం ముగించుకుని రాష్ట్ర ప్రభుత్వ పేదరిక నిర్మూలన పథకం అమలులో స్వచ్ఛంద సంస్థ కార్యకర్తగా తన ప్రయాణం మొదలు పెట్టాడు. కొంత కాలం మెక్ కిన్సే అనే బహుళజాతి ఆర్థిక సంస్థలో పని చేసిన విక్రం ఆకులకు స్వచ్ఛంద సంస్థలను లాభాపేక్షతో ఎలా నడపొచ్చో, పేదరిక నిర్మూలన అనేది ఎంత లాభదాయకవ్యాపారమో బాగా తెలుసు. అప్పుడప్పుడే ఊపందుకుంటున్న మహిళా స్వయం సహాయక బృందాలతో ఆకర్షితుడై 1998లో స్వయం కృషి సంఘం (ఎస్.కె.ఎస్) అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాడు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన సంస్థ ఇది. 2003 నాటికి మెల్లమెల్లగా ఎస్.కె..ఎస్. తన ముసుగును తొలగించు కోవడం మొదలైంది. అదే సంవత్సరం ఎస్.కె.ఎస్. కంపెనీల చట్టం కింద లాభం కొరకు పనిచేసే వాణిజ్య సంస్థగా రూపాంతరం చెందింది. 2005లో రిజర్వ్ బ్యాంకు వద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్.బి.ఎఫ్.సి.) లైసెన్స్ పొందింది ఎస్.కె.ఎస్. గత మూడు నాలుగేళ్లుగా విక్రం ఆకుల పేరు మీడియాలో మారు మ్రోగిపోతోంది. ఎస్.కె.ఎస్ కంపెనీకి, విక్రం ఆకులకు ఇంత పేరు రావడం వెనుక విక్రం తనను తాను ప్రమోట్ చేసుకోవడానికి ప్రొఫెషనల్ మీడియా మేనేజ్మెంట్, పబ్లిక్ రిలేషన్స్ కంపెనీలను వినియోగించడం ఒక కారణమైతే, విక్రం ఆకులకు రాహుల్ గాంధీ వంటి పెద్దలతో ఉన్న సంబంధాలు మరో కారణం. ఇంకోవైపు మైక్రో ఫైనాన్స్ రంగానికి విక్రం వంటి పోస్టర్ బాయ్స్ ఉండడం అవసరం అని ప్రపంచబ్యాంక్ భావించడం కూడా ఇతగాడిని మీడియా ఆకాశానికి ఎత్తేయడం వెనుక ఉంది.

2010 వచ్చే సరికి ఎస్.కె.ఎస్ తన ముసుగును మొత్తం తీసేసి పబ్లిక్ ఇష్యూ చేసి వాల్ స్ట్రీట్‌లో (అమెరికన్ స్టాక్ ఎక్స్చేంజి) నమోదైంది. ఇన్-ఫోసిస్ చైర్మన్ నారాయణ మూర్తితో సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎంతో మంది వ్యాపారస్తులు, బహుళజాతి ఆర్థిక సంస్థలూ ఎస్.కె.ఎస్. కంపెనీలో పెట్టుబడులు పెట్టాయి. ఇక పేదల రక్త మాంసాలతో వాల్‌స్ట్రీట్ గద్దలు జూదం ఆడే రోజులు మొదలయ్యాయి.

పేదరిక నిర్మూలనే తమ ధ్యేయం అని చెప్పుకునే ఎస్.కె.ఎస్ సంస్థ పేదరిక నిర్మూలన ఎంత లాభసాటి వ్యాపారమో ప్రపంచానికి చాటడంలో మాత్రం సఫలీకృతం అయింది. పేదలను ఉద్ధరిస్తానంటూ తీయని మాటలు చెప్పే విక్రం ఆకుల ఎస్.కె.ఎస్. ను నడుపుతున్న విధానం చూసిన వారెవరికైనా అతను చెప్పే మాటలు ఎంత డొల్లవో అర్థమవుతాయి. ఇటీవల సూక్ష్మరుణ సంస్థలపై రాసిన ఒకపరిశోధనా పత్రంలో ఐ.ఐ.ఎం. ప్రొఫెసర్ శ్రీరాం ఎస్.కె.ఎస్. ఎలా విక్రం ఆకులకు కోట్ల రూపాయలు ఆర్జించే వ్యాపారంగా మారిందో చాలా స్పష్టంగా వివరించారు.

ఎస్.కె.ఎస్ ను 2003లో లాభాపేక్ష గల ప్రైవేటు సంస్థగా మార్చినప్పుడు దానిలో 99.5 శాతం వాటాలను అయిదు మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టులకు కేటాయించారు. ఇందులో సభ్యులుగా ఎస్.కె.ఎస్ రుణ గ్రహీతలను చూపిస్తున్నప్పటికీ ఈ ట్రస్టుల అజమాయిషీ అంతా ఎస్.కె.ఎస్ ట్రస్ట్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ నిర్వహించడం ఒక విచిత్రమైతే ఆ కంపెనీని మళ్లీ విక్రం ఆకులనే నిర్వహించడం మరో విచిత్రం. దొడ్డి దారిన విక్రం ఆకులనే ఎస్.కె.ఎస్ సంస్థ పై పూర్తి యాజమాన్య హక్కులు కలిగి ఉన్నాడని అర్థం.

ఎస్.కె.ఎస్ లో పెట్టుబడి పెట్టిన సెకోయా కాపిటల్, కిస్మత్ కాపిటల్‌వంటి సంస్థలు కేవలం లాభాలు దండిగా ఆర్జించే కంపెనీల్లోనే పెట్టుబడి పెట్టే సంస్థలు. ఈ సంస్థలు పెట్టుబడి పెట్టాయంటేనే మైక్రోఫైనాన్స్ సంస్థలు చేసేది లాభాల వేట అని అర్థం.

ఎస్.కె.ఎస్ అధిపతిగా విక్రం ఆకుల ఎస్.కె.ఎస్ మైక్రోఫైనాన్స్ నుండి సంపాదించిన డబ్బెంతో చూడండి. విక్రం ఎస్.కె.ఎస్.లో పెట్టిన పెట్టుబడి కేవలం ఐదు వేల రూపాయలు మాత్రమే. ఆ డబ్బు కూడా 8 నెలల్లోనే విక్రంకు తిరిగి వచ్చేసింది. మార్చ్ 2007లో విక్రం ఆకులకు లక్షా అరవై వేల షేర్లు (ఒక లక్షా అరవై వేలు) ముఖ విలువకు (ఒక్కో షేరుకు పది రుపాయల వంతున) కోటీ అరవై లక్షలకు కేటాయించింది ఎస్.కె.ఎస్. అదే రోజున ఇతర ఇన్వెస్టర్లకు మాత్రం రు.49.77కు ఒక షేరు చొప్పున కేటాయించిందీ సంస్థ. ఇలా ముఖ విలువకు వచ్చిన షేర్లను 18 నెలల తరువాత ఒక్కోటి రు.103.91 వంతున అమ్మేశాడు విక్రం ఆకుల. ఒకసారి లెక్క వేయండి. కోటి అరవై లక్షల రూపాయల పెట్టుబడి ఏడాదిన్నరలో పదహారు కోట్లుగా మారిందంటే మైక్రో ఫైనాన్స్ బడా బాబులకు ఎటువంటి లాభాల వర్షం కురిపిస్తుందో.

కథ ఇక్కడితో అయిపోలేదు. ఉద్యోగులకు షేర్లు ఇచ్చే పథకంలో భాగంగా విక్రం ఆకులకు డిసెంబర్ 2009లో తొమ్మిది లక్షల నలభై ఐదు వేల నాలుగు వందల ఇరవై నాలుగు షేర్లు ఒక్కోటి 49 రూపాయలకు ఎస్.కె.ఎస్. కేటాయించింది. వీటిని ఫిబ్రవరి 2010లో ట్రీలైన్ ఏషియా మాస్టర్ ఫండ్ అనే సంస్థకు ఒక్కో షేరు 636 వంతున అమ్మేశాడు విక్రం. అంటే నాలుగున్నర కోట్ల పెట్టుబడి 15 నెలల్లో అరవై కోట్లయిందన్న మాట!

సంస్థలో నెంబర్ 2గా ఉంటూ ఇటీవలే విక్రంతో అభిప్రాయ భేదాల కారణంగా ఎస్.కె.ఎస్ నుండి తొలగించబడ్డ ఆ సంస్థ ముఖ్య కార్య నిర్వహాధికారి సురేశ్ గురుమణిదీ ఇదే తంతు. ఆయన సంస్థలో చేరింది 2008 డిసెంబర్లో అయితే విచిత్రంగా ఏప్రిల్ 2008లోనే ఆయనకు ఎస్.కె.ఎస్ ఒక కోటి రూపాయల బోనస్ ఇచ్చింది. ఆయన వార్షిక జీతం కోటీ యాభై లక్షలు అయితే బోనస్‌గా మరో కోటీ యాభై లక్షల రూపాయలు లభించిందంటే పేదరిక నిర్మూలన అనేది ఎంత ఆకర్షణీయమైన ఉద్యోగంగా మారిందో తెలుస్తుంది.

ఇవ్వాళ మైక్రో ఫైనాన్స్ సంస్థలకు పెట్టుబడి వస్తున్నదంటే ఈ రంగం ఎవరికి ఉపయోగపడుతున్నదో ఇట్టే అర్థం అవుతుంది.

సూక్ష్మ రుణ సంస్థలకు ప్రజలనుండి ఆదరణ పెరగడం, ఇందులో దండిగా లాభాలు వస్తుండటంతో కొత్తగా అనేక సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చాయి. మరోవైపు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి ప్రాధాన్యతా రంగాలకు రుణాలుగా ఇవ్వవలసిన మొత్తాలు ఇవ్వకుండా తమవద్ద మురగపెట్టుకునే జాతీయ బ్యాంకులు ఇప్పుడు మైక్రో ఫైనాన్స్ సంస్థలకు అప్పులు ఇచ్చి వీటినే ప్రాధాన్యతా రంగాలకిచ్చే అప్పులుగా చూపడం మొదలు పెట్టాయి. దీంతో మైక్రోఫైనాన్స్ రంగంలోకి నిధుల వెల్లువ ప్రారంభమైంది. 10 శాతం వడ్డీకి జాతీయ బ్యాంకుల దగ్గర వందల కోట్లు సేకరించడం, ఈ డబ్బును కనీసం 25-50 శాతం వడ్డీ వరకూ గ్రామీణ పేద మహిళలకు ఇవ్వడం - ఒక్క మాటలో చెప్పాలంటే ఇదే మైక్రోఫైనాన్స్ వ్యాపారం.

రాను రాను మైక్రోఫైనాన్స్ కంపెనీల మధ్య పోటీ పెరిగి ఒకే మహిళకు మూడు నాలుగు సంస్థలు అప్పులివ్వడం మొదలు పెట్టాయి. ఈ సంస్థల దగ్గర తీసుకునే రుణాలను వారానికోసారి కిస్తుల లెక్కన తిరిగి చెల్లించవలసి ఉంటుంది. అయితే చాలా మంది రుణగ్రహీతలకు స్థిరమైన ఆదాయం లేకపోవడంతో వాయిదాలు కట్టలేక ఇంకో సంస్థ దగ్గర అప్పులు చేయడం పరిపాటయింది. ఇంటి ముందుకే సంస్థ ప్రతినిధులు వచ్చి డబ్బులు ఇస్తుండడంతో అనేక మంది అవసరం లేకున్నా అప్పు తీసుకోవడం అది తిరిగి కట్టలేక ఇబ్బంది పడడం కూడా ఎక్కువైంది. సూక్ష్మరుణ సంస్థలు ఇచ్చే అప్పులు మామూలుగానైతే ఏదైనా స్వయం ఉపాధి కల్పించుకోవడానికి వాడుకోవాలి. అయితే ఏ సమాజంలోనైనా కొద్దిమంది ప్రజలే స్వయం ఉపాధి ద్వారా జీవనం కొనసాగిస్తారు. మిగతా వారు ఇతర సంస్థల దగ్గరో వ్యక్తుల దగ్గరో ఉద్యోగం చేయడం ద్వారా ఉపాధి పొందుతారు. ఇవ్వాళ సూక్ష్మరుణ సంస్థల దగ్గర రుణాలు తీసుకుంటున్న లక్షల మంది మహిళల్లో కొద్ది శాతం మందే అ డబ్బును స్వయం ఉపాధి కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. అత్యధికులు ఆ డబ్బును ఇంటి ఖర్చులకు (ఆరోగ్యం, పెళ్లి, చదువు లేద గృహోపకరణాలు) వాడేస్తున్నారు. అందువల్లే వారం వారం కిస్తులు కట్టడం ఇబ్బందవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన పావలా వడ్డీ రుణాలు గ్రామీణ మహిళల్లో అత్యధికులకు అందక పోవడం వల్లనే ఇవ్వాళ ఆ మహిళలు మైక్రోఫైనాన్స్ కంపెనీల వలలో చిక్కుకున్నారు.

మొదట్లో స్థానిక వడ్డీ వ్యాపారుల కన్నా తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చినట్టు చేసిన ఈ సంస్థలు రాను రాను ఏడాదికి 50 శాతం నుండి 100 శాతం దాకా వడ్డీ వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. సూక్ష్మరుణ సంస్థలు అప్పులు వసూలుచేసే విధానాలు కూడా దారుణంగా ఉన్నాయి. అప్పులు కట్టలేని మహిళలను తోటి మహిళలతోనే తిట్టించడం, అప్పు కట్టే దాకా ఇంటి ముందే బైఠాయించడం, ఒక్కోసారి రుణగ్రహీతలపై చెయ్యి చేసుకోవడం కూడా జరుగుతోంది. ఈ అవమానాలను భరించలేక కొంతమంది మహిళలు ఊళ్లు విడిచి వెళ్తుంటే మరికొందరు సున్నితమనస్కులు ఏకంగా ప్రాణాలే తీసుకుంటున్నారు.

గత కొన్ని వారాలుగా ఎడతెగకుండా ఆత్మహత్యలు జరుగుతుండడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా అలజడి రేగింది. అయితే సూక్ష్మరుణ సంస్థల ఆగడాలు బయటపడడం ఇదే మొదటిసారి కాదు. దాదాపు రెండేళ్ల క్రితం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సూక్ష్మరుణ సంస్థల ప్రతినిధుల వేధింపులు బయటికి రావడంతో స్థానిక కలెక్టర్లు ఆ సంస్థల స్థానిక కార్యాలయాలను తాత్కాలికంగా మూయించారు కూడా. అప్పట్లో రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఈ సంస్థలు విధిస్తున్న వడ్డీని నియంత్రించాలని కూడా అనుకున్నది. ఏ అదృశ్య శక్తులు అడ్డుకున్నాయో కానీ ఆ పని జరగలేదు. సూక్ష్మరుణ సంస్థలకు జాతీయంగానేకాదు అంతర్జాతీయంగా కూడా చాలా పలుకుబడి ఉన్నది. వీటికి ఒక రాష్ట్ర ప్రభుత్వం ముకుతాడు వేయాలంటే చాలా సాహసం కావాలి.

ఇప్పుడు తాజాగా రోశయ్య సర్కారు సూక్ష్మరుణ సంస్థల నియంత్రణకు తీసుకువచ్చిన ఆర్డినెన్సులో కూడా వడ్డీ నియంత్రణ ఊసులేదు. ఇన్నాళ్లూ మైక్రోఫైనాన్స్ సంస్థలకు మద్దతుగా ఉన్న రిజర్వ్ బ్యాంక్ కూడా ఇప్పుడు ఈ సంస్థలపై విమర్శలు వెల్లువెత్తడంతో వీటి పనితీరును సమీక్షించడానికి ఒక కమిటీని వేసింది.

గమనించాల్సిన విషయం ఏమిటంటే చంద్రబాబు హయాంలో ప్రపంచబ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తన అభివృద్ధి నమూనాలను పరీక్షించే ఒక ప్రయోగశాలగా వాడుకుంది. అంతకు ముందు లాటిన్ అమెరికన్ దేశాల్లో తాను ప్రయోగించిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ కార్యక్రమాన్నే యథాతథంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ సాయంతో అమలు చేసింది. అందువల్లనే ప్రపంచబ్యాంక్ సంస్కరణలు లాటిన్ అమెరికన్ దేశాల్లో ఏ దుష్ఫలితాలు ఇచ్చాయో సరిగ్గా అవే దుష్ఫలితాలు మన రాష్ట్రంలో కూడా ఇచ్చాయి. ఆర్థిక సంస్కరణల పేరుతో రాష్ట్రంలో జరిగిన ఈ కార్యక్రమాలతో ప్రజా జీవితం అస్తవ్యస్తం అయింది. సహజంగానే వామపక్ష శక్తులు బలంగా ఉన్న మన రాష్ట్రంలో ప్రపంచబ్యాంక్ సంస్కరణలకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమమే చేశాయి. విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు దానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళన బషీర్‌బాగ్ వద్ద పోలీస్ కాల్పులతో హింసాత్మకంగా మారింది. ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా జరిగిన సంఘర్షణల చరిత్రలో లాటిన్ అమెరికాలోని బొలీవియా దేశ రాజధాని కుచబొంబాలో నీటి చార్జీలు పెంచినప్పుడు జరిగిన ఆందోళన తరువాత మన ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్‌చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమమే ఉండడం మనకూ లాటిన్ అమెరికాకూ ఈ విషయంలో ఉన్న సారూప్యత తెలియజేస్తుంది.

ఇప్పుడీ చరిత్ర అంతా చెప్పడానికి కారణం సూక్ష్మరుణ సంస్థల దారుణాల విషయంలో కూడా మన రాష్ట్రానికీ లాటిన్ అమెరికాకు దగ్గరి పోలిక ఉండడం. అచ్చుగుద్దినట్టు ఇక్కడ ఎస్.కె.ఎస్. (స్వయంకృషి సంఘం) అనే సూక్ష్మరుణ సంస్థ చేసినట్టుగానే మెక్సికోలో బాంకో కంపార్టామొస్ అనే స్వచ్ఛంద సంస్థ చేసింది. పేదలకు సాయం చేసే స్వచ్ఛంద సంస్థలా మొదలై లాభాపేక్ష గల బ్యాంక్‌గా పరిణామం చెందిన బాంకొసోలె అనే బొలీవియా సూక్ష్మరుణ సంస్థదీ అదే కథ. అక్కడా పేద ప్రజలకు అవరం లేకున్నా అప్పులు ఇవ్వడం అవి కట్టలేని వారిపై దౌర్జన్యం చేయడం అనే పద్ధతే కొనసాగుతోంది. అయితే ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిన విషయం కాదు.

కాస్త జాగ్రత్తగా అటు లాటిన్ అమెరికా ఇటు మన రాష్ట్రంలోని మైక్రోఫైనాన్స్ సంస్థల జాతకాలు పరిశీలిస్తే మాంత్రికుడి ప్రాణాలు

బాబ్రీ మసీదు తీర్పు భూస్వామ్య, బ్రాహ్మణ, హిందూ శక్తుల ఆధిపత్యానికి లోబడిందనీ, మైనారిటీ పీడిత ప్రజా సమూహాలు ఈ ఆధిపత్యాన్ని సమూలంగా పెకలించి వేయాల్సి ఉందనీ అంటోంది **డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్, జె.ఎన్.యు.**

భారత రాజ్యపు కాషాయ స్వభావం

బాబ్రీ మసీదు తీర్పు అక్షరాలా భారత రాజ్యపు స్వభావం ఏమిటో తెలియజెప్పింది. ఈ రాజ్యం మతోన్మాద రాజ్యమనీ, ఫాసిస్టు రాజ్యమనీ, హిందూ అధిక సంఖ్యాక వాదపు రాజ్యమనీ ఈ తీర్పు రుజువు చేసింది. ఆ తీర్పు కన్న ప్రమాదకరమైన విషయమేమంటే, ఇంత మతోన్మాద పూరితమైన తీర్పును ఈ దేశంలోని ప్రతి ఒక్క పాలకవర్గ పార్టీ సమర్థిస్తోంది. అంతా మామూలే అన్నట్టు ప్రవర్తిస్తోంది. ఈ తీర్పుకు ముందున్న చరిత్రనంతా మామూలుగా మార్చేయబోతోంది. ఈ తీర్పు వెనుక దాగి ఉన్న ఫాసిస్టు పర్యవసానాలను దాచడానికి ప్రయత్నిస్తున్న పార్లమెంటరీ పార్టీలకు కార్పొరేట్ ప్రచార సాధనాలు అన్ని రకాలుగా సహాయ పడుతున్నాయి.

ఈ తీర్పు బాబ్రీ మసీదు స్థలంలో 2/3వ వంతు మీద అధికారాన్ని ముస్లింల నుంచి లాగివేసి, అన్యాయం చేయడం మాత్రమే కాక, ఆధిపత్య, అగ్రవర్ణ హిందూ మతతత్వ వాదులకు రామ మందిరం గురించి ఉన్న విశ్వాసాన్ని సమర్థించింది. ఈ దేశంలో ముస్లింలు రెండో తరగతి పౌరులుగా బతకాలని ఈ తీర్పు మరొకసారి నొక్కిచెప్పింది. ఆ భూమి అంతా హిందూవులకు చెందిందేనని, కాని, అందులో మూడో వంతు భూభాగాన్ని న్యాయవ్యవస్థ ఉదారంగా ముస్లింలకు ఇచ్చిందని, దానితో వారు సంతృప్తి చెందాలని ఈ తీర్పు ప్రకటించింది.

స్పష్టమైన ఈ కారణాల వల్లనే సంఘ్ పరివార్‌కు చెందిన మతోన్మాద ఫాసిస్టు శక్తులు ఉత్సాహంగా ఉన్నాయి. 1992లో మసీదును విధ్వంసం చేసినప్పుడు ఉద్దేశపూర్వకంగా, బహిరంగంగా సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన శక్తులే ఇవాళ హఠాత్తుగా 'చట్టానికి విధేయులైన' పౌరులుగా మారిపోయారు. న్యాయవ్యవస్థ ఈ శక్తుల కార్యక్రమాన్నే నిర్ద్వంద్వంగా ఎత్తిపట్టింది గనుక, వారి వాదనకు బలం చేకూర్చింది గనుక, వారి పాశవిక చర్చలకు చట్టబద్ధత కల్పించింది గనుక వారు చట్టానికి విధేయులయ్యారు. అయోధ్య తీర్పుపై ప్రతిస్పందిస్తూ అద్వానీ 'అయోధ్య తీర్పు జాతీయ సమైక్యతలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని నేను నమ్ముతున్నాను' అని అన్నప్పుడు జాతీయ ఐక్యత గురించి హిందూత్వ నిర్వచనం గురించే ఆయన మాట్లాడుతున్నాడు. ఆ నిర్వచనం ప్రకారం ముస్లింలు గానీ, దళితులు గానీ, ఆదివాసులు గానీ, ఇతర మైనారిటీలు గానీ భారత దేశంలో నివసించదలచుకుంటే ఆధిపత్య బ్రాహ్మణ హిందూ శక్తులు విధించిన పరిమితుల లోపల మాత్రమే జీవించాలి.

తీర్పు వల్ల బలం పుంజుకున్న ఈ మతోన్మాద హంతకులు ఇవాళ కేవలం మూడింట రెండు వంతుల భూమి వచ్చిందని మాత్రమే విజయోత్సవం చేసుకోవడం లేదు. వారు శాంతి పేరిట, సహనం పేరిట బహిరంగంగా, నిస్సిగ్గుగా ముస్లిం సమాజాన్ని బెదిరిస్తున్నారు. గతంలో జరిగిన హత్యాకాండలనూ, అత్యాచారాలనూ, జనహననాన్నీ మరిచిపొమ్మని బెదిరిస్తున్నారు. ఆ మూడో వంతు భూమి మీద హక్కు కూడా ఒదులుకొని, '(బ్రహ్మాండమైన' రామమందిర నిర్మాణంలో '(క్రియాశీల భాగస్వాములు' కమ్మని బెదిరిస్తున్నారు.

పార్లమెంటరీ పంథాలోని కుహనా వామపక్షవాదులు సిపిఎం నాయకత్వంలో బెంగాల్‌లోనూ, కేరళలోనూ రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఆ రాష్ట్రాలలోని ప్రధానమైన హిందూ ఓటు బ్యాంక్‌ను దృష్టిలో పెట్టుకొని అత్యంత అవకాశవాద పద్ధతిలో ఈ తీర్పు మీద ఒక స్పష్టమైన వైఖరిని తీసుకోవడంలో ముందు ఆలస్యం

రామచిలుకలో ఉన్నట్టు మైక్రో ఫైనాన్స్‌ల సృష్టిలో ప్రపంచబ్యాంకు అజెండా బట్టబయలవుతోంది. ప్రజలకు అప్పటిదాకా లేని అవసరాలు సృష్టించడం అవి తీర్చుకోవడానికి సులభ రుణాలు అందజేయడం, ఈ రుణాలు తిరిగి చెల్లించడానికి ప్రజలు జీవితాంతం గానుగెద్దుల్లా కష్టించడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండే సహజ లక్షణం. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోని మధ్యతరగతి, పేదప్రజలు ఇలా సులభంగా దొరికే క్రెడిట్ కార్డ్ రుణాల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడు తున్నారు. మనబోటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో క్రెడిట్ కార్డుల వ్యాపారం అంతగా సాగడం లేదు. దాని బదులు ప్రజలను అప్పుల్లో ముంచి సరుకులు అమ్ముకోవడానికి మైక్రోఫైనాన్స్ వ్యాపారం ప్రపంచీకరణ శక్తులకు రాజమార్గంగా కనపడింది.

ప్రభుత్వాలను కీలక బాధ్యతల నుండి తప్పించి ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంఘాలే అన్ని రంగాలనూ శాసించే ఒక పరిపాలనా నమూనా గత మూడు దశాబ్దాలుగా ప్రపంచబ్యాంక్ అభివృద్ధి చెందుతున్న దేశాలపై రుద్దుతోంది. స్వచ్ఛంద సంస్థల్లా మొదలై అటు తరువాత నిస్సిగ్గుగా ఫక్తు వ్యాపార సంస్థల్లా మారిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రపంచీకరణ అమానవీయ ముఖానికి ప్రతినిధులు. ఒకరకంగా పేద దేశాల ప్రజలను ప్రపంచీకరణ శక్తులు ఎట్లా మాయమాటలతో మోసగిస్తాయో, అవి చెప్పే తీయని మాటల వెనుక ఉన్న తేనె పూసిన కత్తులేమిటో, ముసుగు తీసేస్తే వాటి నిజస్వరూపాలేమిటో మైక్రో ఫైనాన్స్ సంస్థల తాజా వ్యవహార శైలి నిరూపిస్తోంది.

(రచయిత తెలంగాణ ఉద్యమకారుడు) వీ

చేశారు. చివరికి వైఖరి ప్రకటించకుండానే ఉండిపోయారు. బాలివుడ్ సినిమా తారల ప్రవచనాల లాగ అన్నిపక్షాలు తీర్పును 'శాంతియుతంగా' ఆమోదించాలని వారు 'విజ్ఞప్తి' చేశారు. వాళ్లు ఈ విజ్ఞప్తి చేస్తున్నది ఎవరికి? వాళ్లకొకసారి చరిత్ర గుర్తు చేయవలసి ఉన్నది. 1949లో కొందరు దుండగులు బాబ్రీ మసీదు ఆవరణలోకి దొంగచాటుగా వెళ్లి, కేంద్ర భాగంలో రామ విగ్రహాన్ని పెట్టినప్పుడు ఆ తరువాత భారత రాజ్యం ఆ మొత్తం ప్రాంగణానికి తాళాలు వేసి ఆ చారిత్రక మసీదులో నమాజును ఆపివేసినపుడు శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నది ముస్లింలే. ఆ తరువాత, 1986లో భారత రాజ్యమే ఆ తాళాలు తీసి, హిందూవులు పూజ చేసుకోవడానికి అనుమతించినపుడు శాంతిని కాపాడినది ముస్లింలే. ఆ తరువాత అద్వానీ రథయాత్ర నడిపించిన 1990లో దేశవ్యాప్తంగా తమ మీద దాడులు జరిగినపుడు, హింసా కాండకు గురిచేసినపుడు శాంతిని కాపాడినది ముస్లింలే. చివరికి 1992లో ఉన్మాదపు గుంపులు తమ మసీదును ధ్వంసం చేసినపుడు, ఆ తరువాత తమ మీద హంతక దాడులు సాగించినపుడు ప్రశాంతతను కొనసాగించినది ముస్లింలే.

మరొకపక్క హిందూ ఫాసిస్ట్ ముఠాలు దేశం చరిత్రలో సాగిన అన్ని మత కల్లోలాలలో, హత్యాకాండలలో, జనహననాలలో, హింసలో, విధ్వంసంలో పాల్పంచుకొన్నాయి. ఈ కుహనా వామపక్షవాదుల శాంతి కొరకు విజ్ఞప్తులు ఆ ముఠాల చెవికి ఎక్కవు.

కేవలం నైతిక అంతరాత్మకు విజ్ఞప్తి చేయడం ద్వారా మతోన్మాద ఫాసిస్టులను అడ్డుకోవడం సాధ్యంకాదు. వాళ్లను కచ్చితంగా నేలమీద ఎదుర్కోవలసిందే. కుహనా వామపక్షవాదులకి ఆ పని చేయడం మాత్రం ఇష్టంలేదు.

తీర్పు గురించి సిపిఎం కు ఉన్న ఏకైక సమస్య ఆ తీర్పు స్వభావంలో విశ్వాసాన్ని పునాదిగా చేసుకున్నది అని మాత్రమే. కానీ, ఆ తీర్పు ఫలితంగా ఏమి జరగబోతున్నదో అనే విషయంలో మాత్రం సిపిఎం ఉద్దేశపూర్వకమైన మౌనం వహించింది. ఆ ఫలితం ఏమంటే, భూమి పంపకంలో హిందూవులకు అనుకూలమైన, అన్యాయమైన నిర్ణయం. స్పష్టమైన వైఖరి తీసుకోవడంలో సిపిఎం చూపిన సందిగ్ధత, అణచివేతకూ, ద్రోహానికీ గురైన మైనారిటీల కొరకు మసీదును పునర్నిర్మించడం మాత్రమే నిజమైన న్యాయం అవుతుందని డిమాండ్ చేయలేని అశక్తత. చివరికి, ఈ దుర్మార్గమైన తీర్పు ముందర శాంతియుతంగా సాగిలపడమని వాళ్లు చేసిన విజ్ఞప్తి, అదే న్యాయవ్యవస్థ మీద విశ్వాసం ఉంచమని వాళ్లు ఇచ్చిన పిలుపు ఈ వామపక్షవాదుల లౌకిక తత్వం అని చెప్పబడే దానిలో ఉన్న హాస్యాస్పదను, బలహీనతను, అవకాశవాదాన్ని, కాషాయరంగును బయటపెడుతున్నాయి.

మతోన్మాద ఫాసిస్ట్ భాజపాకు తానే 'లౌకిక ప్రత్యామ్నాయం' అని, ఎల్లప్పుడూ ఒక అబద్ధంలో నటిస్తున్న కాంగ్రెస్ నిజమైన మతోన్మాద ముఖం కూడా ఇప్పుడు స్పష్టంగా బయటపడింది. నిజానికి ఇందులో కొత్త విషయమేమీ లేదు. ప్రతి సందర్భంలోను అది 1949 కావచ్చు, 1986 కావచ్చు, 1990 కావచ్చు, 1992 కావచ్చు, 2010 కావచ్చు కాంగ్రెసే కేంద్ర ప్రభుత్వాధికారంలో ఉంది. ఈ ప్రతి సందర్భంలోనూ సంఘ్ పరివార్ పెట్టుకున్న ఫాసిస్ట్ ఎజెండా కేంద్ర ప్రభుత్వ క్రియాశీల మద్దతుతోనే వాస్తవ రూపం ధరించింది. వీలయింది. మత కల్లోలాలను తయారు చేయడం, మసీదును ధ్వంసం చేయడం, కాంగ్రెస్ నాయకత్వం లోని భారత రాజ్యపు క్రియాశీల ప్రోత్సాహంతోనే జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వ స్పష్టమైన అనుమతితోనే 1992 దుండగులు ఇవాళ్టికీ ఏ శిక్షా లేకుండా తిరుగుతున్నారు. అందుకే కాంగ్రెస్ ఈ తీర్పును 'ఎవరి విజయమూ కాదు, ఎవరి అపజయమూ కాదు' అని వ్యాఖ్యానించింది.

అత్యంత దుర్మార్గమమైన, మతోన్మాదపూరితమైన ఈ తీర్పులో ముస్లింలకు న్యాయం స్పష్టంగా నిరాకరించబడిన తరువాత ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ 'లౌకిక స్వభావపు' ప్రతిఫలనంగా చూస్తోంది. 'భారత ప్రజల పరిణతికి' చిహ్నంగా చూస్తోంది. 'శాంతీ, సామరస్యాల కోసం మనం చేస్తున్న ప్రయత్నం' అని చెప్తోంది. బాబ్రీ మసీదు ఉండిన నేల మీద బలవంతంగానైనా సరే ఒక ఆలయం నిర్మించాలని మతోన్మాద ఫాసిస్టులు పెట్టుకున్న ఎజెండాను ఈ తీర్పు బలపరిచిందనే వాస్తవాన్ని వీళ్లు విస్మరిస్తున్నారు. దిగ్విజయ్ సింగ్ వంటి నాయకులు ఈ తీర్పును 'వీలయినంత మంచి తీర్పు' అని ప్రశంసించగా, చిదంబరం 'జాతి ముందుకు కదలాలి' అని పిలుపిచ్చాడు. ఈ తీర్పుకీ, 1992 డిసెంబర్ 6న జరిగిన బాబ్రీ మసీద్ విధ్వంసానికీ ఏమీ సంబంధం లేదని కూడా అన్నాడు.

మతోన్మాద ఫాసిస్టుల పెరుగుతున్న పట్టు మీద ముసుగు కప్పడమే ఈ అన్ని ప్రతిస్పందనల ఉద్దేశపూర్వక ప్రయత్నం. రామాలయాన్ని కూల్చివేసి, దాని మీద ఒక అక్రమ కట్టడంగా మసీదును నిర్మించారని సంఘ్ పరివార్ ఇన్నాళ్లుగా చేస్తున్న వాదనను ఈ తీర్పు సమర్థించింది. అందువల్ల, మసీదును కూలగొట్టిన వాళ్ల మీద నడుస్తున్న క్రిమినల్ కేసులు దానికదిగా బలహీన పడిపోతుంది. అంతేకాదు, ఆ శక్తులకే ఈ భూమి మీద యాజమాన్య హక్కులు ఇవ్వడమంటే వారు చేసిన విధ్వంసానికి నైతిక సమర్థన ఇవ్వడమే. అందువల్ల చాలా స్పష్టంగా ఈ తీర్పు మతోన్మాద ఫాసిస్టుల విజయం. ఆ మాట కాంగ్రెస్ ఒప్పుకోక పోవచ్చు. ఎందుకంటే, కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరూ దీన్నంతా మర్చిపోయి, ముందుకు కదలాలని ఆశిస్తోంది. రాజ్యం ఎప్పుడూ తాను చేసిన అన్యాయ యుద్ధాలనూ, హత్యాకాండలనూ, మారణకాండలనూ, జనహననాలను జనం మర్చిపోవాలని, ముందుకు కదలాలని మళ్లీ ఒక మారణకాండ వచ్చే వరకు ముందుకే పోతూ ఉండాలని అనుకుంటుంది.

సుప్రీంకోర్టు ఏమి నిర్ణయించినా అందులో తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఇప్పుడు కాంగ్రెస్, సిపిఎం రెండూ గుడ్డిగా ప్రకటిస్తున్నాయి. ఈ విషయం మీద ఒక కచ్చితమైన రాజకీయ వైఖరి తీసుకోవాలనే బాధ్యతను (ప్రమాదాన్ని) పక్కనపెట్టి, ఎప్పుడో సుప్రీంకోర్టు అవసరమైన పరిష్కారాన్ని ఇస్తుందనే ఆశ చూపుతున్నారు. కానీ, భారత న్యాయ వ్యవస్థ ఇప్పటికీ ఎన్నోసార్లు తన కులతత్వ, మతతత్వ రంగులను బయటపెట్టుకుంది. అది, ఈ దేశపు మత అగ్ర సంఖ్యాక రాజ్యాన్ని సమర్థించే ఒక సాధనం మాత్రమే. అదే సుప్రీంకోర్టు, గతంలో భూస్వాములకు అనుకూలంగా తీర్పులిచ్చిన సుప్రీంకోర్టు, కార్పొరేట్ సంస్థల భూఆక్రమణలను ఎత్తిపట్టిన సుప్రీంకోర్టు, సాక్ష్యాధారాలే లేకపోయినా 'సామూహిక భావోద్వేగాలను' సంతృప్తి పరచడానికి అనే పేరుతో అఫ్జల్ గురుకు మరణశిక్ష విధించిన సుప్రీంకోర్టు ఇప్పుడు హఠాత్తుగా తనంతట తానే ఏదో ప్రగతిశీలమైన, న్యాయమైన తీర్పును ఇవ్వబోతుందని ఆశించడానికి ఆధారమే లేదు. ఈ బ్రాహ్మణవాద, హిందూ ఫాసిస్ట్ రాజ్యాన్ని, దాని వ్యవస్థలను ప్రత్యక్షంగా ఎదుర్కొని ఓడించడం కన్న మరో మార్గం లేదు. అప్పుడు మాత్రమే ఈ దేశంలోని పీడనకూ, నిరాదరణకూ గురవుతున్న అశేష ప్రజానీకానికి న్యాయం దొరికే అవకాశం వస్తుంది.

❖❖❖❖❖

ప్రభుత్వాధికారుల మద్దతుతో సంఘ్ పరివార్ గూండాలు 1992లో కూల్చేవరకు నాలుగు వందల సంవత్సరాల పాటు బాబ్రీ మసీదు ఉనికిలో ఉంది. ఆ విధ్వంసం ఈ దేశంలో మతోన్మాద ఫాసిస్టుల దుర్మార్గ చర్యలలో ఒకటి. ఆ బాబ్రీ మసీదు స్థల యాజమాన్యం ఎవరిదనే విషయంలో యాభై ఏడు సంవత్సరాలుగా వివాదంలో ఉన్న కేసుపై సెప్టెంబర్ 30న అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ తీర్పు ఇచ్చింది. న్యాయ వ్యవస్థలో బలంగా పాతుకుపోయి ఉన్న మతోన్మాద స్వభావాన్ని ఈ తీర్పు ప్రతిఫలించడం ఆశ్చర్యం లేదు. మసీదుకు చెందిన భూమిలో మూడింట రెండు వంతుల భాగాన్ని మతోన్మాద శక్తులకు అప్పగించడం ద్వారా వాళ్ల తర్కాన్నీ, కార్యక్రమాన్నీ న్యాయస్థానం ఆమోదించినట్టయింది.

చాలా పాత కేసుకు కొనసాగింపుగా వెలువడిన ఈ కొత్త తీర్పులో హైకోర్టు రెండు అంశాల మీద తన నిర్ధారణ ప్రకటించవలసి ఉండింది. ఇది రాముడి జన్మస్థలం అవునా, కాదా అనేది ఒక అంశం. మసీదు కింద ఒక ఆలయం ఉండిన మాట నిజమా, కాదా అనేది మరో అంశం. అది రామజన్మస్థలం అవునో, కాదో నిర్ణయించడానికి ఎంత బ్రహ్మాండమైన తెలివి అయినా సరిపోదు. ఎందుకంటే, దానికి ఒక చారిత్రక పునాది లేదు. అది కేవలం నమ్మకానికీ, విశ్వాసానికీ సంబంధించిన విషయం. న్యాయస్థానం ఎప్పుడైనా నమ్మకాల మీద ఆధారపడి తీర్పు చెప్పజాలదు. మరొకపక్క మసీదు ఒక చారిత్రక కట్టడం, అది ఆ స్థలం మీద మన కళ్ల ముందర నాలుగు వందల ఏళ్ల పాటు నిలిచి ఉంది. హైకోర్టు తీర్పు ఈ సాధారణ వాస్తవాన్ని అంగీకరించడానికి నిరాకరించింది. అందుకు బదులుగా 'వివాదాస్పద స్థలం భగవాన్ రాముడి జన్మస్థలం. జన్మస్థలం న్యాయం కోరుతున్న వ్యక్తిగానూ, భగవంతుడిగానూ ఉంది. భగవాన్ రాముణ్ని ఒక శిశువుగా భావించి, ఆ జన్మస్థలాన్ని పూజిస్తున్నందువల్ల అది వ్యక్తిగా మూర్తిభవించినట్టే' అని ఒక అర్థంలేని సూత్రీకరణ చేసింది.

'ఒక పాత నిర్మాణాన్ని కూల్చివేసి, ఆ స్థలం మీదనే వివాదాస్పద కట్టడాన్ని నిర్మించారు. ఇప్పుడు వివాదంలో ఉన్న ఆస్తి రామచంద్రుల వారి జన్మభూమి స్థలం అనేది నిర్ధారణ అయింది. అలాగే మొత్తంగా హిందువులు వివాదాస్పద స్థలం మీద ఉన్న రామపాదుకలను, సీతాదేవి వంటశాలను, ఇతర విగ్రహాలను, ఇతర ఆరాధనా వస్తువులను పూజిస్తూ ఉన్నారనేది కూడా నిర్ధారణ అయింది. వివాదాస్పద స్థలాన్ని భగవంతుడు జన్మస్థానంగా హిందువులు పూజిస్తున్నారని నిర్ధారణ అయింది. అందువల్ల హిందువులు ప్రాచీన కాలం నుంచి ఒక హక్కుగా ఈ పుణ్యస్థలాన్ని దర్శిస్తున్నారని నిర్ధారణ అయింది. వివాదాస్పద కట్టడం నిర్మాణం జరిగిన తరువాత ఆ వివాదాస్పద కట్టడం లోపల 1949 డిసెంబర్ 22, 23 రాత్రి భగవంతుడి విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందని కూడా నిర్ధారణ అయింది. బాహ్య ప్రాంగణమంతా అంతకు ముందు కూడా హిందువుల సంపూర్ణ యాజమాన్యం కింద ఉండిదనీ, వివాదాస్పద స్థలమయిన అంతఃప్రాంగణంలో కూడా వారు పూజలు చేస్తూ ఉండేవారనీ నిర్ధారణ అయింది. వివాదాస్పద కట్టడం అసలు ఇస్లాం సూత్రాలకు వ్యతిరేకంగా ఉనికిలోకి వచ్చింది గనుక దాన్ని మసీదుగా అభివర్ణించడానికి కూడా వీలులేదని నిర్ధారణ అయింది.' ఇది తీర్పు.

ఈ చట్టపరమైన వివాదానికి చారిత్రక నేపథ్యం

ఫైజాబాద్ సబ్ జడ్జ్ న్యాయస్థానంలో నిర్మోహీ అఖాడా అనే సంస్థకు చెందిన మహంత్ రఘువర్‌దాస్ 1885 జనవరి 19న ఒక వ్యాజ్యం దాఖలు చేశాడు. మసీదు ముందర ఉన్న ఒక స్థలం రామజన్మస్థలమనీ, అందువల్ల అక్కడ ఒక గద్దె మీద పూజలు నిర్వహించుకోవడానికి తనను అనుమతించాలనీ ఆయన కోరాడు. ఈ మొత్తం వ్యవహారంలో ఇది మొట్టమొదటి దరఖాస్తు. అప్పటి ఫైజాబాద్ సబ్ జడ్జ్ పండిత్ హరికిషన్ ఈ దరఖాస్తును కొట్టివేశారు. 1885 ఫిబ్రవరి 24న ఆయన ఇచ్చిన తీర్పులో 'ఈ గద్దె ప్రస్తుతం ఉన్న మసీదుకు ఎంత సమీపంలో ఉన్నదంటే, దరఖాస్తుదారు కోరినట్టుగా అక్కడ ఆలయం నిర్మించుకొనే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ విధానానికి వ్యతిరేకం అవుతుంది' అని అన్నారు.

ఆ తరువాత 1949 డిసెంబర్ 22 రాత్రి ఈ వ్యవహారం మళ్లీ ఒకసారి భగ్గుమంది. ఆ రాత్రి మసీదు మధ్య భాగంలో విగ్రహాలు పెట్టి, వందలాది మంది హిందువులు లోపలికి దూసుకువెళ్లి అక్కడ పూజ ప్రారంభించారు. ఆ గుంపును అక్కడి నుంచి చెదరగొట్టి, బయటికి తరిమివేసినప్పటికీ మొత్తంగా మసీదు ప్రాంగణపు సింహద్వారానికే తాళం వేయడం జరిగింది. విగ్రహాలేమో లోపల ఉండిపోయాయి. అప్పటి నుంచీ మసీదు తాళం వెయ్యబడే ఉంది. అందువల్ల ముస్లింలకు ప్రవేశం నిరాకరించబడి, అక్కడ నమాజ్ నిషేధించబడింది. 1950 జనవరి 16న హిందూ మహాసభకు చెందిన గోపాల్‌సింగ్ విశారత్ ఫైజాబాద్ సివిల్ జడ్జ్ ముందర మరొక దరఖాస్తు చేశాడు. మసీదు లోపల పూజ చేసుకోవడానికి తమకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇమ్మని ఆయన కోరాడు. అప్పటి సివిల్ జడ్జ్ ఎన్. ఎన్. ఛద్దా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులో పూజ చేసుకోవడానికి అనుమతిని ఇచ్చారు. కానీ, అది స్థానిక హిందూవులకు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. ఈ ఉత్తర్వు మొత్తం వ్యవహారాన్ని సంక్లిష్టం చేసింది.

ఆ తరువాత మహమ్మద్ హషీమ్ నాయకత్వంలో ఆయోధ్యకు చెందిన ఐదుగురు ముస్లింలు ఈ మధ్యంతర ఉత్తర్వును సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఎంతో మంది ముస్లింలూ, హిందువులూ కూడా ఈ వ్యాజ్యంలో పాల్గొంటామని దరఖాస్తులు పెట్టుకున్నందువల్ల ఈ చట్టపరమైన వివాదం చాలా కాలంగా కొనసాగుతోంది. 1986లో రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మసీదు తాళాలను పూర్తిగా తొలగించాలనీ, హిందూవులకు పూజ చేసుకునే అనుమతి ఇవ్వాలనీ నిర్ణయించింది. ఆ తరువాత 1992 డిసెంబర్ 6న అధికార వర్గాల పూర్తి మద్దతుతో సంఘ్ పరివారానికి చెందిన కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చివేశారు. ఈ కూల్చివేతకు నాయకత్వం వహించిన వారు లాల్‌కృష్ణ అద్వానీ, ఉమా భారతి, ప్రవీణ్ తొగాడియా, అశోక్ సింఘాల్ తదితరులు. ఈ కూల్చివేత తరువాత దేశవ్యాప్తంగా ముస్లింలకు వ్యతిరేకంగా ఎన్నో మతకల్లోలాలు జరిగి ఎంతో మంది చనిపోయారు. ముస్లిం ప్రజానీకం, వారి ఆస్తి ప్రత్యేకంగా ఎక్కుపెట్టబడ్డాయి.

ప్రస్తుత తీర్పు సంఘపరివారం ఇంతకాలంగా వాదుతున్న నీచమైన భావోద్వేగాలకు, సమర్థనలకు ప్రతిధ్వనిగా ఉంది తప్ప, ఎటువంటి సమంజసమైన చారిత్రక ఆధారాలతో లేదు. తీర్పులో ఉటంకించిన ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పూర్తిగా దురభిప్రాయాలతో నిండిన అవిశ్వసనీయమైన నివేదిక. ఆ నివేదికను ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తయారు చేయించారు. తీర్పు మసీదు స్థలాన్ని మూడు భాగాలుగా విభజించాలనీ, మధ్యభాగాన్ని రామవిగ్రహ పూజను కొనసాగించేందుకు వీలుగా హిందూ మహాసభకు ఇవ్వాలనీ, ఒక భాగాన్ని హనుమంతుడిని పూజించే నిర్మోహి అఖాడా అనే హిందూ

శాఖకు ఇవ్వాలనీ, మిగిలిన మూడో భాగాన్ని మసీదుకు వదలాలనీ చెబుతోంది. ఇది నిస్సిగ్గుగా, హిందూ అధిక సంఖ్యాక రాజ్యపు అభివృద్ధి నిరోధక కార్యక్రమాన్ని పునరుద్ఘాటించడమే. తమకు దొరికిన మూడో వంతు భాగాన్ని స్వీకరించి, రాజ్యపు ఔదార్యంతో సంతృప్తి పడి రెండో తరగతి పౌరులుగా జీవించడమే ముస్లింల బాధ్యత అని ఈ తీర్పు చెబుతోంది.

ఈ తీర్పు విగ్రహాలను దొంగతనంగా ప్రతిష్ఠించడాన్ని సమర్థిస్తోంది. మసీదుకు అన్యాయంగా తాళం వేయడాన్ని సమర్థిస్తోంది. ఆ తరువాత హిందువుల కోసమే ఆ తాళం తెరవడాన్ని సమర్థిస్తోంది. చివరికి మసీదును కూల్చివేసిన దుర్మార్గ చర్యను సమర్థిస్తోంది. ఒక్క కలంపోటుతో ఈ అన్ని జరిగిపోయాయి. ఇంకా చెప్పాలంటే, ఇతర మతస్తుల ప్రార్థనా స్థలాన్ని దురాక్రమించినందుకు, అది తమదే అని అక్రమంగా ప్రకటించుకున్నందుకు, చివరికి దాన్ని తమ ఇష్టారాజ్యంగా కూలగొట్టినందుకు మతోన్మాద శక్తులకు ఈ తీర్పు వెన్నుతట్టిందన్నమాట. ఈ గూండా శక్తులకు ఇకముందు ఇతర మతస్తుల ప్రార్థనా మందిరాలతో కూడా ఇలాగే వ్యవహరించేందుకు సమర్థననూ, ప్రోత్సాహాన్నీ ఈ తీర్పు ఇస్తుంది.

మతోన్మాద శక్తులు ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం బాబ్రీ మసీదుపై దాడిచేసి కూల్చివేశారు. అందువల్ల ముస్లిం సమాజానికి న్యాయం చేకూర్చాలంటే బాబ్రీ మసీదు పునర్నిర్మాణం మాత్రమే ఏకైక పరిష్కారం. 1947లో అధికార మార్పిడి జరిగిన తరువాత ఈ దేశంలో ముస్లింలే అత్యధికంగా వేటాడబడిన, అణచివేయబడిన సమూహాలలో ఒకటిగా ఉన్నారు. బాబ్రీమసీదు స్థలాన్ని దురాక్రమించడం, అక్కడి మసీదును కూల్చివేయడం, ఇప్పుడు అక్కడొక ఆలయాన్ని నిర్మించడానికి చట్టబద్ధమైనా ఆమోదం తెలపడం అన్నీ కూడా భారత రాజ్యపు హిందూ ఫాసిస్ట్ స్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. అక్కడి మసీదు ముస్లింల చారిత్రక పూజా స్థలం. దాని అక్రమ విధ్వంసం జరిగింది గనుక పునర్నిర్మాణం మాత్రమే న్యాయబద్ధమైన చర్య అవుతుంది.

ఇది కేవలం ఒక పూజా స్థలాన్ని పునఃస్థాపించడం అనే మామూలు విషయం మాత్రమే కాదు. పిడికెడు మంది సంపన్నుల వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే భూస్వామ్య, బ్రాహ్మణ, హిందూ శక్తులకు వ్యతిరేకంగా సాగవలసిన విశాల పోరాటంలో ఇది భాగం. ఈ నేపథ్యంలో కుహనా లౌకికవాదులు సూచిస్తున్న 'పరిష్కారాలు' ఉదాహరణకు, అక్కడ ఆస్పత్రిని నిర్మించాలనీ, లేదా 'మతాతీత' నిర్మాణాలేవైనా చేపట్టాలనీ ప్రతిపాదించేవి కూడా సమస్యాత్మకమైనవే. హిందూ ఫాసిస్ట్ రాజ్యం, దాని తైనాతీలు తమ అధిక సంఖ్యాక దురభిప్రాయాలతో ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిగా మనం బాబ్రీ మసీదు విధ్వంసాన్ని గుర్తించవలసి ఉంది. బాబ్రీమసీదులో ముస్లింలు నమాజ్ చేసుకునే హక్కును తొలగించడం గానీ, మసీదును విధ్వంసం చేయడం గానీ, ఆ తరువాత విస్తృతంగా సాగిన ముస్లిం వ్యతిరేక కల్లోలాలు గానీ అన్నీ కూడా రాజ్యపు మద్దతుతోనే సాగాయి. ఈ దుర్మార్గాలన్నీ చేసిన నాయకులు ఇవాళ్టికీ బహిరంగంగా తిరుగుతున్నారు. వారి మీద కనీసమైన న్యాయవిచారణ కూడా ప్రారంభం కాలేదు. ఈలోగా ఇదే హిందూ ఫాసిస్ట్ రాజ్యపు సహకారంతో వాళ్లు గుజరాత్ మారణకాండకు తలపడ్డారు. కంధమాల్‌లో మారణకాండ సాగించారు. ఈ పద్ధతిలోనే ఈ దేశంలో బ్రాహ్మణవాదం, హిందూత్వం, భూస్వామ్యం విస్తరించాయి. ఎల్లవేళ రాజ్యం సహకార, ప్రోత్సాహాలతోనే బలపడ్డాయి. అందువల్లనే నిజమైన న్యాయం కావాలని ఆకాక్షించడం అంటే మసీదును పునర్నిర్మించాలని నిర్ద్వంద్వంగా ఆకాంక్షించవలసి ఉంటుంది.

మరొక కోణం కూడా ఉంది. బాబ్రీ మసీదు తాళాలు పగులగొట్టి హిందువులను పూజకు అనుమతించడం, తద్వారా మతకల్లోలాలను రెచ్చగొట్టడం సరిగ్గా భారత ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ శక్తుల ఇష్టారాజ్యానికి అనుమతించడం ఒకేసారి జరిగాయి. తత్ఫలితంగా దేశప్రజానీకంలో పెరిగిపోతూ ఉన్న పేదరికం, అసంతృప్తి, సామ్రాజ్యవాద మార్కెట్ శక్తుల దాడితో కునారిల్లిపోతున్న ప్రజా జీవనం ఈ నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలక వర్గాలు ఎంచుకున్న కుట్ర ఈ ప్రార్థనా స్థలం మీద వివాదం రేపి జాతిని మత ప్రాతిపదికపై విభజించడం. రామజన్మభూమిని పునరుద్ధరించినందువల్ల కోట్లాది మంది నిరుపేద హిందూ ప్రజానీకపు భౌతిక పరిస్థితులలో మెరుగుదల రాదు. 'హిందూ రైతులు' ఆత్మహత్యలు చేసుకోకుండా ఆపగలిగే మంత్రదండమేదీ రామజన్మభూమిలో లేదు. భూమిలేని నిరుపేద 'హిందూ దళితులు' తమ సామాజిక ఆత్మగౌరవ స్థాయిని పెంచుకోవడానికీ, భూమి హక్కును పొందడానికీ రామజన్మభూమి ఏమీ ఉపయోగపడదు. ప్రపంచీకరణ వల్ల ఉద్యోగాల నుంచి తొలగించబడిన 'హిందూ కార్మికులకు' రామజన్మ భూమి మళ్లీ ఉద్యోగాలివ్వదు. పితృస్వామ్యపు బంధనాల నుంచి 'హిందూ స్త్రీలను' రామజన్మభూమి విముక్తి చెయ్యజాలదు. రామజన్మ భూమి చేయగలిగిందల్లా ఏమంటే, అది పాలకవర్గాల చేతిలో ఒక ఆయుధంగా మారి, ముస్లిం ప్రజానీకాన్ని దెబ్బతీస్తుంది. అది ఉదాహరణగా చూపి ఇతర పీడిత వర్గాల మీద, దళితుల మీద, ఆదివాసుల మీద, స్త్రీల మీద, దేశంలోని ఇతర మత, అల్పసంఖ్యాక వర్గాల మీద దాడి చేయడానికి భారత రాజ్యపు బ్రాహ్మణ, హిందూ, భూస్వామ్య స్వభావానికి మరింత బలం చేకూరుస్తుంది. తద్వారా ఈ దేశంలో ఆధిపత్యం వహిస్తున్న భూస్వామ్య వర్గాల, వారి సామ్రాజ్యవాద యజమానుల ప్రయోజనాలను పరిరక్షించడానికి న్యాయవ్యవస్థ, పార్లమెంట్, ప్రచార సాధనాలు మూకుమ్మడిగా పనిచేస్తాయి.

అందువల్ల నిజమైన న్యాయం సాధించాలంటే, భారత రాజ్యపు బ్రాహ్మణ, హిందూ, భూస్వామ్య వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించడం మాత్రమే ఏకైక మార్గం. పీడిత ప్రజానీకం అంతా ఐక్యంగా ఈ రాజ్యానికీ, దాని అధికార వ్యవస్థలకూ వ్యతిరేకంగా పోరాడినప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. ఈ వ్యవస్థ లోపల నిజమైన న్యాయం అందుతుందనే భ్రమలు ఇంకెంత మాత్రం ఉంచుకోనక్కర్లేదు. ఈ రాజ్యం హిందూ ఫాసిస్టులదనీ, న్యాయవ్యవస్థ దానికి ఊతగా ఉన్నదనీ తేటతెల్లం అవుతోంది. ముస్లింలూ, తమ జీవనం కోసం పోరాడుతున్న ఆదివాసీలూ, శతాబ్దాలుగా భూమికీ, గౌరవానికీ దూరం కొట్టబడిన దళితులూ, జాతీయ స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల ప్రజలూ, స్త్రీలూ, శ్రామిక ప్రజానీకం, కార్మికులూ, రైతులూ సహా ఈ దేశంలోని యావత్ పీడిత ప్రజానీకం ఒక నిశ్చయాత్మకమైన పోరాటం ప్రారంభించి దేశంలో ప్రస్తుతం సాగుతున్న విప్లవోద్యమంతో ఐక్యమైనపుడు మాత్రమే భారత రాజ్యపు బ్రాహ్మణ, హిందూ, భూస్వామ్య వ్యవస్థను ఓడించగలుగుతాం. అది మాత్రమే ప్రస్తుత పీడన సమాజాన్ని ప్రజాస్వామికీకరించ గలుగుతుంది. నిజమైన న్యాయం తేగలుగుతుంది. సమానత్వం తేగలుగుతుంది. పీడిత అశేష జనబాహుళ్యానికి గౌరవాన్ని ఇస్తుంది. వీ

బాబ్రీ మసీదు కూల్చివేత పై ఇచ్చిన తీర్పు మధ్య యుగాలకూ, ఆధునిక యుగానికీ మధ్య విభజన రేఖను మరోసారి చెరిపేసిందనీ, ఆధిపత్య శక్తుల చర్యలకు చట్టబద్ధత కల్పించిందనీ అంటున్నారు **పి. ప్రసాద్**

అనేక 6/12 లకు ఊతమిచ్చిన 30/9

బాబ్రీ మసీదు కూల్చివేత (6 డిసెంబర్ 1992)కీ, దానిపై తాజా తీర్పు (30 సెప్టెంబర్ 2010)కీ మధ్య పద్దెనిమిది ఏండ్లు పట్టింది. ఈ పద్దెనిమిది ఏండ్ల కాల పరిమితి దేశరాజకీయ కాలగమనంలో చాలా పెద్దదే. అయితే చరిత్ర గమనంలో మాత్రం అది చాలా చిన్నదే. ఒక మనిషి పుట్టాక ఓటు హక్కు పొందడానికి పట్టే మైనార్టీ కాలం కూడా పద్దెనిమిది ఏండ్లే. ఇలాంటి పద్దెనిమిది ఏండ్ల మైనార్టీ కాలం సమకాలీన భారతదేశ రాజకీయ రంగాన్ని ఒక మేజర్ మలుపు తిప్పింది. పద్దెనిమిది ఏండ్ల క్రితం రాజ్యాంగేతర రాజకీయ శక్తులు బాబ్రీ మసీదును ఆధునిక డైనమైట్లతో కూల్చివేశాయి. అందువల్ల డిసెంబర్ 6 లౌకిక భారతదేశ చరిత్రలో 'చీకటి దినం'గా మారింది. అట్టి విధ్వంసకర శక్తులు ఆనాడు తాము కూల్చిన స్థలంలో మూడింట రెండు వంతుల భూభాగాన్ని నేడు రాజ్యాంగబద్ధంగానే పొందగలిగాయి. ఈ కారణంగా సెప్టెంబర్ 30 చరిత్రలో 'చిమ్మ చీకట్ల దినం'గా మారింది. ఆనాటి చీకటి దినాన్ని రాజ్యాంగేతర ప్రైవేట్ శక్తులు సృష్టించాయి. ఈనాడు రాజ్యమే పబ్లిక్‌గా చిమ్మ చీకట్ల దినాన్ని సృష్టించింది. ఇదే తాజా తీర్పు ప్రత్యేకత.

ఒకవైపు ప్రభుత్వ రంగంలోని ఆర్థిక పారిశ్రామిక వ్యవస్థలు సర్వం ప్రైవేటీకరణ అవుతున్నాయి. మరోవైపు, ఈ ప్రైవేట్ శక్తుల విధ్వంస ప్రక్రియ మాత్రం ప్రభుత్వీకరణ జరుగుతున్నది. నిజానికి ప్రపంచీకరణ అంటే 'సరుకుల ప్రపంచీకరణ – ఆలోచనల స్థానికీకరణ మాత్రమే. (గ్లోబలైజేషన్ పాలసీస్ ఆర్ నథింగ్ బట్ గ్లోబలైజేషన్ ఆఫ్ గూడ్స్; లోకలైజేషన్ ఆఫ్ మైండ్స్). న్యూయార్క్ – న్యూ ఢిల్లీల మధ్య ప్రాణంలేని సరుకుల స్వేచ్ఛా ప్రయాణానికి ప్రైవేటీకరణ అవకాశమిస్తుంది. అయితే అట్టి సరుకులను సృష్టించే ప్రాణమున్న మనుషులను సంకుచిత విద్వేషాల మధ్య బంధిస్తుంది. సరుకులను ప్రభుత్వరంగం తగినంత విశాల పరచలేదు. అందుకే ప్రైవేటీకరిస్తుంది. ప్రజల మెదళ్లను ప్రైవేట్‌రంగం తగినంతగా సంకుచిత పరచలేదు. అందుకే రాజ్యాంగీకరణ (ప్రభుత్వీకరణ) చేస్తుంది. సరుకులపై గల అన్ని ఆంక్షలను ఎత్తివేస్తుంది. ప్రజల మెదళ్లపై ఆంక్షలు విధిస్తుంది. ప్రాణంలేని సరుకులకు రాజ్యం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పిస్తుంది. ప్రాణమున్న మనుషుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరిస్తుంది. ఇలాంటి ప్రపంచీకరణ రహదారిలో తాజా తీర్పు ఓ మైలురాయి.

అలహాబాద్ హైకోర్టు, లక్నో బెంచ్ ఇచ్చిన తాజా తీర్పును స్థూలంగా కింది విధంగా విశ్లేషించవచ్చు. కరసేవకులు రాజ్యాంగేతర ప్రైవేట్ ఆర్మీగా మారి పద్దెనిమిది ఏండ్లక్రితం బాబ్రీ మసీద్‌ను కూల్చేశారు. వారికి ఈ పద్దెనిమిది ఏండ్లలో రాజ్యాంగం విధించిన శిక్షలు లేవు. లిబర్హాన్ కమిషన్ విచారణా, దాని నిర్ధారణలూ ప్రహసనంగానే మిగిలాయి. తాను ఆనాడు రక్షించలేని బాబ్రీమసీదును పునర్నిర్మించాల్సిన బాధ్యతను రాజ్యాంగం విడనాడింది. తాజా కేసు ద్వారా భూ యాజమాన్య హక్కును కనీసం ఒక మతసామరస్య ప్రచార ట్రస్టీకో, లేదంటే ఒక చారిత్రక పురావస్తు మ్యూజియంకో స్వాధీనపరచవచ్చును. తద్వారా శాశ్వతంగా ఈ వివాదాన్ని ముగించవచ్చు. అవేమీ చేయలేదు. పైగా ఏ ప్రైవేట్ ఆర్మీ రాజ్యాంగేతరంగా బాబ్రీ మసీదును ఆనాడు కూల్చిందో, దానికే అది కూల్చిన స్థలంలో మూడింట రెండు వంతుల భూమిని రాజ్యాంగ బద్ధంగా అప్పగించిన పరిణామమిది. గాయపడ్డ శక్తులకు ఒకవంతు స్థలాన్ని, గాయపరిచిన శక్తులకు రెండు వంతుల స్థలాన్ని అప్పగించిన సరికొత్త సామాజిక న్యాయమిది.

తాజా తీర్పులో ఉభయపక్షాలకు ఇంకా ఈ కింది సందేశాలూ, సంకేతాలూ నిగూఢంగా దాగి ఉన్నాయి. 'ఈ స్థలం మీది కాకపోయినా, మీరు శాంతంగా ఉండేందుకు వీలుగా ఒక వంతు స్థలాన్ని ఉదార బుద్ధితో అప్పగిస్తున్నామని' గాయపడ్డ ముస్లిం మతస్తులకొక పరోక్ష 'సౌహార్ద' సందేశాన్నిచ్చింది. అంతేకాకుండా, 'ఒకవేళ మీరు మా తీర్పును నిరసించితే మీకిచ్చిన ఒక వంతు స్థలంతోపాటు మథుర, కాశీ తదితర మీ స్థలాల స్వాధీనంకై 'విశ్వాస' ఆయుధాన్ని 'మీ ప్రత్యర్థుల జమ్మిచెట్టు మీద ఉంచుతున్నామ'న్న సంకేతం కూడా వారికి ఉంది. ఇకపోతే 'కూల్చివేసిన మీ శ్రమకు గిట్టుబాటుగా మీకు రెండువంతుల భూభాగాన్ని అప్పగిస్తున్నందున గాయపడ్డ వారికి మేమిచ్చిన ఒక వంతు స్థలం గూర్చి గొడవ చేయకండం'టూ, గాయపరిచిన హిందుత్వ శక్తులకొక బుజ్జగింపు సందేశం ఉంది. 'ఒకవేళ ఒక వంతు సరిపోదని ముస్లింలు నిరసనకు దిగితే మెజార్టీ మత 'విశ్వాస' ఆయుధాన్ని చేపట్టండ'న్న సంకేతం కూడా అందులో ఉంది. మతవిశ్వాస ప్రాతిపదికగా ఇచ్చిన తాజా తీర్పులో ఇలాంటి హెచ్చరికలూ, మచ్చికలూ ఉన్నాయి.

నిజానికిది ఇస్లాం, హిందూ మతాల మధ్య వివాదం కాదు. లౌకిక రాజ్యానికీ, రాజ్యాంగేతర అలౌకిక శక్తులకూ మధ్య వివాదం. తనమీద ఆనాడు డైనమైట్లతో దాడికి దిగిన విధ్వంసకర శక్తులకు రాజ్యం నేడు అండగా నిలిచింది. రాజ్యం అండతో తమకు లౌకిక న్యాయం జరుగుతుందని పద్దెనిమిది ఏండ్లుగా ఎదురుచూస్తున్న బాధితుల కళ్లల్లో నేడు కారం పడింది. అయినా ఆ కళ్లు ఎర్రబారకపోవచ్చు. నిప్పులు

చెరగకపోవచ్చు. అవి మరింత కన్నీళ్లు కార్చవచ్చు. లేదంటే నీరుగారవచ్చు కూడా. ఇక్కడ సమస్య కేవలం ముస్లిం మతస్తులది కాదు. ఇది దేశ ప్రజలందరి సమస్య. తొలుత యూదులను వేటాడినపుడు పట్టించుకోనందున నాజీ జర్మనీలో ఒక్కొక్క వర్గం ప్రజలు వరుసగా ఫాసిస్టు దాడికి గురయ్యారు. ఆ చారిత్రక చేదు అనుభవాలు ఇక్కడ పునరావృతం కారాదన్నదే అసలు సమస్య.

1528కి ముందు రామాలయం ఉనికి గూర్చి పురావస్తు తవ్వకాలపై లక్నో కోర్టు ఆధారపడింది. అక్కడే న్యాయవ్యవస్థ మౌలికంగా దారితప్పింది. ప్రాచీన, మధ్యయుగాలలో మతకేంద్రాల విధ్వంసం ఒక భౌతిక సత్యం. పాహియాన్, మెగస్తనీస్, హ్యూన్‌త్సాంగ్, తారానాథ్ తదితరుల చరిత్రల నుంచి బౌద్ధ జాతక కథల వరకూ నిరూపించిన సత్యమిది. ఇది అన్వేషించి కనుగొనాల్సిన విచారణాంశం కానేకాదు. మగధ, మౌర్య రాజ్యాలు బౌద్ధం, జైనమతాలను ఆదరించాయి. బృహద్రదుణ్ని హత్యచేసి గద్దెనెక్కిన పుష్యమిత్రుడితో వాటి విధ్వంసం సాగింది. గుప్త కాలంలో హైందవమతం వర్ధిల్లితే, హూణుల దాడులతో అది తిరిగి పతనావస్థ బాట పట్టింది. కనిష్కుని పాలనలో తిరిగి మగధ మౌర్య రాజ్యాలలో బౌద్ధం పునరుద్ధరణ జరిగితే, గౌడరాజు శశాంకుని కాలం నుంచి మరోసారి అది పతనం కాసాగింది. ఇలా అంచెలంచెలుగా మధ్యయుగ ఆటవిక నీతి రాజ్యమేలింది. భారత ఉపఖండంలో ఇలా అధికంగా విధ్వంసమైన ప్రార్థనా స్థలాలు బౌద్ధ, జైనాలవే. పురావస్తు తవ్వకాలనే ప్రాతిపదికన చేస్తే ఈ దేశంలో ఈనాటి వేలాది హిందూ దేవాలయాల స్థలాలను బౌద్ధ, జైన మతాలకు అప్పగించాల్సి వస్తుంది. మన రాష్ట్రంలోని అమరావతి, బెజవాడ, రామతీర్థంలతో సహా పంచారామాలనూ, త్రిలింగ దేవుళ్ల ఆలయాలనూ తొలగించి బౌద్ధ, జైన మతస్తులకు అప్పగించాలి. అయితే ఇది ఆటవిక న్యాయం తప్ప, ఆధునిక ప్రజాస్వామ్య నీతి అనిపించుకోదు.

ప్రాచీన, మధ్యయుగాలలో ఇక్కడ జరిగిన విధ్వంసాలు ప్రపంచమంతటా జరిగినవే. మంగోలుల దండయాత్రలో ఇస్లాం మతం కోల్పోయినన్ని మసీదులనూ, చారిత్రక నిర్మాణాలనూ ప్రపంచంలో మరో మతం కోల్పోలేదని చరిత్రకారులందరూ చెప్పిందే. బాగ్దాద్ కొన్ని నెలలపాటు దగ్ధమౌతూనే ఉంది. స్పానిష్ వలసవాదులు 16, 17 శతాబ్దాలలో లాటిన్ అమెరికాలోని పురాతన మయా, ఆజ్‌టెక్, ఇంక్‌తా నాగరిక జాతుల ప్రార్థనా నిర్మాణాల ఉపరితలాలను కూల్చి, వాటి పిరమిడ్ల పునాదుల మీదే పెద్ద చర్చిలను నిర్మించారు. అంతెందుకు, ఒకే మతంలోని శైవ – వైష్ణవ శాఖల మధ్య, సున్నీ – షియా శాఖల మధ్య, కేథలిక్ – ప్రొటెస్టెంట్ శాఖల మధ్య యుద్ధాలు జరిగి ప్రపంచమంతటా లక్షలాది ప్రార్థనా నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. లక్నో బెంచి తీర్పును స్ఫూర్తిగా తీసుకుంటే ముమ్ముందు ప్రపంచమంతటా అన్ని మతాలలోని మతోన్మాదశక్తులు ఎలాంటి విధ్వంసకాండలు సాగించవచ్చునో ఊహించుకోవచ్చును.

నేటికీ పాకిస్తాన్‌లో సుమారు పాతిక లక్షల మంది హిందువులున్నారు. వారికి ఏడెనిమిది వందల హిందూ దేవాలయాలున్నాయి. అందులో ఎక్కువ భాగం మధ్యయుగాలలో బౌద్ధ, జైన ఆలయాల శిథిలాలపై నిర్మించినవే. పాకిస్తాన్‌లోని ఇస్లాం మతతత్వ శక్తులకి లక్నో హైకోర్టు తీర్పు ఏ స్ఫూర్తినిస్తుంది? రేపు అక్కడి హిందువుల పరిస్థితేమిటి? మెజారిటీ మత'విశ్వాసం' ఆధారంగా ఇచ్చిన ఈ తీర్పు బంగ్లాదేశ్ మతతత్వ శక్తులకి ఏ స్ఫూర్తినిస్తుంది? గౌతమ బుద్ధుని జన్మస్థలమైనందునే శశాంకుని కాలం నుంచి హిందూ పాలకులు కక్షకట్టి నేపాల్‌ను వల్లకాడుగా మార్చారు. పశుపతి దేవాలయంతో సహా వేలాది హిందూ దేవాలయాలను నిర్మించారు. ఫలితంగా నేపాల్ ఏకైక హిందూ దేశంగా మారింది. నేడు మారిన రాజకీయ పరిస్థితుల్లో నేపాల్‌కు ఈ తీర్పు ఏ సందేశమిస్తుంది? ఇవన్నీ చర్చించాల్సినవే!

భారతదేశ చరిత్రలో 26 జనవరి 1950 కొక ప్రత్యేకత ఉంది. ఆరోజు నుంచే 'గణతంత్ర, ప్రజాతంత్ర, లౌకిక' రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అది మధ్యయుగానికీ, ఆధునిక యుగానికీ మధ్య గీసిన స్పష్టమైన సరిహద్దు రేఖ! దానికి ముందు కాలంలో రకరకాల మత, కులోన్మాద దాడులకూ, విధ్వంసాలకూ బలైన బాధిత వర్గాలకు ఊరటగా ఆ తర్వాత పరిహార లేదా సమానీకరణ చర్యలే ఉంటాయి. అంతే తప్ప ప్రతీకార చర్యలుండవు. పుష్యమిత్రుడు, ఖారవేలుడు, సముద్రగుప్తుడు, శశాంకుడు, గణపతి దేవుడు తదితర హిందూ పాలకులు బౌద్ధ జైన ఆలయాల విధ్వంసకాండ సాగించారు. వాటికి ప్రతీకారం పేరిట ఈ కాలపు హిందూ మత ప్రజల హృదయాలను గాయపరచడం నేరం! అదే విధంగా ఘజ్నీ, ఘోరీ, నాదిర్షా, ఔరంగజేబులు ఆనాడు సాగించిన హిందూ దేవాలయాల విధ్వంసకాండకు ప్రతీకారం పేరిట ఈ కాలపు ముస్లిం ప్రజల హృదయాలను గాయపరచడం నేరం! 'జనవరి–26'కి ముందు నాటి పరిస్థితి 'యథాతథ స్థితి' గా పరిగణించాలి. అంతకు ముందున్న పాత ప్రార్థనా స్థలాల 'యథాతథ పరిస్థితి'ని పరిరక్షించాల్సిన బాధ్యత కొత్త రాజ్యాంగం మీద ఉంటుంది. రాజ్యాంగం ఏర్పడే సమయంలో ఇలాంటి గత చారిత్రక విషాద సంధర్భాల గూర్చి లోతైన చర్చ జరిగింది. ఆ సందర్భంలో అనుసరించాల్సిన చారిత్రక న్యాయ సూత్రాన్ని గూర్చి గోవింద రెనడే ఇలా పేర్కొన్నారు. 'ఇలాంటి గతాన్ని మృత అంశంగా పరిగణించాలి. చరిత్రను చరిత్రేతరంగా చూడడం సాధ్యం కాదు. అదంతా గతించిన చరిత్రే. ఈ రిపబ్లిక్ న్యాయ సూత్రాల ప్రాతిపదికను తాజా లక్నో హైకోర్టు తీర్పు మౌలికంగానే అతిక్రమించింది. ఇది రానున్న పెను ప్రమాదానికి సంకేతం. దీనిని నియంత్రించడానికి ఇకముందు ఆధారపడాల్సింది రాజ్యాంగం మీద కాదు. పౌర సమాజమే మేల్కొనాలి. లక్నో బెంచ్ తీర్పు ఇస్తున్న వాస్తవ సందేశమిదే.

(రచయిత ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

వీక్షణం పత్రికను ప్రతి నెల 29–30 తేదీల్లో పోస్టు చేస్తాం.
పత్రిక 7వ తేదీలోగా అందకపోతే మాకు తెలియపర్చండి.
చందా రెన్యువల్ చేసుకున్న వారికే పత్రికను పంపించడం జరుగుతుంది.
కార్యాలయం ఫోన్ : 040 - 66843495 (ఉ. 10.30 నుండి సా. 5.30 లోపు)

ధనవంతుల పన్నాగాలకు, బలవంతుల దౌర్జన్యాలకు బాసటగా నిలవడానికే కోర్టులూ, చట్టాలూ అనే విషయం ఆయేషా మీరా - సత్యంబాబు కేసులో మరోసారి రుజువైందని అంటున్నారు **పి. శ్రీనివాస్**

ప్రజలు వ్యతిరేకించిన తీర్పు

సెప్టెంబర్‌లో రెండు అన్యాయమైన తీర్పులు వచ్చాయి. ఒక తీర్పుకు 64 ఏళ్ల చరిత్ర ఉంటే, ఇంకొక తీర్పుకు 3 సంవత్సరాల ఉద్యమం ఉంది. 29వ తేదీన సంచలనం కలిగించిన ఆయేషా హత్య కేసులో విజయవాడ మహిళా సెషన్స్ జడ్జి సత్యంబాబు దోషి అని నిర్ధారిస్తూ యావజ్జీవ శిక్ష విధించింది. సెప్టెంబర్ 30వ తేదీ అలహాబాద్ హైకోర్టు అయోధ్య వివాదంపై తీర్పునిచ్చింది. ఆయేషా కేసులో తీర్పు వెల్లడి కాగానే కోర్టు ఆవరణలోని ప్రజలు, మహిళలు, దళిత సంఘాలు తీర్పు అన్యాయంగా ఉన్నదని ఆ తీర్పును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కోర్టు గేటుకు తాళాలు వేశారు. కోర్టులో జనం న్యాయం గొంతు నులిమి చంపబడిందని నినదించారు. దానికి కారణం మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం, పోలీసులు ఈ కేసును పక్కదారి పట్టించి అసలు నేరస్తులకు కొమ్ముకాసి పేదవాడు దళితుడు అయిన సత్యంబాబును ఈ కేసులో ఇరికించడం తీర్పు పట్ల ప్రజల నిరసనకు కారణమయింది. కనీసం న్యాయస్థానంలోనైనా న్యాయం జరుగుతుందని అనుకున్నారు. ఇంకా ఎక్కువగానే న్యాయస్థానం నుండి ఆశించారు. ఆయేషా తల్లిదండ్రులు శంషాద్‌బేగం, ఇక్బాల్ బాషాలు డిమాండ్ చేసినట్లు అసలు నేరస్తులు మాజీమంత్రి కోనేరు కుటుంబీకులపైన విచారణ జరపమని న్యాయస్థానం ఆదేశిస్తుందని, ఒకరి తరువాత ఒకరిని, లడ్డూని, ఉపేంద్ర సింగ్‌ని, ఆయేషా మేనమామని చివరకు అమాయకుడు సత్యంబాబుని అక్రమంగా కేసులో ఇరికించిన పోలీసులపై కఠినమైన చర్యలకు కోర్టు ఆదేశిస్తుందని ఆశించారు. కాని కాళ్లు చచ్చుబడిపోయి వీల్ ఛైర్‌లో కోర్టుకు వచ్చిన సత్యంబాబుకి మరణ శిక్ష విధించాలని వాదించిన ప్రభుత్వ ప్రాసిక్యూటర్ వాదనకు యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు విని కేవలం విజయవాడలోని ప్రజలేకాక యావత్తు రాష్ట్ర ప్రజలు నివ్వెరపోయారు.

అయోధ్య తీర్పుకు ముందు శాంతి భద్రతల పేరుతో ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛను నిషేధించినది. అన్యాయమైన తీర్పుపై మీడియాలో చర్చను నియంత్రించింది. అన్యాయమైన తీర్పును అన్యాయం అని చెప్పడానికి కూడా లేకుండా అన్ని రాష్ట్రాలలో సైనిక కవాతు చేయించి అందరికి ఆమోదయోగ్యమైన తీర్పు అని ప్రచారం చేసి ప్రజల నోళ్లు మూయించింది. కోర్టులో వివాదాస్పద భూమి గురించి కేసు విచారణ జరుగుతుండగానే 1992 లో బి.జె.పి. అగ్రనాయకత్వం, ఆర్.ఎస్.ఎస్. గూండాలు పథకం ప్రకారం బాబ్రీ మసీదును కూలదోసి తమ హిందూ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. హిందూ ఆధిపత్యానికి అనుకూలంగా తీర్పు రాకపోతే దేశంలో మళ్లీ అల్లర్లు జరుగుతాయని, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని హెచ్చరించి, సెప్టెంబర్ 30వ తేదీన తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని, న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అందరు గౌరవించాలని ముస్లింలు భావోద్రేకం చెందకుండా సంయమనం పాటించాలని సందేశాలు ఇచ్చారు.

ఆయేషా మీరా విజయవాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నిమ్రా కాలేజీలో బి.ఫార్మసీ చదివే విద్యార్థిని. మైనారిటీ వర్గంవారు ఆర్థికంగా వెనకబడి నిరక్షరాస్యులుగా ఉండగా ఆయేషా తల్లిదండ్రులు కాలేజీ అధ్యాపకులుగా ఉండడం వలన తమ కూతురిని గొప్పగా చదివించాలని సాంప్రదాయ పరదా బురఖాలను తొలగించి తమ స్వగ్రామం తెనాలి నుండి ఇబ్రహీంపట్నం దుర్గా లేడీస్ హాస్టల్‌కి పంపించారు. 2007 డిసెంబర్ 26న క్రిస్టమస్ సెలవులు అయిపోయిన తరువాత ఆయేషా మీరాను హాస్టల్‌లో దించి వచ్చిన శంషాద్ బేగంకు తెల్లవారేసరికి తమ కూతురిపై అత్యాచారం జరిగి, హత్య గావింపబడినదనే వార్త తెలిసింది. ఒక విద్యార్థిని దారుణ హత్యకు గురికావింపబడడం రాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతి పరిచింది. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీస్ కమిషనర్ సి. ఆనంద్ 48 గంటలలో ఈ ఘాతుకానికి పాల్పడ్డ దోషులను పట్టుకుంటామని అంటూ, ఆవేశంగా హక్కుల సంఘాల వాళ్లు ఇప్పుడు మాట్లాడరేమిటి ముద్దాయికి ఉరివేస్తే అప్పుడు వచ్చి మానవ హక్కుల గురించి మాట్లాడుతారు అని అన్నాడు. ఆయేషా తల్లిదండ్రులు, రాష్ట్ర ప్రజానీకం ఆయేషాకి కొంతైనా న్యాయం జరుగుతుందని అనుకున్నారు. కాని 4 రోజుల ఇన్వెస్టిగేషన్ తరువాత అసలు నేరస్తులను తెరమీదకు తెచ్చే అవకాశం లేదని, అది కాబినెట్ మంత్రులను, వారి కుటుంబ గౌరవాన్ని కాపాడడం ప్రభుత్వ ప్రతిష్టగా భావించిందని, పై నుండి వచ్చిన ఒత్తిడి వలన అర్థమయింది.

అపుడు మొదలయింది పోలీసుల వేట. ఈ కేసులో ఎవరిని బలిపశువుగా చేయావా అని ఇబ్రహీంపట్నం, నందిగామ చుట్టుపక్కల ఉన్న అనేక మందిని 16 నుండి 40 ఏళ్ల వయస్సున్న వారందరిని వందల సంఖ్యలో ఈ పోలీస్ స్టేషన్‌లో రోజుల తరబడి అక్రమంగా నిర్బంధించారు. కోర్టు అనుమతి లేకుండా వారిపై చేతిరాత పరీక్షలు, రక్త పరీక్షలు జరిపారు. ఇవేమీ నేరం చేసిన వారిని పట్టుకోవడానికి కాదు. అసలు నేరస్తులను ప్రజల దృష్టి నుంచి మరలించడానికి ఈ కేసులో పోలీసులు ఎంతో కృషి చేశారు. పోలీసుల అక్రమ నిర్బంధం పై వందలాది మంది గ్రామస్తులు ధర్నాలు చేశారు. అమాయకులను చిత్రహింసలు పెట్టవద్దని హుటాహుటిన విజయవాడ వచ్చిన మానవ హక్కుల కమిషన్ సభ్యులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఆయేషా కుటుంబీకులను అనుమానించిన అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి ఈ దారుణానికి పాల్పడినది ఆ అమ్మాయి మేనమామే కదా అని అన్నారు. ఈ లోపు సంఘటనలపై స్పందించిన మైనారిటీ కమిషన్, మహిళా కమిషన్, మానవ

హక్కుల కమిషన్‌ల సభ్యులు విజయవాడ వచ్చారు. ఆయేషా మీరా తల్లి శంషాద్ బేగం వారిని కలిసి హాస్టల్ నిర్వాహకురాలు పద్మతో కుమ్మక్కై కోనేరు కుటుంబానికి చెందిన కోనేరు సతీష్, రాజేష్, చింతల పవన్‌లు హాస్టల్‌లో జరుగుపున్న ఆఘాయిత్యాలను ప్రశ్నించినందుకు తన కూతురిని దారుణంగా చంపారని ఆరోపించింది. ఈ విషయంపై ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డికి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు తీవ్ర స్థాయిలో అసెంబ్లీలో చర్చ జరిగిన తరువాత విజయవాడ పోలీసులు గురువీందర్‌సింగ్ అలియాస్ అడ్డాను తెరమీదకు తీసుకువచ్చి అతన్ని క్రిమినల్ రికార్డు అంతా పత్రికల ముందు పెట్టి మానవ మృగం అని ఈ నేరం అతనే చేశాడని సంఘటనా స్థలంలో దొరికిన పాదముద్రలతో అతని పాదం సరిపోతుందని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించారు. అప్పటి డి.జి.పి. ఎ.కె. ఖాన్ ఢిల్లీ వెళ్లి లడ్డాయే ఈ కేసులో ముద్దాయి అని తేల్చిచెప్పాడు. ఈలోగా ఇంత దారుణం చేయడం ఒకరివల్ల కాదని లడ్డూ నేరాలతో సహకరిస్తుంటాడని కరీంనగర్‌కు చెందిన ఉపేంద్రసింగ్‌ని కేసులో ఇరికించడానికి ప్రయత్నం చేశారు. కాని బెజవాడ బార్ అసోసియేషన్, మానవ హక్కుల కమిటీ, ఇతర హక్కుల సంఘాలు సకాలంలో స్పందించి మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వలన పోలీసుల ప్రయత్నం సఫలం కాలేదు. లడ్డూ కూడా తనని ఒప్పుకోమని రు. 25 లక్షలు ఇస్తామని చెప్పి పోలీసులు బలవంతంగా ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని ఎదురు తిరగడంతో పోలీసులకు కేసులో ఇరికించడానికి నోరు లేని మూగజీవి అవసరం అయినది. దానికి బలి అయినది నందిగామ దగ్గర అనాసాగరానికి చెందిన సత్యంబాబు. కాని ఈ సారి పోలీసులు పక్కా ప్రణాళిక రచించి సత్యంబాబుని ముందుగానే 2008 ఆగస్టు 9న తమ అదుపులోకి తీసుకొని, దాదాపు పదిరోజులు అక్రమంగా నిర్బంధించి కేసు ఒప్పించేందుకు చిత్రహింసలు పెట్టారు. అనాసాగరం గ్రామస్తులు దాదాపు వారంరోజులు సత్యంబాబును పోలీసులు ఎన్‌కౌంటర్ చేయకుండా ఉండడానికి రోడ్లు ఎక్కి ధర్నాలు, రాస్తా రోకోలు చేశారు. చివరకు హ్యూమన్‌రైట్స్ కమిషన్ ఆదేశాలతో సత్యంబాబును 2008 ఆగస్టు 16/17 తేదీల్లో నందిగామ కోర్టులో హాజరు పరిచి నందిగామ చుట్టుపక్కల హాస్టల్ విద్యార్థినులకు సంబంధించిన 9 కేసులను సత్యంబాబు ఒప్పుకున్నాడని పత్రికల ముందు ముసుగువేసి అతనిని బలవంతంగా ఒప్పించారు. అప్పటి నుండి సత్యంబాబు న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నాడు.

సత్యంబాబు తరపున హక్కుల సంఘాలు నిలబడ్డాయి. బెజవాడ బార్ అసోసియేషన్ ఈ కేసును సి.బి.ఐ దర్యాప్తునకు అప్పగించాలని గవర్నరుకు లేఖ రాసింది. ఆయేషా తల్లిదండ్రులు సత్యంబాబుకు ఈ నేరంతో సంబంధం లేదని అసలు నేరస్తులను పట్టుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికీ పోలీసు ఇన్వెస్టిగేషన్ మీద వచ్చిన అనుమానాలతో పోలీసులపై నమ్మకం పోయి ఉండడం వలన తాము చూపించే సాక్ష్యాలు ప్రజలను నమ్మించలేవని ఫోరెన్సిక్ ల్యాబ్ డాక్టర్ ఇచ్చిన నివేదికలను ప్రజల ముందుకు తీసుకువచ్చారు. ప్రజలకు సైన్సుపై ఉన్న విశ్వాసాన్ని అనుకూలంగా మార్చుకునేటట్లు విజయవాడ పోలీసులు ప్రయత్నించారు. కేసు కోర్టులో ఉందని విచారణ జరిగితే నిజాలు బయట పడతాయని ప్రజలు భావించారు. పోలీసు విచారణపై నమ్మకం లేకపోయినా న్యాయస్థానంలో నైనా ఎంతో గొప్పగా న్యాయం జరుగుతుందని ప్రజలు ఆశించారు.

ఆయేషా కేసులో సత్యంబాబును ముద్దాయిగా పోలీసులు అరెస్ట్ చేసినప్పటి నుండి ముద్దాయి హక్కుల ఉల్లంఘన మొదలైనది. ఒక పక్క పోలీసుల అక్రమ నిర్బంధనలు, చిత్రహింసలపై తల్లి మరియమ్మ వేసిన ఫిర్యాదుపై మానవహక్కుల కమిషన్‌లో విచారణ జరుగుతుండగా మహిళా సెషన్స్ కోర్టులో ముద్దాయి హక్కుల ఉల్లంఘన మొదలైంది. సత్యంబాబు పేద కుటుంబం నుంచి రావడం వలన తన తరఫున లాయరును పెట్టుకునే స్తోమత లేదు. పైగా తనని బలవంతంగా కొట్టి కేసును ఒప్పించడం, కోర్టు పర్మిషన్ లేకుండానే అక్రమ నిర్బంధంలో ఉండగానే తనను హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి రక్తం, పాద ముద్ర నమూనాలు సేకరించి శాస్త్రీయ ఆధారాలతో సత్యంబాబుని పట్టుకున్నామని పోలీసులు ప్రచారం చేయడంతో ఇక తను ఈ కేసు నుండి బయటపడలేననే మానసిక పరిస్థితికి సత్యంబాబు వచ్చాడు. ఆ పరిస్థితులలో పౌరహక్కుల సంఘాల లాయర్లు ముందుకు వచ్చి బార్ అసోసియేషన్ అండగా నిలబడి, సీనియర్ న్యాయవాదులతో కమిటీ ఏర్పరిచి సత్యంబాబుని డిఫెండ్ చేయడానికి ముందుకు రావడం జరిగింది. ముద్దాయికి ప్రాథమిక హక్కు అయిన బెయిల్ కూడా కోర్టు తిరస్కరించింది. విచారణ కాకుండానే పోలీసులు ప్రవేశపెట్టిన శాస్త్రీయ ఆధారాలతో ప్రాథమికంగా నేరం నిరూపించబడిందనే నిరూపణకు రావడం న్యాయస్థానంపై పోలీసులు వత్తిడి స్పష్టంగా కన్పిస్తుంది. పోలీసులు సత్యంబాబును అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టడం వలన విజయవాడ జిల్లా జైల్లో ఉన్న సత్యంబాబు జి.బి. సిండ్రమ్ అనే కండరాల వ్యాధి వచ్చి కాళ్లు చచ్చుబడిపోయాయి. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు ఆ వ్యాధికి అక్కడ చికిత్స చేయడానికి సదుపాయాలు లేవని తెలియచేయగా న్యాయవాదులు జైల్లో ముద్దాయికి వైద్య చికిత్స చేయించవలసిన బాధ్యత ప్రభుత్వానిది అని కోర్టులో వాదించి చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కి, 17 మార్చ్ 2009లో పంపించారు. హైదరాబాద్‌లో ప్రజా సంఘాల, దళిత సంఘాల ఆందోళనలతో, ధర్నాలతో ప్రభుత్వం దిగివచ్చి సత్యంబాబు వైద్యానికి 3 లక్షలు డబ్బు విడుదల చేసింది.

ముద్దాయిని పట్టుకోవడంలో దాదాపు సంవత్సరం జాప్యం జరగడం, పోలీసు దర్యాప్తులో అనేక అనుమానాలు రావడం, చివరకు మన పోలీసుల సమర్థతపై నమ్మకం పోయిన పరిస్థితిలో సత్యంబాబు ముద్దాయి అని చెప్పి ఒప్పించడానికి పోలీసులు చాలా కష్టపడవలసి వచ్చింది. అందువలన కోర్టులో త్వరగా విచారణ ముగించడానికి కోర్టు మీద చాలా ఒత్తిడి తెచ్చారు. సత్యంబాబు తనపై అక్రమంగా కేసు పెట్టారని హైకోర్టుకు వెళ్లగా అందులో ఐదు కేసులలో ప్రాథమిక సాక్ష్యాలు లేవని హైకోర్టు కొట్టివేసింది. అందులో ఒక కేసులో నందిగామకు చెందిన హాస్టల్ విద్యార్థిని వంగపాటి రాధ తనపై దాడి చేసింది సత్యంబాబు కాదని, తనను గాయపరిచిన గంగాధర్, ప్రసన్నలక్ష్మీల పేర్లు చెప్పి మెజిస్ట్రేట్ దగ్గర వారిని గుర్తుపట్టింది.

10 ఆగస్టు 2009న మహిళా సెషన్సుకోర్టులో సత్యంబాబు కేసు విచారణ ప్రారంభమైంది. హైకోర్టులో తను వేసిన కేసు కింది కోర్టులో తల్లి మరియమ్మ అక్రమ నిర్బంధంపై ఎస్.సి.,ఎస్.టి. అత్యాచారం నిరోధక చట్టం కింద సంబంధిత పోలీసు ఆఫీసర్ల పైన వేసిన కేసులు పెండింగ్ ఉన్నాయని, విచారణ నిలుపు చేయాలని సత్యంబాబు వేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. సాక్షులను క్రాస్ ఎగ్జామ్ చేయడానికి అనుమతివ్వమని కోర్టును కోరితే జైలులో ఉన్న ముద్దాయిని రు. 5,700 ఖర్చులకు కట్టమని దయా, కనికరం లేకుండా ఆదేశించింది. దానిపై హైకోర్టుకు వెళ్లగా ముద్దాయి పేదరికం, అతని ఆరోగ్య పరిస్థితి పరిశీలించి పైసా కట్టకుండా సాక్షులను విచారించడానికి సత్యంబాబుకు అనుమతి ఇచ్చారు. ఈలోగా సత్యంబాబు ఆరోగ్యం క్షీణించగా మళ్లీ నిమ్స్‌కు వైద్య పరీక్షలకు పంపించాలని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు సిఫార్సు చేయగా పోలీసులు దానికి అడ్డుపడి నిమ్స్ నుండి వెనుకకు తీసుకువచ్చారు.

ఈలోపు విజయవాడ నగరానికి కొత్తగా పోలీస్ కమిషనర్‌గా సీతారామాంజనేయులుని వేశారు. (ఇతనికి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని పేరుంది) అతను పనిచేసిన జిల్లాలలో ఇప్పటికి 28 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో చంపాడు. తెలంగాణ సమస్యపై ఉస్మానియా క్యాంపస్‌లో విద్యార్థులపై విరుచుకుపడి సస్పెండ్ అయి విజయవాడకు వచ్చాడు. రాగానే సత్యంబాబును చంపడానికి ప్లాన్ వేసి మే 19న వైద్య చికిత్సకు నిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి వచ్చేటప్పుడు సూర్యారావుపేట దగ్గర సత్యంబాబు పారిపోవడానికి ప్రయత్నించాడని కట్టుకథ అల్లి చంపడానికి ప్రయత్నం చేశాడు. కాని సమాచారం లీక్ అయి మీడియా అలర్ట్ అవడంతో అది బెడిసికొట్టింది.

ఆ సంఘటన జరిగిన తరువాత సత్యంబాబు చుట్టూ ఎస్కార్ట్ పెంచి కోర్టుకు వచ్చినపుడు అతని లాయర్లను కూడా అతనితో మాట్లాడడానికి లేకుండా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు అయిన ముద్దాయి తాను నిర్దోషి అని నిరూపించుకోవడానికి తన తరపు లాయరును నియమించుకోవలసి ఉండగా కోర్టు సత్యంబాబుకు ఆ ప్రాథమిక హక్కులను కూడా కొట్టివేసింది. విచారణ సమయంలో లాయరును కలుసుకోవడానికి పోలీసులు అడ్డుపడితే, జైల్లో నిరాహారదీక్ష చెయ్యి అన్నందుకు సత్యంబాబు న్యాయవాది శ్రీనివాస్‌పై తీర్పులో కోర్టు ఆక్షేపణలు చేసింది. దానిని కోర్టు ధిక్కారంగా పరిగణించింది. మహిళా సెషన్స్ కోర్టులో తనకు న్యాయం జరగడంలేదనీ, తన కేసును వేరొక కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయమనీ పెట్టిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

పోలీసులు తనను అక్రమంగా నిర్బంధంలోకి తీసుకున్నారనడానికి తనను అనవసరంగా కేసులో ఇరికించారని చెప్పడానికి 20 మంది సాక్షులున్నారని డిఫెన్స్ సాక్షులను ప్రవేశపెట్టడానికి అనుమతి కోరితే పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సత్యంబాబు నిర్దోషి అని నిరూపించు కోవడానికి అన్ని దారులు మూసివేసి మహిళా సెషన్ కోర్టు సత్యంబాబుకు యావజ్జీవ శిక్ష విధించింది. ముద్దాయి హక్కుల కాలరాసి, సహజ న్యాయ సూత్రాల ప్రకారం ముద్దాయి తను నేరం చేయలేదని నిరూపించు కోవడానికి అన్ని అవకాశాలు కోర్టు ఇవ్వవలసి ఉండగా వాటిని ఖాతరు చేయకుండా పోలీసు ఛార్జిషీటు ఉండగా ఇక ఇవన్నీ తీర్పు ఇవ్వడానికి అవసరం లేదన్నట్లు విచారణను తూతూ మంత్రంగా జరిపి ముగించారు. అందుకే తీర్పు ఇచ్చిన మరునాడు అన్ని పత్రికలలో 'సత్యం వధ' 'సత్యం ఓడిపోయింది' అని ఆ తీర్పుకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాలు చేసిన ఆందోళనను ప్రముఖంగా ప్రచురించారు.

అందుకే పత్రికలలో 'సత్యం వధ' అని, 'సత్యం ఓడిపోయింది' అని ప్రజల తీర్పును సెప్టెంబర్ 30న అన్ని పత్రికలు ప్రచురించాయి.

1) 2007 నుండి 17 ఆగస్టు 2008 వరకు ఆయేషాను హత్య చేసింది సత్యంబాబు అని చెప్పడానికి పోలీసుల దగ్గర ఎటువంటి ఆధారం లేదు. 17 ఆగస్టు 2010 పోలీసులు మీడియా ముందు సత్యంబాబుతో చెప్పించిన బలవంతపు ఒప్పుదల వాంగ్మూలం తప్ప పోలీసుల దగ్గర ఎటువంటి ఆధారం లేదు. భారత సాక్ష్యాధారాల చట్టం ప్రకారం పోలీసుల ముందు ముద్దాయి ఇచ్చే వాగ్మూలం చట్టం ముందు చెల్లదు. కాని ఈ కేసులో కోర్టు అదే వాంగ్మూలం నమ్మి శిక్ష వేయడం గమనించదగిన విషయం.

2) దుర్గా లేడీస్ హాస్టల్‌లో ఆయేషాతో పాటు 27 డిసెంబర్ 2007 రాత్రి సహ విద్యార్థినులు సత్యంబాబును ముద్దాయిగా చూపించడానికి ముందు కోర్టులో పోలీసుల వాదన అంతా అదే ఫ్లాట్ పక్క గదిలో ఉన్న విద్యార్థినులకు తెలియకుండా హత్య జరగిందని, విద్యార్థినులు ప్రీతి, కవిత, సౌమ్య హాస్టల్ వార్డన్ పద్మ, ఆమె భర్త శివరామకృష్ణలు నిజాలు దాచిపెట్టి అబద్ధాలు చెపుతున్నారని వాళ్లందరికి నార్కో ఎనాలసిస్ పరీక్షలు జరపాలని కోర్టు ముందు వాదించారు. పోలీసులు పెట్టుకున్న పిటిషన్ కిందికోర్టు కొట్టివేస్తే, హైకోర్టులో బల్లగుద్ది నార్కో ఎనాలసిస్ పరీక్షలకు అనుమతి తెచ్చుకున్నారు. కాని ఈ ఇన్వెస్టిగేషన్ మొత్తం పక్కకుపెట్టి సత్యంబాబు ముద్దాయి అని తెరమీదకు తీసుకువచ్చారు. పోలీసులు ఇన్ని రోజులు ఏ విద్యార్థినులను, ఏ వార్డెన్‌ను అనుమానించారో ఎవరిని దోషులని విచారణ సాగించారో, ఆ సాక్ష్యులనే సత్యంబాబుకు వ్యతిరేకంగా సాక్ష్యులుగా పెట్టి వాళ్లు ఇచ్చిన సాక్ష్యంతో సత్యంబాబుకు శిక్ష వేశారు. నిన్నటి వరకు ఈ కేసులో అనుమానితులుగా ఉన్న వారి సాక్ష్యంతో సంత్యంబాబు నేరాన్ని నిర్ధారించారు. జరిగిన సంఘటన మొత్తం పరిశీలిస్తే హాస్టల్‌లోని లోపలి వ్యక్తులకు సంబంధం లేకుండా బయట వాళ్లు లోపలికి వచ్చి ఈ అఘాయిత్యం చేసే అవకాశం లేదని సంఘటన జరిగిన వెంటనే విచారణ జరిపిన మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

శాస్త్రీయ ఆధారాలు, డాక్టర్ల రిపోర్టులతో క్రిమినల్ కేసులో ముద్దాయికి శిక్ష వేసే అవకాశం చట్టం ప్రకారం లేదు. శాస్త్రీయ ఆధారాల సహాయంతో పోలీసులు పకడ్బందీగా ఇన్వెస్టిగేషన్ చేసి నిజాలు బయటకు తీయాలి. కాని కోర్టులో తీర్పు ఇవ్వడానికి శాస్త్రీయ ఆధారాలు ఒక్కటే సాక్ష్యంగా పనికి రావని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు చెపుతున్నాయి. లాకప్‌లో అక్రమంగా నిర్బంధించి, కొట్టి, చిత్రహింసలు పెట్టి ప్రాణాలు తీసి నిజాలు రాబట్టాలనుకోవడం చట్ట వ్యతిరేకం అని హక్కుల సంఘాలు ఏప్పటినుండో ఆందోళన చేస్తున్నాయి. కాని ఈ కేసులో పోలీసులు నేరస్తులను కాపాడడానికి శాస్త్రీయ ఆధారాలు సృష్టించి సత్యంబాబే నేరస్తుడని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ ల్యాబ్ అనేది రాష్ట్ర డి.జి.పి కంట్రోల్‌లో ఉంటుంది. ఆ ల్యాబ్ నుండి పోలీసులు తమకు కావలసినట్లు ఎటువంటి రిపోర్టులు అయినా తెచ్చుకోగలరు. వాళ్లకు ఇష్టం వచ్చినట్లు కోర్టు అనుమతులు లేకుండా రక్తపరీక్షలు జరిపిస్తుంటారు. వాళ్లకు అనుకూలంగా రిపోర్టులు తెచ్చుకుంటారు. సత్యంబాబును 11 ఆగస్టు 2008న వాళ్ల ఇంటి నుండి తీసుకెళ్లి అక్రమంగా నిర్బంధించి నాటి నుండి పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో సత్యంబాబుపై నేరం నిరూపిస్తామని సవాలు విసిరారు. సత్యంబాబును కోర్టు ముందు పెట్టక ముందే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తీసుకువెళ్లి డి.ఎన్.ఎ, చేతిరాత, కాలిముద్రలకు సంబంధించిన రిపోర్టులు తయారు చేశారు. సంఘటనా స్థలంలో దొరికిన రక్తం, వెంట్రుకలు, పాదముద్రలు నమూనాలతో సత్యంబాబు నమూనాలు సరిపోయాయని కథలు చెప్పారు. డి.ఎన్.ఎ పరీక్ష చేసి రిపోర్టు ఇచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రొఫెసర్ వెంకన్న విదేశీ వనిత రేప్ కేసులో ముద్దాయిలకు అనుకూలంగా రిపోర్ట్ ఇవ్వడానికి పదిహేను వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఎ.సి.బి అధికారులకు చిక్కాడు. కోర్టు ఎవరి డి.ఎన్.ఎ. రిపోర్టు ఆధారంగా సత్యంబాబుకు శిక్ష విధించాలో ఆ డాక్టర్, సైంటిఫిక్ ఆఫీసర్ ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నాడు. అదే రిపోర్టు ఆధారంగా యావజ్జీవ శిక్ష పడిన సత్యంబాబు చర్లపల్లి జైల్లో ఉన్నాడు. దీంతోనే ఈ తీర్పు ఎంత అన్యాయమైనదో స్పష్టం చేస్తుంది.

అసలు నేరస్తులను పట్టుకుని విచారణ చేయాలని సత్యంబాబు నిర్దోషి అనీ కన్నీళ్లతో గద్గద స్వరంతో చాలారోజుల నుండి ఆయేషా మీరా తల్లి శంషాద్ బేగం వాపోతున్నది. తన ఆవేదన కూడా సత్యంబాబు నిర్దోషి అని తీర్పు చెప్పడానికి సహాయపడలేదని ఎంతో ఆవేదనతో తీర్పువచ్చిన రోజు 'సత్యం నన్ను క్షమించు' అన్న ఆ తల్లి కన్నీటి వేడికోలు ఆయేషా కేసులో ఇచ్చిన తీర్పు అసత్యాన్ని గెలిపించి 'సత్యం'ను జీవిత ఖైదు చేసిందని మనకు నిలువుటద్దంలో చూపించింది.

(రచయిత న్యాయవాది, పౌరహక్కుల సంఘం సభ్యులు) వీ

స్వయం నిర్ణయాధికార హక్కుకోసం దశాబ్దాలుగా వ్యక్తమవుతున్న కాశ్మీర్ ప్రజల ఆకాంక్షను, అంతరాత్మను ఆవిష్కరించిన ఢిల్లీ సభ నివేదికను అందిస్తున్నారు **శుద్ధబ్రత సేన్‌గుప్తా**

కాశ్మీర్ పై ఢిల్లీ సభ - ఒక వక్త నివేదిక

కొద్ది గంటల కింద ఒక సభలో పాల్గొని, ప్రసంగించి వస్తున్నాను. ఆ సభను కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్, ఢిల్లీలోని లిటిల్ థియేటర్ గ్రూప్‌లో ఏర్పాటు చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని పరిస్థితి మీద ఏర్పాటు చేసిన ఆ సభ 'ఆజాదీ యే ఏకైక మార్గం' అనే శీర్షిక కింద జరిగింది. సభ మొదలయినప్పటి నుంచి నేను ఉండలేకపోయాను. మరో నగరం నుంచి ప్రయాణం చేసి వెళ్లడంలో ఆలస్యం అయింది. కాని, రాత్రి ఎనిమిది తరువాత ముగిసిన ఆ సభలో, ప్రారంభమయిన నాలుగున్నర నుంచి కూడా ఏమి జరిగిందో నేను చెప్పగలను.

ఢిల్లీలోని కోపర్నికస్ మార్గ్ మీద ఉన్న లిటిల్ థియేటర్ గ్రూప్ సమావేశ మందిరంలో జరిగిన ఆ సభకు హాజరయిన వారు కిక్కిరిసి పోయారు. కవి వరవరరావు, ప్రొఫెసర్ అమిత్ భట్టాచార్య, సుజాతో భద్ర, గురుశరణ్ సింగ్, ప్రొఫెసర్ సాయిబాబా, జర్నలిస్ట్ నజీబ్ ముబారకీ, రచయిత అరుంధతీ రాయ్, జమ్మూ నుంచి వచ్చిన కార్యకర్త శివనందన్, శ్రీనగర్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుసేన్, నాగా మానవ హక్కుల ఉద్యమ నాయకుడు డాక్టర్ ఎన్. వెనుహ్ లతో పాటు నేను మాట్లాడాను. ఇంకా నేను మరచిపోయిన మరికొంతమంది ఉపన్యాసకులు కూడా ఉండవచ్చు. క్షమించాలి.

సమావేశం చివరన విస్తృతమైన సమాచారంతో చాలా ప్రాముఖ్యత కలిగిన ఉపన్యాసం చేసిన వారు హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు సయ్యద్ అలీ షా జిలానీ. ఆ ఉపన్యాసం కాశ్మీర్‌లో ఆజాదీ గురించిన, సామాజిక న్యాయం గురించిన భవిష్యత్ దృష్టిని కళ్లకు కట్టింది. ఆయన ఉపన్యాసం గురించి వివరంగానే రాయవలసి ఉంది.

కాశ్మీర్ నుంచి వచ్చి, ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఉంటున్న ఇందర్ సలీం అనే కళాకారుడు ఒక అద్భుతమైన, క్లుప్తమైన కళా ప్రదర్శనలో సభికులందరినీ తనతో పాటు రాయి విసురుతున్న కాశ్మీరీ యువకుడి పాత్రలో ఒక క్షణం కోసమైనా జీవించమని కోరాడు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థులు 'తూ జిందా హైతో జిందగీ కి జీత్ మే యకీన్ కర్' అనే పాటతో జీవన సౌందర్యాన్ని, విముక్తి సౌందర్యాన్ని సభికులకు వినిపించారు. సభ ముగింపుగా నిర్వాహకుల తరఫున అమిత్ భట్టాచార్య చదివి వినిపించిన తీర్మానాన్ని సభికులు ఆమోదించారు.

నేను అక్కడున్న కొన్ని గంటలూ ఆ వాతావరణం విద్యుత్తేజంతో నిండి ఉంది. సభికులలో అత్యధికులు ఉపన్యాసకుల పట్ల గౌరవాదరాలను, ప్రశంసను ప్రకటించారు. ఓపికగా విన్నారు. ఉపన్యాసకుల పట్ల మన్నన చూపారు. ఆ సభలోనే ఉన్న కొందరు తమను తాము 'భారత దేశ భక్తులమని' 'కాశ్మీర్ భారతదేశంలో అవిభాజ్య భాగమనే వైఖరిని తీసుకునే వాళ్లమని' చెప్పుకుంటూ సభికులనూ, ఉపన్యాసకులనూ రెచ్చగొట్టడానికి, సభను భగ్నం చేయడానికి ప్రయత్నించినప్పటికీ సభ ప్రశాంతంగా జరిగింది. చివరికి ఈ విచ్ఛిన్నకారులు ఒక సందర్భంలో వేదిక మీదికి చెప్పులో, ఇతర వస్తువులో విసరడానికి ప్రయత్నించినప్పుడు కూడా సభికులు ప్రశాంతంగా సభ జరగనిచ్చారు.

సభలో పాల్గొన్న వారిలో అత్యధికులు ఎటువంటి రెచ్చగొట్టే నినాదాలు ఇవ్వలేదు. ఏ ఒక్క వర్గానికి సంబంధించిన పాక్షిక, ద్వేషపూరిత నినాదాలు ఇవ్వలేదు. అక్కడ రెచ్చగొట్టే వైఖరి తీసుకున్నది భారత దేశభక్తులమని చెప్పుకున్న వాళ్లు మాత్రమే. వాళ్లను కూడా వాళ్ల అభిప్రాయాలు చెప్పకుండా అడ్డుకోలేదు. సభా కార్యక్రమాన్ని భగ్న పరచవద్దని మాత్రమే కోరారు.

వాళ్ల ప్రవర్తన మామూలు సభా మర్యాదలను అతిక్రమించినపుడు అక్కడే ఉన్న ఢిల్లీ పోలీస్ సిబ్బంది వారిని సభాప్రాంగణం నుంచి బయటికి తీసుకువెళ్లారు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలంటే ఢిల్లీ పోలీసులు అక్కడ సభికులలో అత్యధికులకు వ్యతిరేకంగా ఎందుకు చర్య తీసుకోలేదంటే, ఆ అత్యధిక సభికులు పూర్తిగా పౌర, ప్రజాస్వామిక మర్యాదలకు లోబడి తమ సభ జరుపుకున్నారు గనుకనే.

అక్కడ చిన్నమెత్తు బెదిరింపు ప్రయత్నాలు కూడా జరగలేదు. నిర్వాహకుల తరఫున సభా కార్యక్రమాలను నడుపుతున్న ప్రొ. ఎస్.ఎ.ఆర్. జిలానీ వేదిక మీది నుంచి అనేకసార్లు ఆగంతకులకు విజ్ఞప్తి చేశారు. సంస్కారయుతంగా, గౌరవప్రదంగా ప్రవర్తించి ఉపన్యాసకులను అడ్డుకోవద్దని కోరారు. కానీ, ఆయన విజ్ఞప్తులను ఈ గుంపు పెడచెవిన పెట్టింది. బహుశా నాగరికంగా ఉండడం కన్న భారత దేశభక్తులుగా ఉండడమే ఎక్కువ అవసరమని వాళ్లు అనుకున్నట్టుంది. అక్కడ పరిస్థితులు దాదాపు చేయిజారిపోయిన సందర్భం వచ్చినపుడు ఆ గుంపు చేసే దురుసు వ్యాఖ్యలను, నినాదాలను అడ్డుకోవడానికి అత్యధికులు అలలు అలలుగా చప్పట్లు మాత్రం కొట్టారు.

నేను సభలో ఉన్న సమయం అంతటిలోను ఆ సభలోని అత్యధిక యువతీ యువకులు కరతాళ ధ్వనులు చేశారు, నినాదాలిచ్చారు. కానీ, వారి నినాదాలలో ఒక్కటయినా మత నినాదం లేదు. పాక్షికత రంగు అంటిన నినాదం ఒక్కటి కూడా లేదు. సయ్యద్ అలీ షా జిలానీ తన ఉపన్యాసంలో భారత ప్రజలకు, కాశ్మీర్ ప్రజలకు మానవతా సంబంధాల ఐక్యత ఉంది అని అన్నప్పుడు, గాంధీని ఉటంకించినప్పుడు, ద్వేషం లేని అహింసాయుత పోరాటం జరపవలసిన అవసరం గురించి

మాట్లాడినప్పుడు, ప్రపంచంలో ఒక మహాశక్తిగా భారతదేశం లేచి నిలవాలని తాను కోరుకుంటున్నానని అన్నప్పుడు, కాని, ఆ శక్తికి ఇతరులను అణచివేయవలసిన అవసరం ఉండకూడదని అన్నప్పుడు ఆయన మాటలను సభికులు హృదయపూర్వకంగా స్వాగతించారు. ప్రశంసించారు. ఆ మాటలను ఆహ్వానించిన వారిలో కాశ్మీరీలు ఉన్నారు, ఇతరులూ ఉన్నారు.

అయితే ఈ సభను అనేక ఇతర సంఘటనల నేపథ్యంలో చూడవలసి ఉంటుంది. అది, జంతర్ మంతర్‌లో, లేదా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో, లేదా, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రదర్శనలు కావచ్చు. సినిమా ప్రదర్శనలు కావచ్చు. ఉపన్యాసాలు కావచ్చు. వేరు వేరు విద్యా సంస్థలలో జమ్మూ కాశ్మీర్ చరిత్రపైన స్వతంత్రంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు కావచ్చు. ఇవాళ కాశ్మీర్‌లో కొనసాగుతున్న పరిస్థితులపై ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన కావచ్చు. ఇవన్నీ అతి భయంకరమైన దురాక్రమణ సైన్యాల పాశవికత్వం కింద నలిగిపోతున్న నిరాయుధులైన యువకులు, చిన్నారి పిల్లలు రాళ్లు విసురుతున్న పాపానికి నూటా పదకొండు మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు జరిగాయి. ఈ సంఘటనల ప్రక్రియ కాశ్మీర్‌లోని పరిస్థితిని తక్షణమే పరిష్కరించవలసిన ఆవశ్యకతను గుర్తించింది. అక్కడి పరిస్థితిని ఒక తార్కిక ముగింపుకి తేవాలని ప్రయత్నించింది. ప్రపంచం, అంతర్జాతీయ సమాజం ఇప్పటికైనా మేల్కొని, కాశ్మీర్ మీద, అక్కడ ప్రజల మీద భారత ప్రభుత్వపు పట్టుకు నిజమైన అర్థం ఏమిటో గుర్తించాలని ఈ సభలూ, సమావేశాలూ, ప్రదర్శనలూ తెలియజెప్పాయి. ఢిల్లీలోనూ, భారతదేశంలోని ఇతర పెద్ద నగరాలన్నిటిలోనూ ఇటువంటి సభలూ, సమావేశాలూ ఎన్నో జరగవలసి ఉంది.

ఈ ప్రక్రియను ఎందుకు కొనసాగించవలసి ఉందంటే, చివరికి నవంబర్‌లో ఢిల్లీని సందర్శించనున్న బరాక్ హుసేన్ ఒబామా కూడా కాశ్మీర్‌లో భారత రాజ్యం ఎట్లా ప్రవర్తిస్తున్నదో వాస్తవాలు అర్థం చేసుకునేలా చేయాలి. 'అక్కడ భారత రాజ్యం పాశవికమైన హింస మీద, అత్యాచారాల మీద ఆధారపడింది. పౌర పాలనకు సంబంధించిన ప్రతి సూత్రాన్ని ఉల్లంఘించడం మీద ఆధారపడింది. ఈ ప్రపంచంలో ఇది చెల్లదు' అని ప్రకటించవలసి ఉంది. ఇరవై సంవత్సరాలలో డెబ్బై వేల మంది ప్రజలను చంపి, ఆ శవాల మీద కూర్చుని ప్రపంచంలో కల్లా పెద్ద ప్రజాస్వామ్యాన్ని నేనే అని చెప్పుకునే హక్కు లేదు. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం లాంటి దుర్మార్గమైన శాసనాల సహాయంతో పాలిస్తూ, ప్రజాస్వామ్యం అని పిలుచుకునే హక్కు లేదు. ఒకవైపు నిన్ను నీవు ప్రజాస్వామ్యం అని పిలుచుకుంటూ, నీ పోలీసుల చేత, నీ పారా మిలిటరీ బలగాల చేత వీథులలో చిన్నారి పిల్లలను చంపించడం కుదరదు. బాలికల మీదా, యువతుల మీదా అత్యాచారం చేసిన, చంపిన పోలీసులకూ, పారా మిలిటరీ బలగాలకూ శిక్ష లేకుండా ఉండడం కుదరదు. ఏదయినా ఒక ప్రభుత్వం అలా చేస్తున్నదంటే, అది పీడన సాగిస్తున్నదంటే, అనైతికంగా ఉన్నదంటే, మరొక ప్రజా సమూహం మీద దురాక్రమణ చేస్తున్నదంటే ప్రపంచంలో ఎక్కడ ఉన్న ఆలోచనాపరులయినా దాన్ని ఖండించవలసి ఉంటుంది. ప్రతిఘటించ వలసి ఉంటుంది.

గత కొన్ని దశాబ్దాలలో కాశ్మీర్‌లో భారత రాజ్యపు చరిత్ర కాశ్మీర్ ప్రజల మీద దుర్మార్గాలు సాగించిన చరిత్ర మాత్రమే కాదు. అది, ఐక్యరాజ్య సమితి సూత్రాలకు అవమానం. అది ప్రపంచ మానవజాతికే అవమానం. అది, మానవజాతి రూపొందించుకున్న న్యాయం, సమంజసత్వం, ప్రజాస్వామ్యం అనే ప్రతి ఒక్క సూత్రానికీ అవమానం. భారత దేశంలో కూడా శాంతి కాముకులైన, స్వాతంత్ర్య ప్రియులైన పౌరులందరికీ అది అవమానం. ఈ దుర్మార్గమంతా ఆ భారత ప్రజల పేరు మీద భారత ప్రభుత్వం సాగిస్తున్నది గనుక ఇది ఆ ప్రజలకు అవమానం.

ఈ సందేశం నలువైపులా వినిపించవలసి ఉన్నది. అది ఇప్పటికే వినిపిస్తున్నది. ఈ సందేశాన్ని శ్రీనగర్, బారాముల్లా, కుప్వారా వీథుల్లో నుంచి అక్కడి ప్రజలు వినిపించారు. భారత రాజధాని ఢిల్లీ నడిబొడ్డున జరిగిన ఈ సభలాంటి అనేక సభలు కూడా ఈ సందేశాన్నే వినిపిస్తున్నాయి. 'భారత దేశంలో స్వేచ్ఛకూ, న్యాయానికీ మిత్రులుగా మమ్మల్ని మేం భావించుకునే భారతీయులం, మా కాశ్మీరీ సోదర సోదరీమణుల పక్కన నిలబడి ఉన్నాం. భారత ప్రభుత్వం, కాశ్మీర్‌లోని దాని సమర్థకులూ ప్రకటిస్తున్న పచ్చి అబద్ధాలను మేం అంగీకరించడం లేదు' అని ప్రపంచానికి చెప్పదలిచాం. సరిగ్గా ఇందువల్లనే నిన్నటి సభ చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. అది, ఈ మొత్తం ప్రక్రియలో ఒక ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ఈ జరుగుతున్న పరిణామాలను ప్రపంచం తన పరిగణనలోకి తీసుకునే వరకు ఈ ప్రక్రియను ఆపకూడదు. ఐక్య రాజ్య సమితి, యూరప్‌లోనూ, అమెరికాలోనూ, ప్రపంచంలోని ప్రతి ప్రముఖ దేశంలోనూ ఉన్న విశాల ప్రజాస్వామిక స్రవంతులు, రాజకీయ నాయకత్వాలు ఈ విషయం గుర్తించవలసి ఉంది. వందలాది మంది ప్రజలూ, యువకులూ, వృద్ధులూ, మేధావులూ, రచయితలూ, కార్యకర్తలూ, న్యాయవాదులూ, ఉపాధ్యాయులూ అన్ని జీవన రంగాల భారతీయులూ, కాశ్మీరీయులూ ఐక్యంగా కలిసి నిలబడుతున్నారు. భారత రిపబ్లిక్ రాజధాని నడిబొడ్డున నిలబడిన ఈ స్వేచ్ఛా ప్రియులు జమ్మూ కాశ్మీర్ మీద ఇటు భారతదేశమైనా, అటు పాకిస్తాన్ అయినా సాగించే దురాక్రమణను తిరస్కరిస్తున్నామని ప్రకటిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్ భవిష్యత్తు ఏమిటో నిర్ణయించుకోవలసినది కేవలం జమ్మూ కాశ్మీర్ ప్రజలు మాత్రమేనని వాళ్లు ప్రకటిస్తున్నారు. ఆ స్వయంనిర్ణయం కూడా శాంతియుతంగా జరగాలనీ, మరే శక్తీ వారిని ఒత్తిడి చేసి, బెదిరించి ఆ నిర్ణయం మీద ప్రభావం వేయకూడదనీ వారు ప్రకటిస్తున్నారు.

కాశ్మీర్ నుంచి వచ్చిన సయ్యద్ అలీ షా జిలానీ గానీ, షేక్ షౌకత్ హుసేన్ గానీ అడిగిన మాట ఒకటే. వాళ్లు అడుగుతున్నదల్లా స్వయం నిర్ణయాధికార హక్కు. కాశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును గౌరవిస్తానని భారతదేశం హామీ ఇచ్చింది. ఐక్య రాజ్య సమితికి హామీ ఇచ్చింది. శాంతిమయ, స్వేచ్ఛాపూరిత పరిస్థితులలో సాయుధ బలగాల ఉనికి లేనప్పుడు జనాభిప్రాయ సేకరణను నిర్వహిస్తానని, ఆ జనాభిప్రాయ సేకరణలో అవిభక్త జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలోని నివాసులందరి అభిప్రాయాలు స్వేచ్ఛగా సేకరించి, తదనుగుణమైన నిర్ణయం చేస్తానని భారత ప్రభుత్వం ఐక్య రాజ్య సమితి ముందర అరవై సంవత్సరాల కింద హామీ ఇచ్చింది. ఈ జనాభిప్రాయ సేకరణ ఫలితాలు భారతదేశానికి అనుకూలంగా ఉన్నా, పాకిస్తాన్‌కు అనుకూలంగా ఉన్నా, స్వతంత్రంగా ఉండాలని ఉన్నా, ఐక్య జమ్మూ కాశ్మీర్ దక్షిణాసియాలో తన పొరుగు దేశాలతో శాంతియుతంగా జీవించవచ్చునని హామీ ఇస్తానని భారత ప్రభుత్వం ప్రకటించింది.

నిన్నటి సభలో వెలువడిన ప్రకటనలలో, వైఖరులలో, శైలులలో అపారమైన, అద్భుతమైన వైవిధ్యం ఉంది. ఆ మొత్తం సభను ఒకే ఒక్క సాదా, మొరటు ప్రకటనగా కుదించడానికి వీలులేదు. సభలో మాట్లాడిన వక్తలందరూ కాశ్మీర్‌లో భారత రాజ్యపు సైనిక ఆక్రమణను ముగించవలసిన అవసరం ఉందని విస్పష్టంగా ప్రకటించిన మాట నిజమే. కానీ, దాని అర్థం వాళ్ల ప్రకటనలనూ, అభిప్రాయాలనూ ఎవరో మూసపోసినట్టు తయారు చేశారని కాదు. వేదిక మీద ఉన్న ఉపన్యాసకుల మధ్య ప్రధానమైన, అతి ముఖ్యమైన రాజకీయ, తాత్విక విభేదాలున్నాయి. అసలు ఆజాదీ అంటే అర్థం ఏమిటనే విషయంలోనే వారిలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. కానీ, నిన్నటి సభ శక్తీ, సామర్థ్యమూ ఈ భిన్నాభిప్రాయాలలోనే ఉన్నాయి గాని, అవి ఆ సభ బలహీనతకాదు.

ఎప్పటికయినా, ఎట్లాగయినా ఆజాదీ అనేది వస్తే, అది కాలం చెల్లిపోయిన సామ్రాజ్యవాదం ఇచ్చి పోయిన స్వాతంత్ర్య కానుక లాగా ఉండదు. కోట్లాది మంది ప్రజల ఊహలకు, స్వప్నాలకు, ఆలోచనలకు ఫలితమయిన చర్చల, సంభాషణల పంట లాగా ఆ ఆజాదీ ఉంటుంది. నిన్నటి సభ ప్రాముఖ్యతను ఈ సంభాషణలలో అది కూడ ఒకటనే వెలుగులో చూడవలసి ఉంది.

ఆ సభలో ఉత్తేజకరంగా అనిపించిన వాస్తవం ఏమంటే, ప్రతి ఒక్క వక్త కాశ్మీరీ ప్రజల గళాలు ఇంకెంత మాత్రం ఒంటరివి కావనీ, వేరేవి కావనీ, దక్షిణ ఆసియాలోని విభిన్న ప్రాంతాలలో ప్రజలు గొంతు కలుపుతున్న బృందగానంలో అవి భాగమనీ ప్రకటించారు. ఒక పాశవిక సైనిక ఆక్రమణ నుంచి విముక్తి కావాలనే ఆకాంక్షను ఈ బృందగానం ప్రతిధ్వనిస్తుందనీ, సమర్థిస్తుందనీ వాళ్లు చూపారు. రచయిత అరుంధతీ రాయ్, కాశ్మీర్ ఆజాదీ ఆకాంక్షను సమర్థిస్తూ కాశ్మీర్ ప్రజలు న్యాయాన్యాయాల విషయంలో కొన్నిటిని ఆమోదించి, కొన్నిటిని ఆమోదించబోమని అనగూడదని గుర్తు చేశారు. భారత దేశంలో ఇతర భాగాలలో కూడా పీడనకు గురవుతున్న, బాధలు అనుభవిస్తున్న ప్రజలతో కాశ్మీరీ ప్రజలు సంఘీభావ బంధాలు ఏర్పర్చుకునే మార్గాలు కనిపెట్టాలని ఆమె కోరారు. భారత జాతీయవాదులమని చెప్పుకున్న చిన్న గుంపు ఆమెను గేలిచేశారు. దురుసుగా అడ్డుకున్నారు. కాశ్మీరీ పండిట్‌ల పరిస్థితి గురించి ప్రశ్నించారు. ఈ ఆటంకాల మధ్య తనకు మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు ఆమె నిర్ద్వంద్వంగా కాశ్మీరీ పండిత్‌ల పరిస్థితి విషాదకరమైనదని అంగీకరిస్తానని అన్నారు. ఆమె మాటనే ప్రతిధ్వనిస్తూ ఆ తరువాత సయ్యద్ అలీ షా జిలానీ తన ఉపన్యాసంలో భవిష్యత్తులో ఏర్పడబోయే స్వతంత్ర కాశ్మీర్‌లో హిందూ, సిక్, బౌద్ధ, క్రైస్తవ తదితర మైనారిటీల రక్షణకు, భద్రతకు తాను వ్యక్తిగతంగా పూచీ పడతానని హామీ ఇచ్చారు. పండిత్‌లను కాశ్మీర్‌కు వెనక్కి తిరిగి రమ్మని ఆయన అభ్యర్థించారు. పండిత్‌లు కూడా కాశ్మీరీ సమాజంలో అంతర్భాగమని ఆయన నొక్కి చెప్పారు. స్వతంత్ర కాశ్మీర్ అనేది తమ దృష్టిలో న్యాయంతో కూడిన కాశ్మీర్ మాత్రమేనని ఆయన అన్నారు. న్యాయం అంటే, అన్ని మైనారిటీల స్వేచ్ఛ, రక్షణ, భద్రత, వారి ఆస్తులకు, వారి ప్రార్థనా స్థలాలకు, వారి మతాచారాల స్వేచ్ఛకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడమేనని ఆయన అన్నారు. ఇటీవలి సంక్షోభమయ దినాలలో కూడా కాశ్మీర్ ప్రజలు హిందూ యాత్రికులకు అతిథి సౌకర్యాలన్నీ కల్పించారని ఆయన గుర్తు చేశారు. హిందూ యాత్రికుల కోసం కాశ్మీర్ ప్రజలు లంగర్‌లు (భోజనశాల) ఏర్పాటు చేశారనీ, అనారోగ్య బాధితులయిన హిందూ యాత్రికులకు కాశ్మీర్ ప్రజలు ఉపశమనం కల్పించారనీ ఆయన గుర్తు చేశారు. ఇదంతా కూడా భారత రాజ్యపు హింస కాశ్మీర్ ప్రజల మీద సాగుతున్నప్పుడే జరిగిందని ఆయన చెప్పారు.

నేను చాలా క్లుప్తంగా మాట్లాడాను. నా నగరంలో, ఢిల్లీలో ఇంతమంది ప్రజలు కాశ్మీర్ ప్రజలతో నిర్దిష్టమైన మానవ సంఘీభావాన్ని ప్రకటించడానికి సమావేశం కావడం నాకు గర్వం కలిగించిందని అన్నాను. పౌరసత్వమంటే, రాజ్యం చెప్పిన రాజకీయపరమైన అమూర్త నిర్వచనాన్ని పక్కనపెట్టిన ఆ సభికులను అభినందించాను. కాశ్మీర్‌లోని పరిస్థితి తీవ్రత గురించి రాస్తున్న, మాట్లాడుతున్న ప్రముఖమైన గళాలు ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలో కూడా ఉన్నాయని చెప్పాను. కాశ్మీరీ యువకులు తమ దగ్గర ఏమి జరుగుతున్నదో ప్రపంచానికి తెలియజెప్పే ఆకాంక్షతో చేస్తున్న పనులను బయటి ప్రపంచం గుర్తిస్తున్నదని నేనన్నాను. ప్రధాన స్రవంతి విధేయ ప్రచార సాధనాలు 1989 – 90లలో లాగా ప్రవర్తించినా అలావ్ లాంటి ఫేస్‌బుక్ సైట్‌లు, బ్లాగ్‌లు నిర్వహిస్తున్న పాత్ర వల్ల వాస్తవాలు భారత ప్రజానీకానికి, ప్రపంచానికి అందుతున్నాయని నేను చెప్పాను. కాశ్మీరీ యువత పొందుతున్న అవమానం, ఇవ్వాళ్టికి కాశ్మీర్ వాస్తవికత, ఇటువంటి ప్రత్యామ్నాయ ప్రచార సాధనాల ద్వారా, బయటపడుతున్న వీడియోల ద్వారా బయటికి వస్తోందని అన్నాను. ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలోని విలేకరులూ, సంపాదకులూ ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకొని, తమ పనితీరును సమీక్షించుకోవాలని కోరాను. భారత ప్రభుత్వం ప్రస్తుతం నడుపుతున్న మానసిక యుద్ధంలో, ప్రచార యుద్ధంలో పనిచేస్తూ, తమ వృత్తిపరమైన నైతికతను వదులుకోకూడదని విజ్ఞప్తి చేశాను. అబూ గరేబ్‌లో అమెరికా సాగించిన దుర్మార్గాల కన్న ఎన్నో రెట్లు ఘోరమైన అత్యాచారాలు భారత సైన్యం సాగిస్తుంటే, వాటిని వక్రీకరించి నివేదించడంలోనో, అసలు నివేదించకుండా ఉండడంలోనో కొన్ని ప్రచార సాధనాలు నిర్వహిస్తున్న పాత్ర పట్ల నాకు సిగ్గు, అవమానం కలుగుతున్నాయని చెప్పాను.

కాశ్మీర్‌కు సంబంధించిన విషయాల నివేదనలో బాధ్యతాయుత మైన పాత్ర నిర్వహించవలసిందిగా, సగౌరవంగా నేను విజ్ఞప్తి చేసిన తరువాత, సరిగ్గా ఆ సభగురించి నివేదికలలోనే 'టైమ్స్ నౌ', ఎన్.డి.టి.వి. వంటి ప్రధాన చానళ్లలో సత్యానికి తారు పూయడానికి చేసిన ప్రయత్నం చూస్తే, నాకు మరింత సిగ్గు కలుగుతోంది. ఇంత చరిత్రాత్మకమైన సమావేశాన్ని గురించి తన వార్తల్లో చెప్పడానికి 'ఎస్.ఎ.ఎస్. జిలానీ మీద చెప్పు విసిరిన సంఘటన' అని మాత్రమే చెబితే సరిపోతుందని ఎన్.డి.టి.వి. అనుకుంది. ఒక చెప్పో లేదా, మరేదో గుర్తించరాని వస్తువో కింది నుంచి విసిరిన మాట నిజమే. కానీ, అది జిలానీ మీద కాదు. మరొక ఉపన్యాసకుడు మాట్లాడుతున్నపుడు ఆయన ముందర ఉన్న నీళ్ల సీసాకు అది తగిలింది. కనుక కనీసం జరిగింది జరిగినట్టుగానైనా చెపుదాం. ఇక టైమ్స్ నౌకు సంబంధించిన ఆర్నబ్ గోస్వామి ఉన్నాడు. ఆయన న్యూస్ అవర్ (అందులో న్యూసూ ఉండదూ, అది అవర్‌కూ పరిమితం కాదు) అని పిలుచుకునే కార్యక్రమంలో, చర్చ అని అభివర్ణించిన దానిలో ఉన్మాదభరితుడి లాగా అబద్ధాలను పదే పదే వల్లించాడు. 'ఏ రాజ్యమూ విడిపోతాననడాన్ని, స్వయం నిర్ణయాధికారాన్ని అనుమతించదు' అనే ఒక అభిప్రాయం పదే పదే చెప్పి నిన్న జరిగిన లాంటి సమావేశం అమెరికాలో గనుక జరిగి ఉన్నట్టయితే, అక్కడ మాట్లాడిన వక్తలందరినీ వెంటనే దేశద్రోహ నేరం

కింద అరెస్టు చేసి, జైల్లో పెట్టి ఉండేవారని ఆయన అన్నాడు. పాఠకులందరికీ నేను గుర్తు చేయదల్చుకున్నదేమంటే, ఈ రెండు అంశాలలోనూ ఆర్నబ్ గోస్వామి చెబుతున్నది తప్పు. ఘోరమైన తప్పు. ఆయన బహుశా ఈ విషయాలు తెలియని మూర్ఖుడైనా అయి ఉండాలి, లేదా, తాను చెబుతున్నది తప్పని తెలిసి కూడా తన ప్రేక్షకులను తప్పుదారి పట్టించడానికి అబద్ధం ఆడుతూనైనా ఉండాలి. తన ఉద్దేశాలు ఏమిటో, తననే వివరించుకొమ్మనే ఔదార్యాన్ని మనం పాటించవచ్చు. కానీ, ఆయన తెలివిమాలిన వాడని మాత్రం స్పష్టమవుతుంది.

మమ్మల్ని అందర్నీ వెంటనే భారత శిక్షాస్మృతి సెక్షన్ 124 (దేశద్రోహం) కింద ఎందుకు జైల్లో పెట్టలేదు అని గోస్వామి గర్జించాడు. ఆర్నబ్ గోస్వామికి ఒక విషయం గుర్తు చేయవలసి ఉంది. అమెరికాలో అమలులో ఉన్న చట్టాల ప్రకారం, అందులోనూ దేశద్రోహ చట్టం నిబంధనల ప్రకారం కేవలం ఆ దేశం మరొక దేశంతో యుద్ధంలో ఉన్నప్పుడు మాత్రమే ఆ నిబంధనలు వర్తిస్తాయి. అందువల్ల ఆయన ఇక్కడ చెబుతున్న పోలిక ఎంత మాత్రం సరిపోదు. భారత రిపబ్లిక్ ప్రస్తుతం ఇంకే దేశం మీదయినా యుద్ధం ప్రకటించి ఉందేమో నాకు తెలియదు. అలాంటి యుద్ధ ప్రకటన కూడా అంతర్జాతీయ చట్టాల ప్రకారం జరగవలసి ఉంటుంది. (లేదా, ఆర్నబ్ గోస్వామి పూర్తిగా పిచ్చివాడైపోయి, టెలివిజన్ తెర మీద తాను నీడతో సాగించే యుద్ధాన్నే అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఒక ప్రభుత్వం ప్రకటించే యుద్ధంగా భ్రమ పడుతున్నాడేమో తెలియదు) అంతేకాదు, ఇంకొక వ్యవహారం ఉంది. అమెరికా దేశ ద్రోహ చట్టపు నిబంధనలు చెల్లవని, అమెరికన్ సుప్రీంకోర్టు బ్రాండన్‌బర్గ్ వర్సెస్ ఒహియో (1969) కేసు తీర్పులో స్పష్టంగా ప్రకటించింది. అలాగే, అమెరికా సుప్రీంకోర్టు అన్నిటికన్నా భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాథమికమైనదనీ, ఈ భావ ప్రకటనలో దేశద్రోహ భావ ప్రకటన, చివరికి అమెరికా దేశ పతాకాన్ని తగలబెట్టడంతో సహా భాగమేననీ, ఇవన్నీ అమెరికన్ రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ నిబంధనల కిందికి వస్తాయని తీర్పు చెప్పింది.

అమెరికా చట్టంలో జెండాను తగలబెట్టడం ఒక నేరమని ప్రకటించే చట్టాన్ని తీసుకురావడానికి అనేకసార్లు ప్రయత్నాలు జరిగాయి. అదృష్టవశాత్తూ ఇప్పటివరకూ ఆ ప్రయత్నాలేవీ విజయం సాధించలేదు.

ప్రస్తుతం అమెరికా చట్టాల ప్రకారం స్వయం నిర్ణయాధికారాన్ని, దేశం నుంచి విడిపోవడాన్ని ప్రచారం చేయడం పూర్తిగా చట్ట సమ్మతమే. అయితే, అది శాంతియుతంగా సాగాలనీ, అంటే, జాతీయ పతాకంతో సహా రాజ్యాధికార చిహ్నాలను తగలబెట్టడం, ధ్వంసం చేయడం, అవమానించడం కూడా శాంతియుతంగా జరిగితే చట్టబద్ధమేనని అమెరికా న్యాయశాస్త్రం చెబుతుంది. అంతేకాదు, కెనడా, ఇథియోపియా, ఆస్ట్రియా, ఫ్రాన్స్ వంటి ఎన్నో దేశాల రాజ్యాంగాలు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ స్వయం నిర్ణయాధికార హక్కుకు చట్టపరమైన వ్యక్తీకరణలను తమలో భాగం చేసుకున్నాయి. ఆ హక్కును శాంతి యుతంగా, ప్రజాస్వామిక పద్ధతిలో భావప్రకటనా స్వేచ్ఛ సూత్రానికి లోబడి అమలు చేసుకోవచ్చునని చెప్పాయి.

అయితే, ఇక్కడ సమస్య ఆర్నబ్ గోస్వామి తెలివి తక్కువ వాడా, అతి తెలివి ప్రదర్శిస్తున్నాడా అనే దానికన్న పెద్దది. ఆ ఛానల్‌కు, బహుశా భారత ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలన్నిటికి నిన్నటి సభ ఒక చరిత్రాత్మక అవకాశం. ఆ సభ గురించి వార్తలు ఇవ్వడం ద్వారా భారత ప్రజాభిప్రాయంలో ఒక ప్రధానమైన బృందం కాశ్మీర్ ఆజాదీకి అనుకూలంగా ఉన్నదనే వాస్తవాన్ని వాళ్లు చెప్పి ఉండవచ్చు. ఈ బృందం చాలా ఎక్కువగా ఉన్నదనో, ఇదే అత్యధికుల అభిప్రాయమనో నేననడం లేదు. అలా మారితే మారవచ్చు కూడా. కానీ, నేనంటున్నదల్లా, అటువంటి ఒక అభిప్రాయం ఉంది అని మాత్రమే. అది ఉంది, హేతుబద్ధంగా, కచ్చితంగా తన వాదనలు ముందుకు తెస్తోంది. దాన్ని, టైమ్స్ నౌ వంటి సాధనాలు తీవ్రవాద బూచిని చూపి మాయం చేయలేవు.

నిజం చెప్పాలంటే, ఇవాళ కాశ్మీర్‌లో టెర్రరిజం అనేది లేదు. (భారత రాజ్యం సాగిస్తున్న టెర్రరిజాన్ని మినహాయిస్తే). గత రెండు మూడు నెలల్లో చనిపోయిన నూటా పదకొండు మంది రాజ్యాంగేతర తిరుగుబాటుదార్ల చేతులలో చనిపోలేదు. వాళ్లు నిరాయుధంగా, భారత రాజ్యపు తూటాలకు ఎదురు నిలిచి చనిపోయారు. కాశ్మీర్‌లో ఆజాదీ కోసం సాగుతున్న ఉద్యమం తుపాకి గ్రెనేడ్‌ల సంస్కృతిని వదిలేసింది. అది ఇవాళ ఆయుధాలు లేకుండా పోరాడుతోంది. ఇవాళ సాహసమే దాని ఆయుధం. ఇవాళ కాశ్మీర్‌లో ఒక తీవ్రవాది ఉంటే, అతను భారత రాజ్యపు సైనిక బలగాల యూనిఫాం వేసుకుంటాడు. భారత రాజ్యం ఆయుధ శక్తినే ధరిస్తాడు. ఈ వాస్తవికతను వ్యతిరేకిస్తూ వినిపిస్తున్న గళాలను తీవ్రవాద సానుభూతిపరులు అని ఆర్నబ్ గోస్వామి లాగా అనడం వాస్తవికతను అవమానించడమే.

సయ్యద్ అలీ షా జిలానీ కాశ్మీర్ ప్రజలకూ, భారత ప్రజలకూ మధ్య ఉన్న మానవతా బంధాల గురించి మాట్లాడాడు. ఆ మాటలు నా చెవులారా విన్నాను. ఆయన ఆ మాటలు అంటున్నప్పుడు ఆయనకు అయిదు అడుగుల దూరంలో ఉన్నాను. జమ్మూకాశ్మీర్‌లోని మైనారిటీల పట్ల ఆయన గౌరవ ప్రతిపత్తులు ప్రకటించడం విన్నాను. రాజకీయం గానో, సైద్ధాంతికంగానో జిలానీ ప్రాతినిధ్యం వహించే దానిలో చాలా భాగంతో నాకేకీభావం లేదు. కాని, నిన్న ఆయన మాట్లాడిన మాటలలో ఉన్న మెత్తదనం, ఇచ్చిపుచ్చుకునే ధోరణి, మర్యాద, ఔదార్యం, బహిరంగత్వం నాకు ఆశ్చర్యాన్నీ, గౌరవాన్నీ కల్పించాయని చెప్పడంలో నాకేమీ సందేహం లేదు. నిజానికి ఇది పెద్ద వార్త అయి ఉండవలసింది. సయ్యద్ అలీ షా జిలానీ బలోపేతమైన, పునర్వికాసం చెందిన భారతదేశాన్ని చూడదల్చుకున్నాడు. ఆయన ఆ మాట అనడం నేను విన్నాను. ఇది ఎక్కడైనా పత్రికల్లో, ఛానళ్లలో వచ్చిందా? లేదు. ఆయన ఈ మాట అన్నప్పుడు సభికులందరూ కరతాళ ధ్వనులు చేశారని ఎక్కడైనా వచ్చిందా? లేదు. భారత దేశంలో తమ సమస్యల మీద పోరాడుతున్న ప్రజలకు వ్యతిరేకంగా ఆ సభలో ఏ ఒక్కరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఎక్కడైనా వచ్చిందా? లేదు.

ఆ సభలోనే జిలానీ తాను చర్చలకు వ్యతిరేకం కాదని అన్నాడు. అదెక్కడైనా వచ్చిందా? లేదు. ఆయన అన్నదల్లా తాను ప్రతిపాదిస్తున్న అయిదు అంశాల ప్రాతిపదికగా చర్చలు జరపవచ్చునని మాత్రమే. అవి, ఒకటి, జమ్మూ కాశ్మీర్ భూభాగం వివాదాస్పదమైనదని అంగీకరించడం. రెండు, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం, తదితర అణచివేత చట్టాలను రద్దు చేయడం. మూడు, రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయడం. నాలుగు, మితిమీరిన సంఖ్యలో మోహరించిన సాయుధ బలగాలను ఉపసంహరించడం. ఐదు, గత రెండు మూడు నెలల్లో ప్రాణ హరణానికి కారణమైన వారిని శిక్షించడం. నిజం చెప్పాలంటే, ఈ అయిదు ప్రతిపాదనలలో ఏ ఒక్కదాని గురించీ భారత ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని దాటి ఆలోచించనక్కర్లేదు.

జమ్మూ కాశ్మీర్‌లోని వేర్పాటువాద నాయకులందరిలోకీ

ప్రముఖుడైన నాయకుడు, ఢిల్లీకి వచ్చి చాలా నెమ్మదైన స్వరంలో భారత ప్రభుత్వంతో చర్చించడానికి మౌలిక పునాది ఉంది అంటున్నాడంటే, అది పెద్ద వార్త అని మీరు అనుకోరా? నిజానికి ఆయన ప్రతిపాదనలు సమంజసమైనవి. న్యాయబద్ధమైనవి. అందరికీ గౌరవప్రదమైనవి. ఏ బాధ్యత గల ప్రచార సాధనమైనా ఇటువంటి ప్రతిపాదనను ఒక గొప్ప అవకాశంగా, ప్రధాన వార్తగా గుర్తించి ఉండేది. కానీ, ఆ పని జరగలేదు.

అందుకు బదులుగా టైమ్స్ నౌ పిడికెడు మంది విచ్ఛిన్నకారులు ఆ సభను భగ్నం చేయడానికి చేసిన ప్రయత్నం మీద దృష్టి పెట్టింది. ఇక ఉదయం వెలువడే వార్తా పత్రికలు ఏం రాస్తాయో నేనింకా చూడలేదు. టైమ్స్ నౌ మాత్రం కాశ్మీర్‌లో మన ఆక్రమణ సైన్యాలు కొనసాగాలనే పిడికెడు మంది మీద, కెమెరా ముందు కనబడితే చాలుననుకునే వాళ్ల మీద కేంద్రీకరించింది. కొన్ని గంటల పాటు ఓపికగా సాగిన సభ మీద కేంద్రీకరించకుండా, అందులో అయిదు శాతం కన్నా తక్కువ ఆక్రమించిన సంఘటనలను చూపించింది. మీరు ఆ కార్యక్రమాన్ని చూసి ఉన్నట్టయితే, అక్కడ జరిగిన కార్యక్రమమంతా నిరసనేనేమో అని అనుకునే వాళ్లు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఒక వ్యక్తిగా, ఇంత పెద్ద ఎత్తున అబద్ధాలను వండి ప్రేక్షకుల ముందర ప్రదర్శించడం చూసి, నేను దిగ్భ్రాంతి చెందాను. ఈ కార్యక్రమంలో ఒక వక్తగా, అర్నబ్ గోస్వామి పిలిచిన ఆదిత్యా రాజ్ కౌల్ అనే వ్యక్తి నేరుగా ఆడిన ఒక పచ్చి అబద్ధం విని మరింత ఆశ్చర్యపోయాను. అసలు సభను అడ్డుకునే ప్రయత్నమే జరగలేదని ఆయన అన్నాడు.

ఇటు భారత ప్రజలను, అటు కాశ్మీర్ ప్రజలను ఇలా చీకటిలో ఉంచినందుకు, అబద్ధాలు చెప్పినందుకు ఏదో ఒకరోజు ఇటువంటి ఆర్నబ్ గోస్వాములందరూ పశ్చాత్తాప పడే రోజు వస్తుందని నేననుకుంటాను. వాళ్లు ఇప్పుడే కాస్త ఆలోచించడం మంచిది. ఎందుకంటే ఆ పశ్చాత్తాప పడే రోజు మరీ ఎక్కువ దూరం లేదు. కాశ్మీర్‌కు ఆజాదీ వస్తుంది. ఆ ఆజాదీ వచ్చినప్పుడు కాశ్మీరీ మిత్రులతో కష్ట కాలంలో నిలబడిన భారత ప్రజలకు కూడా ఆ ఆజాదీ వెలుగు అందుతుంది. నిన్నటి సభలో నేను చూసిన దాన్ని బట్టి అటువంటి వెలుగు అందుకునే భారత ప్రజలు చాలా మందే ఉండబోతున్నారు. అందువల్ల అర్నబ్ గోస్వాములూ, అటువంటి వాళ్లూ ఇప్పటి నుంచే క్షమించండి అని రోజుకు వందలాది సార్లు అనడం ఎలాగో కసరత్తు చేసుకుంటే మంచిది.

(రచయిత స్వతంత్ర పాత్రికేయులు) వీ

పై సభ జరిగిన వెంటనే టైమ్స్ నౌ, ఎన్.డి.టి.వి. వంటి ప్రచార సాధనాలు ప్రారంభించిన వ్యతిరేక ప్రచారాన్ని మర్నాటి నుంచి పయనీర్ వంటి పత్రికలు కొనసాగించాయి. నిర్వాహకులను, వక్తలను దేశద్రోహ నేరం కింద అరెస్ట్ చేయాలని భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. వక్తల మీద భారత శిక్షాస్మృతి 124 ఎ కింద కేసు నమోదయిందని, వారిని అరెస్ట్ చేయనున్నారని కూడా, ఇది రాసే సమాయనికి, వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 26న ***అరుంధతీ రాయ్*** *విడుదల చేసిన ప్రకటన.*

నేనిది కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి రాస్తున్నాను. ఇటీవల కాశ్మీర్ గురించి బహిరంగ సభలలో నేను మాట్లాడిన దాని గురించి దేశద్రోహ నేరం కింద నన్ను అరెస్టు చేయవచ్చునని ఇవాళ ఉదయం పత్రికలలో చదివాను. ఇక్కడ ప్రతిరోజూ లక్షలాది మంది ఏమంటున్నారో అదే నేను ఆ సభల్లో అన్నాను. ఎంతోమంది వ్యాఖ్యాతలు ఎన్నో సంవత్సరాలుగా అంటున్నదే, రాస్తున్నదే నేనన్నాను. నా ఉపన్యాసపు పాఠాన్ని చదివే శ్రద్ధ ఉన్న ఎవరైనా అది కేవలం న్యాయం కోసం చేసిన విజ్ఞప్తి అని అర్థం చేసుకోగలరు. ప్రపంచంలోకెల్లా అత్యంత పాశవికమైన సైనిక ఆక్రమణ కింద నలిగిపోతున్న కాశ్మీర్ ప్రజలకు న్యాయం అందించాలని నేనన్నాను. తమ స్వస్థలం నుంచి బయటికి వెళ్లగొట్టబడిన విషాదాన్ని అనుభవిస్తున్న కాశ్మీరీ పండిత్‌లకు న్యాయం అందించాలని నేనన్నాను. కాశ్మీర్‌లో చనిపోతున్న దళిత సైనికులకు న్యాయం జరగాలని నేనన్నాను. అటువంటి సైనికుల సమాధులు కడలూర్ దగ్గర గ్రామాలలో చెత్తకుప్పల మధ్యన ఉండడం నేను చూశాను. ఈ ఆక్రమణకు మూల్యంగా పోలీసు రాజ్యంగా మారిపోతున్న పాలనలో భయోత్పాతం కింద బతకవలసి వస్తున్న భారత ప్రజానీకానికి న్యాయం జరగాలని నేనన్నాను.

నిన్న దక్షిణ కాశ్మీర్‌లో ఆపిల్ పండ్లకు ప్రసిద్ధి చెందిన షోపియన్ పట్టణానికి వెళ్లాను. అక్కడ ఆసియా, నీలోఫర్ అనే ఇద్దరు యువతులపై దుర్మార్గంగా అత్యాచారం జరిపి, హత్య చేసినందుకు నిరసనగా నలభై ఏడు రోజుల పాటు బంద్ పాటించారు. ఆ ఇద్దరు యువతుల మృతదేహాలు వారి ఇంటి దగ్గర ఒక కాలువలో దొరికాయి. వారి హంతకులను ఇవాళ్టిదాకా విచారించలేదు. శిక్షించలేదు. నీలోఫర్ భర్తా, ఆసియా సోదరుడూ అయిన షకీల్‌ను నేను నిన్న కలిసాను. భారత దేశంలో ఎప్పటికైనా తమకు న్యాయం దొరుకుతుందనే ఆశలేని బాధామయ, ఆవేశమయ సమూహం అది. వాళ్లు ఇప్పుడు ఆజాదీ – స్వాతంత్ర్యం ఒక్కటే తమ ఆశ అని నమ్ముతున్నారు. మొన్నటి ఆందోళనలలో రాళ్లు విసిరిన కుర్రవాళ్లను కలిసాను. వాళ్ల మీదికి నేరుగా కళ్లకు గురిపెట్టి పోలీసులు కాల్పులు జరిపారు. అనంతనాగ్ జిల్లాలో తన స్నేహితులైన ముగ్గురు ముక్కుపచ్చలారని పిల్లలను ఎలా పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారో, వారు రాళ్లు విసిరినందుకు వారి వేళ్ల గోర్లు ఎలా పీకివేశారో నాతోపాటు ప్రయాణించిన యువకుడు చెప్పాడు.

నేను 'ద్వేషభరితమైన' ఉపన్యాసాలు ఇచ్చాననీ, భారతదేశం విచ్ఛిన్నం కావాలని కోరుకున్నాననీ పత్రికలలో ఆరోపించారు. అందుకు భిన్నంగా నా మాటలు ప్రేమను, గర్వాన్ని ప్రకటించాయి. తమను తాము భారతీయులమని చెప్పుకొమ్మని బలవంతపెడుతూ మనుషులను చంపకూడదనీ, అత్యాచారం చేయకూడదనీ, జైళ్ల పాలు చేయకూడదనీ, వేళ్ల గోర్లు పీకివేయకూడదనీ నేనన్నాను. న్యాయభావన నిండిన సమాజంగా మన సమాజం ఎదగాలనే ఆకాంక్ష నుంచి మాట్లాడాను. తమ మనసులో ఏమున్నదో అది మాట్లాడిన రచయితల నోరు మూయించడానికి ప్రయత్నిస్తున్న దేశాన్ని చూస్తే నాకు జాలి వేస్తోంది. న్యాయం అడిగిన మనుషులను జైళ్లకు పంపాలని అంటున్న దేశమే మతోన్మాద హంతకులను, మూకుమ్మడి హత్యాకాండలకు కారణమైన వాళ్లను, కార్పొరేట్ కుంభకోణాల నిందితులను, లూటీదారులను, రేపిస్టులను, పేద ప్రజలను బలిగొంటున్న వారిని ఇష్టారాజ్యంగా తిరగనివ్వడం చూసి జాలివేస్తున్నది. వీ

తెలంగాణను సాధించుకునే దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేయడం, వనరులను పరిరక్షించుకోవడం ముఖ్య లక్ష్యాలుగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ ముందుకు సాగుతుందని అంటున్నారు **ఆకుల భూమయ్య**

తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావం

9 అక్టోబర్ 2010న హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లోగల మారుతి గార్డెన్ ఫంక్షన్‌హాలులో వేలాది మంది తెలంగాణ ఉద్యమకారుల, అభిమానుల సమక్షంలో ప్రజాగాయకుడు గద్దర్ అధ్యక్షతన తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భవించింది. ఎనభై అయిదు మందితో కూడిన రాష్ట్రస్థాయి అడ్‌హాక్ కమిటీకి గద్దర్ నేతృత్వం వహిస్తున్నారు. గత ఆరు నెలలుగా గ్రామస్థాయి నుండి విస్తృతంగా చర్చించబడిన ప్రణాళిక హర్షాద్వానాల మధ్య ఆమోదించబడింది.

ఉద్యమం ద్వారా తెలంగాణ సాధించుకోగలమని విశ్వసించే పలు జెఎసిలు, సంఘాలు, పార్టీలు, వ్యక్తులతో కూడిన ప్రజాఫ్రంట్ నిర్మాణానికి ముందు 2010 మార్చ్ నెల నుండే ప్రయత్నాలు ఉధృతంగా జరిగాయి. ఫ్రంట్‌కు గైడ్‌లైన్‌లాగా ఒక ప్రణాళిక ఉండాలని, దాన్ని కిందిస్థాయి నుండి వివిధ జెఎసిల, సంఘాల, సంస్థల ప్రతినిధులు చర్చించి అవగాహన చేసుకోవాలనే విధానంలో భాగంగా కాస్త జాప్యం జరిగినా మంచి ఫలితాలు రావడానికి భూమిక ఏర్పడిందని చెప్పుకోవచ్చును. ప్రజాఫ్రంటు ఏర్పడడానికి దారి తీసిన పరిస్థితులను కొంతమేరకైనా చర్చించడం అవసరం.

1996లో మలి దశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమయినప్పటి నుండి ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న గద్దర్ ప్రజాఫ్రంటుకు నాయకత్వం వహించడం ముదావాహం. అత్యంత ప్రజాకర్షణ కలిగి, ఉద్యమ నేపథ్యం ఉన్న గద్దర్, ఇతరుల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం కొత్త పుంతలు తొక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు. 1996 నుండి 2001 దాకా తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తెలంగాణ మహాసభ, జనసభ, ఐక్యవేదికల్లాంటివి ఏర్పడి ప్రచార, నిర్మాణ పోరాట కార్యక్రమాలు విరివిగా నిర్వహించాయి. నాటి తెలుగుదేశం ప్రభుత్వం పచ్చి తెలంగాణ వ్యతిరేకంగా అణిచివేత చర్యలు చేపట్టింది. బెల్లి లలితను ముక్కలుగా నరికి చంపడం, కళాకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపి వేయడం, కార్యకర్తలను గూండాలతో దాడి చేయించి చంపడం, నాయకత్వం నిర్మూలనకై అనేక హింసాత్మక చర్యలు చేపట్టిన నాటి తెలుగుదేశం ప్రభుత్వం చివరకు అసెంబ్లీలో తెలంగాణ పేరెత్తవద్దనే స్థాయికి నిర్బంధాన్ని పెంచింది. ఆ నేపథ్యంలో ఏర్పడిన 'తెలంగాణ రాష్ట్ర సమితి' ఒక్క రక్తపు చుక్క రాలకుండా, త్యాగాలు అవసరం లేకుండా, విద్యార్థులు, రైతులు, కార్మికులు రోడ్లమీదకు రాకుండానే ఓట్లద్వారా, సంకీర్ణ ప్రభుత్వాల అవసరాల రీత్యా లాబీయింగ్ చేసి తెలంగాణను దగ్గరి దారిలో సాదిస్తామనే అశాస్త్రీయ సూత్రీకరణలు చేసింది. కొంత మంది మేధావులు కూడ ఆ నినాదాన్ని నమ్మి మోసపోవడం తెలంగాణలో ఏర్పడిన సైద్ధాంతిక దారిద్ర్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చును. ఆ విధంగా రాజకీయ పార్టీ నేర్పరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని ఉద్యమ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. అధికారానికి చాలా కాలంగా దూరంగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్ ఈ పరిస్థితి గమనించి, లబ్దిపొందాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించి, తెరాస తో పొత్తు పెట్టుకుని 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని స్థాపించింది.

ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు తెలంగాణ ఇవ్వాల్సిన కాంగ్రెస్ మొండిచేయి చూపి మరోసారి తెలంగాణకు ద్రోహంచేసింది. తెరాస కూడా పెద్దగా డిమాండ్ చేయకపోగా అధికారంలో భాగం పంచుకోవడం వల్ల ఉద్యమ తీవ్రత తగ్గింది.

2006 జూలైలో 50కి పైగా ప్రజా సంఘాలు – పార్టీలు ఉద్యమం ద్వారానే తెలంగాణ సాధ్యం అనే నినాదంతో తెలంగాణ ఐక్య కార్యచరణ కమిటీ నేర్పరచి తెలంగాణ వ్యాప్తంగా అనేక నిర్మాణ పోరాట కార్యక్రమాలు చేపట్టాయి. మరో వైపు తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఏర్పాటై, ఈ రెండుసంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఊపందుకున్నాయి. 2008 ఉప ఎన్నికలు, 2009 ఎన్నికల సందర్భంగా ఎన్నికల ద్వారా తెలంగాణ రాదు, అని పోరాడి సాధించాలనే నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకపోవడం జరిగింది. 2009 ఎన్నికల్లో అన్ని పార్టీలు తెలంగాణకు అనుకూలంగా బూటకపు నినాదాలను ప్రచారంలో పెట్టడం వలన అన్ని పార్టీలను ప్రజలాదరించారు. తర్వాత అన్ని పార్టీలు మోసం చేసినాయి. కాంగ్రెస్ పార్టీ అయితే ఎన్నికల తర్వాత 'జై సమైక్యాంధ్ర' అని గవర్నర్‌తో అనిపించింది. హైదరాబాదుకు పోవాలంటే వీసాలు అవసరం పడతాయని సీమాంధ్రవాసులను వై.ఎస్.ఆర్. రెచ్చగొట్టాడు. పోలింగ్ జరిగిన తర్వాత చాలా పార్టీలు బాణీని మార్చివేసి తెలంగాణ వ్యతిరేక విధానాలు అవలంబించినాయి. అందుకే ఎన్నికలు ప్రతీసారి తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చు తున్నాయని, పక్కదారి పట్టిస్తున్నాయని, తెలంగాణ వచ్చేదాక ఎన్నికల ప్రస్తావన లేకుండా అందరూ కలిసి కట్టుగా ఉద్యమించాలని ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. 2009 ఎన్నికల తర్వాత 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు, అన్ని పార్టీలు, సంస్థలు ఎన్నికల ద్వారా ఏమీకాదని, ఉద్యమాలు తీవ్రతరం చేయడం ద్వారానే తెలంగాణ సాధించుకోగలమనే ఏకాభిప్రాయానికి రావడం సంతోషించదగిన అంశం. అది తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ, సాంస్కృతిక సమాఖ్యల సైద్ధాంతిక విజయంగా పేర్కొనవచ్చు.

ఈ నేపథ్యంలోనే టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.సి.ఆర్. ఆమరణ నిరాహార దీక్ష – ఆ దీక్షననుసరించి విద్యార్థుల వీరోచిత ఉద్యమాలు – రైతులు, కార్మికులు, ప్రజలంతా, రాస్తారోకో, రైలురోకో, బంద్ కార్యక్రమాలు నిర్వహించడం, చివరికి విద్యార్థులు డిసెంబర్ 10న చలో అసెంబ్లీ ప్రకటన

అన్నీ కలిసి డిసెంబర్ 9న చిదంబరంచే తెలంగాణ ఏర్పాటు ప్రకటనకు దారితీశాయి. కాని లగడపాటి, జె.సి. దివాకర్‌రెడ్డి, పయ్యావుల కేశవ్ మొదలయిన వారు సృష్టించిన కృత్రిమ సమైక్యాంధ్ర ఉద్యమం కేంద్ర ప్రకటనను వెనక్కుతిప్పింది. 23 సెప్టెంబర్ 2009 తర్వాత తెలంగాణలోని రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు ఏకమై జె.ఎ.సి. నాయకత్వంలో కార్యక్రమాలు చేపట్టాయి. జనవరి 5న చిదంబరం రాజకీయ పార్టీలను చర్చలకు పిలిచి రాజకీయ వ్యవస్థను, పార్టీల వ్యవస్థను కాపాడుకోవాలని, ఉద్యమం రెండు ప్రాంతాల్లో సామాన్యుల చేతికిపోయిందనీ, తెలంగాణగానీ, సమైక్యాంధ్ర గానీ, ఏదైనా పాలకవర్గ పార్టీల ప్రయోజనాలమేరకే జరగాలనీ, బడుగు బలహీన వర్గాలు దీని ద్వారా లబ్దిపొందకూడదంటే వెంటనే శాంతి సామరస్యాలను పునరుద్ధరించడం అవసరమనీ గీతోపదేశం చేయడంతో అన్ని పార్టీలకు జ్ఞానోదయం అయి ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేసి తెలంగాణకు తీరని ద్రోహం చేశాయి. పోరాడింది విద్యార్థులు, యువకులు కాని చర్చల్లో పాల్గొని నిర్ణయాత్మక శక్తిగా మారింది రాజకీయ పార్టీలు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పై ఒక కమిటీవేసి చేతులు దులుపుకుంది.

ఈ పరిస్థితిలో తెలంగాణ మరోసారి మోసపోయిందని గ్రహించిన తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ, సాంస్కృతిక సమాఖ్య – జనపరిషత్ మొదలగు సంస్థలు రాజకీయ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదని, గ్రామ, మండల, పట్టణ, జిల్లా రాష్ట్ర స్థాయిల జె.ఎ.సిలు, సంస్థలు కలిపి రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా విద్యార్థులు, లాయర్లు తదితర పోరాట శక్తులతో కూడిన తెలంగాణ జె.ఎ.సిల సమన్వయ ఫ్రంటును మార్చ్ 18న ఏర్పరచి శ్రీకృష్ణ కమిటీ 'గో బ్యాక్' అనే నినాదం ఇచ్చింది. తెలంగాణ జె.ఎ.సిల సమన్వయ ఫ్రంట్ ఆధ్వర్యంలో 10 జిల్లాల్లో స్టీరింగ్ కమిటీలు ఏర్పరిచి రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించి తెలంగాణ ప్రజాఫ్రంట్‌ను ఏర్పరచడం జరిగింది.

ప్రణాళికపై జరిగిన చర్చలో కొన్ని భిన్నాభిప్రాయాలు ఏర్పడినందున రాష్ట్ర సదస్సులో ఒక తాత్కాలిక కమిటీని ఎన్నుకోవడం జరిగింది. డిసెంబర్ 2010లోగా ఈ చర్యను పూర్తి చేసి, ఏకాభిప్రాయం సాధించి పూర్తి స్థాయి బాడీని ఎన్నుకోవాలని రాష్ట్ర సదస్సు నిర్ణయించింది. తెలంగాణ ప్రజా ఫ్రంట్ ముఖ్య ఆశయాలు – తెలంగాణ రాష్ట్ర సాధన, తెలంగాణ వనరుల పరిరక్షణ. ఈ ఆశయాల సాధనకోసం పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెట్టించి ఆమోదింపచేయడానికి అన్ని పార్టీలు, కేంద్ర ప్రభుత్వం పై ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి చేయడం, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, కార్యకలాపాలు స్తంభించే స్థాయిలో ఉద్యమాలు చేపట్టడం, తెలంగాణ వనరుల పరిరక్షణ కోసం ఆయా జిల్లాల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై స్థానికంగా పోరాటాలు నిర్వహించి ఉద్యమ నిర్మాణం చేయడం.

ఈ లక్ష్యాల సాధన కోసం అన్ని సంస్థల సమాన ప్రాతినిధ్యంతో సమిష్టి నాయకత్వాన్ని ఏర్పాటు చేయుడం

వివిధ రాజకీయ పార్టీల పట్ల ఫ్రంట్ అవగాహన

తెలంగాణ ఉద్యమాన్ని పలుమార్లు తీవ్రంగా అణిచివేయడంతో పాటు రాష్ట్రం ఏర్పాటు చేస్తామని చెప్పిన వాగ్దానం నుంచి వెనక్కు పోవడం లాంటి ద్రోహపూరిత చర్యలతో కాంగ్రెస్ పార్టీ మొదలు నుండి తెలంగాణకు మోసం తలపెడుతూనే ఉంది. నేడు రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఆ పార్టీ, ఆ పార్టీ ఆధ్వర్యంలోని యు.పి.ఎ ఉంది కాబట్టి రాష్ట్రం ఏర్పాటు చేసే బాధ్యత ప్రధానంగా కాంగ్రెస్ మీదే ఉంటుంది. ఆ బాధ్యత నుండి కాంగ్రెస్ తప్పించుకోజాలదు. మేమెంతో చేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ వాదులు తాము తలచుకుంటే పార్లమెంటులో బిల్లు వెంటనే పెట్టించలేరా? నాలుగు కోట్లమంది తెలంగాణ ప్రజల ప్రశ్న ఇది. తానేమీ తక్కువ కాదనే పద్ధతిలో తెలుగుదేశం పార్టీ ఉద్యమాన్ని అణిచివేయడంతోపాటు ప్రతీసారి మోకాలడ్డువేస్తూ ప్రధాన అడ్డంకిగా మారింది. తెలంగాణ ఇస్తానని చెప్పిన బిజెపి అవకాశం వచ్చినపుడు ఇవ్వకుండా మాటతప్పి ఇపుడు తెలంగాణకు అనుకూలమంటుంది తప్ప పెద్దగా ఉద్యమాలు చేయడంలో నిజాయితీ చూపడంలేదు. సిపిఐ – అనుకూలమని చెప్పినప్పటికీ ఎలాటి కార్యాచరణ లేకపోవడంతో చిత్తశుద్ధిని శకించాల్సిన పరిస్థితి ఉంది. సిపిఐ(ఎం) తెలంగాణ వ్యతిరేకి – మజ్లిస్ రాయల తెలంగాణ కోరి తన వ్యతిరేకతను చాటుకుంటూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయి. ఇక తెలంగాణ కోసమే పుట్టినట్లు చెప్పుకుంటున్న టిఆర్‌ఎస్ ఉద్యమాన్ని ఎన్నికల చుట్టే తిప్పుతూ తెలంగాణ వనరుల పరిరక్షణ పట్ల గానీ, తెలంగాణ ఏర్పాటు పట్లగానీ పోరాటాలు చేయడంలో ముందుకు రావడంలేదు. తెలంగాణ ప్రజాఫ్రంటు సమస్యల ప్రాతిపదికన తెలంగాణ పై చిత్తశుద్ధితో పోరాడే పార్టీలతో కలిసి ఐక్య పోరాటాలు చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

తెలంగాణ ప్రజాఫ్రంటు – ఒక ఐక్య సంఘటన. వివిధ పార్టీలు, సంస్థలు తమ స్వయం ప్రతిపత్తి నిలుపుకొంటూ తెలంగాణ రాష్ట్ర సాధనకై ఐక్య ఉద్యమాలు చేపడతాయి. ఈ ఫ్రంటు మూడు కేంద్ర డిమాండ్ల పై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

1) తెలంగాణ బిల్లు పార్లమెంటులో పెట్టి ఆమోదింపజేయడం.
2) తెలంగాణ ఉద్యమకారులపై, విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయించేందుకు పోరాడడం.
3) తెలంగాణ వనరుల దోపిడీని అడ్డుకోవడం.

కలిసివచ్చే సంఘాలు, సంస్థలతో, వ్యక్తులతో ఈ ఫ్రంటును బలోపేతం చేయడానికి అక్టోబర్ 31 వరకు జిల్లాల పర్యటనలు ఉంటాయి.

నవంబరు 1ని విద్రోహదినంగా ప్రకటించి – నల్లజెండాలు తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటా ఎగరవేసి నిరసన కార్యక్రమాలు చేపట్టాలి.

నవంబరు 1 తెలంగాణ విద్రోహదినం కాబట్టి ఆ రోజు తెలంగాణ ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని అడ్‌హాక్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

(రచయిత తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - డిసెంబర్ 2010 : తప్పనిసరిగా చదవవలసిన పుస్తకాలు**
- **జాతీయ ఫైబర్ విధానం - ఒక సమీక్ష - డి. నరసింహారెడ్డి**
- **సోషలిజం - లాటిన్ అమెరికా ఆలోచనలు - బి. సాంబశివరాజు**

తెలంగాణ ఆకాంక్షను మరింత బలంగా ముందుకు తీసుకుపోయే క్రమంలో భాగంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావాన్ని చూడాలని అంటున్నారు **ఆర్.ఎస్. చౌహాన్**

తెలంగాణ సాధనకు మరో ప్రయత్నం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు జరుగుతున్న ఉద్యమాలు ఈ నాటివి కావు. దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమిస్తున్నారు. ఈ పోరుబాటలో వందల మంది అమరులైనారు. కానీ పాలకపక్షంలోని ఏ రాజకీయ పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను తీర్చలేదు. ఈ క్రమంలో టి.ఆర్.ఎస్. పార్టీ కూడా ప్రత్యేక తెలంగాణ సాధనకై తనదైన శైలిలో ఉద్యమాలను నడిపించింది.

కానీ తన ఉద్యమాలతో టి.ఆర్.ఎస్. ఏమీ సాధించగలిగినదని ఆలోచిస్తే, ఎక్కువ శాతం వైఫల్యాలనే చవిచూసింది. టి.ఆర్.ఎస్. పార్టీ ప్రత్యేక తెలంగాణ కొరకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టించలేకపోయింది. ఉద్యమ క్రమంలో పాలకపక్షం పెట్టిన కేసులో తన పార్టీ ఎం.పి.లపై పెట్టిన కేసులు ఎత్తివేయగలిగిందే కానీ, విద్యార్థులపైన పెట్టిన కేసులను ఎత్తివేయించే విషయంలో విఫలమైంది. సమైక్య రాష్ట్రమే ఉండాలని సీమాంధ్ర నేతలు చేపట్టిన ఉద్యమాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనలేక పోయింది. శ్రీకృష్ణ కమిటీ నియామకం తరువాత ఈ కమిటీ వెలువరించే నివేదిక కోసం ఎదురుచుస్తూ తన ఉద్యమ ఉధృతిని తగ్గించుకొన్నది. తెలంగాణ సాధనకొరకు రాజీనామా చేసిన 12 మంది ఎం.ఎల్.ఎ.లు తిరిగి ఎన్నిక కావడంతో ప్రత్యేక తెలంగాణ కావాలని తెలంగాణ ప్రజలు ప్రకటించిన బలమైన ఆకాంక్ష నిరూపించబడినదే కానీ టి.ఆర్.ఎస్. పార్టీ సాధించిన ప్రత్యేకత ఏమీలేదు. ఉద్యమ ఉధృతిని తగ్గించుకున్న టి.ఆర్.ఎస్. పార్టీ తన ఉనికిని నిలబెట్టుకునే ప్రయత్నంలో నాయకులతో అప్పుడప్పుడు వేదికల మీద పొంతన లేని ప్రకటనలు చేయిస్తున్నది.

టి.ఆర్.ఎస్. పార్టీ ప్రత్యేక తెలంగాణ సాధన కొరకు చేసిన ఉద్యమాల ప్రయత్నంలో చవిచూసిన వైఫల్యాలను జీర్ణించుకోలేని తెలంగాణ ప్రజలు ప్రత్యేక తెలంగాణ సాధించుకోవాలనే బలమైన ఆకాంక్షతో మరో మార్గాన్ని ఎంచుకోవడం సహజం. ఈ క్రమంలో ఎక్కడ టి.ఆర్.ఎస్. పార్టీ తన ఉద్యమాన్ని ఆపివేసి శ్రీకృష్ణ కమిటీ వెలువరించే నివేదిక పైన ఆధారపడినదో, అక్కడే తెలంగాణ సాధన కొరకు ఉద్యమాలే తన ఏకైక మార్గమనీ, పార్లమెంట్‌లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని బిల్లు పెట్టించడం తన మొదటి డిమాండ్ అని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రకటించింది. బలంగా ప్రత్యేక తెలంగాణను కోరుకునే తెలంగాణ ప్రజలు. టి.పి.ఎఫ్. వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

మన దేశంలో ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పొలిటికల్ పార్టీలు రెండు లేక మూడు ఫ్రంట్‌లుగా ఏర్పడడం ఆనవాయితీ అయి ఉంది. ఇదే క్రమంలో ప్రత్యేక తెలంగాణ సాధన ఏకైక లక్ష్యంగా కొన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కవుల కళాకారుల సంఘాలు ఒక కూటమిగా ఏర్పడి తెలంగాణ ప్రజాఫ్రంట్‌ను ఏర్పరిచారు.

ఎన్నికల వైఖరిని ఇప్పుడే నిర్ణయించాలనీ, ఈ ఫ్రంట్ ఉద్యమం సాయుధ పోరాటమా? తేల్చాలని ఒక వర్గం విభేదించిన కారణంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ రెండుగా చీలిపోయిందని కొన్ని వార్తా పత్రికలు కథనాలను ప్రచురించినాయి. వార్తా పత్రికల కథనాల నేపథ్యంలో ఆలోచిస్తే తెలంగాణ ప్రజా ఫ్రంట్ పొలిటికల్ పార్టీ కాదు. ఉద్యమాల క్రమంలో భవిష్యత్తులో ఎన్నికల అవసరం వచ్చినప్పుడు ఎన్నికల విషయంలో కూడా తగు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికలు కావాలనుకునేవారు ఏ ఎన్నికలలోనైన స్వతంత్ర అభ్యర్థులుగా పాల్గొనవచ్చును. ప్రజా పోరాటాలు సాయుధ పోరాటాలు కానేరవు. ప్రజలు దగ్గర ఆయుధాలు ఉండవు. ఉద్యమించిన ప్రజలను అణచివేసే క్రమంలో రాజ్య యంత్రాంగం ఆయుధాలను ఉపయోగించి ఉద్యమించిన ప్రజల ప్రాణాలను సైతం ప్రమాదంలో పడవేసిన పరిస్థితులలో చేతికి దొరికిన రాళ్లతో, కర్రలతో ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటారే తప్ప సాయుధ పోరాటాలు చేయరు. కాబట్టి సందర్భానుసారంగా ఉద్యమకారులు ఉద్యమాల విధి విధానాలను మార్చుకుంటారు. ఈ మధ్య కాలంలో జరిగిన సోంపేట ఉద్యమాన్ని ఒక చక్కటి ఉదాహరణగా తీసుకోవచ్చు. వార్తా పత్రికల కథనాలానుసారం విభేదిస్తున్న సంఘాలు కూడా గత మూడు దశాబ్దాలుగా ప్రజల కోసం పని చేస్తున్నవారే. రాజకీయ అవగాహన, అనుభవం ఉన్నవారే. పీడిత ప్రజల కోసం, ప్రాణ త్యాగాలకు సంసిద్ధులైన వారు పంతాలనూ, పట్టింపులనూ త్యాగం చేయడానికి వెనుకాడరని ఆశిద్దాం. అయినా, ఈ చీలికను సృష్టించిన వారెవరో తెలుసుకోవలసిన అవసరమున్నది.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఇంకా శైశవ దశలో ఉంది. తెలంగాణ ప్రజల మీద దీని ప్రభావం ఎంత శాతమున్నదో ఇంకా నిర్ధారణ కాలేదు.

ఏది ఏమైన కానీయండి, 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప' అనే సందేశాన్ని గుర్తు చేసుకుంటూ ప్రత్యేక తెలంగాణ కొరకు తెలంగాణ ప్రజా ఫ్రంట్ తలపెట్టిన మరో ప్రయత్నంలో నిర్వహించే ఉద్యమాల తీరుతెన్నులను, అవి తెచ్చే ఫలితాలను వేచి చూద్దాం.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

తెలంగాణ విధ్వంసానికి ఎన్.టి.ఆర్ పాలనలోని మూలాలను విశ్లేషిస్తూ, వాక్ సభా విశ్వాస స్వాతంత్ర్యాలతో సహా అన్ని మౌలిక హక్కులు కాలరాయబడిన తెలంగాణను ఆవిష్కరిస్తున్నారు **వరవరరావు**

ఎన్.టి.ఆర్. పాలన - ప్రజా ద్రోహ చరిత్ర

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన గత 54 సంవత్సరాల్లో తెలంగాణకు జరిగిన విద్రోహం గురించి రాయాలంటే చాల పెద్ద చరిత్ర అవుతుంది. గానీ తెలంగాణలో కూడా ప్రజాభిప్రాయంలోను, ప్రజాస్వామ్యవాదుల, మేధావుల అభిప్రాయంలోను ఎన్.టి.ఆర్. తొలి, మలి పాలనల పట్ల ఒక ఆరాధనాభావం, అనుకూల భావం ఉంది గనుక, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు వల్ల, వైస్రాయ్ హోటల్ కుట్ర వల్ల ఆయన పదవీచ్యుతుడయ్యాక ఆయన పట్ల అభిమానం పెరిగింది గనుక ఎన్.టి.ఆర్. పాలన కాలంలో తెలంగాణకు జరిగిన విద్రోహం గురించి విశ్లేషణ చేయడం చారిత్రక అవసరమనుకుంటాను. ఎన్.టి.ఆర్. కన్న అన్ని విధాలా చంద్రబాబు దుర్మార్గుడు అనడంలో గానీ, ఆయన తనకు తానుగా ప్రపంచబ్యాంక్ సి.ఇ.ఒ.గా ప్రకటించుకున్నాడు గనుక ఆయన పాలన ఎన్.టి.ఆర్. పాలనకన్నా ఎన్నో రెట్లు దుర్మార్గమైనదనడంలో గానీ రెండో అభిప్రాయం లేదు, ఉండనక్కర్లేదు. ఎన్.టి.ఆర్. పాలన కూడ ఆరంభంలో రాడికల్స్ మొదలు ఆర్.ఎస్.ఎస్. వరకు, రాజకీయ పార్టీలుగా సిపిఐ, సిపిఎం మొదలు బిజెపి వరకు మద్దతు పొందింది గనుక, (గవర్నర్ తొలగించిన కాలంలో మరీ ముఖ్యంగా) ఈ కాలమంతా కూడ టి.డి.పి. కార్యదర్శిగాను, సంస్థా నిర్మాణంలోను చంద్రబాబు మీదనే ఆధారపడ్డారు గనుక – వీటికి అతీతంగా ఒక అవతార పురుషుడుగా ప్రజల్లో, భావావేశపూరిత కళాకారుడుగా మేధావుల్లో ఆయన పొందిన ఆదరణ వల్ల ఆయన కాలపు పాలనలో తెలంగాణకు జరిగిన మేలు కీడులను కొంచెం జాగ్రత్తగా పరిశీలించాలి.

చంద్రబాబు వెన్నుపోటు, వైస్రాయ్ హోటల్ కుట్ర, తదనంతర పరిణామాల్లో ఆయన మరణం వల్ల ఆయన దేశానికి ప్రధానియో, అధ్యక్షుడో అయ్యే అవకాశం కూడా జారిపోయింది గనుక ఆయన పట్ల సానుభూతి, అభిమానం పెరిగాయి. చివరకు కాంగ్రెస్ పార్టీ కూడ ప్రతిపక్ష నాయకుడుగా చంద్రబాబును ఎదుర్కోవడానికి ఎన్.టి.ఆర్.ను ఆకాశానికి ఎత్తడం ప్రారంభించింది. ఎన్నికల పార్టీల రాజకీయాల్లో వై.ఎస్.ఆర్.ను వ్యతిరేకించే వాళ్లకూ ఎన్.టి.ఆర్. ఆదర్శం కావడం ఆశ్చర్యం కూడ కాదు.

ఎన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే 'నక్సలైట్లకు జోహార్లు' చెప్తూ తెలంగాణలో నక్సలైటు సానుభూతిపరుల అభిమానం చూరగొన్నాడు. నక్సలైట్లు దేశభక్తులన్నాడు. వాళ్లు తనతో చేతులు కలిపితే ఎర్రకోటపై జెండా ఎగరేస్తానన్నాడు. అప్పటికి జగిత్యాల జైత్రయాత్ర ప్రారంభమై ఐదేళ్లే అయింది. 'కల్లోలిత ప్రాంతాల' ప్రకటన, ఎన్‌కౌంటర్లు, పోలీసు క్యాంపులు, నిర్బంధం ఉన్నప్పటికీ పీపుల్స్‌వార్ ఉద్యమం, ఆదిలాబాద్ కరీంనగర్ రైతాంగ పోరాటం తెలంగాణ అంతటా విస్తరించి బలంగా ఉన్న కాలమది. నిర్బంధం తట్టుకోలేక బయటికి వచ్చిన యువకులు చాలామంది గ్రామాల్లో సాధారణ జీవితం గడపడానికి టి.డి.పి. లో చేరారు. లేదా మద్దతు ప్రకటించారు. తెలంగాణలో దొరల భూస్వామ్యాన్ని ప్రతిఘటించి పోరాడి అజ్ఞాత జీవితం గడపలేని వాళ్లు, పోలీసు నిర్బంధాలు, కేసులు తట్టుకోలేని వాళ్లు, బడుగువర్గాలు, ముఖ్యంగా బి.సి. కులాల వాళ్లు – టి.డి.పి. వైపు మొగ్గు చూపారు.

1978–83 మధ్యన రాడికల్స్ గ్రామాలకు తరలండి ప్రచారంతో, భూస్వాముల సాంఘిక బహిష్కరణతో మారిన గ్రామీణ భూసంబంధాలు 1983లో టి.డి.పి. ఎన్నికలకు ఎంతో కలిసొచ్చాయి.

అందుకు ఎన్.టి.ఆర్. నక్సలైటు అనుకూల నినాదాలు, ఎన్నికల ప్రచారం పనికొచ్చాయి.

వీటితోపాటు అప్పటికి ముప్పై ఏళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగి ఉన్న ప్రజలకు, ఆయన 'ఆత్మగౌరవ' నినాదం ఒక 'తారకమంత్ర'మైంది. ఆశ్చర్యమేమంటే ఆంధ్ర వలస దోపిడీ పాలనకు వ్యతిరేకంగా 1969, 72లలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న రాజకీయ నాయకులు ఈ 'ఆత్మగౌరవ' నినాదానికి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరారు. హనుమకొండలో సత్యనారాయణ (ముచ్చర్ల), నాగర్‌కర్నూల్‌లో మహేంద్రనాథ్‌లు అటువంటి ఉదాహరణే.

రాడికల్ నేపథ్యం నుంచి ప్రణయభాస్కర్, సిపిఎం నేపథ్యం నుంచి కడియం శ్రీహరి దొరల అణచివేత నుంచి ఆత్మగౌరవ నినాదంతో ఆకర్షితులయి టి.డి.పి.లోకి వచ్చిన వాళ్లే. ఇటువంటి ఉదాహరణలు తెలంగాణ నుంచి ఎన్నైనా ఇవ్వవచ్చు. రాడికల్ ఉద్యమం వల్ల ఐదు సంవత్సరాలలో గుణాత్మకంగా మారిన గ్రామీణ భూసంబంధాలు టి.డి.పి.కి ఎన్నికల పంట అయినవి. టి.డి.పి. కి ఎంతో కొంత బి.సి. వర్గాల్లో బలం ఈ నేపథ్యం నుంచే కొనసాగుతున్నది.

ఈ ఫలితాన్ని దృఢం చేసుకోవడానికే ఎన్.టి.ఆర్. గ్రామాల్లో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసాడు. కాని ఆ స్థానంలో ఈనాటికీ ఒక ప్రజాస్వామికమైన ప్రత్యామ్నాయం ఏర్పడక గ్రామాలు అరాచక, లుంపెన్ శక్తుల ఆగడాలకు గురవుతున్నాయి. ఈ శక్తులకు పాలకవర్గాల అండ మెండుగా లభిస్తున్నది.

1983 నుంచి 89 వరకు కొద్దిరోజుల నాదెండ్ల భాస్కరరావు పాలన మినహాయింపుతో (అందువల్ల ఎన్.టి.ఆర్. ప్రభుత్వ పునాది బలపడింది. ప్రజాస్వామ్య శక్తుల్లో ప్రతిష్ట ఏర్పడింది.) అన్ని ప్రతిపక్ష పార్టీల మద్దతు నిర్విచక్షగానే పొందాడు. విప్లవ పార్టీల్లో కూడ పీపుల్స్‌వార్ మినహా ఒకటి రెండు పార్టీల ప్రత్యక్ష, పరోక్ష సహకారమూ పొందాడు.

1/70 చట్టం రద్దు కొరకు ప్రయత్నం

టి.డి.పి.లోనూ, ఆ ఒకటి రెండు విప్లవ పార్టీల్లోనూ, సి.పి.ఐ., సి.పి.ఎం.లోనూ ఉన్న సెటిలర్స్ కోసమే, వాళ్లాయనకు ఓటు బ్యాంక్‌గా ఉన్నారు గనుకనే ఎన్.టి.ఆర్. 1989లో 1/70 చట్టాన్ని రద్దు చేయడానికి ప్రయత్నించాడు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు మొదలుకొని ఖమ్మం జిల్లా వరకు, ఇటు నల్లగొండలో మిర్యాలగూడ, కోదాడ మొదలుకొని పాలమూరు జిల్లాలో నడిగడ్డ వరకు భూములు సాధించుకొని, వ్యవసాయం చేస్తూ ఎన్.టి.ఆర్. కాలానికి రాజకీయంగా కూడా అధికారానికి వచ్చిన ఆంధ్రా సెటిలర్స్ తమ తమ రాజకీయ పార్టీలు ఏవైనా ఎప్పుడూ ఎన్.టి.ఆర్.కు అండగా ఉన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని రద్దు చేసి ఈ ఆదివాసేతర భూకామందులకు, వడ్డీ వ్యాపారులకు, ఎరువుల, పురుగు మందుల, విత్తనాల వ్యాపారులకు వాళ్ల దురాక్రమణ చేసిన భూములను కట్టబెట్టాలని ఎన్.టి.ఆర్. తీవ్రంగానే ప్రయత్నించాడు. ఆదివాసుల ప్రతిఘటన, ప్రజాస్వామ్య వాదుల తోడు, అంత నిర్బంధంలోనూ విప్లవ శక్తుల ప్రతిఘటన వల్ల అది ఆగిపోయింది. చరిత్రలో ఎన్నటికీ మాయని మచ్చగా మిగిలిపోయే చింతపల్లి అడవులలో కోయల ఆరువందల గుడిసెల దహనకాండ ఎన్.టి.ఆర్. పాలనలోనే జరిగింది. వాళ్లు పీపుల్స్‌వార్ సానుభూతి పరులుగా ఉండి ఆశ్రయమిస్తున్నారనే కక్షతో.

ఇండియన్ పీపుల్స్ ట్రిబ్యునల్ రిటైర్డ్ న్యాయమూర్తులతో నిర్వహించ తలపెట్టిన ప్రజా విచారణను కూడా పోలీసులు భగ్నం చేసారు. డాక్టర్ రామనాథం హత్యను, చింతపల్లి గృహదహనాలను 'అంకురం' సినిమా సృజనాత్మకంగా ఎల్లకాలం కోసం రికార్డు చేసింది.

మిగతా పౌర, ప్రజాస్వామిక హక్కుల పోరాటం గురించే కాకుండా కారంచేడు, చింతపల్లి సంఘటనలపై కూడ అవిశ్రాంతంగా పోరాడి నందుకు ఎ.పి.సి.ఎల్.సి. ప్రధాన కార్యదర్శి డా. కె. బాలగోపాల్‌ను ఎన్.టి.ఆర్. పాలనలోనే గ్రేహౌండ్స్ కిడ్నాప్ చేశారు.

హైదరాబాద్ నగరంలో భూదురాక్రమణలు కూడ స్వయంగా ఎన్.టి.ఆర్. తన కొరకు అబిడ్స్ వంటి కేంద్ర స్థానంలో ప్రారంభించి గండిపేట, నాచారంలో వందలాది ఎకరాలు ఆక్రమించడంతో ఊపందుకున్నాయి.

ఎక్సైజ్ విధానం

రెండవసారి అధికారానికి వచ్చినపుడు (1994) రెండు రూపాయల కిలో బియ్యం, సబ్సిడీలు, పీపుల్స్‌వార్‌పై నిషేధం ఎత్తివేత, సారా నిషేధం వంటి ప్రజాకర్షక విధానాల వల్ల ఎన్.టి.ఆర్. 'దేవుడ'య్యాడు. కానీ 1983లో తొలిసారి ముఖ్యమంత్రి అయినపుడు ఆయన అనుసరించిన మద్యపాన ప్రోత్సాహ విధానం గుర్తు చేసుకుంటే తల దిమ్మ తిరిగిపోతుంది. అధికారంలోకి రాగానే ఆయన 1983లో టి.డి.పి.కి గ్రామాల్లో నిర్మాణ పటిష్టత ఎట్లా అని ఆలోచించాడు. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం అప్పటికి గ్రామీణ నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి నెలకు నూట యాభై రూపాయలు ఇవ్వడం ద్వారా గ్రామ గ్రామాన యువసేనను తయారు చేసుకున్నది.

ఎన్.టి.ఆర్. ఒక ఆకు ఎక్కువ చదివినట్లుగా ప్రభుత్వ ఖజానా నుంచి కూడ ఇవ్వనక్కర్లేకుండా గ్రామీణ నిరుద్యోగ లుంపెన్ యువకులకు గ్రామగ్రామాన ప్ర.సా.దు.(ప్రభుత్వ సారా దుకాణం) తెరచి ఇచ్చాడు. ప్రభుత్వ సారా దుకాణం అంటే ప్రభుత్వం, పోలీసుల అండతో, గూండాల బలంతో గ్రామాల్లో ఒక రాజకీయ శక్తికి కేంద్రమన్నమాట. ఇది తెలంగాణలో టి.డి.పి.కి ఒక బలమైన గ్రామీణ నిర్మాణమైంది.

దీంతో చెన్నారెడ్డి ప్రభుత్వకాలంలో ఉన్న ఎక్సైజ్ ఆదాయం 180 కోట్ల రూపాయల నుంచి ఎన్.టి.ఆర్. కాలానికి 800 కోట్ల రూపాయలకు పెరిగింది.

ఇంక 1985 నుంచి 89 వరకు ఈ ప్రభుత్వ సారా విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ రాడికల్స్, గోదావరిఖనిలో, గోదావరి లోయలో సింగరేణి కార్మిక సమాఖ్య, ముఖ్యంగా స్త్రీలు చేసిన చరిత్రాత్మక పోరాటాలు ఎన్.టి.ఆర్. 1995లో సారా నిషేధం అమలు చేయడం వల్ల ఉద్దేశ పూర్వకంగానే విస్మృతిలోకి నెట్టబడ్డాయి.

1989లో రాడికల్స్ సారా వ్యతిరేక పోరాటాన్ని ఎదుర్కోవడానికి అమలు చేసిన నిర్బంధం చాలక ఎన్.టి.ఆర్. నిజామాబాద్ జిల్లాలో పాలక్యాన్లలో, వరంగల్ జిల్లాలో హనుమకొండ, రఘునాథపల్లి పోలీసు స్టేషన్లలో సారా ప్యాకెట్లు అమ్మిన ఉదంతం జ్ఞాపకం చేస్తే చాలనుకుంటాను. వరంగల్‌లో హరిభూషణ్ నాయకత్వంలో జరిగిన సారా వ్యతిరేక పోరాటాన్ని టి.డి.పి. పార్టీ నాయకుడు, సారా కాంట్రాక్టర్ రవీంద్రనాథ్ చౌదరి, ఖమ్మం నుంచి సి.పి.ఐ., సి.పి.ఎం. నాయకులు, సారా కాంట్రాక్టర్లు కూడా అయిన వారి అండతో దాడులు చేసి, కాపు సారా కాచుకునే లంబాడాలను, బడుగువర్గాల వాళ్లను చంపేసిన ఉదంతాలు, ఈ శక్తుల ప్రోద్బలంతోనే గోదావరిఖనిలో పీపుల్స్‌వార్ నర్సయ్యను, వరంగల్‌లో హరిభూషణ్‌ను ఎన్‌కౌంటర్ చేసిన దారుణాలు ఉదాహరణలు మాత్రమే.

విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ

ఎన్.టి.ఆర్. తొలి పాలనలో ఎక్సైజ్ పాలసీ, సారా వ్యాప్తి తర్వాత తెలంగాణకు జరిగిన విద్రోహానికి కొట్టొచ్చినట్లు కనిపించే దాఖలాలు విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ.

ఎన్.టి.ఆర్. సినిమాల్లో ఉండగానే జాతీయకరణ, కుటుంబ నియంత్రణ, సహకార రంగం వంటి వాటికి వ్యతిరేకంగా సినిమాలు నిర్మించాడు. ఇవన్నీ ఇందిరా కాంగ్రెస్ విధానాలనుకున్నాడాయన.

ఉన్నత విద్యారంగాన్ని ప్రైవేటీకరించడానికి ఆయన అప్పటికే 14 ఏళ్లుగా అమెరికాలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న రామకృష్ణారావును పిలిపించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్‌గా చేసి ఉన్నత విద్యలో సంస్కరణల కోసం ఆయన అధ్యక్షతన ఒక కమిటీ వేసాడు. ఆ కమిటీ సెకండరీ విద్య తర్వాత కళాశాల, విశ్వవిద్యాలయ విద్యా బాధ్యత ప్రభుత్వం చేపట్టనక్కర్లేదని స్పష్టంగా సిఫార్సు చేసింది. 1985 నుంచే విద్యా రంగం ఎంత వేగవంతంగా ప్రైవేటీకరణకు గురవుతున్నదంటే, ఇవాళ కేవలం రెండు కార్పొరేట్ విద్యాసంస్థలు (రెండూ కోస్తా ఆంధ్రప్రాంత సంపన్న వర్గాల, కులాలవేనని వేరే

చెప్పాలా?) మొత్తం మన విద్యారంగాన్ని శాసిస్తున్నాయి. కార్పొరేట్ రంగంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు రాబోతున్నాయి.

అట్లే కాకర్ల సుబ్బారావును నిమ్స్ డైరెక్టర్‌గా చేయడం మాత్రమే కాకుండా వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ రంగానికి అప్పగించే పథకాలు రచించే బాధ్యత కూడా అప్పగించాడు. ఇవాళ కార్పొరేట్ వైద్యరంగం 'ఆరోగ్య శ్రీ' వంటి ఆకర్షణీయ అనారోగ్య అవాంఛనీయ పథకాల స్థాయికి చేరి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న దుస్థితికి ప్రారంభమక్కడే అయింది. ఇవాళ తెలంగాణ జిల్లాలతో సహా వచ్చిన నక్షత్రాల ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు లక్షల, కోట్ల రూపాయలతో ఆస్తులు, ప్రభుత్వ వనర్ల ఆధారంగా దండుకుంటున్నాయి. మరొకవైపు పేదలు, ఆదివాసులు మలేరియా, అతిసార, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులతో వేలాదిగా చనిపోతున్నారు. బహుశా ఇంత గొప్ప కార్పొరేట్ సేవలకు గుర్తింపుగానేమో వైద్య విధాన పరిషత్తు, ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్.టి.ఆర్. పేరు పెట్టి విజయవాడను కేంద్రంగా చేసింది.

ఎన్.టి.ఆర్. 1985-89 మధ్య ఆరంభించిన ఈ విద్యా, వైద్య రంగాల కార్పొరేటీకరణ ఒకసారి నైజాం కాలపు విద్యా, వైద్య రంగాలతో పోల్చండి.

ఆ ఫ్యూడల్ నిరంకుశ రాజరిక పాలనలో విద్య, వైద్యం పబ్లిక్ రంగంలో ఉన్నాయి. ఉన్న ఆసుపత్రులన్నీ ప్రభుత్వ ఆసుపత్రులే. హైదరాబాద్, వరంగల్‌లలో ప్రసూతి ఆసుపత్రులు, క్యాన్సర్, ఆర్థోపెడిక్, శిశు వైద్యశాలలు కూడా ప్రభుత్వ రంగంలోనే పరిమితంగానే కావచ్చు, కానీ వైద్యమంతా ప్రజారంగంలోనే.

అట్లే విద్య - ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దేశంలోనే మొదటిసారిగా ఒక ప్రాంతీయ భాష (ఉర్దూ)లో విశ్వవిద్యాలయ స్థాయి (పి.జి., పరిశోధన, మెడిసిన్, ఇంజనీరింగ్, లా - అన్నీ) వరకు విద్యాబోధన. ఆరోగ్య శాఖను పబ్లిక్ హెల్త్ అన్నట్టుగా, విద్యా శాఖను పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ అనేవాళ్లు. చదువంతా ప్రభుత్వ బాధ్యతే. తెలుగు, కన్నడం, మరాఠీ మాధ్యమాలు కాకపోవడం విషాదమే కావచ్చు, కానీ - స్వతంత్ర భారతంలో ఆంధ్రప్రదేశ్ వంటి భాషా రాష్ట్రంలో ఇంగ్లిష్ మాధ్యమం కావడం కన్న అన్యాయం కాదు కదా.

దళితులపై దాడులు

ఆదివాసుల భూముల పట్ల ఎన్.టి.ఆర్. విధానమేమిటో చూసాం. దళితుల పట్ల ఎన్.టి.ఆర్. నాయకత్వంలో టి.డి.పి. అనుసరించిన వైఖరి ఏమిటి?

1983 ఎన్నికల ప్రచారంలోనే చిత్తూరు జిల్లాలో పాదిరి కుప్పంలో దళితుల ఇళ్లు, పంటలు, పశువులు తగులబెట్టడంతోనే టి.డి.పి. పాలన ప్రారంభమైంది. 17 జూలై 1985 నాటికి ఎన్.టి.ఆర్. మరింత ప్రజాస్వామ్య ప్రతిష్టతో స్థిరపడినందున ఆయన వియ్యంకుడు దగ్గుబాటి చెంచురామయ్య నాయకత్వంలో కారంచేడు కమ్మ భూస్వాములు దళితులపై హత్యాకాండ నిర్వహించగలిగారు. తెలుగువాళ్ల ఆత్మగౌరవ నినాదంతో ప్రారంభమైన ఎన్.టి.ఆర్. పాలన 17 జూలై 1985 కారంచేడుతో దళితుల ఆత్మగౌరవ పోరాటం ముందు నిజరూపాన్ని బయటపెట్టుకున్నది.

1983 జనవరిలో బెజవాడలో జరిగిన విరసం సాహిత్య పాఠశాల బహిరంగ సభలో బాలగోపాల్, 'ఎన్.టి.ఆర్. చెప్తున్న తెలుగు ప్రజల ఆత్మగౌరవం ఏ తెలుగు ప్రజలది' అని ప్రశ్నించాడు. ఆ బహిరంగ సభ బెజవాడ కృష్ణలాకుల దగ్గర పూరిగుడిసెల మధ్యన చిత్తడిలో చీకట్లో జరిగింది.

ఇంక వరుసగా మంగళగిరి దగ్గర నీరుకొండ, ఇట్లా దళితులపై అగ్రవర్ణాల దాడుల పరంపర.

ఇవ్వాళ అదే కోస్తా జిల్లాల నుంచి దళిత బహుజనులు కెరటాలుగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో మమేకమవుతున్నారు. కవులు, కళాకారులు, బుద్ధిజీవులు దళిత, బహుజన స్వరాలై ప్రత్యేక తెలంగాణకు స్వాగతం చెప్తున్నారు. తెలంగాణేతర ప్రాంతాల్లో కూడ దోపిడీ చేస్తున్నవాళ్లు, దోపిడీకి గురవుతున్న వాళ్లు కేవలం భాషా ప్రాతిపదికన ఒకే జాతి అనుకోలేం అంటున్నారు.

భాషా, సాహిత్య, సాంస్కృతిక వివక్ష

ఎన్.టి.ఆర్.ను గొప్ప తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక, కళాపోషకునిగా భావించేవాళ్లు సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాల్లో కూడా చాలామంది ఉన్నారు. కాని వాళ్లందరూ ఆయన జననాట్య మండలి, విరసం వంటి సంస్థలను ఉద్దేశించే 'ఆట, మాట, పాట బంద్' అమలు చేసాడని గుర్తు చేసుకోవడానికి ఇబ్బంది పడతారు. ఎన్.టి.ఆర్. తొలి పరిపాలన కాలమంతా గద్దర్‌తో సహా జననాట్య మండలి కళాకారులు అజ్ఞాతంలో (1985-89) గడపాల్సి వచ్చింది.

ఎన్.టి.ఆర్. చాల కృత్రిమమైన సంస్కృత పదబంధాలతో ప్రభుత్వ సంస్థలకు, కార్యకలాపాలకు పేర్లు పెట్టి అవి తెలుగు భాషకు చేసిన సేవ అనుకునేవాడు.

ఆయన ట్యాంక్‌బండ్ మీద పెట్టించిన విగ్రహాలలో శాతవాహనుడు మొదలు కృష్ణదేవరాయల వరకు ఆయన పోలికలుండి తానొక చక్రవర్తినని, కళాసాహిత్య పోషకుణ్ణని అనుకోవడం ఒక అంశం అయితే సురవరం ప్రతాపరెడ్డి, మగ్దూం తప్ప ఆ విగ్రహాల్లో తెలంగాణ సాహిత్యవేత్తలెవరూ లేకపోవడం మరొక చేదు నిజం.

తానుగా అవతారమని, రాజాంశకలవాడని భావించే ఎన్.టి.ఆర్. దాశరథి కృష్ణమాచార్య ఆస్థాన పదవిని రద్దు చేస్తే, పి.ఎ. చౌదరి వంటి ప్రగతిశీల న్యాయమూర్తికి అది 'ఫ్యూడల్ ఆచరణను రద్దు చేసిన ప్రజాస్వామిక చర్య' అనిపించింది.

నార్ల వెంకటేశ్వరరావు సూచనతో ఒక్క కలంపోటుతో సాహిత్య, సంగీత, నాటక అకాడమీలు రద్దుచేసి అన్నింటినీ తెలుగు విశ్వ విద్యాలయంలో కలిపాడు. ఆ తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయా తెలుగు సమాజ, భాషా, సాహిత్యాలకు ప్రాతఃస్మరణీయులయిన కందుకూరి, గిడుగు, గురజాడల పేర్లు గానీ, ఆంధ్రోద్యమ వైతాళికులయిన ఆదిరాజు వీరభద్రరావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిల పేర్లలో గానీ ఒక్కటయినా పెట్టాలనిపించలేదు.

మద్రాస్ ప్రావిన్స్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోవాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి మరణించిన పొట్టి శ్రీరాములు పేరు ఎన్నుకొని కోస్తా పక్షపాతం చూపాడు.

ఈ ప్రారంభం ఇవ్వాళ ఎక్కడికి చేరిందంటే తెలుగు విశ్వవిద్యాలయంతో కలిసిపోయిన అకాడమీలు, అందులో నుంచి కూడా

తొలగించబడి ప్రభుత్వ శాఖల్లో ఒకటిగా ఏర్పడిన సాంస్కృతిక శాఖలో చేరిపోయాయి. ప్రాచీన భాషగా తెలుగుకు కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఇంక సాంస్కృతిక శాఖయే ఖర్చు చేయాల్సి ఉంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం ఇక ముందు కన్నడ, తమిళ విశ్వవిద్యాలయాల వలె తెలుగు భాషా, సాహిత్య, కళా సంస్కృతుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా కేవలం డిగ్రీలు ఇచ్చే విశ్వవిద్యాలయంగా మాత్రమే మిగులుతుంది.

నిర్బంధం - రాజ్యహింస

పైన చెప్పిన విధానాలన్నీ ఒకరకంగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన రాజీవ్‌గాంధీ 21వ శతాబ్దంలోకి దేశాన్ని తీసుకపోవడానికి అనుసరించిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటి పెట్టుబడిదారీ విధానాల ఆచరణలో భాగమే. పైకి కాంగ్రెస్ వ్యతిరేకత కనిపించవచ్చు గానీ, కాశ్మీర్, పంజాబ్ ప్రజా పోరాటాలను అణచడానికి రాజీవ్‌గాంధీ టాడా చట్టాన్ని దేశంలో ప్రవేశపెట్టిన మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఎన్.టి.ఆర్.దే. పదమూడు వేల మందిని (కాశ్మీర్, పంజాబ్‌లలో కన్న ఎక్కువగా) టాడా కింద అరెస్టు చేసారు. వాళ్లలో జర్నలిస్టులున్నారు, పౌరహక్కుల నాయకులున్నారు, రచయితలున్నారు. వ్యవసాయ కూలీలు, కార్మికులు, విప్లవకారుల సంగతి సరేసరి.

1985 నుంచి 1989 'ఆట-మాట-పాట' తెలంగాణలో 'బంద్' అయిన సందర్భం ఎన్నోసార్లు ప్రస్తావించాను. ఆ కాలమంతా జననాట్య మండలి అజ్ఞాతంలో గడపాల్సి వచ్చింది. 1983లో ప్రారంభమైన తెలంగాణలో వాక్సభాస్వాతంత్ర్య నిషేధం - జిల్లాలలో కొద్ది విరామాలతో (1990లో కొన్ని నెలలు, 2004లో కొన్ని నెలలు) ఈనాటికీ కొనసాగుతున్నది. అది ఎన్.టి.ఆర్. భిక్షనే.

1983-85 రెండేళ్లు వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయంలో, పన్నెండు కళాశాలల్లో 144 సెక్షన్ అమలయింది. ప్రభుత్వ, పోలీసుల అండతో ఎ.బి.వి.పి. విద్యార్థులు రాడికల్స్‌పై పిస్టల్స్‌తో, కత్తులతో దాడులు చేసారు. ఉన్నత పోలీసు అధికారి ఎచ్.జె. దొర, ఎ.బి.వి.పి. విద్యార్థులు తమ కళ్లు, చెవులు అన్నాడు. ఎన్.టి.ఆర్. కాషాయ వేషధారణ ఆయన కాలంలోని పోలీసు అధికారులు కొందరు విశ్వహిందూ పరిషత్‌ను, ఆర్.ఎస్.ఎస్.ను, ఎ.బి.వి.పి.ని బహిరంగంగా బలపరచడానికి, పుట్టపర్తి సాయిబాబాకు అధికారికంగా సేవలు చేయడానికి అవకాశాన్నిచ్చినవి.

ఎన్‌కౌంటర్లు సరే సరి. లాటిన్ అమెరికా వంటి మిస్సింగ్ కేసులు 1985-89 మధ్యనే విస్తృతమైనవి. 1990లో జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి అటువంటి 75 కేసులు విచారించి ఏడుగురు పోలీసు అధికారులు (వారిలో కె.ఎస్. వ్యాస్, యాదగిరి రెడ్డి కూడా ఉన్నారు) దోషులని నిర్ధారించాడు.

పౌరహక్కుల సంఘం నాయకులను పట్టపగలు బహిరంగంగా చంపిన ఉదంతాలు ఎన్.టి.ఆర్. కాలంలోనే ప్రారంభమైనవి. 1985 జనవరిలో గోపి రాజన్న అనే న్యాయవాదిని, ఎ.పి.సి.ఎల్.సి. నాయకుణ్ని జగిత్యాలలో సంఘపరివార్ శక్తులు చంపాయి. 3 సెప్టెంబర్ 1985న డాక్టర్ రామనాథాన్ని, 7 నవంబర్ 1986న జాపా లక్ష్మారెడ్డిని పోలీసు అధికారులే మఫ్టీలో వచ్చి చంపారు. దాదూ ఫిర్యాదూ లేదు.

అమరవీరుల స్థూపాలు కూల్చడం కూడా ఎన్.టి.ఆర్. పాలనలోనే పోలీసులు ప్రారంభించారు. పైడిపల్లిలో గిరాయిపల్లి మృతవీరుల స్థూపాలు, జన్నుచిన్నాలు స్థూపం, గద్వాలలో కామ్రేడ్ సుదర్శనరెడ్డి మొదలైన అమరుల స్థూపాలు కూలగొట్టిన 1986-89 మధ్యకాలంలో ఇంద్రవెల్లి స్థూపాన్ని డైనమైట్లతో పోలీసులు పేల్చి వేయడం - అంజయ్య ప్రభుత్వ కాలంలో 1981లో ఇంద్రవెల్లి సభ మీద జరిగిన పోలీసు కాల్పులు - ఆదివాసుల మారణకాండను 'బహిరంగ విషాదం' అని వ్యాఖ్యానించి అధికారానికి వచ్చిన ఎన్.టి.ఆర్. పాలనలోనే జరిగింది. ఆయన ఇంద్రవెల్లి హత్యాకాండపై న్యాయవిచారణ జరపకపోగా ఆలంపల్లిలో ఎ.పి.ఎస్.పి. క్యాంప్‌పై పీపుల్స్‌వార్ దళం దాడి చేసినపుడు ఆదిలాబాద్ జిల్లా ఎక్కడ ఉంటుంది అని అడిగాడు. పీపుల్స్‌వార్ ఏం ఆశిస్తున్నది - వాళ్లు ఎక్కడ ఉంటారు - ఎట్లా మాట్లాడాలి అని అడిగాడు. నక్సలైట్లకు జోహార్లు చెప్పి, వాళ్లతో చేతులు కలిపి ఢిల్లీ అధికారాన్ని పొందాలని ఆశించిన నాలుగేళ్ల తర్వాత!

విప్లవోద్యమంపై, ప్రజాసంఘాలపై ఎన్.టి.ఆర్. కాలంలో 1985-89 మధ్యకాలంలో అమలయిన అప్రకటిత నిషేధమే 1991లో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రారంభమై 1992లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి కాలంలో ప్రకటిత నిషేధానికి దారితీసింది. ఎన్.టి.ఆర్. విద్యా వైద్య రంగాల ప్రైవేటీకరణ నేదురుమల్లి ఇంజనీరింగ్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి దారి సుగమం చేసింది. విశాల విద్యార్థి ఉద్యమ ప్రభావం వల్లనే హైకోర్టు కొట్టివేస్తే నేదురుమల్లి ప్రభుత్వ రాజీనామా చేయాల్సి రావడం వేరే కథ.

నక్సలైట్ నాయకుల సరెండర్ విధానాలు, సరెండర్డ్ నక్సలైట్లకు భారీ పారితోషికాలు, వారి సహకారంతో విప్లవకారులపై, ప్రజా సంఘాలపై దాడులు - కె.ఎస్. వ్యాస్ వంటి పోలీసు అధికారుల వ్యూహాలతో ఈ కాలంలోనే ప్రారంభమైనవి.

ఎంతో కుఖ్యాతి పొందిన గ్రేహౌండ్స్ రూపకల్పన, నిర్మాణం కె.ఎస్. వ్యాస్ నాయకత్వంలో ఎన్.టి.ఆర్. కాలంలోనే జరిగింది. ఇపుడదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు (ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే) విప్లవోద్యమాన్ని, ప్రజా ఉద్యమాలను అణచడానికి ఆదర్శ నమూనా అయింది.

1994 ఎన్నికల్లో అధికారానికి రావడానికి ప్రజాకర్షక వాగ్దానాలు చేసి, ఒక ఏడాదిపాటు అమలు చేసినా, అప్పటి ఆర్థిక మంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ద్వారా వైస్రాయ్ హోటల్ కుట్ర చేసి ప్రపంచ బ్యాంక్, దాని దళారులయిన ఆంధ్ర వలసపాలకులు ఎన్.టి.ఆర్. ను పడగొట్టే స్థితి చేజేతులా ఆయనే తెచ్చుకున్నాడు. ప్రపంచబ్యాంక్ ఆర్థిక విధానాలకు దారులు వేసింది ఆయనే. తెలంగాణను అందుకు ప్రయోగశాలగా చేయాలని ఎంచుకున్న కాలానికి ఆయన వేగం చాలలేదు. బహుశా ఆ పరుగు పందెంలో ఆయన వెనుకబడిపోయాడు. అప్పటి దాకా తెరవెనుక ఉన్న కేతిగాడు చంద్రబాబు ఇంక స్వయంగా రంగం మీదికి రాక తప్పలేదు. తెలంగాణను ప్రపంచబ్యాంక్ అభివృద్ధి నమూనాకు ఒక ప్రయోగశాలగా మార్చి శ్మశాన శాంతి నెలకొల్పడానికి చంద్రబాబు శాసనసభలో తెలంగాణ శబ్దాన్నే నిషేధించాడు. ఆ అప్రకటిత నిషేధం ఎన్.టి.ఆర్. పాలనలోనే 1983లోనే మొదలైంది.

(రచయిత విరసం సభ్యులు) వీ

కలిసి ఉన్నా, విడిపోయినా రాష్ట్రంలో అసమ అభివృద్ధికి ఉన్న చారిత్రక, భౌగోళిక, రాజకీయ కారణాలను విశ్లేషించుకొని, సరిచేసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అంటున్నారు **చలసాని శ్రీనివాస్**

యాభై నాలుగేళ్ల ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు

1956 - 2010 తెలుగుజాతి సుదీర్ఘ పయనంలో ఈ 54 ఏళ్ల దూరం తక్కువే కావచ్చు కాని తెలుగువారి భవిష్యత్తుని మలుపుతిప్పిన గమనం. సమగ్రంగా ఈ 54 ఏళ్లను వీక్షిస్తే తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని చాటిచెపుతూనే, జరిగిన అభివృద్ధితో పాటు, పోలికలో అంతరాలను అలాగే విభజనోద్యమాలను, భిన్నాభిప్రాయాలను వెలుగులోకి తీసుకువచ్చిన కాలం. భవిష్యత్తు గురించి ఆలోచనలు సారించాల్సిన సమయం ఇది.

దేశంలో విస్తీర్ణంలో, జానాభాలో 5వ స్థానంలో ఉండే మనం ఈనాడు విస్తీర్ణంలో నాలుగవ స్థానంలోకి చేరుకున్నాం (బీహార్ రాష్ట్ర విభజన వల్ల 4వ స్థానం కోల్పోయింది). దేశంలో ఎక్కువగా మాట్లాడే భాషలలో 50 ఏళ్లుగా రెండవ స్థానంలో ఉండే మన తెలుగు భాషని నిర్లక్ష్యంతో మూడవ స్థానానికి చేర్చాం. వర్షపాతంలో మార్పు పెద్దగా లేకపోయినా ఉష్ణోగ్రతని పెంచుకున్నాం.

1956 నాటి నుంచి రాష్ట్రంలో నేటివరకూ పరిశీలిస్తే పరిశ్రమలు, వ్యాపారాలు, సేవారంగం, విద్యుత్, వ్యవసాయరంగం, విద్య, ప్రభుత్వరంగ సేవలలో ఇతోధిక ప్రగతి సాధించాం అనేది వాస్తవం. అయితే పరిశ్రమలలో గుజరాత్, మహరాష్ట్ర, తమిళనాడు; అభివృద్ధి వ్యవసాయం, విద్య, ప్రభుత్వ సేవలలో కేరళ, పంజాబ్ మొదలగు రాష్ట్రాలకంటే వెనుకబడి ఉన్నా, 1956 నాటికే ఉన్న పరిస్థితులు, భౌగోళిక పరిస్థితి, ఇతర విషయాలు ఒక కారణమనేది మరువకూడదు. అయితే చాలామంది రాజకీయ నాయకులలో చిత్తశుద్ధి కొరవడినా పలువురు నాయకులు, అధికారులు, విజన్ ఉన్న మేధావుల తోడ్పాటు ఈ అభివృద్ధికి ఒక కారణమన్నది విస్మరించకూడదు. 2004/5 - 2008/9 ఎన్.ఎస్.డి.పిని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి రేటు 7.9 శాతం కాగా అది దేశ సరాసరి సూచిక కన్నా (7.2 శాతం) అధికం.

అభివృద్ధి సూచికల ప్రకారం మన రాష్ట్రంలో 47.83 శాతం ఆంధ్రప్రదేశ్ భౌగోళిక ప్రాంతం మాత్రమే (రెవెన్యూ డివిజన్) అభివృద్ధి చెంది ఉంది. మిగతా ప్రాంతం అంతా వెనుకబడి ఉంది. 6 జిల్లాలు మాత్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందగా 8 జిల్లాలు బాగా వెనుకబడిన కేటగిరిలో ఉన్నాయి. గనుల విషయంలో దేశంలో మన రాష్ట్రం 6వ స్థానంలో ఉంది. అయినా దాన్ని మన సమగ్ర అభివృద్ధికి ఉపయోగించుకో లేకపోయాం, పోతున్నాం. వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధికి సరైన ప్రణాళికలు లేవు. దాదాపు 70 శాతం పైగా గ్రామీణ ప్రాంతాలలో ఈనాటికి నివసిస్తున్నారు. మహబూబ్‌నగర్, శ్రీకాకుళం జిల్లాలలో ఇంకా 89 శాతం ప్రజలు గ్రామాలలోనే నివసిస్తుండగా కనీస ప్రాథమిక సౌకర్యాలు లేని గ్రామాలు ఇంకా 35 శాతం వరకు ఉన్నాయి. జనాభా పెరుగుదలలో శ్రీకాకుళం, విజయనగరం, ఉభయగోదావరులు, గుంటూరు జిల్లాలు 10 శాతం కంటే తక్కువ అభివృద్ధిని నమోదు చేసాయి (వలస మొదలగు కారణాలతో). ఎన్ని సాక్షరతా మిషన్‌లు పెట్టినా అక్షరాస్యత విషయంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలోనే అట్టడుగున ఉంది. 1956 - 2010 లలో ప్రాథమిక రంగాన్ని పరిశీలిస్తే అన్ని ప్రాంతాలతో దాని వాటా తగ్గి పరిశ్రమరంగం, సేవారంగం ఆధిపత్యం వహిస్తున్నాయి. ఉత్తరోత్తరగా పరిశ్రమరంగం అభివృద్ధి అత్యవసరంగా కనపడుతుంది. మొత్తం ఆదాయంలో 25 శాతం (2006) వచ్చే ప్రాథమిక రంగంలో అనిమల్ హస్బెండరీ కాంట్రిబ్యూషన్ పెరగడం గమనార్హం. 2010 నాటికి ప్రాథమిక రంగం వాటా 20 శాతం లోపుకు తగ్గుతుందని ఒక అంచనా. మానవ అభివృద్ధి సూచికలలో ప్రాంతాలతో నిమిత్తం లేకుండా జిల్లాకి జిల్లాకి మధ్యన అనేక అంతరాలు ఉన్నాయి. మానవ దారిద్ర్య సూచిక ప్రకారం విజయనగరం, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, అనంతపురం ఆఖరి స్థానంలో ఉన్నాయి. కాని హైదరాబాద్ మహానగరం ప్రాంతం, జనాభా, విస్తీర్ణంతో సంబంధం లేకుండా అన్ని రంగాలలో సింహభాగం వశం చేసుకోవడం మిగతా ప్రాంతాల అభివృద్ధికి ఆటంకంగా కనపడుతుంది.

ప్రైవేటు వ్యవస్థని ప్రోత్సహించాల్సిందే, కాని 1956–2010 నాటి పరిస్థితులను సంగ్రహంగా చూస్తే ఒకనాడు పటిష్టంగా ఉన్న ప్రభుత్వ వ్యవస్థలని బలహీనపరుచుకుంటూ ఈనాడు ప్రైవేటు వ్యవస్థని దాని స్థానంలో పట్టంగట్టడమే ధ్యేయంగా ప్రభుత్వం, నాయకులు ఆలోచిస్తున్నారన్నది బాధగలిగించే విషయం. దాని విషపరిణామాలు త్వరలోనే తెలుసుకుంటాం. కాని అప్పటికే ఆలస్యమైపోవచ్చు. 1956–2010 గణాంకాల విషయమై అనేక వివరాలు ప్రస్తుతం లభ్యమౌతున్నాయి.

దేశంలోనే ఎన్నిటికో మనం ఆద్యులమైనాం. దేశంలో వినూత్నమైన ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది ఆంధ్రప్రదేశే. తెలుగు అభిమాని సి.పి. బ్రౌన్‌చే మధ్యాహ్న భోజన పథకం మొదట ఇండియాలో ప్రవేశపెట్టింది 1821లో తెలుగునేలపైననే . మొట్ట మొదటి ఉపగ్రహాన్ని (రోహిణి)ని దేశంలో నుంచి ప్రయోగించిన శ్రీహరికోట, దేశంలో మొట్టమొదటి కలర్ టెలివిజన్ కంప్యూటర్ ఉత్పత్తి కేంద్రం, మొట్టమొదటి ఓపెన్ విశ్వవిద్యాలయ స్థాపన, పంచాయితీలలో మూడంచెల ఏర్పాటు, మండల వ్యవస్థ, 18 సంవత్సరాలకే ఓటు హక్కు (స్థానిక సంస్థలలో 1981), మహిళలకు ఆస్తిహక్కు – రాజకీయాలలో రిజర్వేషన్, భారతావనికి మొదటి దళిత ముఖ్యమంత్రి, సహకార రంగంలో మొదటి చక్కర కర్మాగారం, స్పాంజ్ ఐరన్ కర్మాగారం, తీరప్రాంతంలో అత్యాధునిక ఉక్కు కర్మాగారం, కరోన, ఎంజియోప్లాస్ట్ ఆపరేషన్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, సూపర్ అల్లాయ్ తయారీ, గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ ఇలా ఎన్నిటిలోనో మొట్టమొదటివారం. ఇక మన తెలుగువారు ప్రపంచంలో చుక్కాని కనుక్కున్నవారిగా ప్రసిద్ధులు. రోమ్ నుంచి మలయావరకూ

సముద్రయానంలో వేల సంవత్సరాల క్రితమే మేటి అనిపించుకున్నవారం, దేశంలో పేరెన్నికగల నాటి మాధవాయిపాలెం, అలాగే మొట్టమొదటి ఆధునిక నౌకనిర్మాణ కేంద్రం (హిందుస్తాన్ షిప్‌యార్డ్) కలిగినవారం... నేడు పరిస్థితిని ఆకళింపు చేసుకుని 972 కిలోమీటర్ల సముద్రతీరాన్ని పర్యావరణ హిత అభివృద్ధితో భవిష్యత్తులో అందలం ఎక్కవలసినవారం. ఆంధ్రుల చేనేతకార్మికుల ధాటికి ప్రపంచం అబ్బురపడి వందల సంవత్సరాల క్రితమే యాంటి డంపింగ్ డ్యూటి వేసి వారి పరిశ్రమలని కాపడుకోవల్సి వచ్చిందన్న విషయం గుర్తుకు తెచ్చుకుని, ప్రపంచ వస్త్రరంగంలో పోటీపడాల్సినవారం. పాట్నా నుండి శ్రీలంక పాలించిన తెలుగువారి ప్రతిభ ఈనాడు కొన్ని ప్రాజెక్టులు కూడా దేశంలో సాధించుకోలేని వారం. ఐదు రాష్ట్రాలను తెలుగువారు ముఖ్యమంత్రులుగా పాలించినా, భారత ప్రధాని, దేశాధ్యక్షునిగానే కాకుండా విదేశాలకి అధ్యక్షుడిగా చేసిన ఘనతున్నా... తెలుగుభాషని కాపాడుకోవడానికి ఇంకా నడుం బిగించుకోనివారం... ఏనాడో మానవాళికి ఆరోమైసిన్, టెట్రా సైక్లిన్‌లను కనుగొని, బల్క్ డ్రగ్స్ పరిశ్రమలో పేరుపొందినవారం... ఈ మధ్యకాలంలో నిర్లిప్తతగా ఉన్నవారం... భౌగోళికంగా విడినా, కలిసున్నా ఒక్కటై మన ఆకాంక్షలు సాధించుకోవడానికి నడుం కట్టాల్సిన సమయం ఆసన్నమైనవారం.

1954 - 2010 ఆంధ్రప్రదేశ్‌ని విశ్లేషించి భవిష్యత్తుని వీక్షించే విషయంలో ప్రత్యేక రాష్ట్ర వాదనలు విస్మరించలేనివి. అందువల్ల సంక్షిప్తంగానే చూస్తే..

మధ్యలో వచ్చిన బన్ను - చాయ్ అనుబంధం గొప్పదని, అది తగ్గిపోతుందని కొందరు ప్రవచిస్తున్నా, దానికంటే వేలాది సంవత్సరాల రక్తసంబంధం, జొన్న, వరి మెతుకుల అనురాగబంధం తెలుగువారిలో ఎక్కువ. హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగువారందరూ తాము ఆంధ్రులమని గర్వంగా చెప్పుకునే రోజులు 1953 వరకూ బహుళంగా ఉండేవి. వివేకవర్ధిని సంస్కార సభలో ఉర్దూ, మరాఠీ లాంటి భాషలకు మొదట, అత్యధిక ప్రాధాన్యత లభించినా ఎన్నడూ బాధపడని తెలుగువారు ఆఖరికి ఒక్క తెలుగువాడు మాట్లాడడానికి అవకాశం వస్తే తెలంగీ - బేధంగీ అని అపహాస్యం చేసి అవమానిస్తే కేవలం ఆంధ్రులకు మాత్రమే (అంటే తెలుగువారికని అర్థం) సభ్యత్వం లభించే ఆదిమ ఆంధ్ర మహాసభకి అంకురార్పణ జరిగి, ఆఖరికి హైదరాబాద్ విముక్తికి దోహదపడిన విషయం చరిత్రలో నుంచి చెరిపితే చెరిగేది కాదు. మద్రాసు ప్రెసిడెన్సీలోని తెలుగువారు, నైజాంలోని తెలుగువారు ఇతరప్రాంతంల్లో ఎదురుపడితే యాసలు పక్కనపెట్టి స్వంత అన్నదమ్ములకంటే ఆత్మీయంగా ఉండే రోజులవి. కొంతమంది పెత్తందారీలు వ్యతిరేకించినా వందలాది సభలు, సమావేశాలు, ఊరేగింపులతో విశాలాంధ్ర కావాలని ఉద్యమంగా తెలంగాణలో సాగిన రోజులవి. తెలంగాణ స్థానిక ప్రజాప్రతినిధులు తీర - సీమాంధ్రలలో పర్యటించి విశాలాంధ్రకి గళమెత్తాలన్నా అక్కడ ప్రజలలో అంత స్పందన కనపడిన సందర్భాలు బహుతక్కువ. ఆచార్య గోగినేని రంగా, సర్దార్ గౌతులచ్చన్నలాంటి కొంతమంది నాయకులు మినహా - తీర - సీమాంధ్ర నాయకులు మాత్రం విశాలాంధ్ర ఏర్పడి తీరాల్సిందేనని దానికి ఎలాంటి సర్దుబాటుకన్నా సిద్ధమే అన్న సందర్భాలు అనేకం. తెలంగాణలో అయితే ప్రజలతో పాటు నాయకులలో విశాలాంధ్ర కావాలని ఉన్నా కొంతమంది పెత్తందారీ నాయకులలో తమ పెత్తందారీతనం ఎక్కడ పోతుందోనని అనేక అపోహలు. అందుకే విలీనానికి స్పష్టమైన వ్యతిరేకత. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడే హైదరాబాద్ రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు కూడా విశాలాంధ్ర ఏర్పడాలని పార్లమెంట్‌లో ఆకాంక్షించారు. ఫజల్ మొదటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాలు అనేకం. అందులో విదర్భ రాష్ట్ర ఏర్పాటు, బీదర్‌తో సహ తెలంగాణ, బళ్లారి, హంపి, విజయనగరం, తుంగభద్ర ఆనకట్టలాంటి ప్రాంతాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి 5 సంవత్సరాల ఎన్నికల తరువాత శాసనసభ్యులు 2/3 వంతు మెజార్టీతో ఒప్పుకుంటే ఆంధ్రతో కలవవచ్చని సిఫారసులు అనేకం ఉన్నాయి. కాని అప్పటివరకూ ఆగకుండా దాదాపు 4/5 వంతు మెజార్టీ సభ్యుల సమ్మతితో ఆంధ్రతో కలవడానికి తెలంగాణ నుంచి ఎందుకు సిద్ధపడ్డారో విచిత్రం. ఆ రోజులలో తెలంగాణ నుంచి ఎన్నికైన శాసనసభ్యులు కొందరు శాసనసభలో మాట్లాడిన విధం చూస్తే విశాలాంధ్ర ఏర్పడాలనే ఆత్రుత తెలంగాణ నుంచి ఎన్నికైన బలహీనవర్గాలు, అభ్యుదయవాదులు, కమ్యూనిస్టులలో ఎంతుందో సంభ్రమాశ్చర్యాలు గొలుపుతాయి. మచ్చుకు ముఖ్యమంత్రి బూర్గుల ప్రకటన ప్రకారం జాతీయ ఆదాయం తలసరి ఆంధ్రలో రు. 525 ఉంటే అవిభక్త హైదరాబాద్ రాష్ట్రంలో అది రు. 425గా ఉంది. విభజన తరువాత మిగిలిన హైదరాబాద్ (తెలంగాణ)లో తలసరి ఆదాయం కేవలం రు. 265 ఉంటుంది. అందువల్ల ఆంధ్ర కన్నా తెలంగాణ మెరుగైందని చెప్పలేం.

ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే ఇప్పుడు వస్తున్న ఆదాయంలో సగం పడిపోతుంది. అలాగే ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో చాలామందిని తొలగించవలసి వస్తుంది. విశాలాంధ్ర ఏర్పడితే వనరులు అధికంగా ఉంటాయి. కనుక భరించగలవచ్చు. మైనారిటీల ప్రయోజనాల రీత్యాకూడా విశాలాంధ్ర ఏర్పాటు అవసరం. మనకి బాకీ ఎక్కువ, ఉన్న రిజర్వేమో తక్కువ.

పి. లక్ష్మయ్య (ఎం.ఎల్.ఏ. నల్లగొండ - రిజర్వుడ్) అసెంబ్లీలో ప్రకటన మరువలేనిది. ఒకరా ఇద్దరా అనేకమంది శాసనసభ్యులు విశాలాంధ్ర వల్ల తెలంగాణకే కచ్చితంగా లాభం అని ఘోషించారు. ఇదంతా ఎందుకు ఉదహరించాల్సి వచ్చిందంటే 1956 ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో ఆ రోజు ఎవరినీ ఎవరూ మోసం చెయ్యలేదనీ, అలా ప్రచారం చెయ్యడం సరైనది కాదనీ చెప్పడానికే. కాని తీరాంధ్ర (కోస్తా), సీమాంధ్ర (రాయలసీమ)ల మధ్యన ఉన్న విభేదాలకంటే (శ్రీబాగ్ ఒప్పందం ఒక సాక్షి), తెలంగాణ ప్రాంతంతో విభేదాలు ఆ రోజులలో ఎక్కువ కనపడ్డాయి. కొందరు పెత్తందారీలతో అవమానాలు పడిన బూర్గుల రాష్ట్రం సమైక్యంగా ఉంటే తీరాంధ్రలో ఉన్న ఆత్మీయులు కలిసి వస్తారనే ఒక భావం పనిచేసిందని కొందరు చెబితే, వచ్చే కాలంలో తమ ప్రాభవం పెరగడానికి రాయలసీమలో మరొకవర్గం, అలాగే తెలంగాణలో దళిత బలహీనవర్గాల వారు తీర-సీమాంధ్రలో అప్పటికే పేరు గాంచిన తమ నాయకుల అండ తమ అభివృద్ధికి తోడ్పడుతుందనే ఆకాంక్షలన్నీ ఆనాడు గట్టిగా విశాలాంధ్రకి పనిచేసాయని మరికొందరు విశ్లేషకులు అంటుంటారు. అయితే తెలంగాణలో, తీరాంధ్రలో రెండు అగ్రవర్ణాలలో కొందరు నాయకులు విడిగా ఉంటేనే తమ వర్గాల ప్రాబల్యం పెరుగుతుందని విశాలాంధ్రని అడ్డుకుంటానికి చూసారనేది మరొక వాదన. ఒకనాడు చట్టబద్ధతలేని పెద్దమనుషుల ఒప్పందం చేసుకున్నా ఆ ఒప్పందంలోని అంశాలను ఏ ప్రాంతంవారు తమకి అనుకూలంగా ఉంటే ఉల్లంఘించారు? ఏ ఒక్క ప్రాంతం వారో ఉల్లంఘించారన్నది అవాస్తవం.

1957లో ప్రత్యేక పరిస్థితుల రీత్యా కేవలం తెలంగాణలో ఉన్న శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరగగా అప్పుడు గట్టి నాయకులెవ్వరూ ప్రత్యేక తెలంగాణ వాదంతో పోటీ చేయలేదు కదా, కనీసం ఆ నాదం కూడా వినిపించలేదనేది ఎలా మరువగలం? ఆ తరువాత తనకి పదవి రాలేదని తెనాలి సభలో కాంగ్రెస్‌లో చేరడం కంటే కృష్ణానదిలో పడి చావడం మంచిదన్న చెన్నారెడ్డి ప్రకటనలు, వందేమాతరం రామచంద్రరావు మీద, అక్రమాలకు పాల్పడి గెలిచారని ఎన్నికని రద్దు చేయాలని వేసిన

పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇస్తే దాన్ని కేంద్ర సర్వోన్నత న్యాయస్థానం సమర్థించి ఆరు సంవత్సరాలు ప్రజా ఎన్నికల నుంచి డిబార్ చేసింది. వారు కేంద్ర ఉక్కు గనుల మంత్రిగా అవమాన భారంతో రాజీనామా చేసింది, తనకు మద్దతు ఇవ్వలేదని బ్రహ్మానందరెడ్డి మీద కోపం పెంచుకున్నది, ఉద్యోగాల కోసం నిబద్ధతతో మొదలైన తెలంగాణ ఉద్యోగ, నిరుద్యోగుల ఉద్యమాన్ని ప్రత్యేక తెలంగాణ వైపు మళ్లించడంలో ప్రధాన పాత్ర వహించింది వారేనని మరొక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ ఉద్యమంలో దాదాపు 350 మంది బలైపోయారని అంచనా.

1969 జై తెలంగాణ ఉద్యమాన్ని అత్యధికంగా ముస్లిం మైనారిటీలు, ఒవైసీ లాంటి నేతలు వ్యతిరేకించడానికి కారణాలు అనేకం కాగా, 1948 హైదరాబాద్ విలీనం కాగానే 1956 వరకూ ఉద్యోగాల విషయంలో ముస్లింల సంఖ్య వందల శాతం పడిపోవడానికి ఆనాటి తెలంగాణ నాయకులే కారణమనేది ముఖ్యమంటారు. ఏది ఏమైనా 1972లో వచ్చిన జై ఆంధ్ర ఉద్యమాల సమయంలో తెలంగాణలో వేళ్ల మీద లెక్కపెట్ట గలిగినవారు మినహా వేలమీద ఉన్న నేతలు సమైక్యవాదం వినిపించడం గానీ లేదా మౌనంగా గానీ ఉన్నారు. ఆరోజే జై ఆంధ్ర ఉద్యమంలో దాదాపు నాలుగు వందల మంది ప్రాణాలర్పించినా ప్రత్యేక తెలంగాణ వాదులు గట్టిగా ఒక్కడుగు వేసినా రాష్ట్రం విడిపోయుండేది. కాని ఆరోజులలో జై ఆంధ్ర వాదాన్ని పక్కనపెట్టడానికి కొందరు నాయకులు ముఖ్యంగా తెలంగాణ వరిష్ఠ నేతలు ఆరు సూత్రాల ఒప్పందం అని చెప్పి తీర–సీమాంధ్ర వాసులని ఇరికించారు. హైదరాబాద్‌ని అన్ని ప్రాంతాల నిధులతో అభివృద్ధి చెయ్యడాన్ని చట్టబద్ధం చేసారు. ఆరు సూత్రాల ఒప్పందానికి అనేక ఉల్లంఘనలు జరిగాయి. తీర–సీమాంధ్ర ప్రాంతాలకు కూడా అన్యాయం జరిగిందనేది ఫ్రీజోన్ విషయం తీర్మానాలు అక్షరబద్ధం చేసింది. కానీ తీర సీమాంధ్ర ప్రజలతో పాటు, తెలంగాణ ప్రజలలో బలహీనవర్గాల వారికి అన్యాయం అనేక విషయాలలో జరిగింది. దాదాపు 90 శాతం పైగా దళిత, గిరిజన, మైనారిటీ, వెనుకబడిన వర్గాల జనాభా ఉన్న తెలంగాణ ప్రాంతంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్, గిరిజనలకు మరో 12 శాతం రిజర్వేషన్ ఇస్తామన్న నాయకులు ఇప్పటి నుంచే తమ సీట్లలో, న్యాయవాద పదవులలో బహుజనులకి 90 శాతం న్యాయం చేయడం లేదని కేవలం తీర – సీమాంధ్రులని ఆడిపోసుకోవడమే ఎందుకు సరైనదో ఆలోచించుకోవాలి.

ఏది ఏమైనా ఆ తరువాత కాంగ్రెస్ సమైక్యాంధ్ర నినాద ప్రణాళికతో ఎన్నికలలోకి వెళ్లడం జరిగింది. 1995–96 నుంచి కొంతమంది మేధావులు, కళాకారులు ప్రత్యేకవాదం నెమ్మదిగా లేవదీయడం ప్రజల దృష్టికి వచ్చింది. 2001లో తెరాసని అప్పటికే పదవి విషయంలో అసంతృప్తితో ఉన్న కె.సి.ఆర్., సహచరులు ప్రకటించడం 2010 నాటికి ప్రత్యేక తెలంగాణ నినాదానికి అదే జెండాగా మారడం జరిగింది. అయితే ప్రత్యేక భావనలు పెరగడానికి అసమానతలు, సాంస్కృతిక అంశాలు కొంత కారణం కాగా వాటిని అనేకరెట్లు ఎక్కువ చేసి చూపడం, ప్రజలని నమ్మించడం ముఖ్యకారణం. కొన్ని వాస్తవాలని పరిశీలిస్తే, విద్యుత్ సౌకర్యం ఉన్న గ్రామాలు / పట్టణాలు తెలంగాణలో మొత్తం 1957 నాటికి కూడా కేవలం 17 మాత్రమే. అవిభక్త హైదరాబాద్ జిల్లాకంటే ఒకనాడు కృష్ణా జిల్లా విద్యుత్ వినియోగం 45 శాతం కంటే ఎక్కువ (అన్ని రంగాలలో), ఈనాడు వెనుకబడిపోయింది. 2008–09 నాటికి పారిశ్రామిక రంగంలో కూడా తీరాంధ్రలో వినియోగ సూచిక 71 ఉంటే సీమలో 66తో వెనుకబడి ఉంటే, తెలంగాణలో (హైదరాబాద్ మినహాయించినా) 105 ఉంది.

నాడు దాదాపు రాష్ట్రంలో ఉన్న ప్రాథమిక విద్యాసంస్థలలో తెలంగాణ ప్రాంత వాటా 26 శాతం కాగా నేడు 40 శాతానికి పెరిగింది. తీరాంధ్ర వాటా 52 నుంచి 40 శాతంకి, ఉన్నత పాఠశాలలో 66 నుంచి 31కి, కాలేజీలలో 54 నుంచి 39కి పడిపోయింది. నేడు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు పరిశీలిస్తే తీరాంధ్రలో 32–34 శాతం సీట్లు ఉండగా తెలంగాణలో హైదరాబాద్ జిల్లా మినహాయించే 50 శాతం పైగా సీట్లు ఉన్నాయి. పైగా స్థానిక కోటాలు కచ్చితంగా అమలు చేస్తున్నారు.

ధాన్యం ఉత్పత్తి 6.38 లక్షల టన్నుల నుంచి దాదాపు 600 శాతం పెరగగా, కోస్తాలో అది 250 శాతం, రాయలసీమలో కేవలం 100 శాతం పెరిగింది. (అనేక వ్యవసాయ ఉత్పత్తులలో ప్రాంతాల వారి పెరుగుదల ఎలా ఉన్నా రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించింది.) ఈనాడు మొత్తం జలయజ్ఞ ప్రణాళికలో దాదాపు 55 శాతంపైగా నిధులు తెలంగాణలో ఖర్చు పెడుతుండగా, కోస్తాకి 21 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదు.

1955 రాష్ట్రాల బడ్జెట్ ప్రణాళికలను పరిశీలిస్తే 62,608 చదరపు మైళ్లతో ఉండే ఆంధ్ర రాష్ట్రం 70.6 కోట్ల రూపాయలను అభివృద్ధి కార్యక్రమాలకు, మొత్తం బడ్జెట్ ప్రణాళికలో రు. 116.2 కోట్లు కేటాయించగా 81,168 చదరపు మైళ్లు ఉన్న అవిభక్త హైదరాబాద్ రాష్ట్రం బడ్జెట్ ప్లాన్ ఆంధ్రకంటే 16 శాతం తక్కువ కాగా, అభివృద్ధి ప్రణాళికలో రు. 47 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్‌తో పోల్చుకుంటే నామమాత్రమే. పైగా వారికి ఆ రాష్ట్రంలో ప్రత్యేకంగా హాస్టల్ సదుపాయాలు కూడా కల్పించలేదు. ఒక్క గుంటూరు జిల్లాలో 1961 నాటికి నమోదైన వైద్యుల సంఖ్య హైదరాబాద్ మినహా – మిగతా తెలంగాణ జిల్లాలలోని వైద్యుల సంఖ్యకంటే రెట్టింపు ఉండేది. 1956తో పోల్చుకుంటే ఆసుపత్రులలో తీరాంధ్రలో లభ్యమైన పడకల సంఖ్యలో వాటా 50 శాతం నుంచి 37 శాతానికి పడిపోయింది. రాయలసీమ కూడా అభివృద్ధి శాతంలో వెనుకబాట పట్టింది.

1955–56, నేటి తలసరి ఆదాయం పరిశీలిస్తే కోస్తాలో ఒక్క విశాఖపట్నం జిల్లా తప్ప అన్ని జిల్లాలు తమ ముందు స్థానాలు పోగొట్టుకొన్నాయి. విద్య, వైద్య – ఆరోగ్యం, వ్యవసాయం, నీటిపారుదల, రహదారులు, పరిశ్రమలు – కార్మికులు, బలహీనవర్గాలకు న్యాయం... ఒకటా రెండా దాదాపు అన్నింటా ముందుండే తీర – సీమాంధ్ర ప్రాంతాలు ఈనాడు అభివృద్ధి శాతం పోలికలో వెనుకబడ్డాయి. అనేక విషయాలలో ప్రత్యేక తెలంగాణ కోరుకునే మిత్రులు ఇంకొన్ని గణాంకాలు ఇస్తూనే ఉన్నారు. ఇక 1956–2010 వివరాలు, గణాంకాలు ఇప్పటికే అందరివద్ద లభ్యమవుతున్నందువల్ల, శ్రీకృష్ణ కమిటీ ఇవ్వబోతున్నందువల్ల ఇంక ఎక్కువ ఉదహరించడం లేదు.

నీటిపారుదల సమస్యలు, హైదరాబాద్ విషయం పరిష్కరించ బడితే భవిష్యత్తులో రాష్ట్రం విడిపోవడానికే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. కాని పక్షంలో ఒకే రాష్ట్రంలో మూడు స్వయం పాలిత (అటానమస్ – బోడో కౌన్సిల్ తరహాలో) కౌన్సిల్స్ ఏర్పడవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మంచి ఉద్యోగాలు వస్తాయని లక్షల నిరుద్యోగులకి, కాలడ్డం పెడితే నీళ్లు ముంగిట పారతాయని లక్షల కొద్దీ రైతులకి, సర్వం ఆయాచితంగా వస్తాయని అనేకులకి అరచేతిలో స్వర్గం కొందరు నాయకులు, మేధావులు చూపెట్టారు. కానీ, రాష్ట్రం ఏర్పడినా, కౌన్సిల్ పాలనలోనైనా అలాంటి కల్పనలు వాస్తవానికి దూరంగా ఉంటాయని తెలుసుకున్న రోజున అశాంతి ప్రబలవచ్చు. చెదలు పట్టిన వ్యవస్థని సంస్కరించకుండా ఏదో జరుగుతుందని ఆశించడం ఏ ప్రాంత వాసులకైనా సరైనది కాదు. అదే తీరాంధ్రలో విడిపోతే అన్ని జిల్లాల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయి.

కాని భారీ లోటులో ఉండబోయే రాయలసీమ కేంద్ర నిధులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంటుంది. కాని పెత్తందారీ వ్యవస్థ ఇంకా చాలా కాలం ఆ ప్రాంతంలో కొనసాగబోయే అవకాశం కనబడుతోంది.

రాష్ట్రం విడిపోతే ఒక ప్రాంతంలో కేవలం 1956 తరువాత పుట్టినవారే ఆ ప్రాంత వాసులవుతారని ఒకరూ, కాదు 1956 ముందు వచ్చి స్థిరపడ్డవారే ఆ ప్రాంత వాసులవుతారని తాము రాష్ట్రం వచ్చిన తరువాత వారి భవిష్యత్తుని తేలుస్తామని మాట్లాడడం చూస్తే తామేదో ప్రత్యేక రాచరిక దేశం ఏర్పాటు చేసుకున్న భావనలు కనిపిస్తున్నాయి. భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులకి, సమగ్రతకు, ప్రజల మధ్యన విద్వేషాలు రెచ్చగొట్టడానికి ఎవ్వరు తీవ్రంగా ప్రవర్తించినా వారికి రాజకీయాలలో, వ్యాపారాలలో పాల్గొనే అర్హత లేకుండా చేయాలన్న ప్రతిపాదనపై అందరూ ఆలోచించాలి. తమ స్వంత రాజకీయ ప్రయోజనాల కోసం విద్వేషాలు రెచ్చగొట్టే నాయకులకి ఏ ప్రాంతంలో కొదవలేదు. కాబట్టి భవిష్యత్తులో నీటి గురించి వివాదాల విషయంలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి విజ్ఞత కలిగిన ప్రజలు చాలా అప్రమత్తతతో ఉండాల్సి ఉంది.

1969 లేదా 1972లో మొదలైన ప్రత్యేక ఉద్యమాలు అణగారిపోవడానికి నాయకుల ద్రోహం కంటే హింసాత్మక ఘటనలు కారణమన్న వాస్తవం వల్లే ప్రస్తుత ఉద్యమాలు కొన్ని సంఘటనలు మినహాయిస్తే ప్రశాంతంగా జరగడం, రాబోయే ఆందోళనలు గాంధీయుత మార్గంలో జరుపుతామని నాయకులు దూరదృష్టితో ప్రకటించడం జరిగి ఉంటుంది. ప్రత్యేక తెలంగాణ కోసం అనేకమంది ఆత్మాహుతులు చేసుకోవడం, సమైక్యాంధ్ర కోరి కొందరు ఆత్మత్యాగం చేసుకోవడం బాధాకరం. వారి ఆవేదన అర్థం చేసుకోవాలి. మా తరంలో చైతన్యవంతంగా ఉండే విద్యార్థులు గత ఇరవై సంవత్సరాల నుంచి తమ సెల్ఫ్ సెంటర్డ్ ఎన్విరాన్‌మెంట్‌లో బందీ అయినా ఈ మధ్యకాలంలో విద్యార్థి ఉద్యమాలు తిరిగి పోరాట స్ఫూర్తిని జ్ఞప్తికి తెచ్చాయి. కొంత ఆవేశాన్ని తగ్గించుకుని ప్రత్యేక, సమైక్య రాష్ట్రాల పోరాటంతో పాటు కొంత సమాజహితం కోసం దృష్టిపెడితే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. ఎవ్వరి హక్కులకీ భంగం కలగకుండా సమస్యలకి పరిష్కార మార్గాలతో భౌగోళిక విభజనలు జరిగితే మంచే జరుగుతుంది. కానీ మానసిక విభజన, విద్వేషభావనలు పెచ్చరిల్లితే అవి పెచ్చరిల్లిన సమాజానికే అంతిమంగా హానిచేస్తాయి.

భవిష్యత్తులో మన రాష్ట్రం / రాష్ట్రాలలో మనని మనం మోసం చేసుకోకుండా ఉండాలంటే :

1) రాష్ట్రంలో దారిద్ర్యరేఖకి దిగువగా ఉన్న జనాభా దాదాపు 85 శాతం అని విడుదల చేసిన తెల్లకార్డులని చూసి నమ్మాల్సిన స్థితి నుంచి బయటికి వచ్చి, అసలైన లబ్ధిదారులకి ఉపయోగం కల్పించేలా ప్రయత్నించాలి. లేనిపక్షంలో అర్హులైన ప్రజాపంపిణీ విఫలం అయి అన్నీ అదుపు తప్పుతాయి. ప్రజలకి అన్నీ ఉచితంగా ఇవ్వడమే సరైన పాలన అనే భావన నుంచి నెమ్మదిగా బయట పడవేయాలి.

2) 70 శాతం జనాభా గ్రామాలలో నివసించే మన రాష్ట్రంలో వేలాది కోట్ల రూపాయల నిధులని ప్రైవేట్ ఆసుపత్రుల పాలు చేసిన విషయం ఎలా ఉన్నా ఆరోగ్య శ్రీ పేద ప్రజల పాలిట ఆపద్బాంధవు అని చెప్పి తీరాల్సిందే. ఇకనైనా ప్రభుత్వ వైద్య వ్యవస్థని మనం కాపాడకపోతే శాశ్వతంగా మనం ప్రజా ఆరోగ్యాన్ని ప్రైవేట్ పరం చేయడాన్ని ఆపలేం! అదే సమయంలో ప్రజలలో మంచి ఆహారపు అలవాట్లు (జంక్ ఫుడ్, రంగునీళ్లు మొదలగు ప్రమాదాల విషయం చెపుతూ), మంచి జీవన / ఆరోగ్య విధానాన్ని, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని (ఈ మధ్యన వస్తున్న వ్యాపార థర్మల్ విద్యుత్ కేంద్రాలు, కాలుష్యకారక పరిశ్రమలపై పూర్తి చర్చ జరగాలి) ప్రచారం చేయాల్సి ఉంటుంది.

3) చిన్న చిన్న ఉద్యోగులపైనే ప్రతాపం చూపించే విధానం కంటే పెద్ద ఉద్యోగుల నుంచి అవినీతి భూతాన్ని తరిమివేసే ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయి. వారి సంగతి ముందు తేలిస్తే వారే నాయకుల చిట్టాలు విప్పడానికి ప్రయత్నిస్తారు. కనుక కొంతవరకూ అవినీతి ఆగవచ్చు. హైటెక్ రోడ్లు, గనులు, ప్రాజెక్టులలో ప్రతీది పారదర్శకంగా జరిగి తీరాల్సిందే. కల్తీలు, బహుళజాతి కంపెనీలు కొన్ని చేసే మోసాలు ప్రజలు అర్థం చేసుకుని పోరాడాల్సి ఉంది. అంతిమంగా ప్రజలు నైతిక ఆలోచనా విధానంలోనే నెమ్మదిగా మార్పు రావాలని కోరుకోవడం అత్యుత్తమం. వామపక్షాలు, విప్లవపక్షాల ఆలోచనలో సహజంగానే నిబద్ధత హెచ్చు. కానీ, మధ్యతరగతి, ఆలోచనాపరుల స్రవంతి నుంచి వారు ఎందుకు దూరంగా వెళుతున్నారో ఆలోచించుకుని ప్రజా పోరాటాలలో వారిని కూడా భాగస్వామ్యం చెయ్యగలిగితే అంతిమంగా సమాజానికి మేలు జరుగుతుంది.

4) ఈనాటికీ సాగయ్యే భూమిలో 48 శాతానికి కూడా నీటిపారుదల లేని పరిస్థితి రాష్ట్రంలో ఉంది. భవిష్యత్తులో నీటిపారుదల నుంచి – రుణపరపతి – పంటల ఉత్పత్తి – పంపిణీ వరకూ ఒక మాన్యువల్స్ ప్రకారం ట్రాన్స్‌పరెన్సీగా విధానం ఉన్నప్పుడు రైతులు, వ్యాపారులు, వినియోగదారులకి సమన్యాయం జరుగుతుంది. సాధ్యమయ్యే ప్రాజెక్టులనే చేపట్టి గుత్తేదార్ల ఉపయోగం కోసం చేపట్టిన 3000 మెగావాట్లకు పైగా వాడే ఎత్తిపోతల సాగు ప్రాజెక్టులు వెంటనే ఆపుచేయాలి. అయితే తాగు నీటికోసం కష్టసాధ్యమైన ప్రాజెక్టులు చేపట్టినా ఫరవాలేదు.

5) అసలైన కొండ ప్రాంతాల గిరిజనులకు జరుగుతున్న అన్యాయం ఈ రాష్ట్రంలో ఏ వర్గానికి జరగలేదని కచ్చితంగా చెప్పవచ్చు. వనరులు కొల్లగొట్టబడి, సంస్కృతి పోయి, భాష కునారిల్లి, పుట్టకొకరు చెట్టుకొకరు అయి ఉపాధిలో అట్టడుగున ఉండి దోపిడీకి గురవుతున్న వారి గురించి మాట్లాడకుండా ఉన్న ఏ ఉద్యమమూ సమగ్ర ప్రజా ఉద్యమమూ కానేరదు. ఈ మధ్యకాలంలో సామాజిక వర్గం అంటే కులం అని, సామాజిక న్యాయం అంటే కుల ప్రకారం న్యాయం అనే ఉపమానంగా ప్రసార మాధ్యమాలు / పత్రికలలో వస్తున్నాయి. రెండు మూడు కులాలు తప్ప అనేక కులాలు ఒక రాష్ట్రంలో అగ్రకులాలుగా, మరికొన్ని రాష్ట్రాలలో వెనుకబడిన కులాలుగా ఉన్నాయి. మన రాష్ట్రంలో ఇంతవరకూ బలహీనవర్గాలకు రాజ్యాధికారం రాలేదని అనేకులు చెందుతున్న ఆవేదనలో అర్థం ఉంది. అంతిమంగా రాష్ట్రంలో వెనుకబడిన ప్రజలందరికీ న్యాయం జరగాలన్నది ముఖ్యం. కానీ మున్ముందు కులాలవారి కూటముల ఏర్పాటుని ప్రోత్సహించడం కంటే కుల నిర్మూలన ఉద్యమాలకి ఊతం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో తెలుగుభాషా, సంస్కృతులకి జరుగుతున్న అవహేళనలు పెరగకుండా ఉండాలంటే అభ్యుదయవాదులు కూడా నడుం కట్టాల్సిన అవసరం ఉంది. పాశ్చాత్య విధానంలో మంచిని ఒంటబట్టించు కోవడానికి బదులు చెడును తలకెక్కించుకోవడం తగ్గించుకోకపోతే వచ్చే యువతరానికి మానసిక అభివృద్ధికి చెడ్డరోజులు తప్పవు.

6) ఉపాధి కల్పన ముఖ్యంగా ప్రైవేట్ వ్యవస్థ, సేవారంగంలోనో అత్యధికంగా జరుగుతోంది. పారిశ్రామిక కార్మికుల సంఖ్య మొత్తం పనిచేసే ప్రజలలో 2.27 శాతంగా ఉండడం కొంత పారిశ్రామిక రంగ వెనుకబాటుపై ఆలోచన కలిగిస్తుంది. పైగా సంఘటిత రంగ కార్మికుల సంఖ్య కంటే అసంఘటిత కార్మికుల సంఖ్య తక్కువ అవ్వడం ఆందోళన కలిగిస్తుంది. ఆగ్రో – పరిశ్రమలపై దృష్టిని కేంద్రీకరిస్తే రేపు పరిస్థితులు బాగుపడవచ్చు. అదే సమయంలో గ్యాస్, ఆయిల్ నిక్షేపాల వినియోగంలో

తెలంగాణ ప్రజల అభివృద్ధితో సంబంధం లేకుండా వనరుల దోపిడీ, ఉపాధి అవకాశాలలో వివక్షలకు సింగరేణి ఉదాహరణగా నిలుస్తుందని అంటున్నారు **పిట్టల రవీందర్**

వలస దోపిడీ కేంద్రం సింగరేణి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు సంబంధించిన అనేక కారణాలలో తెలంగాణ ప్రాంతంలో విస్తారంగా లభ్యమయ్యే సహజ వనరులు కూడా ముఖ్యమైనవి. దక్షిణ భారతదేశం మొత్తంలో కేవలం తెలంగాణ నాలుగు జిల్లాల్లో మాత్రమే లభ్యమయ్యే నేలబొగ్గు ఇందులో చాలా ముఖ్యమైనది. హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చేసుకోవడం ద్వారా మాత్రమే తెలంగాణ ప్రాంతంలోని నేలబొగ్గును సులభంగా తరలించుకుపోవచ్చుననే కుట్ర కూడా ఆంధ్రప్రదేశ్ అవతరణకు నేపథ్యంగా పనిచేసింది. తెలంగాణ ప్రాంత రాజకీయనాయకత్వ వైఫల్యాలు, బానిస భావజాలం, ముందుచూపు లేకపోవడం, స్వార్థచింతన లాంటి అనేక కారణాలు ఇందుకు సహకరించాయి. అందువల్లనే గడచిన ఐదు దశాబ్దాలుగా తెలంగాణలోని నేలబొగ్గును సీమాంధ్ర వినియోగానికి విచ్చలవిడిగా తరలించుకు పోగలుగుతున్నారు. తెలంగాణలోని సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాలను ఒక పూర్తిస్థాయి అంతర్గత వలస దోపిడీ కేంద్రంగా మార్చివేయడంలో సీమాంధ్ర రాజకీయ నాయకత్వం, పాలకవర్గాలు, ఉన్నతాధికారవర్గాలు ఒక పకడ్బంది ప్రణాళికతోనే వ్యవహరించినట్లు గడచిన యాభై సంవత్సరాలుగా సింగరేణిలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

సింగరేణి వనరులను తరలించుకుపోవడానికి సీమాంధ్రులు మూడు ముఖ్యమైన పద్ధతులను అనుసరించారు. సింగరేణి బొగ్గుగనుల సంస్థలో పరిపాలనాధికారాన్ని చేజిక్కించుకోవడం, బొగ్గు ఉత్పత్తిలోనూ ఆధిపత్యాన్ని సాధించడం, బొగ్గు వినియోగంలో సీమాంధ్ర ప్రయోజనాలకు ప్రాధాన్యతను ఇవ్వడం ... ఇందులో చాలా ముఖ్యమైనవి. ఈ మూడు పరిణామాలకు తొలిమెట్టుగా సింగరేణిలో పరిపాలనాధికారాన్ని చేజిక్కించుకోవడానికి దుర్మార్గమైన పద్ధతులను అనుసరించారు. సింగరేణిలో 'క్లర్క్' ఉద్యోగానికి అప్పటివరకూ అమలులో ఉన్న విద్యార్హతను పదవ తరగతి నుండి డిగ్రీకి మార్చివేశారు. తెలంగాణలో ఆ రోజుల్లో డిగ్రీ చదవడానికి కళాశాలలుగానీ, ఇతర అవకాశాలుగానీ లేని పరిస్థితి సీమాంధ్రులకు అనుకూలంగా పనిచేసింది. డిగ్రీకి తోడుగా ఇంగ్లిష్‌లో టైపురైటింగ్ కూడా తప్పనిసరి అర్హతగా నిర్ణయించారు. నిజాం పరిపాలనలో మగ్గిన తెలంగాణలో ఉర్దూ మీడియం మినహా ఇంగ్లిష్ చదువులు అందుబాటులో లేవు. అందువల్ల ఇంగ్లిష్ చదువులకు, ఇంగ్లిష్ టైపింగ్‌కు తెలంగాణ ప్రాంత నిరుద్యోగులు అనర్హులయ్యారు. అప్పటిదాకా పదవ తరగతి చదువుకోగలిగిన వారికి సింగరేణిలో అందుబాటులో ఉన్న 'క్లర్క్' ఉద్యోగాలు కూడా సీమాంధ్రులు ఎగరేసుకుపోయారు. తెలంగాణ ప్రాంత ప్రజలు అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లో 'తట్ట' మోసే పనికి మాత్రమే పరిమితమయ్యారు. అండర్‌గ్రౌండ్‌లో జరిగే గని ప్రమాదాల్లో మృత్యువాతకు గురయ్యారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ ప్రాంత ప్రజలు అండర్‌గ్రౌండ్ గనుల్లో అత్యంత ప్రమాదకరమైన పనిస్థలాల్లో కీలకమైన బొగ్గు ఉత్పత్తిలో ప్రధాన పాత్రను పోషిస్తుంటే, సీమాంధ్ర నుండి అక్రమ పద్ధతుల్లో వలస వచ్చిన వారు ఏసీ గదుల్లో, మెత్తటి కుర్చీల్లో అధికారం చెలాయించారు. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి సింగరేణి చైర్మెన్‌గా పనిచేసిన సమయంలోనే సుమారు మూడువేల మంది 'క్లర్క్' ఉద్యోగాల్లో మిడతల దండులా సింగరేణిలో వాలిపోయారు. ఆ తర్వాత సీమాంధ్రలో అందుబాటులో ఉన్న ఉన్నత విద్యావకాశాలను ఉపయోగించుకుని వీరిలో చాలామంది పర్సనల్ ఆఫీసర్లుగా, వెల్ఫేర్ ఆఫీసర్లుగా పదోన్నతులు పొందారు. ఆ తర్వాతి క్రమంలో వీరందరూ

ప్రాధాన్యత స్థానిక తెలుగు ప్రాంతాలకే ఇవ్వాలన్నది పరిగణనలోకి తీసుకోవాలి. గనులలోని ఖనిజ సంపదని ఎగుమతి చేయడం కంటే ఇక్కడే ఎక్కువ వినియోగించుకుని పరిశ్రమలు పెట్టడానికి ఇకనైనా ప్రయత్నించాలి. ఎలాగూ పెరుగుతుంది కదా అని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థని నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధి శాతాన్ని అలాగే కొనసాగించాలి. కొత్త రైల్వేలైన్లను, సమాచార వ్యవస్థను, విద్యుత్ ఉత్పత్తి-పంపిణీలపై దృష్టిని కేంద్రీకరించాలి.

7) 1956లో దాదాపు ఉన్నత విద్య, సాంకేతిక విద్య ప్రభుత్వ రంగంలో ఉంటే నేడు 90 శాతం సాంకేతిక విద్య ప్రైవేట్ రంగానికి వెళ్లిపోగా, మిగతా విద్యారంగం దాన్ని అనుసరించే రీతిలో పాలన తావు ఇస్తోంది. అందువల్ల బలహీనవర్గాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకి అన్యాయం జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ఉపాధి కల్పనలో కూడా దాంతో అన్యాయం జరుగుతోంది. అందువల్ల సమగ్ర విద్యా – ఉపాధి వ్యవస్థని రూపొందించుకోవడానికి ఇంకా ఆలస్యం కాలేదు.

8) బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనల ప్రకారం హైదరాబాద్‌ని దేశానికి రెండవ రాజధానిగా చేయించడానికి ప్రయత్నిస్తే ఇక్కడి యువతకి, న్యాయవాదులకి, అభివృద్ధి కాముకుల ఆశయాలకు న్యాయం జరుగుతుంది. ఆ విధంగా జరిగితే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. అలాగే జిల్లా, స్థానిక సంస్థలకు అధికారాలు ఇస్తే పాలన వికేంద్రీకరణ వల్ల ప్రజలకు ఉపయోగమే జరుగుతుంది.

అంతిమంగా మొన్న అయోధ్య వివాదం విషయంలో తీర్పు వచ్చిన సమయంలో పత్రికా ప్రపంచం, ప్రసార మాధ్యమాలు పోషించిన అభ్యుదయ పాత్రతో పాటు, ప్రజలు అద్భుత పరిణితి పాటించి విద్వేషాలకు, హింసావాదాలకు సమాజంలో చోటులేదని, అలాంటి నాయకులని దూరం పెట్టాలన్న అద్భుత పరిణితిని ప్రదర్శించారు. అందువల్ల భవిష్యత్తులో అదే పరిణితిని అందరూ ప్రదర్శిస్తారని ఆశిస్తూ సర్వే జనా సుఖినోభవంతు.

(రచయిత న్యాయవాది, ప్రత్యేక ఆంధ్ర నాయకులు) వీ

కంపెనీలో డైరెక్టర్లుగా ఎదిగిపోయారు. పరిపాలనా సంబంధమైన అధికారాలన్నింటినీ హస్తగతం చేసుకున్నారు. తెలంగాణ ప్రాంత గనికార్మిక వర్గాన్ని అణచివేతకు గురిచేశారు. అవహేళనకు గురిచేసారు. తమకున్న సహజమైన స్వార్థచింతన, వ్యాపార బుద్ధితో వివిధ రకాలైన స్కీములు కార్మికులపై రుద్ది ఆర్థిక దోపిడీని కొనసాగించారు.

ఇదే సమయంలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియపై పట్టును సాధించేందుకు సీమాంధ్రులు అనేక రకాలైన కుయుక్తులను అమలు జరిపారు. తెలంగాణ ప్రాంతంలో బొగ్గుగనులుంటే సీమాంధ్ర ప్రాంతంలో మైనింగ్ కళాశాలలను ఏర్పాటు చేసుకున్నారు. పరిమితమైన సీట్ల సంఖ్యతో నిర్వహిస్తున్న కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ మినహా తెలంగాణలో ఎక్కడా మైనింగ్ కళాశాల ఏర్పాటు కాకుండా అడ్డుకున్నారు. సింగరేణిలో ఆరంభం నుండి ఆధిపత్యం చెలాయించిన బెంగాల్, బీహార్ రాష్ట్రాలనుండి వచ్చిన మైనింగ్ ఇంజనీర్ల స్థానంలో సీమాంధ్రలో ఏర్పాటు చేసిన మైనింగ్ కళాశాలలనుండి అందివచ్చిన ఇంజనీర్లను సింగరేణి నిండా నింపివేసారు. తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకునే 'అంప్రెటిస్ ట్రేనీ'ల నుండి మొదలుకుని, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ల పోస్టులదాకా సీమాంధ్ర ప్రాంతాల్లోనే క్యాంపస్ నియామకాలను నిర్వహించుకున్నారు. గనికార్మిక కుటుంబాలనుండి ఎదిగిన మైనింగ్ ఇంజనీర్లను సింగరేణి ఉద్యోగాల్లోకి రాకుండా పకడ్బందీ పద్ధతులను అనుసరించారు.

బొగ్గు ఉత్పత్తిలో ప్రధాన పాత్రను పోషిస్తున్న తెలంగాణ ప్రాంత గనికార్మికులను పూర్తిగా తొలగించే కుట్రను ఈ సీమాంధ్ర అధికారవర్గం ఒక పథకం ప్రకారం అమలు జరిపింది. వేగవంతంగా పెరుగుతున్న బొగ్గు అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయాలనే నెపంతో అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లో పూర్తిస్థాయి యాంత్రీకరణను ప్రవేశపెట్టారు. యంత్రాల కొనుగోలులో వందలకోట్ల రూపాయలను ముడుపులుగా దిగమింగారు. ఫలితంగా సింగరేణి సంస్థను ఖాయిలా పరిశ్రమగా మార్చేందుకు రంగాన్ని సిద్ధం చేసారు. సింగరేణిలో పారిశ్రామిక అశాంతికి ఆజ్యం పోసి దీర్ఘకాలిక సమ్మెలకు సీమాంధ్ర అధికారవర్గాలు కారణమయ్యాయి. సమ్మెలను కారణంగా చూపి కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు సీమాంధ్ర ఆధిపత్య అధికారవర్గాలు, మైనింగ్ అధికారులు ఉమ్మడిగా కుట్రపూరితమైన విధానాలను అమలు జరిపారు. ఫలితంగా సింగరేణిలో ఒకనాడు లక్షా 17వేలమంది కార్మికుల సంఖ్య, ఇవ్వాళ 67 వేలకు కుదించుకుపోయింది. ప్రపంచంలో ఎక్కడా అమలు జరగని రీతిలో సింగరేణిలో ఇప్పటివరకూ 23 దశల్లో స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని అమలు జరిపారు. పనిస్థలాల్లో కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి, పనిభారాన్ని మోపి బలవంతంగా పదవీ విరమణ తీసుకునే విధంగా ఒత్తిడిని తీసుకువచ్చారు. మరోవైపున బొగ్గు ఉత్పత్తి పద్ధతుల్లోనూ విపరీతమైన మార్పులను తీసుకువచ్చారు. అండర్‌గ్రౌండ్ గనులను మూసివేసి, ఓపెన్‌కాస్ట్ గనులను పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఔట్‌సోర్సింగ్ పేరిట బొగ్గుగనుల్లోనూ, దానికి అనుబంధంగా జరిగే పనుల్లోనూ ప్రైవేటు కాంట్రాక్టర్ల పాత్రను పెద్దఎత్తున పెంచారు. ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల్లో ఓవర్‌బర్డెన్ (భూమి ఉపరితలంపై ఉండే మట్టిపొర) తొలగించే పనులను సీమాంధ్ర కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఈపేరుమీద ఏటా వందలకోట్లను దండుకుంటున్నారు.

ఇక సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గును వినియోగించడంలోనూ సీమాంధ్ర పాలకులు, రాజకీయ నాయకత్వం, సంపన్నవర్గాలు పూర్తి వివక్షను పాటిస్తున్నారు. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో సగానికిపైగా సీమాంధ్ర ప్రాంతానికి తరలించుకుపోతున్నారు. బొగ్గు ఆధారంగా నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనలోనూ, నిర్వహణలోనూ, విద్యుత్ కేటాయింపుల్లోనూ తెలంగాణ ప్రాంతానికి తీవ్రమైన అన్యాయానికి ఒడిగట్టుతున్నారు. బొగ్గు వినియోగంలోనూ, విద్యుత్ కేటాయింపుల్లోనూ సీమాంధ్ర పాలకులు ఈ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని అర్థం చేసుకోవడానికి జాతీయ విద్యుత్ ఉత్పాదక సంస్థ (ఎన్.టి.పి.సి.) చేస్తున్న నిర్వాకం ఒక్కటి గమనిస్తే సరిపోతుంది. ఎన్.టి.పి.సి. ఆంధ్రప్రదేశ్‌లో రామగుండం, విశాఖపట్టణంలలో రెండు భారీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తున్నది. రామగుండంలో నిర్వహిస్తున్న 2600 మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమయ్యే బొగ్గు సింగరేణి నుండి సరఫరా చేస్తున్నారు. ఆరున్నర టి.ఎం.సి. నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి వాడుకుంటున్నారు. అయితే ఈ థర్మల్ కేంద్రంలో ఉత్పత్తి చేసే విద్యుత్తులో కేవలం 29శాతం విద్యుత్‌ను మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి కేటాయిస్తున్నారు. ఇదే ఎన్.టి.పి.సి. విశాఖపట్టణం (సింహాద్రి) వద్ద నిర్వహిస్తున్న థర్మల్ కేంద్రానికి అవసరమయ్యే నీటిని సముద్రం నుండి తీసుకుని శుద్ధి చేసి వాడుకుంటున్నారు. అవసరమైన బొగ్గును ఒడిషా రాష్ట్రం నుండి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ ఈ థర్మల్ కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న 1000 మెగావాట్ల విద్యుత్తును కేవలం ఉత్తరాంధ్రకు చెందిన మూడు జిల్లాలకు (విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం) మాత్రమే పూర్తిస్థాయిలో కేటాయిస్తున్నారు. ఈ పరిస్థితులు కేవలం సీమాంధ్ర ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకత్వం కొనసాగిస్తున్న ఆధిపత్య ధోరణి వల్లమాత్రమే సాధ్యపడుతున్నది. తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకత్వ బానిస భావజాలం ఇందుకు ఉపకరిస్తున్నది.

ఈ నేపథ్యంలోనే సింగరేణి బొగ్గుగనుల నుండి తెలంగాణ ప్రజలను శాశ్వతంగా తొలగించే కుట్రపూరిత వైఖరి ప్రారంభమయింది. ఎన్.టి. రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోల్ బెల్ట్‌ను ఒక పూర్తి స్థాయి 'అంతర్గత వలస దోపిడీ కేంద్రం'గా మార్చివేసేందుకు శ్రీకారం చుట్టారు. స్వల్ప వ్యవధిలో ఎక్కువ మోతాదులో బొగ్గు ఉత్పత్తిని సాధించే 'ఓపెన్‌కాస్ట్' గనులు ప్రారంభించారు. శ్రమశక్తి ప్రధాన ఆధారంగా నడిచే అండర్‌గ్రౌండ్ గనులను ఒకొక్కటిగా మూసివేసారు. కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న హక్కులను కూడా ఒక్కొక్కటిగా హరించివేసారు. సంఘాలను కుదించారు. సమ్మెలను నిషేధించారు. ప్రశ్నించిన కార్మికులను వేధింపులకు గురిచేసారు. కార్మిక సంఘాల నిర్వీర్యం కావడంతో సింగరేణి గని కార్మిక వర్గం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడింది. తమ కోసం ప్రాణాలను త్యాగం చేసిన 'సికాస' నాయకత్వాన్ని వెంటాడి, వేటాడి మట్టుబెట్టారు. విప్లవ కార్మికోద్యమంపై ఉక్కుపాదం మోపారు. మొత్తంగా సింగరేణి గని కార్మికులకు నాయకత్వం లేకుండా అణచివేసారు. (దక్షిణ భారతం మొత్తంలో కేవలం తెలంగాణ ప్రాంతంలో మాత్రమే లభ్యమయ్యే నేలబొగ్గును తరలించుకుపోయే కుట్రలో భాగంగానే) సింగరేణిలో అధికారపక్షాల జోక్యం ప్రారంభమయింది. 1983 తర్వాత నుండే సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాలకు ప్రాంతేతరుల వలసలు తీవ్రమయ్యాయి. అండర్‌గ్రౌండ్ గనుల్లో సమీప ప్రాంతాలనుండి వచ్చిన కార్మికులు చెమటోడ్చి బొగ్గును ఉత్పత్తి చేసే పనిలో నిమగ్నమైతే, అధికార హోదాల్లో ప్రభావిత వర్గాలుగా ఎదిగిన ప్రాంతేతరులు బొగ్గును తరలించుకు పోయే ప్రయత్నాల్లో మునిగితేలారు. సింగరేణిలో 1997 నుండి సంస్కరణల పేరిట అమలులోకి తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానాల నేపథ్యంలో ఇది మరింత బాహాటంగానే కొనసాగుతున్నది. ఇందుకు సీమాంధ్ర అధికారులు పూర్తిస్థాయిలో తమశక్తి సామర్థ్యాలను వినియోగిస్తున్నారు.

మరోవైపున వలసాధిపత్య రాజకీయాల ఫలితంగా సింగరేణి బొగ్గు వినియోగంలో తెలంగాణ ప్రాంతానికి న్యాయమైన వాటా దక్కడం లేదు. సింగరేణిలో ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో కేవలం 30శాతం మాత్రమే తెలంగాణ ప్రాంతంలో వినియోగిస్తున్నారు. మిగిలిన బొగ్గును ఇతర ప్రాంతాలకు

తరలిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక టన్ను బొగ్గును ఉత్పత్తి చేసే క్రమంలో ఇద్దరికి, అదే టన్ను బొగ్గును వినియోగించే క్రమంలో నలుగురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవలసి ఉన్నది. కాబట్టి సూచిక వ్యాసంలో పేర్కొన్న విధంగా సింగరేణి సంస్థ రోజుకు సగటున ఉత్పత్తి చేస్తున్న లక్ష టన్నుల బొగ్గును వెలికి తీసే క్రమంలో కనీసం రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కవలసి ఉన్నది. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 70శాతం ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడంవల్ల ఆ మేరకు తెలంగాణ ప్రాంత ప్రజలకు దక్కవలసిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తెలంగాణేతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి.

సుమారు వంద సంవత్సరాలుగా బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకూ ఒక్క థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా నెలకొల్పలేదు. సింగరేణిలో అత్యధిక మోతాదులో బొగ్గును ఉత్పత్తి చేస్తున్న రామగుండం ప్రాంతంలో నిజాం కాలంలో నిర్మించిన రామగుండం 'బి' థర్మల్ కేంద్రం మాత్రమే కనీస విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 62.5 మెగావాట్లతో కొనసాగుతున్నది. (ఇంతే సామర్థ్యం కలిగిన రామగుండం 'ఏ' థర్మల్ కేంద్రాన్ని ఎప్పుడో మూసివేసారు). ఇక్కడ ప్రైవేట్ రంగంలో ప్రతిపాదించిన బిపిఎల్ (బ్రిటిష్ పవర్స్ లిమిటెడ్) థర్మల్ కేంద్రం నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. ఇదే సమయంలో సింగరేణి బొగ్గుపై ఆధారపడిన విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 1260 మెగావాట్ల సామర్థ్యానికి, రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 840 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి విస్తరించారు. 'నల్లవజ్రం (బొగ్గు) నుండి తెల్ల ముత్యాలు (యూరియా)' పేరుతో ప్రపంచంలోనే అతిపెద్దదిగా (సింగరేణి గనులకు, ఎన్.టి.పి.సి. థర్మల్ విద్యుత్ కేంద్రానికి కూతవేటు దూరంలో) ఏర్పాటు చేసిన రామగుండం ఎరువుల కర్మాగారం కరెంటు, బొగ్గు కొరతల కారణంగా మూసివేయడం ఈ సందర్భంలో గమనించవలసిన అంశం.

మరోవైపున సింగరేణి ప్రతిపాదించిన భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, ఉనికిలో ఉన్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల విస్తరణ, అండర్‌గ్రౌండ్ గనులను ఓపెన్‌కాస్ట్ గనులుగా మార్చే ప్రక్రియలన్నీ 2004 ఎన్నికల తర్వాత మాత్రమే ప్రతిపాదించడం గమనార్హం. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఆ సమయంలో నెలకొని ఉన్న రాజకీయ నేపథ్యం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన ఉద్ధృతి, ఔట్‌సోర్సింగ్ విధానాలు ఇందుకు ప్రధాన ప్రేరకాలుగా చూడవలసి ఉన్నది. (జలయజ్ఞం పేరిట గోదావరి, కృష్ణా నదీజలాలను కోస్తాంధ్ర, రాయలసీమలకు తరలించుకుపోయే పథకాలకు కూడా ఇదే కాలంలో శ్రీకారం చుట్టడం కూడా ఎంతమాత్రమూ యాధృచ్ఛికం కాదని గమనించాలి.)

ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకంలో స్థానికులకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఏ కోశానా ఆస్కారం లేదు. భూములు కోల్పోవడంవల్ల స్థానికులు తరతరాలుగా ఆధారపడుతున్న ఉపాధి అవకాశాలను (భూమి, వ్యవసాయం) శాశ్వతంగా కోల్పోతున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంలేదు. అన్ని రకాలైన కాలుష్యాల కారణంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. చాలినంత నష్టపరిహారాలు అందక, పునరావాస కల్పనలో యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లిప్త ధోరణులవల్ల తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఓపన్‌కాస్ట్ గనుల తవ్వకం వల్ల సహజసిద్ధమైన నీటివనరులన్నీ క్షీణించిపోయి తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ఈ ప్రాంత ప్రయోజనాలకుగానీ, ఈ ప్రాంత ప్రజల సంక్షేమానికిగానీ ఏ మాత్రం ఉపయోగపడటంలేదు. ఓపెన్‌కాస్ట్ పద్ధతుల్లో ఉత్పత్తి చేస్తున్న బొగ్గువల్ల వస్తున్న లాభాల్లో కనీస వాటా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగించడం లేదు. ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ఇంధనంగా తయారవుతున్న విద్యుత్తు, కరెంటుమీదనే ఆధారపడిన తెలంగాణ ప్రాంత వ్యవసాయరంగాన్ని ఆదుకోవడంలేదు. పారిశ్రామిక అభివృద్ధికిగానీ, తద్వారా ఉపాధి కల్పనకుగానీ ఏ మాత్రం దోహదం చేయడంలేదు.

సింగరేణిలో గడిచిన 50సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ పరిణామాలు, ఈ పర్యవసానాలు కోల్‌బెల్ట్ ప్రాంతాలను మొత్తంగా బొందలగడ్డలుగా, ఎడారిగా మార్చే కుట్రలో భాగంగానే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మాత్రమే ఇందుకు అవకాశం కల్పించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా మాత్రమే ఈ దోపిడీని అరికట్టగలుగుతామని ఇక్కడి ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నారు. రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న మలి ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయి వేతన సవరణల కోసం దీర్ఘకాలిక సమ్మెలను నిర్వహించి, విజయం సాధించిన ఘనచరిత్ర సింగరేణి గని కార్మికులకు ఉన్నది. చరిత్ర పునరావృతం అవుతుందడనంలో ఎవ్వరికీ, ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేదు.

(రచయిత తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

(... 7వ లో తరువాయి)

దాన్ని వదిలేయక, నేటి ఆధునిక యుగంలో ఒకరి ప్రార్థనా స్థలాన్ని కూలగొట్టి, మరొకరు ప్రార్థనా స్థలాన్ని కట్టడాన్ని విశ్వాసాల ఆధారంగా నిర్ణయించడం మొదలుపెడితే అంధకార యుగంలోకి ప్రవేశించడమే.

రామ మందిరం కూలగొట్టి మసీదు కట్టారని నిర్దిష్టమైన ఆధారాలు లేవు కానీ, మసీదు మాత్రం మన కళ్ల ఎదుటే కూలగొట్టిన దౌర్జన్యకర ఘటన. మందిరాన్ని కూలగొట్టి మసీదును కట్టడం ఇస్లాం సంప్రదాయం కాదు కాబట్టి అది మసీదే కాదని శర్మ అన్నాడు. మరి మసీదును కూలగొట్టి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తే మందిరం ఎట్లా అవుతుందో ఈ న్యాయాధీశునికి అంతుపట్టదా?

1949లో బాబ్రీ మసీదులోని ముఖ్య గుమ్మటం కింద విగ్రహాలు దొంగతనంగా చేర్చిన నాటి నుండి మొదలుపెట్టి, మసీదును కూల్చేదాకా ఎన్నో దశల్లో కాంగ్రెస్, బి.జె.పి. ప్రభుత్వాలు, కోర్టులు కూడా హిందూ ఫాసిస్టు శక్తులకు దోహదం చేస్తూ వచ్చాయి. అందుకు పరాకాష్ఠగానే 1992లో ఫాసిస్టు శక్తులు బాబ్రీ మసీదును కూల్చివేసాయి. 1947 దేశ విభజన నాటి విషాదగాయాలు మానుతుండగా, మళ్లీ ఒకసారి దేశవ్యాప్తంగా ముస్లిం మైనారిటీలు అభద్రతా భావానికి గురయ్యే దాడులను ప్రేరేపించిన దుర్మార్గమైన మసీదు కూల్చివేత నేరానికి 1992లో ఫాసిస్ట్ సంఘపరివార్ శక్తులు, కాంగ్రెస్ ప్రభుత్వాల కుమ్మక్కుతో పాల్పడ్డాయి.

ఇప్పుడు తాజాగా హైకోర్టు తీర్పులో అక్కడ రామమందిర నిర్మాణానికి అనుమతినివ్వడమంటే ఆ నేరాన్ని కప్పిపుచ్చి, ఆ నేరస్తుల ముఠానాయకులను హీరోలను చేయడమే. అన్యాయపు ఫలితమైన డిఫాక్టో విషయాన్ని ఈ కోర్టు తీర్పు న్యాయ సంగతమైన డి-జ్యూర్‌గా మార్చడమే. బలవంతులు, ప్రజాస్వామ్యాన్ని , కోర్టులను, పరిహసించేవాళ్లు ప్రభుత్వ సాయంతో మొరటు బలంతో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి విజేతలుగా నిలబడొచ్చని వాళ్లకొక నైతిక స్థైర్యాన్ని ఇచ్చే తీర్పు ఇది. ఇటువంటి తీర్పుతో ఫాసిస్టు శక్తులు మరింత రెచ్చిపోతాయే తప్ప మరొకటి కాదు.

బాబ్రీ మసీదు ఉన్న స్థలాన్ని మసీదు పునర్నిర్మాణానికి అప్పజెప్పి, హిందూ మత భావనలను గౌరవించడానికి మసీదు వెలుపల ఉన్న రామ్ చబుత్ర, సీతాకీ రసోయి ప్రాంతం మందిర నిర్మాణానికి నిర్మోహీ అఖాడాకు అనుమతి ఇచ్చి ఉన్నా సామరస్య భావనగా అర్థం చేసుకోవడానికి ఆస్కారముండేది. మసీదు కూల్చివేతను అప్రత్యక్షంగా సరియైనదిగా నిలబెట్టే ఈ తీర్పు అప్రజాస్వామికమైనది, అశాస్త్రీయమైనది, అన్యాయమైనది.

ఈ తీర్పును నిరసిస్తూ చర్లపల్లి జైలులోని మహానది బ్లాకులో ఉన్న రాజకీయ ఖైదీలమైన మేము అక్టోబర్ 2న నిరసన దినంగా పాటిస్తూ ఒక రోజు నిరాహార దీక్ష చేపడుతున్నాం.

ఎన్. రవి శర్మ, తుషార్‌కాంత్ భట్టాచార్య, సి.ఎస్. చంద్రశేఖర్
(చర్లపల్లి జైలులోని రాజకీయ ఖైదీలు)

విద్య ప్రాథమిక హక్కు అనే రాజ్యాంగ స్ఫూర్తి నుంచి దూరమయ్యే క్రమంలోనే ప్రస్తుత విద్యా హక్కు చట్టం రూపొందిందని అంటున్నారు **రమేష్ పట్నాయక్**

ఫలితాలు కనిపించని విద్యా హక్కు చట్టం

ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుండి విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చింది. అయితే ఆ చట్ట ప్రభావం ఇటు ప్రభుత్వ పాఠశాలలపై గానీ, అటు ప్రైవేట్ పాఠశాలలపై గానీ ఏమీ కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల వసతులలో మెరుగుదలగానీ, ప్రైవేట్ పాఠశాలల విచ్చలవిడి దోపిడీపై అజమాయిషీ గానీ ఎక్కడా కనిపించడం లేదు. అందుకేనేమో చట్టంపై చర్చ ఇప్పటికీ వస్తుపరంగా కాక భావపరంగా సాగుతోంది. చట్టం మంచిదే, అమలు జరగకపోవడమే సమస్య అని భావించే వారున్నారు. చట్టాన్ని తీవ్రంగా ప్రశ్నించిన వారూ ఉన్నారు. అదలా ఉండగా, ప్రభుత్వ నిష్క్రియాపరత్వం వలన చట్టాన్ని సమర్థించేవారి ఉత్సాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఏది ఏమైనా రేపటి పౌరుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఈ చట్టంపై విస్తృతంగా చర్చ జరగడం అవసరం. అటువంటి చర్చ చట్టానికి అనుబంధంగా తయారు కానున్న నిబంధనావళిని ప్రభావితం చేయవచ్చు. అంతేకాక విద్యారంగంలో జరుగుతున్న దీర్ఘకాలిక పోరాటాలకు ఉపయుక్తంగా ఉండవచ్చు.

4 ఆగస్ట్ 2009న విద్యా హక్కు బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. అంతకు ముందే జూలై 20న ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. ఆగస్ట్ 26న రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారిన ఈ బిల్లు ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చింది. 15 డిసెంబర్ 2008న అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి అర్జున్‌సింగ్ రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఈ విద్యాహక్కు బిల్లును 'బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు బిల్లు'గా వ్యవహరిస్తూ వచ్చారు. 250 మంది సభ్యులున్న రాజ్యసభలో 54 మంది మాత్రమే హాజరైన రోజున మూజివాణి ఓటుతో ఆమోదం పొందిన ఈ బిల్లును లోక్‌సభలో ఆమోదించినపుడు 10 శాతం సభ్యులు కూడా లేరు. విద్య ఎడల, భవిష్యత్ తరం ఎడల మన ప్రజా ప్రతినిధులకున్న నిబద్ధత ఎంతటిదో ఈ సందర్భంగా మరింతగా స్పష్టమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏప్రిల్ 1న ఘనంగా సభలు జరిపి ఈ విద్యాహక్కు చట్టం అమలును ప్రకటించాయి. అయినా అనేక రాష్ట్ర కేంద్రాలలో జిల్లాలలో ఏప్రిల్ 1న నిరసన దినంగా పాటించారు. మేధావులు, ప్రజాస్వామిక వాదులు చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు.

బిల్లు స్థాయి నుండి ఈ చట్టాన్ని అమూలాగ్రం అధ్యయనం చేసిన వారు, ప్రధానంగా గత రెండు దశాబ్దాల నుండి విద్యాహక్కు చట్టం రావాలని ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తున్న వారు తీవ్రమైన అభ్యంతరాలు లేవనెత్తడం విశేషం. ప్రముఖ శాస్త్రవేత్త, జాతీయ విజ్ఞాన సంఘం పూర్వ సభ్యులు, డాక్టర్ పి.ఎం. భార్గవ బిల్లులో అనేక సమస్యాత్మకమైన విషయాలను లేవనెత్తుతూ ప్రధాన మంత్రికి లేఖ రాశారు. విద్యా రంగంపై కేంద్ర సలహా సభ్యులుగానూ, అలాగే బీహార్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కామన్ స్కూల్ కమిషన్ సభ్యులుగానూ పనిచేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ అనిల్ సద్గోపాల్ ఈ బిల్లును బాల బాలికలకు విద్యా హక్కు కల్పించడానికి బదులు ఉన్న హక్కులను కూడా కుదిస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ బిల్లు చట్టం కాకముందే 2009 మార్చ్‌లో ఢిల్లీలో విద్యా ప్రణాళిక, పరిపాలన జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్.యు.ఇ.పి.ఎ.) నిర్వహించిన సెమినార్‌లో అనేకమంది విద్యావేత్తలు, భాషావేత్తలు, న్యాయకోవిదులు ఈ బిల్లుపై తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తారు. అలాగే 2009 జూన్ 21, 22 తేదీలలో హైదరాబాద్‌లో కామన్ స్కూల్ విధానంపై జరిగిన జాతీయ సెమినార్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల మేధావులు, విద్యారంగ కార్యకర్తలు ఈ బిల్లును సమూలంగా మార్పు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ బిల్లుపై వివిధ రూపాలలో అభ్యంతరాలు లేవనెత్తుతూ దేశవ్యాపితంగా ఆందోళనలు జరిగాయి. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఏ దశలోనూ ఆపకుండా అన్ని లాంఛనాలు పూర్తిచేసి 1 ఏప్రిల్ 2010 నుండి చట్టంగా అమలు చేస్తోంది. అయితే ఈ చట్టానికి వ్యతిరేకంగా కోర్టులలో అనేక కేసులు నడుస్తున్నాయి. అందుకే ఈ చట్టం ఇంకా చర్చనీయాంశంగా ఉంది. అయితే ఈ 'బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009' గురించి చర్చించడానికి ముందు 2002లో ఎన్.డి.ఎ. ప్రభుత్వంచే చేయబడిన 86వ రాజ్యాంగ సవరణ గురించి చర్చించవలసిన అవసరం ఉంది.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్టుదల కారణంగా 0–14 వయో పరిమితికి చెందిన బాల బాలికల విద్యాహక్కుకు రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో (అధికరణం 45) చోటు దొరికింది. నిజానికి, అంబేద్కర్ బాల బాలికల విద్యా హక్కును ప్రాథమిక హక్కులలో చేర్చాలని వాదించినా రాజ్యాంగ పరిషత్‌లో మెజారిటీ అందుకు అంగీకరించలేదు. ఈ హక్కును ఆదేశిక సూత్రాలకే పరిమితం చేశారు. అయితే రాజ్యాంగం అమలు ప్రారంభమయిన పది సంవత్సరాలలోనే అమలు చేయాలని నిర్దేశించారు. ఆ విధంగా పది సంవత్సరాలలోనే అమలు జరగవలసిన ఈ రాజ్యాంగ అధికరణం 1990ల వరకు అమలు జరగకపోవడంతో ఉన్ని కృష్ణన్ కేసు (1993) లో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 14వ ఏట వరకు బాలబాలికల విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా, జీవించే హక్కులో భాగంగా పరిగణించాలని తీర్పునిచ్చింది. ఉన్ని కృష్ణన్ కేసులో ఈ భాగం చాలా విప్లవాత్మకమయినది. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడంలో సుప్రీంకోర్టుకున్న విశేష అధికారాల వలన రాజ్యాంగ సవరణ జరగకపోయినా 0–14 వయో పరిమితిలో బాల బాలికలకు విద్య ప్రాథమిక హక్కుగా సంక్రమించింది. మరొక రకంగా చెప్పుకోవాలంటే ఈ తీర్పు వలన 3–5 వయో పరిమితికి చెందిన పూర్వ ప్రాథమిక విద్య, 6–14 వయో పరిమితికి చెందిన ప్రాథమిక విద్య బాల బాలికలకు హక్కులుగా సంక్రమించాయి. ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడిని తీసుకువచ్చింది. ఆనాటి నుండి అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం ఈ హక్కును అమలు చేయకపోగా కుదించడానికి, నీరుగార్చడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తోంది.

2002లో ఎన్.డి.ఎ. ప్రభుత్వం రాజ్యాంగానికి 86వ సవరణ తీసుకువచ్చింది. ఈ రాజ్యాంగ సవరణ ఉన్ని కృష్ణన్ కేసు తీర్పులో బాల బాలికలకు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విద్యాహక్కును కుదించి వేసింది. విషయాన్ని వివరంగా చూస్తే, 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎన్.డి.ఎ. ప్రభుత్వం బాల బాలికల విద్యా హక్కుకు బూటకపు హామీనిస్తూ, '21ఎ' అధికరణాన్ని రాజ్యాంగంలోకి చేర్చింది. అయితే ఈ అధికరణంలో బాల బాలికలకు విద్యాహక్కు సుప్రీంకోర్టు తీర్పు 0–14 వయో పరిమితికి వర్తించేటట్లు కాకుండా 6–14 వయోపరిమితికి మాత్రమే వర్తించేటట్లు కుదించివేసింది. అంటే ఈ 86వ రాజ్యాంగ సవరణ వలన 3–5 వయోపరిమితికి చెందిన పూర్వ ప్రాథమిక విద్య ఇక ఎంత మాత్రమూ బాలబాలికల ప్రాథమిక హక్కు కాదన్న మాట. ఉన్ని కృష్ణన్ కేసులో తీర్పు సుప్రీంకోర్టు బాల బాలికలకు పూర్వ ప్రాథమిక విద్య (3–5 వయోపరిమితి), ప్రాథమిక విద్య (6–14 వయోపరిమితి) హక్కులు కల్పిస్తే 86వ రాజ్యాంగ సవరణ ద్వారా బి.జె.పి. నాయకత్వాన గల ఎన్.డి.ఎ. ప్రభుత్వం పూర్వ ప్రాథమిక హక్కును నిరాకరించి విద్యాహక్కును ప్రాథమిక విద్యకే పరిమితం చేసింది. ఈ 86వ రాజ్యాంగ సవరణ జరిగిన తరువాత ఉన్నికృష్ణన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అప్పటి విస్తృతి అర్థంలో చెల్లదు. అంటే 86వ రాజ్యాంగ సవరణ ఫలితంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఫలితం కుదించబడింది. అంటే 3–5 వయోపరిమితికి చెందిన పూర్వ ప్రాథమిక విద్య హక్కుగా నిరాకరించబడింది. ఫలితంగా పూర్వ ప్రాథమిక విద్య కొనుగోలు చేయగలిగే వారికే అందుబాటులో ఉంటుంది. విద్యను కొనలేని పేద, దళిత, గిరిజన, బలహీన వర్గాల బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య పూర్తిగా నిరాకరించబడుతుంది.

ఎన్.డి.ఎ. ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును బలహీనపరుస్తూ 86వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చినప్పటికీ నేటి యు.పి.ఎ. రాజ్యాంగాన్ని మరొకసారి సవరించి ఎన్.డి.ఎ. చేసిన తప్పును సరిదిద్దవచ్చు. రాజ్యాంగాన్ని సవరించడానికి ఇష్టం లేకపోయినా విద్యా హక్కు చట్టం ద్వారా బాలబాలికలకు మరిన్ని హక్కులు కల్పించాలను కున్నా రాజ్యాంగం అడ్డురాదు. అయితే ఈ యు.పి.ఎ. ప్రభుత్వం అలా చేయలేదు. తద్విరుద్ధంగా యు.పి.ఎ. ప్రభుత్వం 1 ఏప్రిల్ 2010 నుండి అమలులోకి తీసుకువచ్చిన బాలబాలికల 'ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009' బాలబాలికల విద్యా హక్కును మరింత కుదించివేసింది. 2002లో బాలబాలికల పూర్వ ప్రాథమిక విద్యా హక్కును రద్దు చేస్తూ ఎన్.డి.ఎ. ఆనాడు తీసుకువచ్చిన 86వ రాజ్యాంగ సవరణకు కాంగ్రెస్ నాయకత్వాన యు.పి.ఎ. పార్టీలు మద్దతు ఇస్తే, మిగిలిన ప్రాథమిక విద్యా హక్కును నీరుగార్చుడానికి యు.పి.ఎ. ప్రభుత్వం తీసుకు వచ్చిన 'బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009'కి బి.జె.పి. నాయకత్వాన గల ఎన్.డి.ఎ. ఈనాడు మద్దతు ఇవ్వడం పాలకవర్గ పార్టీల మధ్య భావసారూప్యతను కళ్లకు కడుతోంది.

2002లో తీసుకురాబడిన రాజ్యాంగ సవరణ వలన ప్రాథమిక హక్కులలో 21ఎ అధికరణం, ప్రాథమిక బాధ్యతలలో 51కె అధికరణం ఉనికిలోకి వచ్చాయి. ఈ అధికరణాలను ఆచరణలోకి తీసుకు రావడానికి ప్రత్యేకంగా ఒక చట్టం చేయవలసి ఉంటుంది. అటువంటి చట్టమే 2009 ఆగస్టులో తీసుకురాబడిన 'బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009'. ఈ చట్టంలో ఏముందో, ఏం లేదో పరిశీలిద్దాం.

ఈ విద్యాహక్కు చట్టం పూర్వ ప్రాథమిక విద్యకు ఎటువంటి గ్యారంటీ కల్పించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు పూర్వ ప్రాథమిక విద్యకు ఏర్పాటు చేయవచ్చని మాత్రమే ఈ చట్టం పేర్కొంటోంది. 3–5 వయోపరిమితి బాల బాలికలందరికీ పూర్వ ప్రాథమిక విద్య లభించాలనే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదు. అసలు ఈ చట్టం బాల్యాన్ని 6–14 వయో పరిమితిగా మాత్రమే గుర్తించింది. ఈ చట్టం నిర్వచనంలోనే పూర్వ ప్రాథమిక, సెకండరీ విద్య (9–12 తరగతు)లను తొలగించింది. ఈ చట్టం సెంకడరీ విద్యకు సంబంధించి ఎటువంటి ప్రస్తావనా చేయలేదు. ఈ చట్టం ప్రకారం బాలబాలికల విద్యా హక్కు 14వ ఏటతో లేదా 8వ తరగతితో ముగుస్తుంది. 14 ఏళ్ల లోపు 8వ తరగతి పూర్తి చేయలేని వారికి మాత్రమే 8వ తరగతి పూర్తి చేసే వరకు ఈ హక్కు కొనసాగుతుంది. కనీసం ప్రాథమిక హక్కుగా ప్రకటించబడిన ఎలిమెంటరీ విద్య (1 నుండి 8 తరగతులు)కు సంబంధించి కూడా ప్రమాణాల విషయంలో ఎటువంటి గ్యారంటీ ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు అనే కనీస ప్రమాణాన్ని అమలు చేయాలనే నిబంధన కూడా ఈ చట్టంలో పొందుపరచబడలేదు. ఈ చట్టం డి.పి.ఇ.పి. ద్వారా అమలు జరిగి విఫలమైన బహుళ తరగతుల బోధన (మల్టీగ్రేడింగ్ టీచింగ్) అనే విధానాన్నే కొనసాగిస్తోంది.

అయితే, అది కూడా అరకొర మాత్రమే. ఈ చట్టం ప్రకారం కూడా అత్యధిక ప్రభుత్వ పాఠశాలలో ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉంటారు. అంతేకాదు, ఈ చట్టంలో రెగ్యులర్ ప్రాతిపదికన మాత్రమే ఉపాధ్యాయులను నియమించాలనే నిబంధన లేదు. ఫలితంగా విద్యా వాలంటీర్ వ్యవస్థ కొనసాగుతోంది. ఇక ఉపాధ్యాయుల విద్యార్హత విషయానికి వస్తే ఈ చట్టం ఎటువంటి కనీస అర్హతలు నిర్ణయించలేదు. నిజానికి 2005లో రూపొందించబడిన నమూనా బిల్లులో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్.సి.టి.ఇ.) గుర్తింపుగల సంస్థలలో శిక్షణ పొందిన వారే ఉపాధ్యాయులుగా నియమించబడాలి అనే నిబంధన ఉండింది. అయితే 2008 డిసెంబర్‌లో రాజ్యసభలో ఈ బిల్లు ప్రవేశపెట్టినపుడు ఈ నిబంధన తొలగించారు. కనీస విద్యార్హత రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించాలని ఈ కొత్త చట్టం చెప్తుంది. ఆ విధంగా ఉపాధ్యాయుల విద్యార్హతల సమస్యను నీరుగార్చుడానికి ఏర్పాటు చేయడం జరిగింది. ఉపాధ్యాయులకు బడి బయట పనులు అప్పజెప్పరాదన్న కనీస నిబంధన కూడా ఈ చట్టంలో లేదు. జనాభా గణన, ప్రకృతి విపత్తుల సందర్భంలోనే గాక పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు అన్ని స్థాయిల ఎన్నికలలో, ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని ఈ చట్టం పేర్కొంటోంది. ఇంత వరకు ఏ చట్టం ఉపాధ్యాయులకు బడి బయట పనులు అప్పజెప్పడానికి ప్రభుత్వాలకు ఇంత స్పష్టమైన అధికారాలు కల్పించలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చట్టం తరువాత కూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచర్ అన్న ప్రాతిపదికన నియామకాలు జరగవు. నియమితులైన ఉపాధ్యాయులు కూడా రెగ్యులర్ ప్రాతిపదికన నియమితులైన వారు కాదు. ఉపాధ్యాయుల కనీస విద్యార్హతలపై ఎటువంటి నిబంధనలు లేవు. ఉపాధ్యాయులను బడి బయట పనులకు పంపడం రద్దు కాదు. ఈ చట్టం ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలలలో ఒక భాషా పండితుని పోస్టు రద్దయ్యే అవకాశం కూడా ఉంది. ఈ చట్టం వలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఎంత మాత్రమూ మెరుగుపడదు.

దేశవ్యాపితంగా చూసినప్పుడు ప్రతి ముగ్గురిలో ఇద్దరు బాల బాలికలు ఏడవ తరగతి పూర్తి చేయకుండానే చదువు మానేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చూసుకున్నా ఐదవ తరగతి పూర్తి 35 శాతం చదువు మానేస్తున్నారు. బాలబాలికలు చదువు మానేయడానికి అనేక కారణాలుండవచ్చు. కానీ, కుటుంబ పేదరికం అన్నింటి కంటే పెద్ద కారణం. కుటుంబ పేదరికమే అనేక ప్రత్యక్ష, పరోక్ష రూపాలలో బాల బాలికల విద్యకు అడ్డుపడుతోంది. బాల బాలికల విద్యకు కుటుంబ పేదరికం అడ్డు రాకుండా వారికి మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం ఫలహారం, సాయంత్రం ఉపాహారం అందించాలి. ఉచిత ఆరోగ్య సేవలు, అవసరమైన సందర్భాలలో వసతి ఏర్పాట్లు చేయాలని మేధావులు, ప్రజా సంఘాలు చేసిన విజ్ఞప్తిని చట్టం రూపొందించిన కేంద్ర

ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకనుగుణంగా చట్టంలో ఎటువంటి నిబంధనలు కల్పించలేదు. వలస కార్మికుల పిల్లలకు విద్య అందించడానికి ఈ చట్టంలో ప్రత్యేకమైన శ్రద్ధ ఏమీలేదు. ట్రైబల్ ప్రాంతాలలో విద్యనందించడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఈ చట్టంలో ఏమీ లేవు. విద్యకు దూరంగా ఉంటున్న దళిత కుటుంబాల బాల బాలికల గురించి గానీ, ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉంటున్న బాలికల గురించి గానీ, అంగవైకల్యం ఉన్న బాలబాలికల గురించి గానీ ఈ చట్టంలో ఉపయోగకరమైన ప్రత్యేక చర్యలు ఏమీ లేవు. ఈ చట్టం మొత్తం పైన బాల బాలికలు మధ్యలో బడిమానివేసే సమస్య గురించి పట్టించుకోలేదని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ చట్టం అందరికీ విద్య గానీ, అందరికీ మంచి ప్రమాణాలు గల విద్య గానీ అందించజాలదు.

ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే ఈ చట్టం వ్యాపార మాధ్యమంలో పాఠశాలల నిర్వహణను నిషేధించడం లేదు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులపై ఎటువంటి పరిమితిని విధించడం లేదు. ప్రైవేట్ పాఠశాలలు అనుసరిస్తున్న కర్కశమైన బోధనా విధానాలపై ఎటువంటి నిబంధనలు విధించడం లేదు. ఈ చట్టం ఫీజుల పెంపుదలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసే మధ్యతరగతి వారికి ఎటువంటి ఉపశమనం కలిగించడం లేదు. ఈ చట్టంలో క్యాపిటేషన్ ఫీజుల నిషేధం గురించి చెప్పబడింది. అయితే క్యాపిటేషన్ ఫీజుల నిషేధానికి ఇచ్చిన నిర్వచనం ఏమంటే అడ్మిషన్ సందర్భంలో ప్రకటించిన ఫీజులు వసూలు చేయకూడదని మాత్రమే. అంటే ప్రైవేట్ యాజమాన్యాలు ఎంత ఫీజు అయినా నిర్ణయించుకుని దానిని అడ్మిషన్ సందర్భంలో నోటీసు బోర్డులో పెడితే చాలన్నమాట. ఒక్కమాటలో చెప్పాలంటే కేపిటేషన్ ఫీజుకు ఈ చట్టం ఇచ్చిన నిర్వచనం ప్రకారం ప్రకటించడం వసూలు చేస్తే క్యాపిటేషన్ ఫీజు, ప్రకటించి ఎంత వసూలు చేసినా అది క్యాపిటేషన్ ఫీజు కాదన్నమాట. అది చట్టవిరుద్ధం కాదు. ఈ చట్టం ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాలు ఎంత ఎక్కువ ఫీజులనైనా వసూలు చేసుకోవచ్చు. అదే విధంగా వారి వద్ద పనిచేసే ఉపాధ్యాయులకు ఎంత తక్కువ జీతాలైనా ఇవ్వవచ్చు. అలాగే ఈ చట్టం కులమతాలకతీతంగా ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా బాలబాలికలందరికీ సమాన ప్రమాణాలు గల విద్య అన్నమాట మచ్చుకైనా ఎక్కడా వాడలేదు. విద్యా వ్యాపారాన్ని నిషేధించాలని, ప్రభుత్వ పాఠశాలలైనా, ప్రైవేట్ పాఠశాలలైనా బాల బాలికల నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయరాదని, ప్రైవేట్ రంగంలో పాఠశాలల స్థాపనకు సేవాదృక్పథంలో నడిపే సంస్థలకు మాత్రమే అనుమతించాలనే విద్యావేత్తల వాదనలను ఈ చట్టం పెడచెవిని పెట్టింది. కొఠారీ కమిషన్ 1966లో చెప్పిన కామన్ స్కూల్ విధానం ద్వారా మాత్రమే పిల్లలలో సృజనాత్మకతను కాపాడే, సామాజిక దృక్పథాన్ని పెంపొందించే, సమగ్రమైన వ్యక్తిని తీర్చిదిద్దే ప్రక్రియ సాధ్యమవుతుందని ఈ చట్టం గుర్తించనే లేదు. కామన్ స్కూల్ విధానం రావాలని ఆశించిన మేధావులను ఈ చట్టం నిరాశపరిచింది.

ఈ చట్టం కొఠారీ కమిషన్ సూచించిన కామన్ స్కూల్ విధానం గురించి మాట్లాడకపోవడం సరే సరి. కనీసం ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడానికి గానీ, ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించడానికిగానీ ఏమీ చేయడం లేదు. ఇంతకీ ఈ ప్రభుత్వం మొదటి వంద రోజులలోనే ఈ చట్టాన్ని ఎందుకు చేసినట్లు? ఇందుకు సమాధానం ప్రభుత్వం అనుసరిస్తున్న నయా సరళీకరణ విధానాలలోనే దొరుకుతుంది. చట్టంలో ఒక ముఖ్యమైన అంశం ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి.). ప్రైవేట్ పాఠశాలలు 25 శాతం సీట్లలో ఫీజులు కట్టలేని పేద కుటుంబాల బాల బాలికలను చేర్చుకుంటే వారి ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందనీ ఈ చట్టంలో ఒక నిబంధన పేర్కొంటుంది. ఈ విధంగా ప్రజాధనాన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాక ప్రైవేట్ పాఠశాలలకు ధారాదత్తం చేయడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తుంది. ఆరోగ్యశ్రీ పథకం వలె ఇది విద్యాశ్రీ పథకంగా దేశవ్యాపితంగా ముందుకు వస్తుంది. ఈ దేశంలో 30 శాతం కుటుంబాలే కనీస ప్రమాణాలు గల ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపగలుగుతున్నాయి. ఈ చట్టం ఫలితంగా మరి పది శాతం మందికి రీ ఇంబర్స్‌మెంట్ లభిస్తుంది. ఇక 40 శాతం మంది బాలబాలికలు సుమారు యథాతథంగా కొనసాగే ప్రభుత్వ పాఠశాలలో అరకొర చదువులు కొనసాగించగా మిగిలిన 20 శాతం మంది బాలబాలికలు ఇప్పటిలాగే బడి బయట బాల కార్మికులుగా మగ్గిపోతారు. ఈ చట్టం వలన వచ్చే మార్పంతా ప్రైవేట్ పాఠశాలలకు రీ ఇంబర్స్‌మెంట్ రాబడులు ఇబ్బడిముబ్బడిగా అందడం మాత్రమే.

అమలు జరుగుతున్న ఆరోగ్యశ్రీకి, చట్టంగా రూపుదిద్దుకున్న 'విద్యాశ్రీ'కి మూలాలు ప్రపంచబ్యాంక్ విధానాలలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంక్ మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఆర్థిక సంస్కరణలు నేడు రెండవ దశలోకి అడుగుపెట్టాయి. మొదటి దశలో వివిధ దేశాలలో సామాజిక సేవలను ప్రైవేట్‌పరం చేయడంలో ప్రపంచ బ్యాంక్, ఆయా దేశాల ప్రభుత్వాలు సఫలీకృతం అయినాయి. విద్యా, వైద్యం వంటి సేవల ప్రైవేటీకరణ వలన ధనిక, మధ్యతరగతి వర్గాలు తమ విద్య, వైద్య అవసరాల కొరకు ప్రైవేట్ రంగానికి మారిపోయాయి. ప్రైవేట్ రంగంలోకి వెళ్లగలిగిన వారంతా ఫీజు చెల్లిస్తూ ప్రైవేట్ రంగానికి వెళ్లిపోయారు. పేదలు ఎటూ ఫీజులు కట్టలేరు కాబట్టి వారు ప్రైవేట్ రంగానికి వెళ్లలేరు. ఆ కారణంగా ఇక ప్రైవేట్ రంగం విస్తరించే అవకాశం ఎంత మాత్రమూ లేదు. కానీ పెట్టుబడి నిరంతరం విస్తరించే మార్కెట్‌లను కోరుకుంటుంది. కార్పొరేట్ సంస్థలకు నిరంతరం మార్కెట్‌ను సృష్టించి అందించడం ప్రభుత్వాలు తమ విధిగా భావిస్తాయి. అందుకే ప్రభుత్వాలు ప్రజల ముక్కుపిండి వసూలు చేసిన బడ్జెట్ నిధులతో ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో ప్రైవేట్ యాజమాన్యాల కొరకు మార్కెట్‌ను విస్తరిస్తున్నాయి. ఈ సలహా చెప్పింది ప్రపంచబ్యాంకే. ప్రపంచబ్యాంక్ రెండవ దశ నయా సరళీకరణ విధానాలలో భాగంగా ఈ ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు ముందుకు వచ్చాయి. దేశంలో 70 శాతంగా ఉన్న పేదలు, దళితులపై ఖర్చు చేయాల్సిన నిధులను ఈ పి.పి.పి. పథకాల ద్వారా ప్రైవేట్ యాజమాన్యాలకు తరలిస్తున్నారు.

పేదలకు కార్పొరేట్ విద్య పేరుతో ముందుకు వస్తున్న ఇటువంటి పథకాల ద్వారా జనాభాలో పది, పదిహేను శాతంగా ఉన్న దిగువ మధ్యతరగతికి చెందిన వారిలో కొంతమంది ప్రయోజనం పొందవచ్చు నేమో గానీ, మిగిలిన అధిక శాతంలో ఉన్న పేద, దళిత కుటుంబాల బాలబాలికలు చదివే ప్రభుత్వ బడులలో కనీస వసతులు, అవసరమైనంత ఉపాధ్యాయులు లేక వారి చదువు చట్టుబండలు కావడం మాత్రం ఖాయం. అసలు ఈ చట్టంలో అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఈ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం విధానమే కావచ్చు. అలా కాకపోయినా కనీసం, ప్రైవేట్ పాఠశాలలకు ఇది అత్యంత ప్రీతికరమైన నిబంధన అని చెప్పవచ్చు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ప్రస్తుతానికి ఈ 25 శాతం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్నా, వారు క్రమక్రమంగా అధిక సంఖ్యలో తక్కువ నిర్వహణ వ్యయం కలిగిన లోకాస్ట్ పాఠశాలలను పెద్ద సంఖ్యలో స్థాపించి అధిక లాభాలు పొందుతారు. యశ్‌పాల్ కమిటీ నివేదికలో కూడా ఇదే ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్య విధానానికి అనుకూలమైన సూచనలు ఉండడం ఇక్కడ గమనార్హం. ఈ విద్యా హక్కు చట్టం యశ్‌పాల్ కమిటీ నివేదిక, ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న విదేశీ విద్యా సంస్థల బిల్లు, అక్రిడిటేషన్ బిల్లు, విద్యా ట్రిబ్యునల్ బిల్లు అన్నీ విద్యారంగంలో పాలక వర్గాల నయా సరళీకరణ విధానాల అజెండాలో భాగాలని ఒక్క మాటలో చెప్పవచ్చు.

(రచయిత ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో మన దేశం ప్రపంచంలోనే అట్టడుగు స్థానంలో ఉందన్న వాస్తవాన్ని గణాంకాలతో సహా వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

ప్రభుత్వానికే రోగం వచ్చింది

ప్రజారోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2008-09 బడ్జెట్‌లలో కేటాయించిన మొత్తం 75 వేల కోట్ల రూపాయలు. అంటే నెలకు తలసరి ఖర్చు యాభై రూపాయలు. సామాన్యుడికి ఏదైనా అనారోగ్యం వచ్చి ఒకే ఒక్కసారి మందుల దుకాణానికి వెళ్లి మందులు కొనబోతే ఇంతకంటే ఎక్కువ ఖర్చవుతుంది. ఇదీ పాలకుల నిర్వాకం. రోగాలు, రొష్టులు, జ్వరాలు, చావులు రాకేం చేస్తాయి?

సామాజిక సంక్షేమమే మా ఎజెండా అని చెప్పుకొనే ప్రభుత్వం ఆ ప్రజారోగ్యానికి చేసే ఖర్చు సంక్షేమ ఖర్చులో కేవలం అయిదు శాతం మాత్రమే. సామాజిక సంక్షేమం అంటే జీవిత స్థాయి, ఇల్లు, పారిశుధ్యం, నీటి సరఫరా, విద్య, వైద్యం, ఉపాధి - ఇన్ని ఉన్నాయి. ప్రజారోగ్యం ఖర్చు అంటే కేవలం ప్రభుత్వం పెట్టే ఖర్చు మాత్రమే. అరోగ్యం కోసం ప్రజలు చేసే ఖర్చుతో కలిపి మొత్తం అయ్యే ఖర్చులో భాగం మాత్రమే. ప్రభుత్వం 15 శాతం మాత్రమే ఖర్చు చేస్తుంది. మిగతా 85 శాతం ప్రజలే ఖర్చు చేస్తున్న పరిస్థితి. ఇందుకోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుంది అని 1990-91 నుంచి, అంటే సంస్కరణలు ప్రారంభించిన నాటి నుంచి చూస్తే, రూపాయల్లో ఖర్చు పెరుగుతూ వచ్చింది కాని (రు. 7309 కోట్ల నుంచి 2006-07 లో రు. 52,126 కోట్లు) పెరుగుదల వేగం 1990-91 ముందు నాటితో పోలిస్తే తగ్గుతూ వచ్చిందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. సామాజిక సేవల ఖర్చు మొత్తంలో ప్రజారోగ్యం ఖర్చు శాతం 1990-91లో ఎక్కడుందో 2006-07లో సుమారుగా అక్కడే ఉంది. మరో రకంగా చూస్తే జి.డి.పి.లో మన ఖర్చు శాతం 0.91 శాతం మాత్రమే. ప్రభుత్వం ఇంత తక్కువ ఖర్చు చేయడంతో ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల మీద ఆధారపడాల్సి వచ్చింది.

దేశంలో కుటుంబాలు 68.8 శాతం మేరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. మన రాష్ట్రానికి పరిమితమై చూస్తే, రెవెన్యూ బడ్జెట్‌లో ఈ పద్దు కింద ఖర్చు 1991-92లో 5.77 శాతం నుంచి 2003-04 బడ్జెట్ అంచనా ప్రకారం 5.21 శాతానికి పడిపోయింది. గమనించాల్సిన విషయమేమంటే 1985-86లో అంటే ప్రపంచబ్యాంక్ ఆదేశం మేరకు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టక ముందు 6.41 శాతం ఉంది. దేశానికి తిరిగి వస్తే కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలన్నీ ప్రజారోగ్యం కోసం ఖర్చు చేసింది 23.8 శాతం (2001-02). ఇలా గీసి గీసి ఖర్చు చేస్తూ, మరోపక్క ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు అనుమతులిస్తూ పోతే, ప్రజలకు ఆరోగ్య సేవలందించడంలో అసమానతలు సృష్టించడమే. ప్రపంచబ్యాంక్ దేశంలో అడుగు పెట్టినప్పటి నుంచి ఈ అసమానతలు రాను రాను అన్ని రంగాలకూ విస్తరిస్తున్నాయి. ఈ లెక్కన 2015 నాటికి నిర్దేశించుకొన్న మిలీనియం డెవలెప్‌మెంట్ లక్ష్యాలు చెట్టెక్కినట్టే.

ప్రజారోగ్యం మానవాభివృద్ధిలో అంతర్భాగం, ప్రధానాంశం కూడా. ప్రపంచ మానవాభివృద్ధి సూచిక ప్రకారం 2007లో మొత్తం 182 దేశాల్లో మన దేశం 134వ స్థానంలో ఉండడం చూస్తే ప్రపంచంలో భారతదేశం అగ్రరాజ్యంగా అవతరించబోతుందనేది కేవలం స్వప్నంగానే మిగిలిపోతుంది. 2000-07 మధ్యకాలంలో 124 స్థానం నుంచి 134వ స్థానానికి దిగజారిపోవడం మన ఆశలను నిలువు లోతున పాతరేసినట్లే. మరో పోలిక ఏమంటే ఇదే కాలంలో 96 నుండి 92వ స్థానానికి చేరుకొంటే, మనం కిందకు దిగజారుతున్నాం.

ఒకపక్క జి.డి.పి. పెరుగుతూంటే, ప్రజారోగ్యం నేలచూపు చూస్తూండడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి తిరుగులేని నిదర్శనం. ప్రజల ఆరోగ్యాలను కునారిల్ల చేసే అభివృద్ధి అభివృద్ధేనా? ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేసే ఖర్చు విషయంలో 175 దేశాల ఖర్చులను పరిశీలించగా మన దేశం 171వ స్థానంలో ఉండడం అభివృద్ధి సూచికా? ఏడు సార్క్ దేశాలతో మన దేశాన్ని పోలిస్తే మనం నేపాల్ (5.1 శాతం), శ్రీలంక (4.29 శాతం)ల కన్నా తక్కువ ఖర్చు చేస్తున్నాం. ఆఖరు మాల్దీవుల పాటి కూడా (5.5) చేయకపోవడం సిగ్గుచేటు. డాక్టర్ల విషయంలో మూడోస్థానం (మొత్తం ఏడు దేశాలు), నర్సులు, మంత్రసానుల్లో రెండవస్థానం, పడకల్లో మూడో స్థానంలో ఉన్నాం. జి-8 దేశాలతో పోల్చుకొంటే మనం సోదిలోకి కూడా రాము.

ఇంత తక్కువ ఖర్చు కారణంగా ఆసుపత్రుల్లో సౌకర్యాలెలా సంతృప్తికరంగా, అవసరాలకనుగుణంగా ఉంటాయి? పట్టణాలు, నగరాలతో పోలిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో అసంతృప్తికరంగా ఉన్నాయని వేరే చెప్పాల్సిన పనిలేదు. దేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు పట్టణాల్లో కన్నా, గ్రామీణ ప్రాంతాల్లో 15 ఇంతలు తక్కువగా ఉన్నాయి. 69 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒకే ఒక పడక ఉంది. కేంద్ర ప్రభుత్వ 2008 ఆర్థిక సర్వే ప్రకారమే, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే 20,855 సబ్-సెంటర్లు, 4833 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2525 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల కొరత ఉంది. (2001 జనాభా లెక్కలకు కేవలం సబ్ - కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు పరిమితమై చూస్తే 2005-08 సంవత్సరాల మధ్య ఎటువంటి పెరుగుదలా లేదు. అయితే కొన్ని విషయాల్లో పెరుగుదల కనిపించింది కాని, అవసరాలతో పోలిస్తే తక్కువేనని సర్వేలు తెలియజేస్తున్నాయి.

ఎన్ని లక్ష్యాలు ప్రకటించుకున్నా ప్రజలు మాత్రం పేదరికంలో మగ్గుతున్నారనీ, సాధారణ రోగాలకు కూడా వైద్యం అందక ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారనీ అంటున్నారు **ఎ. నరసింహారెడ్డి**

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలకు గ్రహణం

దారిద్ర్య శృంఖలాల్ని తెంచి, ఆకలి అనారోగ్యాల నుండి ప్రజలను విముక్తం చెయ్యడమే మన స్వాతంత్ర్యానికి అర్థం, పరమార్థం. వలస పాలన అంతరించి అరవై మూడేళ్ళు గడచినా నాటి జనాభా కంటే ఎక్కువ మంది నిరుపేదలు ఒక పూట కూడా తిండి దొరకని స్థితిలో ఆకలితో మాడిపోతున్నారు. మరోవైపు లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలు గోదాములలో ముక్కి కుళ్ళిపోతున్నాయి. దారిద్ర్య నిర్మూలనే ధ్యేయమంటూ రచించిన పంచవర్ష ప్రణాళికలు, సహస్రాభివృద్ధి లక్ష్యాలు ప్రజల జీవన ప్రమాణాలను ఏమాత్రం పెంచలేక పోవడానికి ఆరు దశాబ్దాలుగా పాలకులు అనుసరిస్తున్న విధానాల విష ఫలితాలు నేటి విపత్కర పరిస్థితికి కారణం. ఇటీవలి కాలంలో దేశం రెండంకెల ఆర్థిక వృద్ధి దిశగా మాత్రమే పరుగెత్తుతోంది. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. సంపద సృష్టి జరుగుతున్నా పేదరికం తొలగడం లేదు. ప్రపంచవ్యాప్తంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న నిర్భాగ్యుల్లో సగం మంది భారతీయులేనని అంతర్జాతీయ నివేదికలు ఘోషిస్తున్నాయి. ప్రపంచంలో వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతున్న ఐదు దేశాలలో మన దేశం ఒకటి. అయితే ఆ ఆర్థికాభివృద్ధిలో ఏమాత్రం వాటా పొందని అభాగ్యులు మన దేశంలోనే అత్యధికంగా ఉన్నారు. సహజంగా ఆర్థికాభివృద్ధి పెరుగుతుంటే పేదల సంఖ్య తగ్గుతుంది. అదేమి చిత్రమో కాని మన దేశంలో పేదల సంఖ్య పెరుగుతోంది. అంటే మన 9 శాతం ఆర్థికాభివృద్ధి మేడిపండు చందంగా, మన దారిద్ర్యం రాచపుండులా ఉన్నాయి. మంచం పట్టిన రోగి పరుగు పందెంలో నెగ్గడం సాధ్యం కానట్లే, రోగగ్రస్తమైన జాతి ప్రగతి పురోగమించదన్నది సుస్పష్టం.

నూతన సహస్రాబ్ది ఆరంభంలోనే మానవాళి మహోదయమే లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి 2000 సెప్టెంబర్ నాడు విస్పష్ట అజెండాను ప్రపంచ దేశాల ఎదుట ఉంచింది. ప్రపంచీకరణ వ్యయభారాలు, ప్రయోజనాల పంపిణీల్లో అసమానతల్ని పెంచుతుందని సమితి శిఖరాగ్ర సమావేశం ఆనాడే గుర్తించింది. 2015 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను ప్రకటించింది. అభివృద్ధి కోసం ప్రపంచ దేశాల భాగస్వామ్యాల రూపకల్పనతో సహా సహస్రాబ్ది లక్ష్యాల పరిపూర్తికి నాటి శిఖరాగ్ర సమావేశానికి 192 దేశాలు, 23 అంతర్జాతీయ సంస్థలు హాజరై , 147 దేశాల అధినేతలు దీనిపై సంతకాలు చేశారు. "దుర్భర దారిద్ర్యం సృష్టించే అమానవీయ పరిస్థితుల నుండి మాతోటి స్త్రీ పురుషులను, పిల్లలను తప్పించేందుకై మేము ఏ అవకాశాన్ని విడనాడబోము" అంటూ ప్రపంచ దేశాధినేతలు ప్రతిజ్ఞ చేశారు. సమితి ప్రకటనలో 8 లక్ష్యాలు, 18 టార్గెట్స్, 48 ఇండికేటర్స్‌ను పేర్కొన్నారు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలనే మన ప్రభుత్వం 10వ పంచవర్ష ప్రణాళికలో జాతీయ అభివృద్ధి లక్ష్యాలుగా చేర్చడం జరిగింది. మూడింట రెండొంతుల పుణ్యకాలం గడచిపోయాక లక్ష్యాలలో ప్రగతిని పరికిస్తే లక్ష్యాల సాధన లక్ష్యానికి బారెడు దూరంలో ఉంది.

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు

1. కటిక దారిద్ర్యాన్ని, ఆకలిని నిర్మూలించడం,
2. సార్వత్రిక ప్రాథమిక విద్య,
3. లింగ సమానత, మహిళా సాధికారత,
4. శిశు మరణాల తగ్గింపు,
5. ప్రసూతి మరణాల తగ్గింపు,
6. హెచ్.ఐ.వి/ఎయిడ్స్, మలేరియా, క్షయ తదితర వ్యాధులకు అడ్డుకట్ట,
7. పర్యావరణ పరిరక్షణ,
8. అభివృద్ధి కోసం ప్రపంచ దేశాల భాగస్వామ్య రూపకల్పన

ఆరోగ్య సూచికలు అంటే జీవితకాలం, శిశుమరణాలు, కుటుంబ నియంత్రణ లాంటి విషయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తుంది. అయినా శిశు మరణాలు వెయ్యి పుట్టుకల్లో ఇంకా 52 (2008లో) మంది చనిపోతున్నారు. పురుటి సమయ మరణాలు ప్రతి లక్షకు 254 మంది మరణిస్తున్నారు. అయితే రాను రాను పెరుగుదలలో మందకొడితనం కనిపిస్తోంది. ఉదాహరణకు శిశుమరణాలు 1981–91, అంటే సంస్కరణలు ప్రవేశపెట్టక ముందు సంవత్సరానికి ముగ్గురు చొప్పున మరణిస్తుంటే, 1991 – 2008 మధ్య 1.65 చొప్పున మాత్రమే తగ్గింది. అంటే తగ్గుదల వేగం తగ్గింది.

ప్రజల ఆందోళన మరీ ఎక్కువైతే ఒక కమిటీ ఏర్పాటు చేయడం ప్రభుత్వం అవలంబించే సాచివేత విధానం. ప్రజారోగ్య సమస్య గురించి 1946లో భోర్ కమిటీ నియామకంతో ప్రారంభించి 21 కమిటీలు వేశారు. అయినా అనారోగ్యాలు, అంటు వ్యాధులు, రోగాలు పెరుగుతూనే ఉన్నాయి. అంటే ప్రభుత్వాన్నే రోగం పట్టి పీడిస్తోంది. మాత్రలు, సూదిమందులతో ఈ రోగం తగ్గెట్లు లేదు.

(ఈ నెల 9, 10 తేదీల్లో మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో 'ప్రపంచీకరణ – భారత ఆర్థిక పరిస్థితి' మీద జరిగిన సెమినార్‌లో జి.మొనికొండ, డాక్టర్ జె. సిరిల్ కస్‌మెనిలు సమర్పించిన పత్రం ఆధారంగా)

(రచయిత సీనియర్ పాత్రికేయులు, వీక్షణం గౌరవ సంపాదకులు) వీ

ప్రపంచ వ్యాప్తంగా ఆకలి, దారిద్ర్యాలను 2015 నాటికి సగానికి తగ్గించాలని లక్ష్య నిర్దేశన చేసుకున్నా నేడు వంద కోట్లకు చేరువలో ఉన్న బాధాసర్పదష్టుల సంఖ్య రానున్న అయిదేళ్ళలో ప్రభుత్వాల చిత్తశుద్ధి, సామర్థ్యాలకు పెను సవాళ్ళుగా పరీక్ష పెట్టనుంది. నాటి చారిత్రాత్మక తీర్మానం రూపకల్పనలో చురుగ్గా పాల్గొన్న భారత్ సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను ఏమేరకు పురోగతి సాధించిందీ తెలిపే ఒక నివేదికను ఆగస్టులో ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యు.ఎన్.డి.పి) వెలువరించిన తాజా నివేదిక – భారతదేశానికి సంబంధించి నిరాశజనక చిత్రాన్నే ఆవిష్కరించింది. సహస్రాబ్ది ఎనిమిది లక్ష్యాల్లో ఏ ఒక్క దాన్ని ఇండియా 2015 నాటికి సాధించే అవకాశం లేదని తేల్చి చెప్పింది. ఆ నివేదిక ఆధారంగా అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ ఎక్కడుందని పరిశీలిస్తే కలిగేది నిర్వేదమే. దశాబ్దం క్రితం నిర్దేశించుకున్న 'సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల సాధనలో' సాధించిన ప్రగతిని సమీక్షించేందుకు గత సెప్టెంబర్ 20 నుండి 22 తేదీల్లో మూడు రోజుల పాటు ఐక్యరాజ్యసమితి అసాధారణ శిఖరాగ్ర సమావేశాన్ని న్యూయార్క్‌లో నిర్వహించింది.

పెరుగుతున్న అసమానతలు

2010 సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య సేవ సంస్థలు క్యాప్ జిమిని, మెరిల్‌లించ్‌లు రూపొందించిన ప్రపంచ సంపద నివేదిక ప్రకారం భారతదేశంలో కుబేరులనదగ్గవారు ఒక లక్షా ఇరవై ఆరు వేల ఏడు వందల మంది ఉన్నారు. 2008తో పోల్చితే వీరి సంఖ్య రెట్టింపుకు పైగా పెరిగింది. వీరి సంపద స్థూల జాతీయాదాయంలో మూడింట ఒక వంతుగా ఉన్నది. మనదేశంలో ఉన్న శతకోటీశ్వర్ల సంఖ్య 52కి చేరింది. ఈ 52 మంది ఉమ్మడి సంపద దేశ జి.డి.పి.లో 25 శాతానికి సమానంగా ఉంటుంది. ఇటీవల ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ దేశాలలో 2009లో కొత్తగా 5 కోట్ల మంది పేదలు అదనంగా చేరిపోయారు. అంతేగాక 2015 నాటికి పేదరికం కొద్దిపాటిగా పెరగనుందని నివేదికను బట్టి తెలుస్తుంది. ఇక మన దేశంలో 2004–2007 కాలంలో కన్నా, 2008–2009 మధ్య మూడు కోట్ల ముప్పై ఆరు లక్షల మంది లేదా అంతకు మించిన సంఖ్యలో భారతీయులు పేదలలో కలిసారు. 2009లోనే ఒక కోటి ముప్పై ఆరు లక్షల మంది అంతకుముందు ఏడాది కన్నా ఎక్కువగా పేదలలో చేరారు.

ఒక అంచనా ప్రకారం 2007–08 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకున్నట్లయితే మన దేశంలో అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్న చిత్తశుద్ధే పాలకులకు ఉన్నట్లయితే ప్రభుత్వ విధానాలను సమీక్షించాలి. పేదలకు, ధనికులకు మధ్య అంతరాన్ని పెంచుతున్న ప్రస్తుత ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోనట్లయితే సహస్రాబ్ది లక్ష్యాల సాధన అసాధ్యమవక తప్పదు. అలాకాకుండా విధానాలలో సమూలమైన మార్పులు తీసుకురాగలినట్లయితే ఈ లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు, ప్రభుత్వం ప్రకటిస్తున్న పన్ను రాయితీలను చూద్దాం. ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో (2009–10) ప్రకటించిన పన్ను రాయితీల మొత్తం రు. 5,02,299 కోట్లు. కార్పొరేట్ రంగానికీ, కుబేరులకు ఇచ్చిన ప్రత్యక్ష పన్నుల రాయితీలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వ సంక్షేమ చర్యల్లో పెట్టుబడిగా పెట్టినట్లయితే, ఉపాధి అవకాశాలు పెరగడం, తద్వారా దేశీయంగా డిమాండ్ పెరగడం జరిగేది. అప్పుడు ఆర్థిక రంగ పరిస్థితి ఎంతగానో మెరుగుపడేది. పేదరికము, పౌష్టికాహార లోపమూ తగ్గుముఖం పట్టేవి. దారిద్ర్య నిర్మూలన ప్రభుత్వ ధార్మికతపై ఆధారపడి ఉండదు. అందుకు అనుకూలమైన విధానాలను రూపొందించి అమలు చేయడంలో ఉంటుంది.

దేశంలో పెరుగుతున్న మిలియనీర్లు

సంవత్సరం	కుబేరుల సంఖ్య
2005	70,000
2006	83,000
2007	1,00,015
2008	1,23,000
2009	84,000
2010	1,26,700

ప్రజారోగ్యంలో వెనుకంజ

ఎయిడ్స్, మలేరియా తదితర వ్యాధుల నిర్మూలన సహస్రాబ్ది లక్ష్యాల్లో ఒక లక్ష్యంగా ఉన్నది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ 2007లో వెల్లడించిన అంచనాల ప్రకారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు 57 లక్షల నుంచి 30 లక్షలకు తగ్గారు. ప్రజారోగ్యం మెరుగు పడినందున ఈ తగ్గుదల సంభవించలేదు. తప్పుడు సమాచారాన్ని ఆధారం చేసుకొని వేసిన అంచనాల కారణంగానే ఈ తగ్గుదల కనిపించింది. కాని వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

ఇటీవలి కాలంలో మలేరియా వ్యాధిగ్రస్తులు తగ్గినప్పటికీ మలేరియా కారణంగా సంభవించే మరణాల సంఖ్యలో మాత్రం తగ్గుదల లేదని నివేదిక వెల్లడించింది. నిపుణుల అభిప్రాయం కూడా దీనినే బలపరుస్తున్నది. సహస్రాబ్ది నివేదిక ప్రకారం 2005 నుండి 2008 వరకు కోటి 50 లక్షల నుంచి కోటి 80 లక్షల మంది మలేరియా బారిన పడ్డారు. పది వేల నుంచి పదిహేడు వేల వరకు మరణాలు సంభవించాయి. మరోవిధంగా చెప్పాలంటే గత దశాబ్దితో పోల్చుకుంటే, ఈ దశాబ్దిలో మలేరియా వ్యాధిగ్రస్తులుగానీ, ఈ వ్యాధి కారణంగా మరణించినవారు గానీ పది రెట్లు పెరిగినట్లు అధికారిక సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. దీనంతటినీ చూస్తే సహస్రాబ్ది లక్ష్యాలలో ఒకటైన వ్యాధుల నిర్మూలనలో మనం వెనుకబడి ఉన్నట్లు అర్థం అవుతుంది. మలేరియాను అదుపు చేయడంలో మనం విఫల మయ్యామనే చెప్పాలి. ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాలలో నివసించే ఆదివాసులలో పరాన్నభుక్కుల ద్వారా సంక్రమించే మలేరియా కనబడుతున్నది. ఇది ప్రాణాంతకమైనది. దీనికి సంప్రదాయ వైద్య చికిత్స ఏ మాత్రం పనికిరాదు. కొత్తగా వస్తున్న మందులను దీనికి వాడాలి. కాని ఇవి ఖర్చుతో కూడుకున్నవి. తత్ఫలితంగా మలేరియాకు చికిత్స చేయడం క్లిష్టంగా ఉంటున్నది.

క్షయ రోగులలో ప్రథమ స్థానం

పేదరికం, పరిసరాల కాలుష్యం కారణంగా క్షయ వ్యాధి వ్యాపిస్తుంది. భారతదేశంలో ప్రతి ఏటా దాదాపు రెండున్నర లక్షల మంది క్షయ వ్యాధి కారణంగా మరణిస్తున్నారు. ప్రపంచంలో భారతదేశం

క్షయ వ్యాధికి రాజధానిగా తయారైంది. ప్రపంచంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న ప్రతి ఐదుగురిలో ఒకరు భారతీయుడు. క్షయ వ్యాధిని నయం చేయడానికి ఇప్పుడు కొత్తరకం మందులు వచ్చాయి. మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ టి.బి. అని వీటిని పిలుస్తున్నారు. ఈ మందుల వాడకంతో నయం అవుతున్న కేసులు కేవలం 60 శాతం మాత్రమే ఉంటున్నాయి. పైగా వీటి వల్ల ఖర్చు కూడా పెరుగుతున్నది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో భారతదేశం ప్రపంచంలోనే వెనుకబడి ఉన్నది. అలాగే ప్రపంచం మొత్తం మీద చూసినపుడు వైద్య రంగంలో భారత ప్రభుత్వం చేస్తున్న ఖర్చు చాలా తక్కువగా ఉన్నది. సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో భారతదేశం వెనుకబడి ఉండటానికి ఇలాంటి అంశాలన్నీ కారణమవుతున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేసినపుడే ఈ పరిస్థితిలో మార్పు రాగలదు. అప్పటివరకు ప్రభుత్వం చెప్పే విజయాలన్నీ ఎక్కువ భాగం కల్పితాలుగానే ఉంటాయి.

ప్రజారోగ్యంపై ప్రభుత్వ వ్యయం విషయంలో 171 దేశాల్లో భారత్‌ది 171వ స్థానం. ముఖ్యంగా గ్రామీణ వైద్య రంగం పూర్తిగా అటకెక్కింది. దేశంలోని ఏడు లక్షల గ్రామాల్లో 2 లక్షల గ్రామాలకు రక్షిత తాగునీటి సదుపాయం లేదు. ప్రజారోగ్యంపై అమెరికాలో 700 డాలర్లు, ఇతర పారిశ్రామిక దేశాలు 400 డాలర్లు తలసరి వ్యయం చేస్తుంటే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 50 నుంచి 60 డాలర్లు ఉన్నా భారత్ మాత్రం ఆ స్థాయిలోనూ లేదు. జాతీయాదాయంలో 3 శాతం వ్యయం చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉన్నా ప్రస్తుతం చేస్తున్నది 1.1 శాతమే. ప్రపంచంలోని వ్యాధిగ్రస్తుల్లో 20 శాతం భారతీయులే.

ప్రజారోగ్యంపై వివిధ దేశాల తలసరి ఖర్చు (డాలర్లలో)

దేశం	2000	2006
1. బంగ్లాదేశ్	07	12
2. చైనా	42	88
3. భారత్	14	22
4. ఇరాన్	143	344
5. లావోస్	13	15
6. మలేషియా	151	242
7. నేపాల్	10	16
8. శ్రీలంక	47	81
9. థాయ్‌లాండ్	97	170

లక్ష్యాల సాధన స్థితి గతి

లక్ష్యాలు మరీ అసాధ్యమైనవి కాకపోయినప్పటికీ, వీటి సాధనలో భారత్‌తో సహా అనేక దేశాలు వెనుకబడిపోతున్నాయని సుస్పష్టం. ఆయా దేశాలు ఇప్పటికే సాధించిన పురోగమనాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు రానున్న ఐదు సంవత్సరాలలో గమ్యం చేరడం సాధ్యమయ్యేట్లు కన్పించడం లేదు. పదేళ్ళ క్రితం ఏర్పరచుకున్న మొట్టమొదటి లక్ష్యం, కటిక దారిద్ర్యాన్ని, ఆకలిని పారదోలడం. అయితే ఈ ప్రాథమిక లక్ష్యానికే గ్రహణం పట్టేలా ఉంది. 'యాక్షన్ ఎయిడ్' వెలువరించిన తాజా నివేదిక ప్రకారం 2000లో ఆకలి బాధితులు 80 కోట్ల మంది కాగా 2009లో వంద కోట్లు దాటింది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ ప్రస్తుత సంక్షోభం వల్ల కొత్తగా పది కోట్ల మంది ప్రజలు పోషకాహారలోప స్థితిలోకి జారిపోతారని ప్రకటించింది. మరో అయిదేళ్లలో ఆకలిని, పేదరికాన్ని కనీసం సగానికి తగ్గించడం సాధ్యపడదని దీన్నిబట్టి తెలుస్తుంది. ఆకలిబాధతో శ్రామికులు కోల్పోతున్న శ్రమశక్తి వలన ప్రపంచంలోని పేద దేశాలు ఏటా 45 వేల కోట్ల డాలర్ల మేరకు ఉత్పాదకతను కోల్పోతున్నాయి. ఇతర లక్ష్యాల సాధన మరింత సుదూర స్వప్నంగానే మిగిలిపోతోంది.

- 1990లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 37.2 శాతం కాగా 2015 నాటికి దేశంలో 27.9 కోట్లు (22.1) పేదలు మిగిలే ఉంటారని అంచనా.
- 1990లో మన దేశంలో మూడేళ్ళ లోపు పిల్లల్లో 53.5 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారు. 2015 నాటికి వీరి సంఖ్యను 26.8 శాతానికి తగ్గించాలన్నది లక్ష్యం. కాని దేశంలో బరువు తక్కువ పిల్లలు 40 శాతం ఉంటారని అంచానా.
- 1990లో ఐదేళ్ళ లోపు వయసున్న ప్రతి వేయిమంది పిల్లల్లో మరణాల సంఖ్య 125గా ఉన్నది. 2015 నాటికి దీనిని 42కు తగ్గించాలన్నది లక్ష్యం. కాని ఆ సంఖ్య 70కు మాత్రమే చేరుతుందని అంచనా.
- 1990లో నవజాత శిశువుల్లో మరణాలు ప్రతి వేయిమందికి 80గా ఉన్నాయి. 2015 నాటికి దీనిని 26.7కు తగ్గించాలన్నది లక్ష్యం. కాని 46కు మాత్రమే తగ్గుతుందని అంచనా.
- 1990లో ప్రసూతి మరణాలు ప్రతి లక్షలోనూ 437గా ఉన్నాయి. వీటిని 2015 నాటికి 109కి తగ్గించాలన్నది లక్ష్యంగా ఉన్నది. కాని 135కు మాత్రమే తగ్గగలదని అంచనా.
- సార్వత్రిక విద్య (6-14 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు) వంద శాతం నమోదు, వంద శాతం నిలుపుదల, నాణ్యమైన విద్య ఇప్పటికీ లక్ష్యాలుగానే మిగిలి ఉన్నందున సార్వత్రిక విద్య ఇంకా అందని మామిడిపండే.
- స్త్రీ పురుష సమానత, స్త్రీల సాధికారత 2015 నాటికి పూర్తిగా సాధ్యపడేలా లేదు. ఉపాధి రంగంలో స్త్రీల వాటా 34 శాతంగా ఉండగలదని అంచనా.
- అభివృద్ధి చెందిన దేశాలు లక్ష్య సాధన కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు తమ స్థూల జాతీయ ఆదాయాల్లో 07 శాతం సహాయం అందిస్తామని చేసిన వాగ్దానాన్ని ఇప్పటివరకు ఐదు దేశాలు మాత్రమే పాక్షికంగా అమలు చేశాయి.

అభివృద్ధి, సామాజిక న్యాయం, శాంతియుత సహజీవనం, స్థిరమైన ఆర్థిక సామాజికాభివృద్ధి, అధిక ఉత్పాదకత సాధించాలంటే ముందు షరతుగా దారిద్ర్యాన్ని నిర్మూలించాలి. ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు అందించే ప్రాతిపదికగానే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది. కామన్‌వెల్త్ గేమ్స్ కొరకు 80 వేల కోట్లు ఖర్చు చేస్తుందీ ప్రభుత్వం. కాని ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ చూపడం లేదు. పాలకుల్లో చిత్తశుద్ధి ఉంటే 9 శాతం ఆర్థిక వృద్ధిని సాధిస్తున్న మన దేశానికి ఇదేమంత అసాధ్యమైంది కాదు. ఏది ఏమైనా పాలకుల ఆలోచన సరళి మారడం అవసరం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

కులం పుట్టుకను వివరించిన సిద్ధాంతాల్లో ముఖ్యమైన అంశాలు లోపించాయనీ, విస్మరణకు గురయిన కులాల ఆకాంక్షలు అనేక రూపాల్లో వ్యక్తమవుతున్నాయనీ అంటున్నారు **డా. ఎం.ఎఫ్. గోపీనాథ్**

కులాల ఆవిర్భావం, కొనసాగింపు

(...గత సంచిక తరువాయి)

కులం – బి.ఆర్. అంబేద్కర్

1916లో బి.ఆర్. అంబేద్కర్ పైన పేర్కొన్న చరిత్రకారులకి, నరవర్గ శాస్త్రవేత్తలకి భిన్నంగా కులాల పుట్టుకకు, కొనసాగింపుకు సంబంధించిన తన సిద్ధాంతాన్ని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో ప్రతిపాదించారు. ఆ సిద్ధాంత సారాంశం కింది విధంగా ఉన్నది –

1) అంతర్వివాహ పద్ధతికి కారణాన్ని కనుగొంటే కులాల పుట్టుకకు గల కారణాన్ని తెలిసికొన్నట్లే.
2) దురదృష్టవశాత్తు 'కులం' పుట్టుక గురించి డైరెక్టుగా సమాధానం చెప్పడం సాధ్యం కాదు. పరోక్షంగా చెప్పగలనంటూ, కుల వ్యవస్థకు వర్ణమే తండ్రి లాంటిది అంటారు.
3) బ్రాహ్మణవర్గమే కులవ్యవస్థని ఏర్పాటు చేసింది.
4) వృత్తి సమూహాలు కులాలుగా ఎలా పరిణామం చెందాయి? ఇండియా లోనే గాక, ఇతర దేశాల్లో వివిధ సమాజాల్లో కూడా పురోహిత వర్గం, వృత్తి సమూహాలు ఉన్నాయి. ఆయా సమాజాల్లో కులాలు లేవు. ఇండియాలోనే ఈ పరిస్థితి ఎందుకున్నది? అంటారు అంబేద్కర్.
5) అంటరాని కులాల ప్రజలు యుద్ధఖైదీల సంతతి అని తన రచనల్లోని 7వ వాల్యూమ్‌లో బి.ఆర్. అంబేద్కర్ అంటారు. కులాల పుట్టుకకు పైన పేర్కొన్న వివిధ దేశాల ఇండాలజిస్టులుగానీ, దేశీయ చరిత్రకారులు కానీ కింది కులాల గురించి కానీ, వారి ఆలోచన్లని గానీ, ఉద్యమాలని కానీ అంతగా పట్టించుకున్న దాఖలాలు లేవు. 1861లో తుకారామ్ తాత్యాపద్వాల్ తన 'జాతిభేద్ వివేక్ సాగర్' అనే గ్రంథంలో, కులవిభజన, వృత్తి, ప్రతిభ, అభిరుచి ప్రాతిపదికన జరగాలనీ, ప్రస్తుత కులవ్యవస్థ దానికి భిన్నంగా, అన్యాయంగా అభేద్యమైనదిగా రూపొందిందని వివరించాడు. వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ అనే నిర్మాణాలు, వాటి ఫలితాలు మొత్తంగా బ్రాహ్మణ వర్గం కల్పించిన ఒక ఊహాత్మక, వ్యూహాత్మక పునాదిపై ఉన్నదని, మొత్తంగా అదొక భ్రమ అని, దాన్ని బ్రాహ్మణులు చాలా బలంగా పెంచి, ప్రోత్సహించి, పోషించారని, కుల వ్యవస్థ మత సంబంధమైనది మాత్రమే కాదని, రాజకీయ, ఆర్థిక అధికారానికి సంబంధించినదని పద్వాల్ ప్రతిపాదించారు. ఒకనాడు బ్రాహ్మణులు, క్షత్రియులు పోషించిన నీతి, న్యాయం లేని పాత్రను నేడు శూద్ర దోపిడీ కులాలు పోషిస్తున్నాయి.

అంతర్వివాహ పద్ధతి కులాల ఏర్పాటుకు దారి తీసిందా?

అంతర్వివాహ పద్ధతి, ఏర్పడ్డ కులాల కట్టుబాట్లలో ఒక ముఖ్యమైన ఆచరణకి సంబంధించిన విషయమే కాని, కులాల పుట్టుకకు కారణం కాదనిపిస్తుంది. ఎందుకంటే, మధ్య యుగాల వరకు ప్రపంచంలోని అనేక సమాజాల్లో, సమూహాల్లో అంతర్వివాహ పద్ధతి అమల్లో ఉంది. ఉదాహరణకు రోమ్‌లోని కులీన వర్గమైన పాట్రీషియన్స్‌లో అంతర్వివాహ పద్ధతి కొనసాగింది కానీ, కులాలు గానీ, అంటరానితనం గానీ లేవు. ఇంగ్లండ్‌లోని నోబుల్స్‌లో క్రీ.శ. 15వ శతాబ్దం వరకు అంతర్వివాహ పద్ధతి ఉంది. ఇంగ్లండ్ ప్రొటెస్టెంట్ మత సంస్కరణలు క్రాంవెల్ నాయకత్వాన ఫ్యూడలిజంపై కాపిటలిజం చేసిన పోరాటాల ఫలితంగా ఆర్థిక వనరులు కోల్పోయిన నోబుల్స్ కామన్స్‌ని వివాహమాడడం జరిగింది. 15వ శతాబ్దం వరకు ఉన్న అంతర్వివాహ పద్ధతి అక్కడా కులాల ఏర్పాటుకు దారితీయలేదు. కాబట్టి ఉపఖండంలో మాత్రమే కులాలు ఏర్పడడానికి గల బలమైన, ప్రధానమైన కారణాన్ని తెలిసికోవల్సి ఉంది. 'బలప్రయోగమే' ఆ బలమైన కారణమని నేను ప్రతిపాదించదలచుకున్నాను. నా ప్రతిపాదనకి, చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనల్ని పరిశీలించి, అలాంటి సంఘటనల ఫలితంగా ఏర్పడ్డ పరిస్థితులే కులాల పుట్టుకకు దారితీసాయని ఆధారాలు ఇవ్వాలను కుంటున్నాను.

1) భారత ఉపఖండంలో జరిగిన గణ యుద్ధాలు.
2) 1983లో అస్సాం రాష్ట్రంలో జరిగిన నెల్లి మారణకాండ.
3) మన జైళ్లలో ఇప్పటికీ వివిధ శిక్షలనుభవిస్తున్న ఖైదీల పట్ల జైలు అధికారులు చూపించే వివక్ష.

గణ యుద్ధాలు – యుద్ధ ఖైదీలు

మానవజాతి అభివృద్ధి క్రమంలో మూడు దశలున్నట్లు లూయీ హెన్రీమోర్గన్ (ఎల్.ఎచ్. మోర్గన్) తన 'పురాతన సమాజం'లో వివరించారు. ఆ దశలు –

1) ఆటవిక యుగం (బార్బేరియన్) – ఆహార సేకరణ దశ.
2) అనాగరిక యుగం – పశువులను మచ్చికచేయడం, భూములను సాగుచేయడం.
3) నాగరికయుగం

ఆహార సేకరణ దశలో ఆహార కొరత ఏర్పడినపుడు, ఆహారం కొరకు పోటీపడ్డ మానవ సమాజాల మధ్య (గణాల మధ్య) యుద్ధాలు జరిగాయి. ఆ దశలో గెలుపు ఓటములంటే ఓడిపోయిన గణాన్ని

సవరణ : గత సంచికలో అచ్చయిన ఈ వ్యాసం మొదటి భాగంలో పేజీ 21, మొదటి పేరాలో 'రెడ్లకు కాంగ్రెస్...నక్సలైటు పార్టీ...' వాక్యాన్ని 'రెడ్లకు కాంగ్రెస్, కమ్మలకు తెలుగుదేశం, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ప్రభుత్వం చేత నడపబడే నక్సలైట్ పార్టీలు...' అని చదువుకోవాలి.

సమూలంగా సంహరించి, ఆహారసేకరణకి పోటీదారుణ్ని లేకుండా చేసుకోవడమే. ఆహార ఉత్పత్తి దశలో, పశువుల మందల్ని కాయడానికి, వ్యవసాయ భూముల్లో పనిచేయడానికి బానిసలు అవసరమొచ్చారు. ఈ దశలో గణ యుద్ధాల్లో ఓడిపోయిన వారిని చంపకుండా బలప్రయోగంతో, మానసికంగా హింసించి (ఎక్కువగా తిరగబడ్డ వాళ్లని ఎక్కువగా హింసించి చంపడం), బతికిన వాళ్లని బానిసల్ని చేసుకొన్నారు. (చూడండి : కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యముల ఏర్పాటు – ఫ్రెడరిక్ ఎంగెల్స్). ఇదే విషయాన్ని రాహుల్ సాంకృత్యాయన్ తన 'ఓల్గా నుండి గంగకు' అన్న గ్రంథంలో వివరించారు.

నెల్లి మారణకాండ

1983లో, అస్సాంలోని నౌగాం జిల్లాలో నెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 18న జుగుప్సాకరమైన ఒక మారణకాండ జరిగింది. ఆ మారణకాండలో పాలు తాగే పిల్లల్ని, గర్భిణీ స్త్రీలని, ముసలి వాళ్లని, అంటే ఎవరినీ విడిచిపెట్టకుండా అధికార లెక్కల ప్రకారం 2191 మందిని ఆరు గంటల కాలంలో అతి దారుణంగా నరికి చంపారు. ఆ నరుకుడు కార్యక్రమంలో పాల్గొన్న ఒక ఇరవై సంవత్సరాల యువకుడు, మేం 1983 మార్చ్‌లో (15 నుండి) అస్సాంలో తిరుగుతున్న సమయంలో కలిసాడు. అతను ఒక్కడే వంద మందిని నరికి చంపానని గర్వంగా, సంతోషంగా నాతో చెప్పాడు. ఆ యువకుడు ఏమాత్రం సంకోచం లేకుండా రెండు మూడు సంవత్సరాల పిల్లల్ని కూడా తన పొడవాటి కత్తితో మెడలు నరకడాన్ని గర్వంగా చెప్పాడు. ఒళ్లు జలదరించే ఆ సంఘటనకు ఎందుకు ఒడిగట్టారు అని అడిగినపుడు అతనిచ్చిన సమాధానం ఇంకా ఆశ్చర్యంగా ఉంది. 'వాళ్లు (బంగ్లాదేశీయులు, విదేశీయులు) మాకు తిండి దొరక్కుండా చేస్తున్నారు. మాకున్న వనరుల్లో ఎక్కువ భాగం ఇండియన్ గవర్నమెంట్ దోచుకుపోతుంది. మిగిలిన దానికి వీళ్లు పోటీపడుతున్నారు. కాబట్టి వాళ్లను సమూలంగా నాశనం చేస్తే మా కోనే, పానీ (కోడి గుడ్డు, నీళ్లు) మాకు దక్కుతాయి. ఒకవేళ ఆ బంగ్లాదేశ్ శరణార్థులు అస్సాం ట్రైబల్స్‌ని ఎదుర్కొని పోరాడినట్లయితే ఆ యుద్ధంలో బంగ్లా దేశీయులు ఓడిపోయినట్లయితే, అస్సాంలో టీ తోటల్లో ఆ యుద్ధ ఖైదీలను, అంటరాని వారిగా, నీచమైన వృత్తుల్ని చేసి పెట్టే వారుగా, అసమాన అంగీకార సంధి చేసుకొని ఉండే వాళ్లేమో. (ఈ మారణహోమం వెనుక హిందూత్వ శక్తులు ఉన్నాయని, ఎగువ అస్సాంలోని ట్రైబల్స్‌ని రెచ్చగొట్టాయనే కథనాలు రికార్డు అయినాయి.)

సమాజ శ్రేయస్సు కొరకే కులవిభజన జరిగిందా?

మనం ఇప్పుడు కామన్ సెన్స్‌తో ఒక ప్రశ్న వేసుకొందాం. ఏ సమాజంలోనైనా, ఒకడు మంత్రాలను చదవడానికి, ఇంకొకడు ఆయుధాలు పట్టి యుద్ధం చేయడానికి, వేరొకడు చెప్పులు కుట్టడానికి, మరొకడు మురికి బట్టలుతకడానికి, ఇంకొకడు వీళ్ల పెంట ఎత్తి వేయడానికి సమాజ శ్రేయస్సు కొరకు ఇష్టపూర్వకంగా ఒప్పుకుంటారా? పుట్టుకతోనే మెదడు పనిచేయనివాడు తప్పా అలాంటి పనులకు ఎవరూ అంగీకారం తెలపరు. శ్రమవిభజన ఇలా జరిగిందని చెప్పి ప్రచారం చేసేవాడు, వాటికి దైవాజ్ఞ అని పూర్వ జన్మఫలం అని, తప్పుడు సిద్ధాంతాల్ని అల్లి, బుకాయించేవాడు. బుకాయిస్తూ, వేదాల్ని, పురాణాల్ని, బ్రాహ్మణాల్ని, రామాయణ, భారత, భగవద్గీతల్ని సృష్టించిన దగాకోరులు, మానవద్రోహులు.

ఖైదీల పట్ల జైలు అధికారులు చూపించే వివక్ష

మనం జైళ్లలో వివిధ నేరాల వలన శిక్షలు పడ్డ వాళ్లను, ఖైదీల పట్ల అధికారుల ప్రవర్తన చూసినట్లైతే, మనకు యుద్ధఖైదీల పట్ల గెలిచిన వాళ్ల వైఖరి అర్థం అవుతుంది. ఎంత పెద్ద నేరం చేసినా, ఎంత పెద్ద శిక్ష పడ్డా, జైళ్ల అధికారగణానికి లాభదాయకంగా, దాసోహం అన్న ఖైదీలతో తేలికపాటి పనులు, ఎదురు తిరిగి, అధికారుల అక్రమాలను బయటపెట్టిన వారితో కఠినమైన, నీచమైన పనులు చేయించడం చూస్తాం. (చార్లెస్ శోభరాజ్, రామలింగరాజులు లాంటి వాళ్లు అధికారులకే పనులు చెప్పడం వేరే విషయం).

నేను 'కులం' ఆవిర్భావానికి గల కారణాల విషయంలో ఖమ్మం జిల్లా జూలూరుపాడు మండలంలో సుమారు 200 మంది ఉన్న క్లాసులో ఐదవ తరగతి చదివే ఐదుగురు పిల్లల్ని స్టేజీ దగ్గరకు రమ్మన్నాను. అక్కడ పెన్ను, పుస్తకం, బొమ్మ తుపాకి, చెప్పులుకుట్టే గూటం, బకెట్టు, చీపురు పెట్టాను. ఆ ఐదుగురిని మీరు వీటిలో ఏ వస్తువులు తీసుకుంటారు? భవిష్యత్తులో కూడా మీరు వీటి తోటే పనిచేయాలన్నాను. ఆ ఐదుగురు పెన్ను, పుస్తకం, బొమ్మ తుపాకి కోసం పోటీపడ్డారు గానీ మిగిలిన వస్తువుల జోలికి పోలేదు. ఐదవ తరగతి చదివే ఈ పిల్లలే ఇష్టపూర్వకంగా చెప్పులు కుట్టడానికి, పాకీ పనిచేయడానికి ఒప్పుకోలేదు. ఆనాటి సమాజంలో, గణ పెద్దలు అందరూ కూర్చొని, నేను మంత్రాలు చదువుతాను, నీవు నా పెంట ఎత్తేయమని, అయినా నీకూ నాకూ మన సమాజంలో సమాన గౌరవం ఉంటుందని నమ్మ బలికితే వినే విజ్ఞులున్నారనుకుందామా? ఉండరనేది వాస్తవం కాదా? మరి మన మేధావులు ఉదాహరణకు ఆర్.ఎస్. శర్మ పూజా పునస్కారాలు చేసే బ్రాహ్మణుడికి చెప్పులు కుట్టే చర్మకారునికి వేదకాలంలో ఒకే గౌరవం ఉందంటే ఎలా నమ్ముదాం? అతను 'శర్మ' కాబట్టి అలా రాయడానికి సాహసించాడని నేనంటే గిట్టకనే అన్నాననుకుంటారా? అందుకే కుల సమాజంలో కులాతీత మేధావులుండరని మరొక్కసారి నొక్కి చెబుతున్నాను.

కులాల పుట్టుకకు బలప్రయోగమే కారణం

ఆటవిక దశలో తెగల, గణాల మధ్య తరచుగా యుద్ధాలు జరిగేవి. మానవజాతి మాతృస్వామిక సమాజం నుండి పితృస్వామిక సమాజం ఏర్పడే క్రమంలో స్త్రీ, పురుషుల మధ్య మొట్టమొదటిసారి శ్రమ విభజన జరిగింది. స్త్రీల హక్కుల్ని కాలరాసే క్రమంలో కూడ స్త్రీలు తమ మాతృస్వామిక హక్కుల్ని కోల్పోవడాన్ని, తమని ఇంటికే పరిమితం చేయడాన్ని శాంతియుతంగా ఒప్పుకోలేదనేది చారిత్రక వాస్తవం. అందుకు ఉదాహరణలు గాను సుప్రసిద్ధ స్విస్ చరిత్రకారుడు మదర్ రైట్ (తల్లి హక్కు) గ్రంథకర్త అయిన జోహన్ జాకబ్ బాహోఫెన్ ప్రకారం స్త్రీ, పురుషుల మధ్య యుద్ధాలు, చంపుకోటాలు కూడా జరిగాయి. పురుష దేవుళ్లు ఆదిశక్తిని (స్త్రీని) అణచివేసినట్లే ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల హక్కుల్ని హరించే క్రమంలోనే, ప్రకృతి శక్తుల్ని తెలివిగా పురుష జాతి ఉపయోగించుకున్నది. అదే విధంగా గణ యుద్ధాల్లో ఓడిపోయిన గణాల్ని (ప్రధానంగా ఆర్యగణాలు, మూలవాసుల్ని ఓడించి) యుద్ధ ఖైదీలుగా పట్టుకొని, హింసించి, నీచమైన వృత్తుల్ని అంటగట్టడం జరిగింది. క్రమంగా రాజ్యాలు ఏర్పడి, ఆర్య గణాలలోని ప్రధాన శ్రేణులైన బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు దైవబలం, పశుబలంతో యుద్ధ ఖైదీలను మానసికంగా, శారీరకంగా లొంగదీసుకొని, అణచి ఉంచారు. మైనారిటీగా ఉన్న ఆర్య గణాలు (యుద్ధ ప్రావీణ్యులు), మెజారిటీగా ఉన్న మూలవాసుల్ని ఎల్లకాలం అణచి ఉంచడానికి అవకాశం లేదు కాబట్టి, ఆర్య యుద్ధవీరులే (ఇంద్రుడు, విష్ణువు అవతారాలు) దేవుళ్లుగా ప్రచారం చేసి, కర్మ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి, పునర్జన్మ, స్వర్గం, నరకం కట్టు కథల్ని అల్లి, మూల వాసుల్ని మానసిక బానిసల్ని చేసుకొన్నారు. ఈ యుద్ధాల్లో భయంకరంగా పోరాడిన వారిని రాక్షసులని (రావణుడు, బకుడు, నరకుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశ్యపుడు) హతమార్చారు. అలవికాని చోట, మోసపూరిత ఎత్తుగడలతో (బలి చక్రవర్తిని వామనుడు మోసం చేశాడు) అణచివేసారు. అతి భయంకరంగా పోరాడి, ఓడిపోయిన వాళ్లను దాస్యులుగా ముద్రవేసి, ఊరికి దూరంగా ఉంచి అంటరానితనాన్ని వారిపై రుద్దారు. అంతేగాని గో మాంసం తిన్నందు

వల్లనో లేక బౌద్ధం పుచ్చుకున్నందు వల్లనో దాస్యులను ఊరు బయటకు నెట్టి అంటరానితనాన్ని అంటగట్టలేదు.

ఆర్యులతో యుద్ధం చేసి లొంగిపోయి దాసోహం అన్న వారిని దాస్యులుగా ముద్రవేసి ఊరిలోపలే ఉంచుకొని చాకిరీ చేయించుకున్నారు. వీరే ఈనాటి చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి తదితర సేవక కులాలు. ఇదే క్రమంలో ఆనాటి గణ పెద్దల్ని కొందర్ని చేరదీసి, వాళ్లకి ద్విజత్వం ఇచ్చి, ఈ దేశంలో నల్ల బ్రాహ్మణులను, నల్ల వైశ్యుల్ని తయారు చేసికొన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో మాసికర్మ అనే గిరిజన పెద్దకి, ఓ హిందూ సన్యాసి ద్విజత్వాన్ని ప్రసాదించి, జంధ్యం వేసి మహేంద్రకర్మని చేసినట్లు, ఆర్యుల దండయాత్రల కాలంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. అనేకమంది శూద్రరాజులకు క్షత్రియ స్టేటస్‌ని కల్పించిన సంఘటనలు (ఛత్రపతి శివాజీ, సాహుమహారాజ్) చరిత్ర నిండా కనిపిస్తాయి. కాబట్టి కులాల పుట్టుకకి, కొనసాగింపుకి బలప్రయోగం (దైవబలం, రాజ్యబలం) ప్రధాన కారణం. సమాజ శ్రేయస్సు, శ్రమ విభజన, ఎగ్రిమెంట్‌లు – ఇవన్నీ కులాల ఏర్పాటుకు సంబంధించిన బోగస్ సిద్ధాంతాలే. వివిధ సమూహాల్లోని వ్యక్తుల సెక్సు సంబంధాలు, గుంపు కట్టుబాట్లు, ఉల్లంఘనలు, వెలివేతలు, సంఘ బహిష్కరణలు, తదితర అంశాలు కూడా అంటరానికులాల్లోని ఉపకులాల్ని, వెనుకబడ్డ కులాల్లో ఉపకులాల్ని, వివిధ ఆశ్రిత కులాల్ని సృష్టించాయి. అంటదగిన కులాల్లోని రాతగాళ్లు అందరూ దూర ప్రాంతాల్లో సెటిల్ అయి 'కాయస్థ' కులంగా ఏర్పడినట్లు, నీచ వృత్తి కులాలుగా ముద్రపడ్డవారు సుదూర ప్రాంతాలకు వెళ్లి మున్నూరుకాపులుగా అవతరించినట్లు ఉండొచ్చు. కాని అంటరానివాళ్లు, బి.సి.లు కచ్చితంగా బల ప్రయోగానికి బలైపోయిన ఈ దేశ మూలవాసులు.

ఈ సందర్భంలో రెండు ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వస్తుందని నాకు తెలుసు. ఆ ప్రశ్నలు –

1) గణ యుద్ధాలు ప్రపంచమంతటా జరిగి ఉంటాయి కదా. మరి భారత ఉప ఖండంలోనే ఎందుకు కులాలు ఏర్పడ్డాయి?

2) పూజారి వర్గం అన్ని దేశాల్లో ఉంది కదా ఈ దేశంలోనే పూజారి వర్గం కులాలని ఏ విధంగా ఏర్పరిచింది?

మనుషులలో రెండు ప్రవృత్తులుంటాయి. ఒకటి జంతు ప్రవృత్తి, రెండు మానవ ప్రవృత్తి. మనుష్యులలో ఉన్న జంతు ప్రవృత్తి, మృగప్రవృత్తి కన్నా ప్రమాదం. అందుకే భూస్వాముల్లో రెండు రకాలుంటారు. ఒకడు మొత్తంగా కిరాతకుడు, రెండో రకం తక్కువ కిరాతకుడు. అమెరికన్ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను కాపాడే అమెరికన్ ప్రెసిడెంట్స్‌లో అబ్రహం లింకన్ ఉన్నాడు, నరరూప రాక్షసులైన జార్జిబుష్‌లు ఉంటారు. కమ్యూనిస్టు పార్టీలో పుచ్చలపల్లి సుందరయ్య, కొండపల్లి సీతారామయ్య లుంటారు. కోట్లకి పడగలెత్తిన కామ్రేడ్ దొరలుంటారు. రెండవ ప్రపంచ యుద్ధానికి కారకులైన హిట్లర్ కిరాతకుడైతే, ముస్సోలిని దుర్మార్గుడు. అట్లాగే ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న పూజారి వర్గంలో భారత ఉపఖండానికి వలసవచ్చిన ఇండో ఆర్యన్ బ్రాహ్మణ వర్గం అతి ప్రమాదకరమైంది. 1927లో లైఫార్డ్ ఎడ్వర్డ్ చెప్పినట్లు భారతీయ బ్రాహ్మణవర్గం కౌటిల్యంలో అగ్రగణ్యులు. అంతర్వివాహ పద్ధతిని, ఈశ్వరేచ్ఛని అడ్డం పెట్టుకుని పకడ్బందీగా ఉపయోగించుకున్నదిక్కడి బ్రాహ్మణవర్గం.

ఏమి చేద్దాం?

భారతీయ సమాజం నేడు ఈ కింది సవాళ్లనెదుర్కొంటుంది.

1) సామాజిక రంగంలో దోపిడీ కులాలకు, దోపిడీకి గురయ్యే కులాలకు మధ్య ఉన్న కుల వైరుధ్యాలు.

2) ఆర్థిక రంగంలో నానాటికి పెరుగుతున్న అసమానతలతో కూడిన వర్గ వైరుధ్యాలు.

3) ప్రజాస్వామ్యానికి ప్రాణం లాంటి లెజిస్లేటివ్, ఎక్సిక్యూటివ్, జ్యూడిషియరీ, పత్రికారంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న లంచగొండితనం, జవాబుదారితనం లేమి ఒక వైపు. ఈ వ్యవస్థ మొత్తం మీద నానాటికీ ప్రజల్లో పెరుగుతున్న అపనమ్మకం మరొక వైపు.

కుల వైరుధ్యాలు పరిష్కారం కాకుండా మిగతా వైరుధ్యాలు పరిష్కారం కావు. కుల వైరుధ్యాలు పరిష్కారం కావాలంటే, కుల వైరుధ్యాల్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. కుల వ్యవస్థ వలన లాభపడే కులాలు కుల నిర్మూలనకు అడుగడుగునా అడ్డుతగులుతున్నాయి. ఈ దోపిడీ కులాలకు చెందిన మేధావులు, ఎన్ని నీతులు చెప్పినా, నీతివంతమైన సిద్ధాంతాలెన్ని చెప్పినా, వారి కుల ప్రయోజనానికి విరుద్ధమైన కార్యాచరణకు పూనుకోవడం లేదు. కుల వ్యవస్థ వల్ల నష్టపోతున్న కులాల్లోని మేధావి వర్గం (ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్), బానిస రాజకీయాలు మాని ఉన్న వ్యవస్థలో షేర్ హోల్డర్స్‌మవుదామన్న కోరికల నుండి బయటపడాలి. అణచివేతకు గురవుతున్న శ్రామిక కులసమూహాలకి, అసలు సమస్య పట్ల అవగాహన కల్పించాలి. శ్రామిక కులాలకి శ్రమను దోచుకుంటున్న కులాలకి మధ్య గల వైరుధ్యం శత్రు వైరుధ్యమే. కుల నిర్మూలనోద్యమానికి మిత్రులెవరు, శత్రులెవరు అన్న విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. శ్రామిక కులాల మధ్య ఉన్న వైరుధ్యాల్ని మిత్ర వైరుధ్యాల పరిధిలో పరిష్కార మార్గాలను కనుగొనాలి. సామాజిక జీవనంలో కుల నిర్మూలనోద్యమం జరగాలి. భారతదేశానికి సంబంధించి, కుల నిర్మూలనోద్యమం ప్రాథమిక ఎజెండాగా, విప్లవ శిబిరాలు గుర్తించాలి. 'కుల' సమస్య పట్ల ఇప్పటి వరకు వామపక్ష శిబిరాల్లో ఉన్న గొట్టపు దృష్టిని, అభద్రతని, ఆధిక్య భావాన్ని విడనాడాలి. వీరు హిందూ మార్క్సిస్టుల్లా కాకుండా, మార్క్సిస్టుల్లా తమ ఆలోచనలను సరిచేసుకోవాలి. కులాల ఆవిర్భావం పట్ల, ఫూలే, అంబేద్కర్ పట్ల వీరికున్న అశాస్త్రీయ భావాల్ని వదులుకోడానికి సిద్ధం కావాలి. వామపక్ష మేధావులు శ్రామిక కులాల ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్‌గా రూపాంతరం చెందాలి. దళిత మేధావులు సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, దేవాలయ ప్రవేశాలు, తిరుపతి దేవస్థానంలో ప్రధాన పూజారి పదవులతో సంతృప్తి పడక, కుల సంకర రాజకీయాలు మాని, కుల నిర్మూలనా పోరాటానికి, అదే విధంగా వర్గరహిత సమాజానికి కృషి చేయాలి. ఆ పోరాటం ఏ రూపం తీసుకుంటుంది అనేది శత్రు శిబిరమే నిర్ణయిస్తుంది. కులాల ఆవిర్భావానికి, కొనసాగింపుకు బల ప్రయోగంతో కూడిన బ్రాహ్మణీయ భావజాలం కారణం గనుక, కుల నిర్మూలనకు బలప్రయోగం, బ్రాహ్మణీయ వ్యతిరేక భావజాలంతో పోరాటాలకు సిద్ధం కావాలి. భారతదేశంలో వర్గపోరాటం కన్నా, కుల నిర్మూలనోద్యమ పోరాటాల ఎత్తుగడలు, వ్యూహాలు కష్టాలతో కూడుకున్న వన్న విషయం స్పష్టం. ఇంత జటిలం, సంక్లిష్టమైన అంశాలను సరైన పద్ధతిలో అవగాహన చేసుకోకుండా శ్రామిక కులాల మధ్య కూడా సమానత్వం సాధ్యంకాదు. అటువంటి అవగాహన ఏర్పడబోయిన ప్రతి సందర్భం లోనూ, అడ్డుతగిలే అడ్డగోలు సిద్ధాంతవాదుల నుండి అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

యుద్ధంలో ఓడిపోయిన, ఈ దేశ అణచివేయబడ్డ కులాలు, అమెరికాలోని నీగ్రో బానిసల కన్నా హీన స్థితికి దిగజార్చబడి వెలివాడల్లో దీనమైన బతుకులీడుస్తున్న వాళ్లు ఓడిన తమ యుద్ధాన్ని తిరిగి గెలుచుకొనే ప్రణాళికలను తయారు చేసుకోవాలి. వేల ఏండ్ల నుండి మానవత్వాన్ని నిరాకరించిన బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం అనే అమానుషత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటాని సమున్నతంగా ఎత్తిపట్టి ధర్మయుద్ధాన్ని ప్రకటించవలసి ఉంది. లేని యెడల ఆస్ట్రేలియాలోని 'మావోరి' తెగల్లాగా, అమెరికాలోని 'రెడ్ ఇండియన్స్' లాగా అంతరించి పోవడం ఖాయం.

(అయిపోయింది)

(రచయిత హృద్రోగ నిపుణులు) వీ

సామాజిక అభివృద్ధిలో సామాన్యుడిని భాగం చేసి, శ్రామికుడిని విముక్తి చేసేదే అభివృద్ధి అంటూ, సోంపేట సందర్భంలో ప్రభుత్వ ప్రాజెక్టులనూ, పథకాలనూ విశ్లేషిస్తున్నారు **నక్కా హేమా వెంకట్రావు**

చట్టం - అభివృద్ధి - హక్కులు

'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' ఇది సాధారణంగా అధికారంలో ఉన్న రాజకీయపార్టీలు తమకు అనువుగాని పరిస్థితులలో చెప్పే మెట్ట వేదాంతం. ఇదంతా సమస్యను దాటవేసే ప్రయత్నం. ప్రజలకు అసలు చట్టాలు తెలియవన్న ధీమాతో చేస్తున్న ప్రభోదాలు. అవి అణచివేత, దోపిడీలకి గురవుతున్న తెలంగాణ విషయంలో కావచ్చు. అభివృద్ధి పేరుమీద సోంపేటలో జరిగిన హత్యాకాండలో కూడా కావచ్చును. చట్టాల పేరు చెప్పి అభివృద్ధి అనే మేడిపండును చూపిస్తూ జీవించే హక్కును సైతం కాలరాస్తున్నారు.

మొదట్లో సామాజికంగా ఆమోదం పొందిన కట్టుబాట్లనే ప్రవర్తనా నియమాలుగా గుర్తించారు. ఆ తర్వాత ఆ కట్టుబాట్లే సాంప్రదాయాలు, శాసనాలుగా మారాయి. ప్రైవేటు ఆస్తి ఏర్పాటయ్యే క్రమంలో ఆదిమ సమాజం రూపురేఖలు మారిపోయాయి. బానిస యాజమానులు అధికార శాసనాలు అమలులోకి వచ్చాయి. వాటిపై బానిస తిరుగుబాటు చోటు చేసుకోగా కొన్ని మార్పులు జరిగాయి. భూస్వామ్య వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. బానిసలు కౌలు రైతులుగా మార్పు చెందారు. ఉత్పత్తి చేసే శక్తి పెరిగిన కొద్ది వాటికి మార్కెట్ కావలసి వచ్చింది. అదే ఆసియా, ఆఫ్రికాలలో వలస పాలనకు నాంది అయింది. ఆ తర్వాత వచ్చిన వలస పాలన ఈ దేశంలోని వనరుల నుండి లబ్ధి పొందడానికి కావలసిన చట్టాలను తయారు చేసింది. ప్రజలు తిరుగుబాటు చేసే నేపథ్యంలో కొన్ని సాంఘిక సంస్కరణలు చేపట్టింది. వాణిజ్యానికి కావలసిన శ్రామికులను తయారు చేసుకోవడానికి వారి విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టింది.

ప్రపంచంలో జాతీయోద్యమాలు మొదలైన తర్వాత భారత దేశంలో గూడా వాటి ప్రభావం పడి స్వతంత్రాన్ని వలస పాలకుల నుంచి సంపాదించుకుంది. వలస పాలన అయితే పోయింది గానీ ఆనాటి చట్టాలే ఈనాటి వరకు (ఎక్కడో కొన్ని తప్ప, మరికొన్ని మార్పులు తప్ప) కొనసాగుతూ వచ్చాయి. ఒక్కసారిగా 1990లో వచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలు ఆ తర్వాత ప్రైవేటీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో పాలకవర్గాలు పెట్టుబడిదారీ దేశాల చేతుల్లో కీలు బొమ్మ లయ్యాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు మోకరిల్లాయి. జీవించే హక్కు, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వాటికి తిలోదకాలు ఇచ్చి తమకున్న మెజార్టీ బలంతో పార్లమెంటులో ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి పాలకులు వనరులను బహుళజాతి కంపెనీల కోసం అనేక చట్టాలను సవరించారు. మరికొన్ని తమకు అనుకూలంగా పెట్టుబడీదారులకు లాభసాటిగా చట్టాలు చేసారు. వ్యవసాయం వద్దని, వ్యవసాయం గిట్టుబాటు కాకుండా రైతువ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టారు. ఇప్పుడు ప్రజలే పారిశ్రామికీకరణ కోరుకుంటున్నట్టు వారిపై రుద్దుతున్నారు. చాలా పకడ్బందీగా, తెలివిగా రాజ్యాంగం, చట్టాల ద్వారా తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. దోపిడీ నిరాటంకంగా కొనసాగించడానికి ఏర్పడిన కోర్టులు, చట్టాలు కష్టజీవులకు కన్నీళ్ళే మిగిలిస్తున్నాయి.

ఇప్పుడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మినహా ఏ పార్టీ నోటవిన్నా 'అభివృద్ధి' మంత్రమే. ఈ అభివృద్ధిని కూడా వారు చేయలేమని చేతులెత్తేసి ఆ పనిని బహుళజాతి కంపెనీలకు అప్పగిస్తున్నారు. వారు యువతకు ఇచ్చే ఉపాధి, విదేశీ మారక ద్రవ్యం మీద గంపెడాశ పెట్టుకున్నట్టు ప్రకటించారు (నటించారు). రాయలవారు తలచుకుంటే దెబ్బలకు కొదవేమిటి అన్నట్టు పార్లమెంట్‌లో రెండురోజుల్లో ప్రత్యేక ఆర్థిక మండలుల బిల్లును 2005లో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకున్నారు. అలాగే పిసిపిఐ.ఆర్. పాలసీను! ఈ చట్టం గురించి అప్పట్లో కొంతమంది మేధావులకు తప్ప సామాన్యులకు తెలియనే తెలియదు. తెలిసిన ప్రజా ప్రతినిధులు కిమ్మనలేదు. చట్టాల కార్చిచ్చు గ్రామాల్ని తాకుతుంటే బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ పేరిట భూసేకరణ జరుగుతూనే ఉంది. ఒక వైపు 'ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం', మరోవైపు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద శ్రామిక కుటుంబాలకు 365 రోజులకు గాను 100 రోజుల పని గ్యారంటీ చట్టం. శ్రామికుని కుటుంబంలో ఐదుగురు ఉంటే అందులో ఒక్కరికి పని గ్యారంటీ. పని చేసే దినాలలో సుమారు సంవత్సరంలో పావురోజులకంటే కాస్త ఎక్కువ పనిదినాలు. మరి మిగతా పని రోజులకు పని గ్యారంటీ లేదు. 'ఉద్యోగం పురుష లక్షణం' అని నమ్మే సమాజంలో గ్రామీణ స్త్రీకి పని గ్యారంటీ ఏమీ లేదు. ఆ వచ్చే ఆదాయం కుటుంబానికేమాత్రం సరిపోదు. ఇది నిశ్చయంగా స్త్రీ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చట్టమే. సమాజంలో స్త్రీ పురుష అసమానతలు విపరీతంగా పెరుగుతున్న దశలో కుటుంబ హింస చట్టం–2005, సమాచార హక్కు చట్టం–2005 లాంటి చట్టాలు కంటి తుడుపు చర్యలే.

చట్టాలలోని ద్వంద్వ నీతిని, లొసుగులను, కంటి తుడుపు చర్యలను ప్రజలు ప్రశ్నించినప్పుడల్లా పాలకవర్గాలు వీరిని అణగదొక్కే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. భూమి, అడివి, నీటి వనరులు రాజ్యాధికారంపై తమ హక్కుల కోసం ప్రజలు పోరాటం చేసినప్పుడల్లా అప్రకటిత నిషేధం అమలు చేస్తూనే ఉన్నాయి. తొంబయ్యవ దశకంలో 'టాడా', 2002లో 'పోటా', సరికొత్తగా 2005లో 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం' ఇలా ఎన్నో చట్టాలను ప్రజా ఉద్యమాలను అణగదొక్కడానికి నయా పెట్టుబడిదారీ వ్యవస్థ తయారు చేసుకుంది.

ఇన్నాళ్లు చట్టం పేరుతో దాని వెనకాల ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తున్న పాలక వర్గాల ముసుగును తొలగించడానికి ప్రయత్నిస్తే వచ్చే ఫలితమే జూలై 14న సోంపేటలో జరిగిన హత్యాకాండ! ఇన్నాళ్ళు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని శిక్షిస్తామన్న రాజ్యం చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదన్న ప్రశ్నకు సమాధానం రాబట్టక ముందే రెండు నిండు ప్రాణాలు నేలకొరిగాయి. బుల్లెట్ గాయాలతో సోంపేట చిత్తడినేల రక్తసిక్తమయింది. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. ఇంక చట్టాల గుట్టును ప్రశ్నిస్తే ప్రజలకు పాలకవర్గాలు ఇచ్చిన ఒక హెచ్చరిక!

ఇది ఉద్యమాలు చేస్తున్న వారికి, వారికి సహకరించే వ్యక్తులనే కాదు, నీడనిచ్చే చెట్టు, పుట్టను ఒకే గాటన కట్టి టార్గెట్ చెయ్యడం పాలకులకు కొత్త ట్రెండ్‌గా మారింది. పోలేపల్లి సెజ్‌నే తీసుకుందాం! అక్కడ ఉద్యమ నాయకత్వం మీద కక్ష కట్టడానికి ఒక అర్థముంది. కానీ నాయకులు, ప్రజలు ఒక చెట్టు కింద సమావేశాలు ఏర్పాటు చేసుకుంటుంటే సహించలేని సెజ్ యాజమాన్యం ఆ చెట్టునే నరికి వేసారు. హరితాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మారుస్తామన్న ప్రభుత్వం అడవుల్ని, చెట్లని కాపాడుతామని చట్టం కూడా చేసింది. ఒకవైపు చెట్లు నాటే కార్యక్రమం, మరోవైపు పెట్టుబడిదారీ వర్గానికి లాభాలు చేకూర్చడానికి అదే చట్టపరిధిలో చెట్లు నరికే ప్రక్రియ ఎలా ఇమిడుతాయో!

వాన్‌పిక్ వ్యతిరేక కమిటీ నాయకుడిని 'మావోయిస్టు'గా ముద్రవేసారు. కాకినాడ సెజ్ పోరాటానికి న్యాయసహాయం అందచేసే న్యాయవాదిని కూడా వదిలిపెట్టలేదు. మరి సోంపేటలో ప్రతి ఒక్కరూ 'నక్సలైటు'గా కనపడ్డారను కుంటాను. ఎదురు కాల్పులలో చంపినట్లే ప్రజల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చివేశారు. చట్టాన్ని అతిక్రమిస్తున్నారని ప్రభుత్వం అరుంధతీరాయ్, బినాయక్ సేన్ వంటి మేధావుల్ని, హక్కుల సంఘాల ప్రతినిధుల్ని శిక్షించిన సందర్భాలెన్నో! 24 సెప్టెంబర్‌న మధ్యాహ్నం సోంపేట ఉద్యమ నాయకుని ఆసుపత్రిపై బాంబుదాడి జరిగింది.

నిజమే మరి! చట్టం తనపని తాను చేసుకుపోతూనే ఉంది. అందుకు అనువైన పరిస్థితులను కల్పించుకుంటుంది. రాజ్యం యొక్క అన్ని అంగాలను, హంగులను వాడుకుంటుంది. అవసరమైతే తిమ్మిని బమ్మిని చేయగల పాలకవర్గాలు ఉండగా అదెందుకు సాధ్యపడదు? అది ఎలా సాధ్యమో 4660 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంటును నిర్మించదలచుకున్న నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వద్ద సమాధానం పుష్కలంగానే ఉంది. వీరు నెలకొల్పే ప్రాజెక్టుకు సుమారు 1604 ఎకరాల భూమి కావలసి వచ్చింది. అందుకు అక్కడ ఉన్న చిత్తడి నేలలు, తంపర, నీటి కయ్యలు, సారవంతమైన భూములు ఏమి అడ్డుకాలేదు. కేంద్ర పర్యావరణ అటవీశాఖ నుండి అనుమతిని కూడా తెచ్చుకున్నారు. ఈ ప్రాంతాన్ని స్థానికులు 'బీల'అని పిలుచుకుంటారు. ఇందులో పెద్ద బీల, చిన్న బీల, తంపర ఉన్నాయి. తూర్పు కనుమలలో నున్న మహేంద్రగిరి నుండి వచ్చిన వర్షపు నీరు బీలలను నింపుతాయి. అలాగే సాగరాలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నుండి ఇక్కడ పొలాలకు నీరు అందుతుంది. ఒక్క మే నెలలో తప్ప మిగిలిన నెలల్లో ఎప్పుడు చెరువులాగే కన్పిస్తుంది.

ఒడిషాలోని చిలకా సరస్సు, మన రాష్ట్రంలోని కొల్లేరు, పులికేటు సరస్సులకంటే బీల చిన్నది. కాని అంతే ప్రయోజనాలను స్థానికులకు అందచేస్తుంది. ఇక్కడి 'పాములమిట్ట' అని పిలవబడే 25 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొండ ఉంది. కొన్ని తరాలుగా పాములు ఇతర జంతువులకు నెలవై ఉంది. 118 రకాల పక్షులు (కొన్ని వలస వచ్చేవి), నక్కలు, కుందేళ్లు, ఎలుగుబంట్లు, తోక గబ్బిలాలు, గుడ్లగూబలు ఇలా అనేక రకాలజీవ వైవిధ్యం గల ప్రాంతం. ఇక్కడ ప్రజలు నివసించక పోయినా తమ పశువులను మేపుకుంటారు. ఇద్దువారి పాలెం వద్ద సముద్రపు నీరు మంచినీటితో కలవడం వలన చేపలు, రొయ్యల పునరుత్పత్తి జరుగుతుంది. కొన్ని వందల మత్స్యకార కుటుంబాలు బీలను ఆధారం చేసుకొని బతుకుతున్నాయి. ఎత్తిపోతల పథకం కింద 750 ఎకరాలలో నీరును వ్యవసాయానికి అందిస్తున్నారు.

28 ఫిబ్రవరి 2010న కేంద్ర పర్యావరణ అటవీశాఖామాత్యులు పక్షుల కంటే మనుష్యుల జీవితమే ముఖ్యమని శెలవిచ్చారు. అయినా సరే జాతీయ పర్యావరణ పథకం, పర్యావరణ పరిరక్షణ చట్టం దాని నియమ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ప్రాజెక్ట్ నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. అలాగే చిత్తడి నేలలు, భద్రత ప్రమాణాలు కాలరాసి మరింత ముందుకు వెళ్లి అనుమతులిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ భూముల్ని, నీటి వనరుల్ని కంపెనీ యాజమాన్యానికి కట్టబెట్టింది.

భూములు కట్టబెట్టడం అంతా చట్టపరిధిలోనే జరుగుతున్నట్టు కన్పిస్తుంది. నిజానికి ఇదంతా పేపరు/ఫైళ్ల మాయాజాలంతోనే జరుగుతుంది. కేంద్రం ప్రాజెక్టులకు అనుమతులివ్వడానికి భూమికి సంబంధించిన వివరాలన్నీ కేంద్ర పర్యావరణ అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించాలి. ఆ సమాచారం అంతా తప్పుగా ఉన్నట్లయితే అనుమతులు నిరాకరించబడతాయి కూడా. ప్రాజెక్ట్ కోసం నిర్ణయించ బడిన 1604 ఎకరాలభూమి (అందులో 972.67 ఎకరాలు ప్రభుత్వ భూమి) అంతా రెవెన్యూ రికార్డులలో చిత్తడి నేలగానే గుర్తించబడింది. ఈ భూమి రుషికుట్ట, గొల్లగుండి, బారువాపేట, బెంకిలి గ్రామాలకు చెందినది. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ సోంపేట తహసిల్దారు లెటరు నం.26/08/బి, 23-06-08 ద్వారా జిల్లా కలెక్టరుకు తెలియజేసారు. ప్రభుత్వ భూమి 972.6 ఎకరాలలో 170 ఎకరాలు బీల గయలు, 199 ఎకరాలు బీల తంపర, 209 ఎకరాలు తంపర పోరంబోకు, 396 ఎకరాలు కాలువ పోరంబోకుగా తెలియబర్చారు. ఈ భూములను 1993, 1995, 2000లలో ప్రభుత్వ ఖర్చు కిందే ఎత్తిపోతల పథకం కింద నీరందించారు. ప్రభుత్వ భూమిని ప్రాజెక్టు కోసం అప్పగించిన భూమిలో 78.9 ఎకరాలను డి-పట్టా పొందినవారు, 31.35 ఎకరాల భూమిని సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్నారు. భూస్వాముల నుండి, ధనిక రైతుల నుండి ఎస్.సి. కులస్తులకు ఇచ్చిన పట్టా భూములకు రక్షణ కల్పించాలని (మెమో నెం.1786/ ఎస్.సి./ఎస్.టి. సెల్/70-3, 2-11-1970, మెమో నెం.2854/పోలిస్, ఎఫ్/77-1, 27-10-77) లో ఆదేశించింది. ప్రభుత్వం దాని యంత్రాంగమే భూములను చేతుల్లోకి తీసుకొని ధనికులకు అప్పగిస్తే ఎవరికి చెప్పాలి? ఈ విషయాన్ని కప్పిపుచ్చుతూ సదరు సోంపేట తహసిల్దారు గారు ఆ భూములు వ్యవసాయానికి పనికిరావని, ఎవరూ నివసించడం లేదని జిల్లా అధికారులకు తెలియచేసారు. ఇదే ప్రాంతానికి వన్యప్రాణుల కొరకు ఏర్పడిన జాతీయ బోర్డు మెంబర్లు సందర్శించి ఇవే భూముల్ని థర్మల్ పవర్ ప్లాంటుకు ఇవ్వకూడదని చెప్పినా అధికారులకు తలకెక్కలేదు.

చీఫ్ కమిషనర్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీడింగ్స్ డి2/2225/2003, 20-07-2003 ప్రకారం రాష్ట్రమంతట నీటి వనరుల్ని, వాటి ద్వారా నీరు అందుతున్న భూమి వివరాలను ప్రొహిబిటరీ ఆర్డర్ బుక్‌లో జిల్లా అధికారి నమోదు చెయ్యాలి. అలా చేసినట్టయితే ఈ రోజున భూమి పరిశ్రమలకు ఇవ్వడానికి వీలు చిక్కేదికాదు. కాని జిల్లా అధికారి ఎందుకు అలా చెయ్యలేదో కారణాలు మనకంటే ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికే బాగా తెలుసు. చిన్న చిన్న తప్పులు చేసిన చిరు ఉద్యోగులు శాఖాపరంగా శిక్షలు పడి కేంద్ర రాష్ట్ర ట్రిబ్యునల్స్ చుట్టూ తిరిగే వారు కోకొల్లలుగా ఉన్నారు. కానీ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి, విధిని నిర్లక్ష్యం చేసిన అధికారుల మీద ఎలాంటి చర్యలు శాఖాపరంగా తీసుకోలేదు. నిజానికి ప్రజాద్రోహం కింద వీరిని క్రిమినల్ కేసులలో బుక్ చేయవలసి ఉంది. జిల్లా అధికారులు 18-08-2009న జరిగిన బూటకపు ప్రజాభిప్రాయ సేకరణలో జరిగిన మీటింగు మినిట్సును తారుమారు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి సిఫారసు చేసారు. గొల్లగొండి గ్రామంలోని సర్వే నం.18,19,20,43,44లోని భూమి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలోనికి వస్తుంది. అయినా దాని ప్రస్తావన అధికారుల రిపోర్టులో లేదు. జీవ వైవిధ్యం ఉన్న ప్రాంతం గురించి కలెక్టరు సదరు బోర్డును

సంప్రదించలేదు. 118 రకాల పక్షులు వివిధ జాతుల జంతువులు ఉన్నాయి. రాష్ట్ర జాతీయ బోర్డులు చెప్పినా జిల్లా అటవీశాఖ అధికారి మనఃపూర్వకంగానే గుర్తించలేదు.

చీఫ్ కమిషనర్ ల్యాండు అడ్మినిస్ట్రేషన్ రాష్ట్రంలో ఉన్న భూమికి సంబంధించి అవగాహన ఉన్న శాఖ మాత్రమే కాదు, అధికార యంత్రాంగం కూడా. ఒకవైపు సోంపేట తహసిల్దారు, టెక్కలి ఆర్.డి.ఒ. జిల్లా కలెక్టరు ప్రభుత్వ భూములలో నీటి కయ్యలు ఉన్నాయని, అయినా అవి వ్యవసాయానికి పనికిరావని తెలిపితే ఆ నివేదిక పట్ల విజ్ఞత చూపకుండా కనీస పరిజ్ఞానం లేని వారిలా (లేక లేనట్లు నటించడమా?) ప్రవర్తించారు, భూమికి మార్కెట్టు రేటును నిర్ణయించారు. ప్రజలు తరతరాలుగా తమ ప్రకృతి వనరులను కాపాడుకుంటుంటే వాటిని చట్టపరిధిలో పరిరక్షించవలసి అధికారులు వాటి యంత్రాంగం పని చేసే తీరు ఇదా!

రాష్ట్ర యంత్రాంగం మొత్తం చట్టం పేరుతో చట్టవ్యతిరేకంగా చేసిన కార్యకలాపాలకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన సర్వేలలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులవలన గాలి, నీరు, బావులలో కాలుష్యాలు విరజిమ్ముతాయని తెలియజేసినా దేశంలోనే అత్యుత్తమ చదువును సొంతం చేసుకున్న అధికార్లకు తెలియదని కాదు. కాని వాటిని ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం లేదనుకున్నారు అంతే. బంగాళాఖాతం సోంపేటకు చేరువుగా ఉండడం, అక్కడ ప్రజలు చేసుకున్న పాపం అయితే ప్లాంటు యాజమాన్యానికి వరం. పవర్‌ప్లాంటు కోసం సుమారు రోజుకు ఒక లక్ష 88వేల ఘనపు లీటర్ల నీరు సముద్రం నుండి తీసుకుంటారని చెప్పారు. ప్లాంటులో ఆవిరయిన నీటిని కూలింగ్ టవర్లలో చల్లబరచి ద్రవీకరణ చేసి ప్లాంటులోనే వాడుకుంటామని చెప్పినా అది సాధ్యం కాదని ప్రాజెక్టు యాజమాన్యానికి తెలుసు. ఎలాగు కొంత నీరు సముద్రంలోకి పోతుంది. సముద్రంలో నీటి పంపింగ్ వలన, వదిలే ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం స్థానిక వాతావరణం మొత్తం వేడెక్కిపోతుంది. ప్రపంచం అంతా భూగోళం మొత్తం వేడెక్కిపోతుందని ఆక్రోశిస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా ఉండదు. నిజానికి ఈ చిత్తడి నేలలు కార్బన్‌డై ఆక్సైడ్‌ను తమలో ఇముడ్చుకుంటాయి. ఒక్కసారి ఈ నేలను ధ్వంసం చేసి కాంక్రీటు వేస్తే భూమిలో ఉన్న కార్బన్‌డై ఆక్సైడ్ మొత్తం పర్యావరణంలోకి వెదజల్లుతుంది. ఇది స్థానికులు అజ్ఞానంతో తెలియచేసిన బూటకపు మాటలు కావు. కర్బన వ్యర్థాలు, గ్లోబల్ వార్మింగ్ గురించి ప్రపంచానికి తెలియచేసిన రామ్‌సర్ ఒప్పందాలకు సంబంధించి ప్రమాణాలు తెలియచేసిన వాస్తవాలు. ప్లాంటు కోసం ఏర్పాటు చేసే యాష్‌పాండ్ గురించి, అది చేసే హాని గురించి పొరుగున ఉన్న ప్రాజెక్టులను చూసి ప్రజలు పదే పదే చెబితే అవి ప్రభుత్వ చెవికెక్కలేదు.

1971 ఫిబ్రవరి 2వ తారీఖున రామసర్ అంతర్జాతీయ సదస్సు చిత్తడి నేల గురించి, వాటి భద్రత గురించి చేసిన తీర్మానాలకు ఏకీభవించి మనదేశం కూడా ఒప్పందాలపై సంతకం చేసింది. దాని ప్రకారమే ప్రధానమంత్రి కార్యాచరణ ప్రణాళిక, జాతీయ పర్యావరణ పాలసీ 2004లో తయారు చేస్తే 2006లో యూనియన్ కాబినెట్ ఆమోదించింది. ఈ ప్రమాణాల ప్రకారం దేశంలో ఉన్న చిత్తడి నేలలను గుర్తించి అవి తరిగిపోకుండా భద్రపరచాలి. వాటిని నమోదు చేసి వాటి రక్షణకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర పర్యావరణ నివేదిక 2009 కూడా చెరువులను, చిత్తడి నేలలను, టాంకులను, తంపరలను కాపాడాలని, ఆ వనరులను ఉపయోగించుకొని పేదరిక నిర్మూలనకు, ఉపాధికి కృషి చేయాలని తెలియచేస్తుంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగం కావాలని స్పష్టపరిచింది. ఆహార హక్కు చట్టం 2009 (ముసాయిద), రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును ప్రాథమిక హక్కులలో చేర్చింది. వ్యక్తి స్వేచ్ఛతో పాటు ఆహార హక్కును కూడా చేర్చింది. రాజ్యాంగం ఆర్టికల్ 39 సార్వభౌమ వ్యవస్థలో ప్రతి ఒక్కరికి ఆహారం పొందే హక్కు ఉండాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. సారవంతమైన భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. చిన్న మధ్య తరగతి రైతులకు హాని కలిగించేవి, ఇప్పటికి ఉనికిలో ఉన్న వ్యవసాయ, వ్యాపారాలను తక్షణమే విడనాడాలి. దేశంలో ఆహార ధాన్యాలవృద్ధి సాధించడానికి దేశీయంగా వ్యవసాయ కులాలకు తగిన ప్రోత్సాహం అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత. ప్రజలకు అనుకూలమైన విధానాలు తీసుకుంటూ ఆహార సార్వభౌమాత్వాన్ని పెంచేలా ఉత్పత్తి పెంచాలి. సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. ఈ చట్టాలకు తూట్లు పొడుస్తూ సెజ్‌లు, పవర్‌ప్లాంటు పేరిట జరుగుతున్నదేమిటి?

ఈ మొత్తం ప్రహసనం గమనించినట్లయితే రాష్ట్ర యంత్రాంగం పాలకుల చేతుల్లో కీలుబొమ్మ అయిందని అర్థమవుతుంది. ఈ అధికార యంత్రాంగం ఒక్కోచోట ఒక్కోలాగా వ్యవహరిస్తుంది. పొరుగునే ఉన్న విజయనగరం జిల్లాలోని కొమరాడ మండలాలలోని కోటిపాలెం, పెద్ద కార్జాల, రేగులపాడు, శివరాంపురం, కొమరాడ గ్రామాలపరిధిలో న్యూఢిల్లీకి చెందిన ఆల్ఫా ఇన్‌ఫ్రా ప్రాపర్టీస్ ప్రైవేటు లిమిటెడ్ వారు 2640 మె.వా.బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 22 మే 2010న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రభుత్వ భూమిని ఇవ్వడానికి ఆదేశాలు ఇస్తూ అక్కడి నీటి కయ్యలగల భూమిని తొలగించారు. కాని నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ కోసం రెవెన్యూ ప్రిన్సిపాల్ జీ.వో. నెం.1107, 15 సెప్టెంబర్ 2008లో ప్రభుత్వ భూమిలో కాలువ పోరంబోకు, తంపర పోరంబోకు, బీలగయిలు, బీలతంపర ఉందంటూనే 972.69 సెంట్ల భూమిని ధారాదత్తం చేయడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ మొత్తం చర్యలు పాలకుల కుటిల యత్నాలకు మచ్చు తునక.

ఎన్నో వ్యవస్థలు మారి ప్రజాస్వామ్య వ్యవస్థగా (ప్రజాస్వామ్యం ఎంత వరకు దేశంలో ఉన్నదన్నది ఇక్కడ చర్చించడం లేదు.) మారిన మన దేశంలో అన్ని చట్టాలు, అభివృద్ధి పేపరు మీద సజావుగానే కన్పిస్తాయి. కాని ఆచరణలో ఏమి జరుగుతుందో ప్రజానీకానికి తెలుసు. 'చట్టం కలవారి చుట్టం' అన్న నానుడి ప్రజల అనుభవాల నుంచి పుట్టిందే. రాష్ట్ర యంత్రాంగానికి తెలుసు ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గాల చేతుల్లో ఆటబొమ్మగా మారిందని. అందుకే కంచె చేను మేస్తే అన్న చందాన అధికారులు తమకు వచ్చినంత దండుకొని లాభపడడానికి ప్రయత్నిస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో అంతర్జాతీయ ఒప్పందాలు అడ్డుపెట్టుకొని పెట్టుబడిదారీవర్గాలను ప్రోత్సహించే నెపంతో పాలకవర్గాలు ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. తప్పనిసరి పరిస్థితులలో ప్రజాస్వామ్యం ముసుగులో చట్టాలు చేసినా అవి కాగితపు పులులే. వాటిని ఖాతరు చెయ్యవలసిన పని పాలక వర్గాలకు లేదు. ప్రజల చైతన్య స్థాయిని బట్టి వారిని మభ్యపెట్టడానికి ప్రోత్సాహకాలు ప్రకటించినా అవి పరిమితమైనవే. సోంపేట ప్రజలకు అదే జరిగింది. కొన్ని తరాలుగా వేలకుటుంబాలు భూమి సముద్రపు వనరులమీద ఆధారపడి బతుకుతున్నామని ప్రజలు ప్రాధేయపడినా యాజమాన్యం ఉపాధి చూపిస్తామని ఆశ చూపబోయారు. ఇంతా చేస్తే యాజమాన్యం మాటిచ్చిన ఉద్యోగాలు 750 మాత్రమే. అందులో సాంకేతిక నైపుణ్యం, శిక్షణను బట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయం పరిశీలించడం జరుగుతుందన్నారు. అంటే కొన్ని వేల కుటుంబాలలో కొన్ని పదుల ఉద్యోగాలు. అది సాంప్రదాయ వ్యవసాయ, మత్స్య రంగానికి చెందిన నిపుణులకు పవర్‌ప్లాంటులో ఉపాధి గ్యారంటీ లేదు. పోనీ ఇంతమంది కడుపుకొట్టి మనకు జరిగిందేమిటి?

ప్రస్తుత మన రాష్ట్ర విద్యుత్ అవసరాలు ఏటా 14,500 మెగావాట్లు (మె.వా.), రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో పాటు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టులనుండి (ఎన్టీపిసి) ఉమ్మడి పవర్‌గ్రిడ్ నుండి ఈ విద్యుత్ లభిస్తుంది. పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందితే ఇంకొక 2000 మె.వా. అవసరమవుతుంది. అలా క్రమంగా విద్యుత్ అవసరాలు పెరుగుతాయి. ఇప్పుడు మన విద్యుత్ అవసరాల్లో అత్యధిక భాగం (సుమారు 70శాతం) ప్రభుత్వ రంగం నుండే లభిస్తుంది. తక్కిన 30శాతం ప్రైవేటు రంగానిది. అందులో ప్రభుత్వ సబ్సిడీ చాలా ఉంది. ప్రస్తుతం జెన్‌కో ఇంకొక 17,500 మె.వా. విద్యుత్ ప్లాంటునకు అనుమతి కోరుతున్నది. ఆ ప్లాంటుకు అనుమతించినా రాబోయే 10,15 సంవత్సరాలకు విద్యుత్ అవసరాలు తీర్చుకోవచ్చు. అదీగాక ఉమ్మడి పవర్‌గ్రిడ్ నుండి కూడా మన రాష్ట్రం అదనపు వాటా ద్వారా విద్యుత్ అవసరాలు తీర్చుకోవచ్చు. అయితే సోంపేటలోగానీ, సంతబొమ్మాళిలో గానీ, రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతాన రాష్ట్ర ప్రభుత్వ 20,000 మె.వా. మేరకు అనుమతులిచ్చింది. అందులో ఒక శ్రీకాకుళం జిల్లాలోనే 8000 మె.వా. మేరకు అనుమతులిచ్చారు. ఇవన్నీ మర్చెంటు పవర్‌ప్లాంట్లు. అంటే మన రాష్ట్ర అవసరాలకోసం కాదు. దేశంలో ఎక్కడైనా అధిక ధరలు పలికిన చోట విద్యుత్‌ను అమ్ముకుంటారు. మన రాష్ట్ర అవసరాలకోసం అయితే కొనుగోలు ఒప్పందాలను ముందే ఖరారు చేసుకుంటుంది. ఈ మర్చెంటు పవరు ప్లాంటులో అటువంటి ఒప్పందాలు ఏమిలేవు. అయితే శ్రీకాకుళం జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రివర్యులు ఇదంతా తమను ఎన్నుకున్న ప్రజల అభివృద్ధి కోసమేనని బాహాటంగా చాటుతున్నారంటే దాని వెనకాల ఉన్న పరమార్థాన్ని గ్రహించలేని అమాయకులేం కాదు ప్రజలు. అందుకే తిరగబడ్డారు.

ఏ చట్టాల్ని ఉపయోగించి సమాచారాన్ని గోప్యంగా ఉంచి పాలకవర్గం అభివృద్ధి మంత్రాన్ని జపిస్తుందో వాటినే సమాచార హక్కులచట్టంతో పొంది ఆ చట్టాల్నే ప్రజలు సవాలు చేసారు. ప్రజలకు అందుబాటులో లేని సమాచారం వారికి ఉద్యమకారులు అందిచ్చి ఉండవచ్చును. గానీ వ్యతిరేకించాలన్న నిర్ణయం ప్రజలదే. దాని ఫలితమే జూన్ 14న జరిగిన హత్యాకాండ! ఏలిన వారి అభివృద్ధి నమూనాను ప్రజలు ప్రశ్నించిన ప్రతిసారి చరిత్ర ఇలాగే పునరావృతమవుతుంది. అభివృద్ధి పేరిట హరిత విప్లవం భోపాల్‌ను సృష్టించి ఎన్నో ప్రాణాలను బలి తీసుకోగా రైతులకు కన్నీటిని మిగిల్చింది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని ఆలీగడ్, హిరట్ తదితర జిల్లాల్లో భూసేకరణ పరిహారం పెంచాలంటూ రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆగ్రా నుంచి ఢిల్లీకి ప్రయాణ వ్యవధి తగ్గించడానికి ఉద్దేశించిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం వలన వందలాది గ్రామాలలోని రైతులు భూమిని కోల్పోతున్నారు. రైతులకు పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు మరణించారు. తాజాగా ఉత్తరప్రదేశ్ లోని ఆలీగడ్, హిరట్ తదితర జిల్లాల్లో భూసేకరణ పరిహారం పెంచాలంటూ రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. అభివృద్ధి అంటే ప్రజల దృష్టిలోని నమూనా వేరు. పాలకుల దృష్టిలో మాత్రం అది విధ్వంసానికి దారి తీసినా ఫర్వాలేదు.

ఇంకొక విషయమేంటంటే వ్యవస్థలో నెలకొన్న అన్నిరకాల భావజాలాలను తమకు అనుగుణంగా పెట్టుబడిదారీ వర్గం మలచుకుంటుంది. అది పితృస్వామ్యం కావచ్చు, అస్తిత్వాలు కావచ్చు. సోంపేటలో చూస్తే ఉద్యమ నాయకత్వాన్ని అందిస్తున్న వారి స్త్రీలను టార్గెటు చేసారు. నడివీధిలో స్త్రీలను వివస్త్రలను చేయడానికి ప్రయత్నం చేసారు. కాల్పుల సంఘటనకు మూడు రోజులు ముందే కంపెనీ యాజమాన్యం ఏర్పాటు చేసిన గూండాలు, పోలీసులు ఊరూరా తిరిగి వారిని భయపెట్టారు. ఈ విషయాన్ని ఉద్యమ నాయకత్వం కాల్పుల సంఘటనకు ముందు రోజు సోంపేటలో బసచేసిన కలెక్టరుకు, ఎ.సి.పి.కి తెలియచేసినా ఫలితం శూన్యం. వారి ద్వారా నాయకత్వం వహిస్తున్న మగవాళ్లను కట్టడి చేద్దామనుకున్నారు. మరో నాయకుడి నర్సింగ్‌హోమ్ మీదపడి గర్భిణీ స్త్రీలను ఈడ్చి, మహిళా రోగుల నగలు కొల్లగొట్టి నానా బీభత్సం సృష్టించారు. స్వతంత్ర్యం వచ్చి రాజ్యాంగం స్త్రీలకు స్వేచ్ఛా, సమానత్వం ప్రతిపాదించినా ప్రాజెక్టు, అధికార యంత్రాంగానికి స్త్రీలు సాటి పౌరులుగా కనపడక, కేవలం భయభ్రాంతులకు గురిచేసి దోచుకోబడే వర్గంగా మాత్రమే కన్పించారు. పితృస్వామ్య భావజాలంతో స్త్రీలను బెదిరించే పద్ధతులు వీరి దగ్గర ఎన్ని నేర్చుకోవాలో?! ఇలాంటి వారు వారి ప్రాజెక్టులలో స్త్రీల ఉపాధి కోసం హామీ ఇవ్వగలరన్న నమ్మకం ప్రజలకు, ముఖ్యంగా స్త్రీలకు లేదు.

అలాగే ఇప్పుడిప్పుడే బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించిన రిజర్వేషన్‌ల వలన సమాజంలో దళితులు ముందడుగు వేస్తున్నారు. కారంచేడు సంఘటన కళ్లు తెరిపించగా దళిత వర్గాల చైతన్యం చూసి వారి ఓటు బ్యాంకు పోగొట్టుకోలేక ఎస్.సి., ఎస్.టి. ప్రొటెక్షన్ యాక్టు చేసారు. ఆ చట్టం ద్వారా మూడు శాతం కేసులలో కూడా దళితులకు న్యాయం జరగలేదన్నది వాస్తవం. కాని నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం దళితులలోని కొంతమందిని తమ వైపుకు తిప్పుకొని తమ కన్నును తామే పొడుచుకునేటట్టు చేస్తున్నారు. అది సోంపేటలోనైనా, కాకినాడలోనైనా, వాన్‌పిక్‌లోనైనా వారి సారాంశం ఒక్కటే. నాయకత్వంపై కక్ష గట్టిన ప్రాజెక్టు యాజమాన్యం కొంతమంది దళితులకు డబ్బు, ఉపాధి ఆశ చూపి నాయకత్వంపై తప్పుడు కేసులు బనాయించేలా చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అయిన ప్రెస్‌ను కంపెనీ యాజమాన్యం డబ్బు, వాహనాలు, ల్యాప్‌టాప్‌లతో కొనేస్తున్నారు. అందుకే సోంపేటలో పోలీసులు కాల్పులు జరిపినప్పుడు ప్రజలు పాలక వర్గాలకు, కంపెనీ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న స్థానిక ప్రెస్‌పై తిరగబడ్డారు.

మానవ హక్కుల కమిషన్‌లో కాల్పుల సంఘటనపై ప్రజలు ఒక్కటే కోరారు. చట్ట విరుద్ధంగా ఎస్.పి., కలెక్టరు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యానికి ఇస్తున్న మద్దతు గురించి, విచారణ జరపాలనీ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కాల్పులు జరిపిన పోలీసులపై హత్యా, దౌర్జన్యం, లూటీ, స్త్రీలపై అసభ్య ప్రవర్తనపై చర్య తీసుకోవాలనీ, పోలీసు బలగాలని వెనక్కి పంపాలనీ, తక్షణమే కమీషన్ వేయాలనీ, లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలనీ కోరారు. అలాగే ప్రభుత్వం క్షతగాత్రుల కుటుంబాలకు వైద్య సదుపాయం అందించలేని నిర్దయని వారు పిటిషన్‌లో ప్రశ్నించారు. తమపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. మానవ హక్కుల కమిషన్ పోలీసు బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు ఇచ్చినా మరింత కక్షతో పోలీసులు గ్రామాలపై పడి ప్రజల్ని చావబాదారు. ఇదీ రాష్ట్రంలోని మానవ హక్కుల పరిస్థితి. ఇంకా విషాదమేమంటే అన్యాయంగా ప్రజల్ని పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చిన పోలీసు ఆఫీసర్లను ప్రభుత్వ అవార్డులతో సత్కరించడం!

ప్రజలకు ఉపాధి, విద్య, ఆహార హక్కులు సంక్షేమ పథకాలు ఇవన్నీ ఉండగా ఇంకా అభివృద్ధి పథానికి ప్రజలు, మేధావులు ఎందుకు అడ్డం పడుతున్నారని ప్రభుత్వం అమాయకంగా ప్రశ్నిస్తుంది. ఆ హక్కులు, పథకాల వెనక ఎంత డొల్లతనం ఉందో అనుభవంలోకి వచ్చిన ప్రజలకు తెలుసు. ఆహారపు హక్కు చట్టాన్నే తీసుకుందాం! ఇప్పటి వరకు కిలో రెండు రూపాయలు చొప్పున 35 కిలోలు ఇచ్చే ప్రభుత్వం ఇక మీదట కిలో మూడు రూపాయలకు 25 కిలోలు ఇస్తుంది. అవి కూడా అందరికి చేరవు అన్న సంగతి పేదలందరికి తెలుసు. గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకుంటే పని చూపించలేని

రోజుల్లో నిరుద్యోగ భృతి ఏమి ఇవ్వరు. అందులో అవినీతి లెక్కలకు అంతేలేదు. విద్యాహక్కు కూడా ఇలాంటిదే.

'అభివృద్ధి ఉంటే ఎలా ఉండాలి!' పరిణామాత్మకంగా గుణాత్మకంగా ఉండాలా? భూమ్మీద ప్రజలందరి జీవితం ఎలా ఉండాలి అన్న ఆదర్శాన్ని ప్రజలే సాధించేదాక ప్రపంచ అభివృద్ధి అనే భావనకు అర్థమే లేదు. అయితే మానవ పారిశ్రామిక అనుకూలత అందించే పరికరాలు, యంత్రాలు మెరుగుపడడమే అభివృద్ధి అని కాదు. యోగ్యమైన మానవ లక్ష్యాలు దర్శకత్వం వహించి, నియంత్రించకపోతే శాస్త్ర విజ్ఞానం, మరిన్ని నైపుణ్యాలు మాత్రమే అభివృద్ధి అనిపించుకోవు. మామూలుగా అభివృద్ధి నిటారు రేఖలా సాగుతుందన్న భావనకు భిన్నంగా క్రమం, అభివృద్ధి అనేవి స్థిర చట్రం లోపలే చలనంలో ఉన్నట్టు చూడకూడదు. ఆ చట్రాలను ఛేదించుకొని, నూతన నిర్మాణాలను, వ్యవస్థలను సృష్టించేతీరులో కూడా ఉంటాయి. అందుకే మార్క్స్, ఏంగెల్స్ ఆధునిక సమాజంలో ఈ చలనం మనిషిని మనిషి దోచుకోకుండా ఉండే స్వేచ్ఛాయుత సమాజ సాధనకేసి సాగుతుందని భావించారు. వాళ్ళు దీనికిగాను 'స్వేచ్ఛ' అనే పదబంధాన్ని వాడారు. ఎంగెల్స్ 'స్వేచ్ఛ' అన్న మాటను 'యాంటీ – డూరింగ్' అన్న గ్రంథంలో సంపూర్ణంగా పురోగతి అంటూ వివరించారు. అది ఒక దిశ, ఒక లక్ష్యం, ఆ దిశలో సాగడానికి మనిషికి తోడ్పడేంతా అభివృద్ధికరమైందే. ప్రతికూల దిశలో మనిషిని పడవేసేది ఏదైనా ప్రతిఘాతకమైనదే. ఆ స్వేచ్ఛకేసి సాగడమే అభివృద్ధి అంటారు మార్క్స్. ఉత్పత్తి లాభాలకి, సొంతవృద్ధికి మాత్రమే సాధనంగా ఉండే పరిస్థితి పోయినపుడు మానవుడే ఉత్పత్తికి లక్ష్యం అయినపుడు మనుష్యుల సామర్థ్యత, పరోక్షంగా అభివృద్ధి జరుగుతుంది. ఉత్పత్తి సాధనాల మీద, పంపిణీ మీద ప్రజలస్వీయ నియంత్రణ ఉండడం ద్వారానే ఈ లక్ష్యసాధన జరుగుతుంది.

అయితే భారతదేశ వ్యవస్థ కుల, పితృస్వామ్య ప్రాతిపదికపైన నిర్మించ బడింది. ప్రాంతీయ, కుల, లింగ, మతపరమైన అసమానతలు తీవ్రంగా ఉన్న ఈ సమాజంలో అభివృద్ధి ఎలా సాధ్యం అన్నది మరో ప్రశ్న. ప్రముఖ నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ భారత వ్యవస్థపై స్పందిస్తూ 'భారతదేశం సాధించిన ఘనవిజయం ప్రజాస్వామ్యాన్ని రక్షించడం, చవిచూసిన ఘోరవైఫల్యం సామాజిక అసమానతలు కొనసాగడం' అన్నారు. భారతదేశం ఆర్థికశాఖ వృద్ధిలో 9 శాతం రికార్డు సాధించినా, సామాజికాభివృద్ధిలో వెనుకబడింది. ప్రజలజీవన ప్రమాణాలతో ప్రత్యక్ష సంబంధమున్న అంశాలను సామాజిక అభివృద్ధి కొలబద్దలుగా కొలుస్తారు కూడా. ఉదాహరణకు అక్షరాస్యత, శిశు మరణాలు, మాతృ మరణాలు, సగటు జీవిత కాలం, స్త్రీ, పురుష నిష్పత్తి, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్య సేవల అందుబాటు, మహిళా సాధికారత, సామాజిక న్యాయం మొదలైనవి, భారతదేశంలో ఇప్పటికి అనేక అసమానతలు కొనసాగుతున్నాయని తాజాగా నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనమిక్ రిసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ సంయుక్తంగా నిర్వహించిన పరిశోధన కూడా వెల్లడించాయి. సామాజిక అసమానతలు, గ్రామీణ పట్టణాల మధ్య అసమానతలు, పౌర సేవల అందుబాటులలో తారతమ్యాలు, వర్గాలవారి దిగువ స్థాయిలో ఉండడం. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ముఖ్యమైనవి. విద్యారంగంలో అక్షరాస్యతలో స్త్రీ పురుషుల మధ్య తేడా ఉంది. ఆదాయంలో స్త్రీ వెనుకబడి ఉండడం వలన ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. పురుషులు ఒక్క రూపాయి సంపాదిస్తే, స్త్రీలు కేవలం 53 పైసలు మాత్రమే సంపాదిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు కావడంలేదు. అలాగే పట్టణాలలో19 శాతం మందికి కంప్యూటర్ నైపుణ్యం తెలిస్తే గ్రామాలలో కేవలం 2 శాతం మందికి మాత్రమే తెలుసు. దేశంలోని 17 శాతం ఎస్.సి.లలో 86.25 శాతం భూమి లేని పేద కుటుంబాలే. వారంతా 49.1 శాతం వ్యవసాయ కార్మికులే. నేషనల్ క్రైమ్ రికార్డ్ల బ్యూరో ఇచ్చిన గణాంకాల ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. రిజర్వేషన్లు అమలైన తరువాత కూడా ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ లాంటి అత్యున్నత కేంద్ర ప్రభుత్వోద్యోగులలో షెడ్యూల్ కులాలకు చెందిన వారి ప్రాతినిధ్యం జనాభాలో వారి జనాభా కంటే తక్కువగా ఉంది. ప్రజాభిప్రాయాన్ని నిర్మించే ప్రసార మాధ్యమంలో అత్యున్నత స్థాయిలో పనిచేసే పాత్రికేయుల్లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు లేరు. రోజు రోజుకు పేదరికం పెరిగిపోయి ప్రజల జీవన ప్రమాణాలు అడుగంటుతున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి చావులు, అనారోగ్యం, అవిద్య, అభద్రత, అవినీతి, ఆహార కొరత, నీటి ఎద్దడి వంటి ఎన్నో సమస్యలతో ప్రజల జీవితాలన్నీ అతలాకుతలం అవుతున్నాయి. ఆర్థిక సంక్షోభం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

శతాబ్దాల సామాజిక అణిచివేత, కులవివక్ష ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. సమాజ వనరుల ఆధిపత్యం అగ్ర వర్గాల, కులాల దళారి చేతుల్లోనే ఉంది. రూపాలు మారుతున్నాయి. ఇప్పటి సెజ్, థర్మల్ పవర్ప్లాంట్ యాజమాన్యాలను చూస్తే ఈ సంగతి విదితమే. వీరి చెర నుంచి విముక్తి పొందినప్పుడే అభివృద్ధి సాధ్యం. సర్వ మానవుల శ్రేయస్సు కోసం హేతుబద్ధంగా సకలఉత్పత్తిని శ్రామిక వర్గ అజమాయిషీ కింద తెచ్చుకోవాలి. ప్రజల అందరి సామాజిక, సాంస్కృతిక స్థాయిని పెంచడం, మానవుని ఆర్థిక, రాజకీయ సామాజిక సంబంధాలను వివేచనాయుతమైన ఆధిపత్యం కింద తెచ్చి సమష్టి మానవాళి సామర్థ్యాన్ని పెంచడం, గతంలో ఏ సమాజ రూపమూ చెయ్యని విధంగా నిరంతరంగా మరింత పరిపూర్ణంగా శాస్త్రాల్ని అభివృద్ధి చెయ్యడం, వాటిని మానవ శ్రేయస్సు కోసం వినియోగించడం, సకలశాస్త్రాల్ని కళల్ని వినియోగించడం ద్వారా మానవ జీవిత ఉన్నత ప్రమాణాన్ని ఉండ గలిగిన, ఉండవలసిన ఆదర్శాలని రూపొందించి సాధించగలగడం మాత్రమే నిజమైన అభివృద్ధికి నిర్వచనం.

అశేష ప్రజానికానికి కావలసింది ఈ అభివృద్ధే. ఈ తరహా అభివృద్ధిని అందించడానికి పాలకవర్గాలకు చిత్తశుద్ధి, అంకితభావం లేవు. అందుకే ప్రజలు న్యాయమైన హక్కుల కోసం పోరాడినప్పుడల్లా సమస్యలను ప్రక్కదోవ పట్టించి, వామపక్ష తీవ్రవాదులుగా ముద్రవేసి ప్రజలను విచక్షణారహితంగా చంపుతూ, విధ్వంసానికి పాల్పడుతూ ఒక భయానక బీభత్స వాతావరణాన్ని సృష్టించి ఆ గడ్డ నుంచే ప్రజలను తరిమి వేయాలని పాలకవర్గం ఎదురు చూస్తోంది. తమ హక్కులకై చేస్తున్న పోరాటం కేవలం వారికి సంబంధించినది మాత్రమే కాదు. ఒక ప్రాంతానికి పరిమితమైనది కాదు. ఈ హక్కుల పోరాటం దేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, స్వావలంబనకు, స్వయంప్రతిపత్తికి సంబంధించిన విషయం.

ఒక పక్క దేశ వనరుల్ని, సార్వభౌమత్వాన్ని తాకట్టుపెట్టి కొన్ని హక్కుల్ని ప్రజలకు విదిల్చడం అభివృద్ధి పథం కానేరదు. అందుకే సోంపేటలో ప్రభుత్వ పథకాల్ని తిప్పికొట్టి ప్రజలు ఉద్యమ బాట పట్టడం చూసాం. మనిషి కింద నేల కదలకుండా ఆకలికి, అభద్రతకు వ్యతిరేకంగా అభివృద్ధిని పొందడం ప్రతి మనిషి ప్రజా స్వామ్య హక్కు. అప్పుడే పెట్టుబడి కబంధ హస్తాల్లో పౌరుడు చిక్కకుండా శ్రమ ఆధారిత ప్రత్యామ్నాయ అభివృద్ధి సాధ్యం. ప్రజాస్వామ్యంలో చట్టాల ముసుగులో జరుగుతున్న దోపిడికి పాలకులు బాసటగా నిలిచి చట్టాలు తమ పని తాము చేసుకొని పోతాయని తాకీదులు ఇస్తుంటే, ప్రజలు తమ పని తాము చేసుకుపోవడానికి వెనకాడరని చరిత్ర చెబుతున్న పోరాట సత్యం! కాని తమ ధర్మాన్ని ప్రజాధర్మంగా బోధించే ధర్మాన ప్రసాద రావు వంటి వారు కూడా ఉంటారు. తస్మాత్ జాగ్రత్త!!

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

(అమెరికాలోని సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ గ్రాడ్యుయేట్ సెంటర్‌లో ఆంథ్రోపాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డేవిడ్ హార్వే నలభై సంవత్సరాలుగా కాపిటల్ బోధిస్తున్నారు. మార్క్సిస్ట్ రాజకీయార్థశాస్త్ర విషయాలపై అనేక పుస్తకాలు రాసిన హార్వే కాపిటల్ మొదటి సంపుటాన్ని పరిచయం చేస్తూ చెప్పిన అధ్యయన తరగతి దాదాపు ఇరవై గంటలలో పదమూడు వీడియో పాఠాలుగా ఇంటర్నెట్ మీద www.davidharvey.org మీద ఉంది. ఈ పాఠాలతో ప్రేరణ పొందిన వర్సో బుక్స్ ప్రచురణ సంస్థ ఆ పాఠాల ఆధారంగానే ఒక పుస్తకం రచించమని హార్వేను కోరిన ఫలితంగా 2010లో 'ఎ కంపానియన్ టు మార్క్స్ కాపిటల్' పుస్తకం వెలువడింది. దానికి హార్వే రాసిన ఉపోద్ఘాతం ఇది. – సం.)

కాపిటల్ చదవబోయే ముందు...

కార్ల్‌మార్క్స్ రాసిన కాపిటల్ మొదటి సంపుటాన్ని మీతో చదివింపజేయడం నా లక్ష్యం. అది కూడా మార్క్స్ ఏ ఉద్దేశంతో రాశాడో, ఆ ఉద్దేశానికి అనుగుణంగా చదివింపజేయడం నా లక్ష్యం. ఇది కొంచెం హాస్యాస్పదంగా కనబడవచ్చు. ఎందుకంటే మీరు ఆ పుస్తకం చదవకుండా ఆయన ఉద్దేశం ఏమిటో తెలుసుకోవడం కష్టం. కాని, ఆయన ఉద్దేశాలలో ఒకటేమిటంటే మీరు ఆ పుస్తకాన్ని జాగ్రత్తగా చదవాలనేది అని నేనను కుంటాను. నిజమైన విద్య అంటే ఎప్పుడైనా తెలియని దాన్ని అర్థం చేసుకోవడానికి చేసే పోరాటమే. కాపిటల్‌ను నేనెలా చదివానో ఇక్కడ ఈ పుస్తకంలో సంకలనం చేశాను. కాని, నా పుస్తకం చదవడానికన్నా ముందే మీరు ఆ అధ్యాయాలు చదివి ఉంటే ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. ఆ పుస్తకంతో మీరు సొంతంగా తలపడడాన్ని నేను ప్రోత్సహిస్తాను. మార్క్స్ పుస్తకంతో నేరుగా తలపడడం ద్వారా ఆయన ఆలోచనల గురించి మీ అవగాహనను రూపొందించుకోగలరు.

అయితే, ఇక్కడ ఒక తక్షణ సమస్య ఉంది. దాదాపు ప్రతి ఒక్కరూ కార్ల్ మార్క్స్ గురించి లేదా, మార్క్సిజం, మార్క్సిస్టు అనే పదాల గురించి విని ఉన్నారు. ఈ పదాలతో ఏవేవో భావాలు ప్రచారంలో ఉన్నాయి. అందువల్ల మీరు అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఇప్పటికే ఏర్పడి ఉన్న భావాలతో, దురభిప్రాయాలతో ఈ పుస్తకం చదవడం మొదలుపెడతారు. కాని, నేను మీకొక హెచ్చరిక చేయదలిచాను. వీలైనంత వరకు మీరు మార్క్స్ గురించి మీకు తెలుసనుకుంటున్న విషయాలను పక్కన పెట్టండి. అప్పుడు మాత్రమే వాస్తవికంగా ఆయన ఏం చెప్పాడో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

ఇటువంటి ప్రత్యక్ష సంభాషణతో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి. ఉదాహరణకు, ఈ పుస్తకంతో వ్యవహరించేటప్పుడు మనం మనకు ఇప్పటికే అంది ఉన్న ప్రత్యేక మేధో స్థాయితోనూ, మనం అనుభవించిన చరిత్రతోనూ ఆ పుస్తకం దగ్గరికి చేరుతాం. చాలా మంది విద్యార్థులకు ఆ మేధో స్థాయి మీద వారు చదువుకున్న విద్యా సంబంధమైన పరిమితులూ, అవకాశాలూ విధించే ప్రభావం ఉంటుంది. సహజమైన ధోరణి ఏమంటే, పాఠకులకు తెలిసిన ప్రత్యేక, నిర్దిష్ట విద్యాశాఖ నుంచి (అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర వగైరా) మార్క్స్‌ను చదవడానికి ప్రయత్నించడం. మార్క్స్ ఏదైనా విశ్వవిద్యాలయంలో పనిచేయాలని ప్రయత్నించి ఉంటే ఆయనకు ఏ శాఖా ఉద్యోగం ఇచ్చేది కాదు. ఇవాళ్టికి కూడా ఏ ఒక్క శాఖాపరమైన యంత్రాంగాలు ఆయనను తమవాడిగా భావించడానికి ఇష్టపడవు. మీరు ఏదో ఒక శాఖలో విద్యార్థి అయి ఆయనను చదువుదామని ప్రయత్నిస్తూ ఉంటే, మీ రంగంలో ఏదో దొరుకుతుందని ఆశించకండి. క్లుప్తంగా చెప్పాలంటే మీరు చేయవలసిందల్లా ఆయన ఏం చెబుతున్నాడో నిర్ధారించుకోవడానికి మహాపోరాటం సాగించడం. మీ శాఖాపరమైన పరికరాల కన్నా, మీ సొంత మేధో స్థాయికన్నా, అన్నిటికన్న ముఖ్యంగా మీ సొంత అనుభవ చరిత్ర కన్నా ఆయన చెప్పేది వేరే స్థాయిలో ఉంటుంది.

కాపిటల్ చదివే విషయంలో ఇంత విశాలమైన వైఖరి తీసుకోవడానికి ఒక ముఖ్య కారణం ఏమంటే, అది ఆశ్చర్యకరంగా అత్యంత సంపన్నమైన పుస్తకం. షేక్స్‌పియర్, గ్రీకు రచయితలు, ఫాస్ట్, బాల్జాక్, షెల్లీ, జానపద గాథలు, అభూత కల్పనలు, భూతాల కథలు, కవిత్వం లాంటివి ఎన్నో ఆ పుటల్లో కనబడతాయి. వాటిపక్కనే లెక్కలేనంత మంది రాజకీయార్థశాస్త్ర వేత్తలు, తత్వవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రాజకీయ సిద్ధాంతకర్తలు కనబడతారు. మార్క్స్ ఎంత అసంఖ్యాకమైన వనరుల నుంచి తన సమాచారం సేకరించాడంటే వాటిని వెదుకుతూ పోవడం చాలా జ్ఞానదాయకం గానూ, వినోదంగానూ కూడా ఉంటుంది. ఆయన చేసిన ప్రస్తావనలలో కొన్ని నిగూఢంగా కూడా ఉంటాయి. ఆయన వాటిని ఎక్కడి నుంచి తీసుకున్నాడో నేరుగా చెప్పడు. నేను ఎన్నో సంవత్సరాలుగా కాపిటల్ బోధిస్తున్న కొద్దీ ఎప్పటికప్పుడు నాకు కొత్త సంబంధాలు కనబడుతూ ఉంటాయి. ఉదాహరణకు, నేను కాపిటల్ బోధించడం మొదలు పెట్టినప్పటికి బాల్జాక్ రచనలు చదవలేదు. ఆ తర్వాత బాల్జాక్ నవలలు చదువుతూ ఉంటే, 'ఓహో! మార్క్స్ ఇక్కడి నుంచి ఆ మాట తీసుకున్నాడన్న మాట' అని ఎన్నోసార్లు ఆశ్చర్యపోయాను. బాల్జాక్ రచనలను మార్క్స్ సంపూర్ణంగా చదివాడు. కాపిటల్ రచన అయిపోయిన తర్వాత బాల్జాక్ నవల 'కామెడీ హ్యూమేన్' మీద ఒక సమగ్ర విశ్లేషణ పుస్తకం రాయాలని ఆశించాడు. కాపిటల్‌ను, బాల్జాక్‌ను కలిపి చదివితే ఆయన ఎందుకు అలా ఆలోచించాడో అర్థమవుతుంది.

అంటే, కాపిటల్ ఒక సంపన్నమైన, అనేక కోణాలతో కలగలిసిన పుస్తకం. అది ప్రపంచంలోని విస్తారమైన అనుభవాన్ని భావనీకరించిన, సువిశాల వైవిధ్యం గల సాహిత్యాలను తనలో భాగం చేసుకున్నది. ఆ సాహిత్యాలు వేరు వేరు భాషలలో, వేరు వేరు కాలాలలో, వేరు వేరు స్థలాలలో రాయబడినవి. అట్లని మీరు ఆ మూలాలన్నీ చదివితేనే మార్క్స్ అర్థమవుతాడని నేను చెప్పబోవడం లేదు. కాని, నాకు ప్రేరణగా నిలిచిన అంశం బహుశా మీకు కూడా ప్రేరణ కలిగించగలదని నేననుకుంటున్న అంశం ఏమంటే, మనం మన జీవితాలను ఇలా ఎందుకు గడుపు

తున్నామో వెలుగు ప్రసరించగల వనరులు ఆ పుస్తకంలో లెక్కలేనన్ని ఉన్నాయి. ఆ వనరులన్నీ మార్క్స్ ఆలోచనా మరకు పిండిగా ఉపయోగపడ్డాయి. మన ఆలోచన మర ఆడడానికి కూడా ఆ వనరులను వాడుకోవచ్చు.

అట్లాగే కాపిటల్ ఆశ్చర్యకరమైన మంచి పుస్తకం కూడా. ఒక పుస్తకంగానే అది మంచి పుస్తకం. దాన్ని మొత్తంగా చదివితే ఒక సాహిత్య నిర్మాణంగా అది అద్భుతమైన సంతృప్తిని కలిగిస్తుంది. కాని, ఇక్కడ దాన్ని అర్థం చేసుకోవడానికి ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. మీలో చాలామంది మీ విద్యా క్రమంలో అక్కడక్కడా మార్క్స్ రాసిన ముక్కలు చదివి ఉంటారు. ఎక్కడో ఒక చోట ఉన్నత పాఠశాలలో కమ్యూనిస్టు ప్రణాళిక చదివి ఉంటారు. సామాజిక సిద్ధాంతం అనే పాఠ్యాంశంలో భాగంగా ఓ రెండు వారాలు మార్క్స్ గురించి, మరికొన్ని వారాలు వెబర్ గురించి, దుర్ఖీమ్, ఫూకో అటువంటి ముఖ్యమైన రచయితల గురించి చదివే ఉంటారు. అంతేకాదు, కాపిటల్ నుంచి కొన్ని భాగాలో, లేదా, మార్క్స్ రాజకీయాభిప్రాయాల సైద్ధాంతిక వివరణలో చదివే ఉంటారు. కాని, కొన్ని ముక్కల్లో, సంగ్రహించిన వివరణలో చదవడం కన్న కాపిటల్‌ను ఒక సమగ్ర పుస్తకంగా చదవడం సంపూర్ణంగా భిన్నమైనది. మీకు అప్పటికే తెలిసిన వాక్యాలు, ముక్కలు ఇప్పుడు ఒక విప్లవాత్మకమైన కొత్త వెలుగులో కనబడతాయి. ఇక్కడ ఒక మహా కథనం నేపథ్యాన్ని సమకూరుస్తుంది. ఈ మహాకథనం పట్ల చాలా జాగ్రత్త వహించడం, ఇంతకు ముందు తెలిసిన ముక్కల వాక్యాల వివరణల అవగాహనలను మార్చుకోవడానికి సిద్ధంగా ఉండడం చాలా ముఖ్యం. తన రచనను ఒక సమగ్ర మొత్తంగా చదవాలని మార్క్స్ తప్పని సరిగా ఆశించి ఉంటాడు. ఎంత జాగ్రత్తగా ఎంపిక చేసినా ముక్కల ద్వారా తనను తగినంతగా అర్థం చేసుకోవచ్చుననే ఆలోచనను ఆయన బలంగా ఖండించి ఉండేవాడు. సామాజిక సిద్ధాంతంపై పరిచయ పాఠ్యాంశంలో భాగంగా తనను రెండు వారాల పాటు చెబితే ఆయన ఎంత మాత్రం అంగీకరించి ఉండేవాడు కాదు. స్వయంగా ఆయనే ఆడమ్ స్మిత్‌ను అలా రెండు వారాలలో చదివి పారెయ్యవచ్చునని అనుకోలేదు. కాపిటల్‌ను మొత్తంగా చదివినప్పుడు మార్క్స్ ఆలోచన గురించి మీరు సంపూర్ణంగా ఒక కొత్త అవగాహనకు చేరుతారు. దాని అర్థమేమంటే మీరా పుస్తకాన్ని మొత్తంగా చదవాలి అని. ఇక్కడ ఆ పనిలో మీకు సహాయం చేయడమే నా ప్రయత్నం.

కాపిటల్ చదవడంలో పాఠకుల మేధో స్థాయి, వారి విద్యా శాఖ దృక్పథం ప్రాధాన్యత వహించడం మాత్రమే కాదు, కొత్త దృష్టికోణాలను కూడా సమకూరుస్తాయి. కాపిటల్‌ను తమ తమ విద్యాశాఖ నుంచే ప్రత్యేకంగా చదివే విద్యార్థుల ఆలోచనా ధోరణికి నేను వ్యతిరేకం. కాని, ఆయా విద్యాశాఖల దృక్కోణాలు కాపిటల్ అధ్యయనంలో ఎలా ఉపయోగపడతాయో నాకు తెలిసి వచ్చింది. 1971 నుంచి దాదాపు ప్రతి సంవత్సరం నేను కాపిటల్ బోధిస్తున్నాను. ఒక్కోసారి ఒక సంవత్సరంలోనే రెండు సార్లూ, మూడు సార్లూ కూడా బోధించాను. అన్ని రకాల విద్యార్థులకు బోధించాను. ఒక సంవత్సరం మొత్తంగా నా బోధన బాల్టిమోర్ లోని మోర్గాన్ స్టేట్ కాలేజ్‌లో తత్వశాస్త్ర శాఖలో జరిగింది. ఆ విద్యార్థులలో ఎక్కువమంది హెగెల్ ప్రభావంలో ఉన్నవాళ్లు. మరొక సంవత్సరం జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ శాఖలో విద్యార్థులకు కాపిటల్ బోధించాను. ఇంకొక సంవత్సరం నా విద్యార్థులందరూ అర్థశాస్త్రవేత్తలు. నేను అచ్చెరువు పొందిన అంశమేమంటే వీరిలో ప్రతి ఒక్క బృందం కాపిటల్‌లో వేరు వేరు విషయాలు చూసింది. విభిన్న శాఖల విద్యార్థులతో కలిసి పనిచేస్తున్నప్పుడు ఆ పుస్తకాన్ని నేను మరింత ఎక్కువగా అర్థం చేసుకున్నాను.

కాని కొన్నిసార్లు ఈ నేర్చుకొనే అనుభవం నన్ను అసహనం పాలు చేసింది. ఇబ్బంది పెట్టింది. ఎందుకంటే, ఒక విద్యార్థి బృందం కాపిటల్‌ను నేను చూసినట్టుగా చూడ లేదు. నేను అనవసరమైనవని అనుకున్న విషయాల మీద పట్టుబట్టింది. జాన్స్ హాప్‌కిన్స్‌లో ఒక సంవత్సరం నేను రోమన్ భాషా అధ్యయన కార్యక్రమ విద్యార్థులతో కలిసి కాపిటల్ చదవవలసి వచ్చింది. నాకెంత చికాకు కలిగిందంటే, మేం ఒక సెమిస్టర్ మొత్తం మొదటి అధ్యాయం చదవడానికే వెచ్చించాం. 'చూడండి, మనం ముందుకు కదలాలి. కనీసం పనిదినం వెనుక ఉండే రాజకీయాలను అర్థం చేసుకునే దాకానైనా వెళ్లాలి' అని నేను బతిమిలాడుతూ ఉండేవాణ్ని. వాళ్లు మాత్రం 'కాదు, కాదు, ఉండండి. మనం ప్రతి ఒక్క విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. విలువ అంటే ఏమిటి? డబ్బు ఒక సరుకు అయిపోతుంది అని అన్నప్పుడు మార్క్స్ ఉద్దేశం ఏమిటి? ఆరాధన అంటే ఏమిటి?' వగైరా వగైరా ప్రశ్నలతో వాళ్లు ముంచెత్తేవాళ్లు. అంతేకాదు, వాళ్లు ఒక జర్మన్ ప్రతి కూడా పట్టుకొచ్చి అసలు ఇంగ్లిష్ అనువాదం సరిగ్గా అయిందా లేదా చూడడం మొదలుపెట్టారు. వాళ్లందరూ ఒక మేధావి చెప్పిన పద్ధతిలో ఆలోచించడానికి అలవాటు పడ్డవాళ్లు. అప్పటికి నేను ఆ మేధావి పేరు కూడా వినలేదు. ఇటువంటి వైఖరిని ప్రేరేపించాడంటే ఆయన మేధావిగా కాకపోయినా రాజకీయ అర్థంలో మూర్ఖుడు అని నేను అనుకున్నాను. ఆ వ్యక్తి పేరు జాక్వీ దెరీడా. 1960ల చివర 1970ల మొదట్లోను ఆయన జాన్స్ హాప్‌కిన్స్‌లో కొద్దికాలం ఉన్నాడు. కొంతకాలం గడిచాక నేను ఈ అనుభవం గురించి పునరాలోచించాను. మార్క్స్ వాడిన భాష పట్ల అత్యంత జాగరూకతతో ఉండడం ఎంత ముఖ్యమో నాకు ఈ బృందం నేర్పిందని గుర్తించాను. ఆయన ఏమంటున్నాడు, దాన్ని ఎలా అంటున్నాడు, దేన్ని ఆమోదిస్తున్నాడు అనే విషయాలను ఒక్క మొదటి అధ్యాయంలోనే పదాల మధ్య నుంచి దువ్వెనతో దువ్వినట్టు తెలుసుకోవలసి ఉందని నాకు అర్థమయింది.

కాని, కంగారుపడకండి. ఈ పుస్తకంలో నేను ఆ పని చేయబోవడం లేదు. ఇక్కడ పని దినం గురించి మార్క్స్ చేసిన చర్చను గురించి వివరించడం మాత్రమే కాదు, మొదటి సంపుటం చివరి దాకా మీతో చదివించడానికే నేను కృతనిశ్చయంతో ఉన్నాను. నేను చెప్పదలచినదల్లా ఏమంటే, మార్క్స్ ఆలోచనల్లోని అనేక కోణాలు అర్థం చేసుకోవడానికి విభిన్న విద్యా శాఖల దృక్కోణాలు ఉపయోగపడతాయి అని మాత్రమే. ఎందుకంటే, ఆయన తన పుస్తకం రాస్తున్నప్పుడు అసాధారణమైన, వైవిధ్యభరితమైన, సంపన్నమైన విమర్శనాత్మక ఆలోచనా సంప్రదాయం నుంచి రాశాడు. ఇన్ని సంవత్సరాలుగా ఈ పుస్తకం నేను ఎంతోమంది వ్యక్తులతో, ఎన్నో బృందాలతో కలిసి చదివాను. వాళ్లందరికీ రుణపడి ఉన్నాను. ఎందుకంటే, నా అంతట నేను మార్క్స్ రచన నుంచి గుర్తించలేకపోయిన ఎన్నో అంశాలను వాళ్లు నాకు నేర్పారు. నా వరకు నాకు నేర్చుకోవడం అనేది అంతం లేని ఒక ప్రక్రియ.

ఇక, కాపిటల్‌లో చేసిన విశ్లేషణకు ప్రేరణగా నిలిచిన మూడు ప్రధాన మేధో రాజకీయ ధోరణులు ఉన్నాయి. అవి మూడూ కూడా విమర్శనాత్మక సిద్ధాంతం పట్ల, విమర్శనాత్మక విశ్లేషణ పట్ల మార్క్స్‌కు

ఉండిన లోతైన అభినివేశంతో ముందుకు సాగాయి. ఇంకా యువకుడు గానే ఉన్నప్పుడు తన సంపాదక సహచరులలో ఒకరికి ఆయన రాసిన చిన్న వ్యాస శకలపు శీర్షిక 'ఉనికిలో ఉన్న ప్రతి ఒక్కదాన్నీ నిర్దాక్షిణ్యంగా విమర్శించడం కొరకు'. స్పష్టంగానే ఆయన చాలా వినయంగా ఉన్నాడు. నిజానికి మీరు వెంటనే ఈ వ్యాసం చదవాలనీ, అది అద్భుతమైనదనీ నా అభిప్రాయం. 'ప్రతి ఒక్కటీ తెలివిమాలినది. నేను, మహా మార్క్సును, ప్రతి ఒక్కదాన్నీ విమర్శించి వాళ్ల ఉనికిని చెరిపేయదలచుకున్నాను' అని ఆయన అనలేదు. దానికి బదులుగా, ఆయన ఏమని వాదించాడంటే, ఎంతోమంది గంభీరమైన మనుషులు ప్రపంచం గురించి చాలా తీవ్రంగా ఆలోచించారు. ప్రపంచంలో గౌరవించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయని వారు గమనించారు. వారి ఆలోచనలలో పాక్షికత ఉండవచ్చు. వంకర టింకరలు ఉండవచ్చు. విమర్శనాత్మక సంవిధానం చేయవలసిన పని అంటే, ఇతరులు చెప్పిన, చూసిన విషయాలను తీసుకొని వాటి మీద పనిచేసి, ఆ ఆలోచనను, ఆ ఆలోచన వర్ణించే ప్రపంచాన్ని వినూత్నమైన పద్ధతిలో పరివర్తన చెందించడం. మౌలికంగా వేరువేరుగా ఉన్న భావనాత్మకమైన ముద్దలను తీసుకొని వాటిని ఒకదానితో ఒకటి రాపిడిచేసి, వాటితో విప్లవజ్వాల రగిల్చినప్పుడు కొత్త జ్ఞానం తలెత్తుతుందని మార్క్స్ భావించాడు. కాపిటల్‌లో సారభూతంగా ఆయన చేసిన పని అదే. ఆయన వేరు వేరు దిక్కుల చూసే మేధో సంప్రదాయాలను ఒక్క చోటికి తెచ్చి, సంపూర్ణంగా కొత్తదయిన, విప్లవాత్మకమైన జ్ఞాన చట్రాన్ని సృష్టించాడు.

కాపిటల్‌లో కలగలసిపోయిన మూడు మహా భావనా చట్రాలు ఇవి : మొదటిది, సాంప్రదాయిక రాజకీయార్థ శాస్త్రం – పదిహేడో శతాబ్దం నుండి పంతొమ్మిదో శతాబ్దం మధ్య దాకా సాగిన రాజకీయార్థ శాస్త్రం. ఇది మొత్తంగా కాకపోయినా ప్రధానంగా బ్రిటిష్ సంప్రదాయం. అది విలియం పెట్టీ, లాక్, హాబ్స్, హ్యూమ్‌ల నుంచి మహాత్రయం ఆడమ్ స్మిత్, మాల్తస్, రికార్డోల నుంచి జేమ్స్ స్టూవార్ట్ వంటి ఎందరినో కలుపుకున్నది. దీనిలో క్వెస్నే, టర్గోట్, ఆ తర్వాత సిస్మోండి, సే వంటి ఫిజియోక్రాట్‌ల వల్ల ఫ్రెంచ్ సంప్రదాయంలోని రాజకీయార్థ శాస్త్రం, మరికొంత మంది ఇటాలియన్‌లు, కారీ వంటి అమెరికన్‌లు మార్క్స్‌కు అదనపు విమర్శనాత్మక వస్తువును అందించారు. వీళ్లందరినీ మార్క్స్ లోతయిన విమర్శకు గురిచేశాడు. ఆ విమర్శనంతా మూడు సంపుటాల నోట్స్ రాసుకున్నాడు. వాటినే ఇప్పుడు మనం 'థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ' అని పిలుస్తున్నాం. ఆయనకు ఆ రోజుల్లో ఫొటో కాపీయింగ్ యంత్రం లేదు. వెబ్‌కూడా లేదు. అందుకని జాగ్రత్తగా కూర్చుని స్మిత్ రచన నుంచి పొడవాటి ఉటంకింపును రాసుకోవడం, దాని మీద ఒక వ్యాఖ్య రాయడం. స్టూవార్ట్ నుంచి పొడవాటి ఉటంకింపును రాసుకోవడం, దాని మీద వ్యాఖ్య రాయడం, ఇలా సాగించాడు. నిజం చెప్పాలంటే, ఇవాళ మనం వినిర్మాణం అని పిలుస్తున్న విమర్శనా పద్ధతిని ఆయన అక్షరాలా పాటించాడన్నమాట. వాదనలను ఈ పద్ధతిలో వినిర్మించడం ఎలాగో నేను మార్క్స్ నుంచే నేర్చుకున్నాను. ఉదాహరణకు, ఆడమ్ స్మిత్ గురించి రాస్తున్నప్పుడు మార్క్స్, స్మిత్ చెప్పినదాన్లో అత్యధిక భాగాన్ని అంగీకరిస్తాడు. ఆ తర్వాత దానిలో ఖాళీలు ఎక్కడ ఉన్నాయో, వైరుధ్యాలు ఎక్కడ ఉన్నాయో వెతుకుతాడు. వాటిని సవరించినపుడు మౌలికంగా ఆ వాదన పరివర్తనం చెందుతుందని చూపుతాడు. కాపిటల్ మొత్తంలో ఈ రకమైన వాదనా పద్ధతి కనబడుతుంది. ఎందుకంటే, దాని ఉపశీర్షిక చెప్పినట్టు అది మొత్తంగా 'రాజకీయార్థశాస్త్ర విమర్శ' గా రూపుదిద్దుకుంది.

మార్క్స్ చేసిన సైద్ధాంతీకరణకు రెండవ భావనాత్మకమైన నిర్మాణ పరికరం తాత్విక చర్చ, అన్వేషణ. మార్క్స్‌కు సంబంధించినంత వరకు ఇది గ్రీకుల దగ్గర ప్రారంభమైంది. మార్క్స్ స్వయంగా తన పిఎచ్.డి. సిద్ధాంత పత్రం గ్రీకు తత్వవేత్త ఎపిక్యూరస్ మీద రాశాడు. అందువల్ల గ్రీకు తాత్విక చింతనతో ఆయనకు మంచి పరిచయం ఉంది. ఆయన వాదనలకు చాలా తరచుగా పునాది కల్పించేది అరిస్టాటిల్. ఈ గ్రీకు ఆలోచనా ధోరణి జర్మన్ తాత్విక, విమర్శనాత్మక సంప్రదాయంలోకి ఎలా వచ్చిందో మార్క్స్ లోతైన శిక్షణ పొందాడు. జర్మన్ తాత్విక ధారలో స్పినోజా, లీబ్నిజ్, హెగెల్, కాంట్ తదితరులు ఎందరో ఉన్నారు. మార్క్స్ తన ప్రధాన జర్మన్ విమర్శనాత్మక, తాత్విక సంప్రదాయాన్ని బ్రిటిష్, ఫ్రెంచ్ రాజకీయార్థిక సంప్రదాయంతో కలగలపుతాడు. అయితే ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఈ ఆలోచనా ధోరణులను ఆయా దేశాల, జాతుల సంప్రదాయాలుగా చూడడం పొరపాటవుతుంది. హ్యూమ్ ఎంతగా అనుభవవాద తత్వవేత్తనో, అంతగా రాజకీయార్థిక శాస్త్రవేత్త కూడా. అలాగే, మార్క్స్ మీద డెస్కార్టెస్, రూసో ల ప్రభావం కూడా గణనీయంగా ఉంది. అయినా, మార్క్స్ మీద జర్మన్ విమర్శనాత్మక తాత్విక సంప్రదాయం ప్రభావమే ఎక్కువ ఉండడం ఎందువల్లనంటే అదే ఆయన పొందిన తొలి శిక్షణ. అలాగే, ఆ తర్వాత కాలంలో 'యువ హెగెలియన్'లుగా ప్రచారంలోకి వచ్చిన, 1830లలో, 40లలో ఉండిన విమర్శనాత్మక వాతావరణం ఆయనపై చాలా ప్రభావం వేసింది.

మార్క్స్ అవలంబించిన మూడో సంప్రదాయం ఊహాత్మక సోషలిజానికి సంబంధించినది. మార్క్స్ కాలం నాటికి ఇది ప్రధానంగా ఫ్రెంచ్ ఆలోచనలతో నిండి ఉండేది. నిజానికి థామస్ మూర్ అనే ఇంగ్లిష్ మేధావే మొట్టమొదటిసారిగా ఈ ఆధునిక సంప్రదాయాన్ని ప్రారంభించాడని ఆధారాలు ఉన్నప్పటికీ, రాబర్ట్ ఒవెన్ అనే మరో ఇంగ్లిష్ వ్యక్తి ఈ ఊహాత్మక సిద్ధాంతం మీద విరివిగా రాయడం మాత్రమే గాక, మార్క్స్ జీవితకాలంలోనే ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించినప్పటికీ ఇది ఫ్రెంచ్ ఆలోచనగానే మిగిలింది. 1830లలో, 40లలో ఫ్రాన్స్‌లో సెయింట్ సైమన్, ఫోరియర్, బాబూఫ్ ల రచనలతో ప్రభావితమై ఈ ఊహాస్వర్గపు ఆలోచనలు విస్తృతంగా సాగాయి. ఎటియన్ క్యాబెట్ నాయకత్వంలో ఐకేరియన్స్ అనే బృందం తయారై, 1848 తర్వాత అమెరికాలో స్థిరపడింది. ప్రౌధాన్, ఆయన అనుచరులు వచ్చారు. మొదటిసారిగా, 'కార్మిక వర్గ నియంతృత్వం' అనే మాటను వాడిన ఆగస్ట్ బ్లాంకీ, ఆయన లాంటి మరెందరో జాకొబిన్ సంప్రదాయాన్ని ప్రారంభించారు. సెయింట్ సైమన్ అనుచరుల ఉద్యమం సాగింది. విక్టర్ కన్సిడరెంట్ వంటి ఫొరియరిస్ట్‌లు వచ్చారు. ఫ్లోరా ట్రిస్టాన్ వంటి సోషలిస్ట్ స్త్రీవాదులు వచ్చారు. అలాగే 1840లలోనే ఫ్రాన్స్‌లో ఎంతోమంది రాడికల్స్ తలెత్తి మొదటిసారిగా తమను తాము కమ్యూనిస్టులమని పిలుచుకున్నారు, ఆ మాటకు అర్థమేమిటో వాళ్లకే స్పష్టంగా తెలియకపోయినప్పటికీ. ఈ మొత్తం సంప్రదాయంతో మార్క్స్‌కు సన్నిహిత పరిచయం ఉంది. ఆయన వాటిలో భాగం కానప్పటికీ, మరీ ముఖ్యంగా 1844లో ఆయన పారిస్ నుంచి బహిష్కరణకు గురయ్యేవరకు ఇవన్నీ ఆయన చూస్తూ ఉన్నాడు. ఆయన తన రచనల్లో అంగీకరించిన దానికన్నా ఎక్కువగానే ఈ ధోరణుల నుంచి గ్రహించాడని నాకనిపిస్తుంది. అయితే సహజంగానే ఈ ధోరణుల ఊహాస్వర్గ వాదాల నుంచి ఆయన తనను తాను దూరంగా చూపుకోదలచుకున్నాడు. పారిస్‌లో 1848లో జరిగిన విప్లవపు

వైఫల్యాలకు ఈ ధోరణులే అనేక రూపాలలో కారణమని ఆయన భావించాడు. ఈ ఊహాస్వర్గ వాదులు ఒక ఆదర్శ సమాజాన్ని కలలు గంటూ, ఇక్కడి నుంచి అక్కడికి పోవడం ఎలాగో మాత్రం తెలియకుండా ఉండడాన్ని ఆయన ఒప్పుకోలేదు. అందువల్లనే కమ్యూనిస్టు ప్రణాళికలో వారిపట్ల తన వ్యతిరేకతను స్పష్టం చేశాడు. చాలా తరచుగా ఆయన వారి భావాలను పూర్వపక్షం చేసే రూపంలోనే సంబంధం పెట్టుకున్నాడు. ప్రత్యేకించి ఫొరియర్, ప్రౌధాన్‌ల ఆలోచనలను ఆయన తిరస్కరించాడు.

మార్క్స్ కాపిటల్‌లో ఒక్క చోటికి వచ్చిన మూడు ప్రధానమైన భావనాత్మక ధారలు ఇవి. విప్లవాత్మక రాజకీయ కార్యక్రమాన్ని నిస్సారమైన ఊహాస్వర్గ సోషలిజం నుంచి శాస్త్రీయ కమ్యూనిజం దిశగా మార్చడమే తన లక్ష్యంగా ఆయన భావించాడు. ఆ పని చేయాలంటే కేవలం ఊహా స్వర్గ వాదులను, రాజకీయార్థిక శాస్త్రవేత్తలను పోటీ పెట్టి చూపితే సరిపోదు. సామాజిక శాస్త్ర సంవిధానం అంటే ఏమిటో పునర్నిర్మించాలి. పునస్సంఘటితం చేయాలి. సూటిగా చెప్పాలంటే, ఈ కొత్త శాస్త్రీయ సంవిధానం ప్రధానంగా బ్రిటిష్ సాంప్రదాయిక రాజకీయార్థ శాస్త్ర ధోరణిని విశ్లేషించడం మీద ఆధారపడి ఉంది. ఆ విశ్లేషణకు ప్రధానంగా జర్మన్ సంప్రదాయపు విమర్శనాత్మక తత్వ శాస్త్రపు పరికరాలు వాడవలసి ఉంది. ఈ విశ్లేషణ ద్వారా ఫ్రెంచ్ ఊహాత్మక ఆలోచనల మీద వెలుగు ప్రసరింపచేయవలసి ఉంది. తద్వారా కమ్యూనిజం అంటే ఏమిటి, కమ్యూనిస్టులు ఎలా ఆలోచించాలి, పెట్టుబడిదారీ విధానాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకొని, విమర్శించి సమర్థంగా కమ్యూనిస్టు విప్లవానికి బాటలు ఎలా వేయాలి అనే ప్రశ్నలకు జవాబులు కనిపెట్టాలి. కాపిటల్ పెట్టుబడిదారీ విధానాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవడం గురించి చాలా వివరించింది. కాని, కమ్యూనిస్టు విప్లవం ఎలా నిర్మించాలో అంతగా చెప్పలేదు. కమ్యూనిస్టు సమాజం ఎలా ఉంటుందో ఆ పుస్తకంలో అంతగా ఉండదు.

* * * * *

కాపిటల్‌ను మార్క్స్ సొంత ఉద్దేశాల ప్రకారం చదవడానికి ఉన్న ఆటంకాలలో కొన్నిటి గురించి ఇప్పటికే చెప్పాను. ఈ ఇబ్బందులు ఎటువంటివో స్వయంగా మార్క్స్‌కు చాలా వరకు తెలుసు. తన పుస్తకానికి రాసిన వేరు వేరు ముందుమాటలలో ఆయన ఈ విషయం మీద వ్యాఖ్యానించడం ఆసక్తికరం. ఉదాహరణకు, ఫ్రెంచ్ కూర్పుకు ముందుమాటలో ఈ పుస్తకం ఒక పత్రికలో ధారావాహికగా వస్తే బాగుంటుందనే సూచన మీద ఆయన ప్రతిస్పందన రాశాడు. 'కాపిటల్ అనువాదాన్ని ధారావాహికగా ప్రచురించాలనే ఆలోచనను నేను ప్రశంసిస్తున్నాను' అని 1872లో రాశాడు. అయితే, దానితోపాటే 'ఆ ధారావాహిక రూపంలో ఈ పుస్తకం కార్మిక వర్గానికి మరింత ఎక్కువ అందుబాటులోకి వస్తుంది. ఆ ఆలోచనే నాకు మిగిలిన అన్నిటికన్నా ఎక్కువ ఆసక్తికరంగా కనబడుతోంది... మీ సూచనకు మంచి పార్శ్వం అది. కాని, ఆ నాణానికి బొరుసు కూడా ఉంది: నేను ఉపయోగించిన విశ్లేషణా సంవిధానం, ఇంతవరకూ ఆర్థిక విషయాలకు అన్వయించని సంవిధానం. అందువల్ల తొలి అధ్యాయాలు చదవడం చాలా కష్టంగా ఉంటుంది. మరి, ముగింపు ఎప్పుడు వస్తుందో అని ఎల్లప్పుడూ అసహనంగా చూసే ఫ్రెంచ్ ప్రజలు, సాధారణ సూత్రాలకూ తమ ఉద్రేకాలను రెచ్చగొట్టే తక్షణ ప్రశ్నలకూ మధ్య సంబంధమేమిటో చూడాలని తొందర పడే ఫ్రెంచ్ ప్రజలు ఈ ధారావాహిక వల్ల అసంతృప్తి చెందుతారు. దీని వల్ల వారు తొందరగా ముందుకు సాగలేరు... అధిగమించడానికి నాకు శక్తిలేని అననుకూలత ఇది. అందువల్ల సత్యాన్ని కనిపెట్టడానికి శ్రద్ధాళువులయిన పాఠకులకు నేను ముందస్తుగానే ఒక హెచ్చరిక, ఒక వివరణ చేయవలసి ఉంది. శాస్త్రానికి రాజ మార్గమేదీ లేదు. వంకర టింకర మార్గాలలో విసుగెత్తించే ఆరోహణకు భయపడని వాళ్లకు మాత్రమే దాని వెలిగిపోయే శిఖరాగ్రాలను చేరుకొనే అవకాశం దొరుకుతుంది.'

అలాగే నేను కూడా మార్క్స్ పాఠకులందరికీ ఒక హెచ్చరికతో ప్రారంభించదలిచాను. సత్యాన్వేషణ సాగించాలని మీకు ఎంత బలమైన ఆసక్తి ఉన్నప్పటికీ కాపిటల్‌లో మొదటి మూడు నాలుగు అధ్యాయాలు ప్రత్యేకంగా చాలా కష్టతరమైనవి. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, మార్క్స్ సంవిధానానికి సంబంధించింది. అదేమిటో కాసేపట్లో వివరిస్తాను. మరొకటి, ఆయన తన ప్రణాళికను రూపొందించుకున్న ప్రత్యేకమైన పద్ధతి.

కాపిటల్ రచనలో మార్క్స్ లక్ష్యం పెట్టుబడిదారీ విధానం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడం. ఈ పనిని ఆయన రాజకీయార్థిక శాస్త్రాన్ని విమర్శించడం ద్వారా చేయదలచుకున్నాడు. ఇది ఒక బృహత్తరమైన కార్యక్రమమని ఆయనకు తెలుసు. ఆ కార్యక్రమం సక్రమంగా నడవాలంటే మొదట పెట్టుబడిదారీ విధానపు సంక్లిష్టతనంతా అర్థం చేసుకోవడంలో తనకు సహాయం చేసే భావనాత్మక పరికరాలను అభివృద్ధి చేసుకోవాలి. ఆ పని చేయడానికి ఎలా ముందుకు సాగుతున్నాడో ఆయన తన ఉపోద్ఘాతాలలో ఒకదానిలో వివరించాడు. రెండో కూర్పు ఆఖరి మాటలో ఆయన 'వివరణా సంవిధానం, పరిశోధనా సంవిధానం కన్న భిన్నంగా ఉండాలి' అని అన్నాడు. 'పరిశోధనా సంవిధానం ఉన్న సమాచారాన్నంతా సవివరంగా ఆకళించుకోవాలి. విభిన్న అభివృద్ధి రూపాలను విశ్లేషించుకోవాలి. వాటి మధ్య అంతస్సంబంధాన్ని కనిపెట్టాలి. ఇదంతా జరిగిన తరువాత మాత్రమే దాని వాస్తవ చలనాన్ని తగిన విధంగా వివరించడం సాధ్యమవుతుంది. ఇదంతా విజయవంతంగా సాగితే, అంటే, మన విచారణాంశపు (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు) జీవితాన్ని భావాలలోకి ప్రతిఫలించ గలిగితే అప్పుడది మనం ముందే నిర్ణయించుకున్న భావాల ప్రకారం దాన్ని వివరిస్తున్నట్టు అనిపించవచ్చు.' మార్క్స్ పరిశోధనా పద్ధతి వాస్తవికంగా ఉనికిలో ఉన్న ప్రతి అంశంతోనూ ప్రారంభమవుతుంది. మనం అనుభవిస్తున్న వాస్తవికత, ఆ వాస్తవికతకు రాజకీయార్థ శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు, నవలా రచయితలు, తదితరులు చేసిన వర్ణనలు – మార్క్స్ ఈ సమాచారాన్నంతా పోగు చేసి దాన్ని అతి నిశితమైన విమర్శకు గురిచేస్తాడు. తద్వారా వాస్తవికత పనిచేసే తీరుపై వెలుగు ప్రసరించగల భావనలను కనిపెడతాడు. అవి చాలా మామూలైనవే. కాని, చాలా శక్తిమంతమైనవి. దీన్ని ఆయన అవరోహణ పద్ధతి అన్నాడు. అంటే, మనం మన చుట్టూ తక్షణమే ఉన్న వాస్తవికత దగ్గర ప్రారంభిస్తాం. అక్కడి నుంచి లోపలికి దిగుతూ ఆ వాస్తవికతకు పునాదిగా ఉండే భావనలను కనిపెడతాం. ఆ మౌలిక భావనలు ఒకసారి మన చేతికి అందిన తర్వాత మళ్లీ ఉపరితలానికి వచ్చే ప్రయాణం మొదలుపెట్టవచ్చు. దీన్ని ఆరోహణ పద్ధతి అందాం. ఈ లోతుకు వెళ్లి పైకి వచ్చే పరిశోధనా పద్ధతి ద్వారా మనకు ప్రపంచంలో కనబడుతున్న రూపాలు ఎంత మోసపూరితమైనవో కనిపెట్టగలుగుతాం. ఇటువంటి దృక్పథం ఏర్పడిన తర్వాత ప్రపంచాన్ని మౌలికంగా భిన్నమైన పద్ధతిలో వ్యాఖ్యానించే శక్తి కలుగుతుంది.

మొత్తంగానే మార్క్స్ ఉపరితలంలో కనబడే రూపాల దగ్గర మొదలుపెట్టి లోతయిన భావనల దగ్గరికి వెళతాడు. కాపిటల్‌లో మాత్రం ఆయన ప్రారంభించడమే మౌలిక పునాది భావనల వివరణ దగ్గర మొదలుపెట్టాడు. తన పరిశోధనా పద్ధతి ద్వారా తాను ఇదివరకే కనిపెట్టిన నిర్ధారణల దగ్గర మొదలుపెట్టాడు. తొలి అధ్యాయాలలో గబగబా తన భావనలను సాదాగా వివరిస్తూ పోయాడు. నేరుగా ఒకదాని వెంట ఒకటి త్వరత్వరగా వాటిని పేర్చాడు. నిజంగానే అది చూస్తే ఆయన ముందే ఏర్పర్చుకున్న, తన ఇష్టారాజ్యపు నిర్మాణాలతో మొదలు పెట్టాడనిపిస్తుంది. కనుక మొదటిసారి చదివేటప్పుడు ఇలా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఈ అభిప్రాయాలు, భావనలు అన్నీ ఈయనకు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఆ అభిప్రాయాలను, భావనలను ఈయన ఇలా ఎందుకు వాడుతున్నాడు? అసలు సగం సమయం ఆయనేం మాట్లాడుతున్నాడో అర్థమే కాదు. కానీ, మీరు పుస్తకంలో ఇంకా ముందుకు సాగినకొద్దీ ఈ భావనలు నిజంగానే మన ప్రపంచంపై ఎటువంటి వెలుగు ప్రసరిస్తాయో స్పష్టమవుతుంది. విలువ, ఆరాధన వంటి భావనలు ఎంత అర్థవంతమైనవో కొంత సమయం గడిచాక తెలిసి వస్తుంది.

అంతేకాదు, పుస్తకం చివరికి చేరినాక మాత్రమే ఈ భావనలు ఎలా పనిచేస్తాయో మనకు పూర్తిగా అర్థమవుతుంది. మరి ఇది చాలా విచిత్రమైన, ప్రత్యేకమైన రచనా వ్యూహం. మనందరికీ బాగా తెలిసిన రచనా పద్ధతి ఏమంటే ఒక వాదనను ఇటుక మీద ఇటుక పేర్చినట్టుగా నిర్మిస్తూ పోవడం. కాని, మార్క్స్ విషయంలో వాదనా పద్ధతి ఉల్లిపాయ లాగ ఉంటుంది. బహుశా ఈ పోలిక సరైనదికాదేమో. ఎందుకంటే, ఒకసారి నేను ఈ పోలిక చెప్పినప్పుడు ఉల్లిపాయ విడదీస్తూ పోతే మీకంటికి నీళ్లు వస్తాయి కదా అని ఒకరు వ్యాఖ్యానించారు. మార్క్స్ ఉల్లిపాయ పై భాగం నుంచి ప్రారంభిస్తాడు. బయటికి కనబడే వాస్తవికతను ఒక్కొక్క పొర విప్పుతూ దాని కేంద్ర భాగానికి, భావనాత్మక మూలానికి చేరుతాడు. అప్పుడిక మళ్లీ తన వాదనను పైకి వివరిస్తూ వస్తాడు. వేరు వేరు పొరల సిద్ధాంతం ద్వారా మళ్లీ ఉల్లిపాయ ఉపరితలానికి చేరుతాడు. అందువల్ల ఈ వాదన నిజమైన శక్తి మనకు ఎప్పుడు స్పష్టమవుతుందంటే మన అనుభవ ప్రపంచంలోకి మళ్లీ ప్రవేశించిన తరువాతనే, ఆ అనుభవాన్ని అర్థం చేసుకోవడానికి, వ్యాఖ్యానించడానికి సంపూర్ణంగా కొత్తదయిన జ్ఞాన చట్రం ఒకటి మన చేతిలో ఉన్నదని మనకు తెలిసి వస్తుంది. ఈ క్రమంలో మార్క్స్ పెట్టుబడిదారీ విధానం దానిదైన పద్ధతిలో పెరగడానికి దారితీసినవి ఏమిటేమిటో ఎన్నో విషయాలు విప్పి చెబుతాడు. ఈ రకంగా మొట్టమొదట అమూర్తమైనవిగానూ, ముందస్తు అభిప్రాయాలుగానూ కనబడినవన్నీ మరింత సంపన్నమైనవిగా, మరింత అర్థవంతమైనవిగా బయటపడతాయి. ఈ వాదనలో ముందుకు సాగుతున్న కొద్దీ మార్క్స్ తన భావనల విస్తృతిని ఇంకా విశాలం చేస్తూ పోతాడు.

ఇదంతా ఇటుక మీద ఇటుక పేర్చే పద్ధతికన్న పూర్తిగా వేరయినది. పైగా ఇది అనుసరించడం చాలా కష్టం. ఆచరణలో దీనికి అర్థమేమంటే, ఈ వాదన వెంట పిచ్చివాడిలా అంటిపెట్టుకుని ఉండి ముందుకు సాగాలి. ప్రత్యేకించి మొదటి మూడు అధ్యాయాలు. అక్కడ ఏం జరుగుతున్నదో నిజంగా తెలియకుండానే ముందుకు సాగాలి. కొంత గడిచిన తరువాత ఆ మొత్తం విషయం మీద మెరుగైన అవగాహన కలుగుతుంది. అప్పుడు మాత్రమే ఈ భావనలు ఎలా ఉపయోగపడుతున్నాయో అర్థం కావడం మొదలవుతుంది.

మార్క్స్ ప్రారంభించిన భావన సరుకు అనే భావన. ఇక్కడ ప్రారంభించడం విచిత్రమైనది కాకపోవచ్చును గాని, ఆయన ఇష్టారాజ్యంగానే ఇక్కడ ప్రారంభించాడేమో అని మొదట అనిపిస్తుంది. మార్క్స్ గురించి ఆలోచించేటప్పుడు కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన 'ఇప్పటిదాకా గడిచిన చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే' లాంటి మాటలు గుర్తుకు వస్తాయి. కనుక కాపిటల్‌ను వర్గపోరాటంతో ఎందుకు మొదలుపెట్టలేదు? నిజం చెప్పాలంటే, వర్గపోరాటం గురించిన సూచన, ప్రస్తావన రావడానికి కాపిటల్‌లో మూడు వందల పేజీలు గడవాలి. తమ ఆచరణకు తక్షణ మార్గదర్శి ఏదో అక్కడ దొరుకుతుందని భావించిన వాళ్లు నిరాశ చెందక తప్పదు. పోనీ, మార్క్స్ డబ్బు దగ్గర ఎందుకు ప్రారంభించలేదు? నిజంగానే, ఈ పుస్తకం రాయడం కోసం ఆయన సాగించిన సన్నాహక పరిశోధనలలో, డబ్బు దగ్గరే ప్రారంభించాలనుకున్నాడు. కాని, మరికొంత అధ్యయనం తరువాత డబ్బు భావనను వివరించవలసిందే తప్ప, అది ఉన్నది అనుకొని ప్రారంభించకూడదని అనుకున్నాడు. పోనీ ఆయన చాలా గాఢంగా కలగలసి ఉన్న శ్రమ భావన ఉంది కదా, దాని దగ్గర ఎందుకు ప్రారంభించలేదు? సరుకు భావన దగ్గర ఎందుకు ప్రారంభించాడు? ఆసక్తికర విషయం ఏమంటే ఈ పుస్తకం రాయడానికి మార్క్స్ సన్నాహక రచనలు చూస్తే ఇరవై ముప్పై సంవత్సరాలు ఆయన దాని మీద పనిచేశాడు. ఎక్కడ ప్రారంభించాలి అనే ప్రశ్నతో ఆయన చాలా నలిగిపోయాడు. అవరోహణా పద్ధతి ఆయనను సరుకు భావన దగ్గరికి తీసుకువచ్చింది. కాని, తాను అది ఎందుకు ఎంపిక చేసుకున్నాడో వివరించే ప్రయత్నం ఆయనెక్కడా చేయలేదు. అదే ఎందుకు సాధికారమైనదో వాదించాలని కూడా ఆయన అనుకోలేదు. ఆయన కేవలం సరుకు భావన దగ్గర ప్రారంభించాడు. అదంతే.

ఇప్పటికే నిర్ధారించిన ముగింపు పునాదిగా ఒక వాదనను నిర్మించడానికి ఆయన ప్రయత్నిస్తున్నాడనేది అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఆయన మొత్తం వాదనకు ఒక బలమైన, క్లుప్తమైన ప్రారంభం కావలసి ఉన్నది. కనుక ఆ ప్రారంభపు నిరంకుశత్వంతో దిగ్భ్రాంతి చెందాలని గానీ, అసహనం ప్రకటించాలని గానీ అనుకొనే పాఠకులు మూడో అధ్యాయంతో వదిలేస్తారు. కనుక కాపిటల్ ప్రారంభం ప్రత్యేకంగా కష్టతరమైనదని ముందే హెచ్చరించడంలో మార్క్స్ సరైన పనే చేశాడు. అందువల్ల నా ప్రాథమిక కర్తవ్యం మొదటి మూడు అధ్యాయాల ద్వారా మిమ్మల్ని నడిపించడం. ఆ తర్వాత ప్రయాణం సులభతరమవుతుంది.

ఇక్కడ మార్క్స్ రూపొందించిన భావనాత్మక పరికరాలు కేవలం కాపిటల్ మొదటి సంపుటానికి సంబంధించినవి మాత్రమే కాదని, ఆయన విశ్లేషణకు మొత్తంగా వర్తిస్తాయని ఇదివరకే సూచించాను. కాపిటల్‌లోనే మూడు సంపుటాలు ఉన్నాయి. మీరు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోదలచుకుంటే దురదృష్టవశాత్తు మూడు సంపుటాలు పూర్తిగా చదవవలసిందే. మొదటి సంపుటం ఒకానొక దృక్పథం మాత్రమే. అంత మాత్రమే కాదు, ఇంకా ఘోరం ఏమంటే ఈ మూడు సంపుటాల కాపిటల్ ఆయన మనస్సులో వాస్తవికంగా రాయడానికి నిర్ణయించుకున్న దానిలో ఎనిమిదవ వంతు మాత్రమే. ఈ పుస్తకం రాయడానికి ముందస్తు సన్నాహంగా ఆయన రాసుకున్న గ్రండ్రిస్సె అనే పుస్తకం ఉంది. అందులో కాపిటల్ రచనా ప్రణాళికలు ఎన్నిటినో ఆయన రాసి పెట్టుకున్నాడు. అందులో ఒకదానిలో తన లక్ష్యంగా ఆయన చెప్పుకున్నది ఇది :

"1) అన్ని రకాల సమాజాలలోనూ అటూ ఇటూగా కనబడే సాధారణ, అమూర్త నిర్ణాయకాలు... 2) పెట్టుబడిదారీ సమాజపు అంతర్గత నిర్మాణాన్ని రూపొందించే ప్రమేయాలు, మౌలిక వర్గాలు ఆధారపడే ప్రమేయాలు. పెట్టుబడి, వేతన శ్రమ, భూమి రూపపు ఆస్తి. వాటి అంతస్సంబంధం. పట్టణం, గ్రామం. మూడు మహా సామాజిక వర్గాలు. వాటి మధ్య వినిమయం, పంపిణీ, పరపతి విధానం (వ్యక్తిగతం). 3) రాజ్యం రూపంలో పెట్టుబడిదారీ విధానం కేంద్రీకరణ. తనకు తానే అది పెట్టుకునే సంబంధం. 'అనుత్పాదక' వర్గాలు. పన్నులు, రాజ్యపు అప్పు, ప్రజలు పొందే పరపతి. జనాభా. వలస దేశాలు. పరాయి దేశాలకు వలస. 4) అంతర్జాతీయ ఉత్పత్తి సంబంధం. అంతర్జాతీయ శ్రమ విభజన. అంతర్జాతీయ వినిమయం. ఎగుమతి, దిగుమతులు. మారకపు రేటు. 5) ప్రపంచ మార్కెట్ సంక్షోభాలు."

ఈ ప్రణాళికను పూర్తి చేసే దరిదాపులకు కూడా ఆయన రాలేకపోయాడు. నిజం చెప్పాలంటే ఈ అంశాలలో ఏ ఒక్కదాన్నీ ఆయన క్రమ పద్ధతిలోనో, వివరంగానో చర్చించలేక పోయాడు. వాటిలో చాలా, ఉదాహరణకు, పరపతి పద్ధతి, ద్రవ్య విధానం, వలస దేశాల కార్యకలాపాలు, రాజ్యం, అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ మార్కెట్, సంక్షోభాలు పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవడానికి కీలకమైనవి. ఈ అంశాలలో చాలా వాటిని అర్థం చేసుకోవడానికి ఆయన విస్తారమైన రచనలలో సూచనలు ఉన్నాయి. రాజ్యం, పౌర సమాజం, మనుషుల వలస, ద్రవ్య మారకం వగైరాలను అర్థం చేసుకోవడానికి సూచనలున్నాయి. ఆయన వదిలిపెట్టిన కొన్ని ముక్కలను ఎలా కలిపితే ఇంకా ఎక్కువ అర్థం చేసుకోవచ్చునో నేను నా 'లిమిట్స్ టు కాపిటల్' పుస్తకంలో వివరించాను. కాని, గుర్తించవలసిన ముఖ్యమైన విషయం ఏమంటే, కాపిటల్ ప్రారంభంలో ఆయన నిర్మించిన భావనాత్మక పరికరాలు ఈ మహత్తరమైన అసంపూర్ణ ప్రణాళికకు పునాదులను నిర్మించి పెట్టాయి.

మొదటి సంపుటం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ఉత్పత్తి దృష్టికోణం నుంచి పరిశీలిస్తుంది. మార్కెట్‌ల వైపు నుంచి కాదు. ప్రపంచ వాణిజ్యం వైపు నుంచి కాదు. ఉత్పత్తి వైపు నుంచి మాత్రమే. అసంపూర్ణంగా మిగిలిపోయిన రెండవ సంపుటం మారకపు సంబంధాల వైపు నుంచి ఆ పనిచేస్తుంది. అసంపూర్ణంగానే మిగిలిపోయిన మూడవ సంపుటం పెట్టుబడిదారీ విధానంలోని మౌలిక వైరుధ్యాల ఫలితంగా సంక్షోభం ఎలా తలెత్తుతుందో వివరించడంపై కేంద్రీకరిస్తుంది. ఆ తర్వాత మిగులు, వడ్డీ, ద్రవ్య పెట్టుబడికి ప్రతిఫలం, భూమి కౌలు, వ్యాపార పెట్టుబడికి లాభం, పన్నులు వగైరా విషయాలను కూడా చర్చిస్తుంది. అంటే, మొదటి సంపుటం విశ్లేషణలో రానివి చాలా ఉన్నాయి. కాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వాస్తవికంగా ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి సరిపోయిన విషయాలు అందులో ఉన్నాయి.

ఇక మార్క్స్ సంవిధానం ఏమిటో చూద్దాం. మొదటి సంపుటాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే గ్రహించగలిగిన అతి ముఖ్యమైన విషయాలలో ఒకటి, మార్క్స్ సంవిధానం ఎలా పనిచేస్తుందనేది. పెట్టుబడిదారీ విధానం ఎలా పనిచేస్తుందనే విషయమై ఆయన చేసిన ప్రతిపాదనలు ఎంత ముఖ్యమైనవో, ఈ సంవిధానం కూడా అంత ముఖ్యమైనదని నేను వ్యక్తిగతంగా భావిస్తాను. ఎందుకంటే, ఒకసారి మీరు ఆయన సంవిధానాన్ని నేర్చుకుంటే, దాన్ని ఉపయోగించడాన్ని అభ్యసిస్తే, దాని శక్తి పట్ల విశ్వాసం పెరిగితే, ఆ తర్వాత మీరు ఏ విషయాన్ని అర్థం చేసుకోవడానికయినా దాన్ని ఉపయోగించవచ్చు. ఈ సంవిధానం గతితర్కం నుంచి తయారైంది. ఇంతకు ముందే నేను ఉటంకించిన ముందుమాటలో ఆయన ఈ పరిశోధనా పద్ధతి "ఇంతకు ముందు ఆర్థిక విషయాలకు అన్వయించినది కాదు" అని చెప్పి ఉన్నాడు. అలాగే రెండో కూర్పు ఆఖరి మాటలో కూడా ఈ గతితార్కిక సంవిధానం ఏమిటో ఆయన చర్చించాడు. గతితర్కానికి సంబంధించిన భావాలు ఆయనకు హెగెల్ నుంచే అందినప్పటికీ, మార్క్స్ ఉపయోగించిన "గతితార్కిక సంవిధానం దాని పునాదులలో హెగెలియన్ సంవిధానం కన్న భిన్నమైనది మాత్రమే కాదు. దానికి పూర్తిగా వ్యతిరేకమైనది." అందువల్లనే హెగెల్ గతితర్కాన్ని మార్క్స్ తలకిందులు చేశాడని, దాన్ని దాని కాళ్లమీద నిలబెట్టాడని ప్రఖ్యాతమైన వ్యాఖ్య వచ్చింది.

అయితే, ఇది పూర్తిగా సత్యమని చెప్పడానికి వీల్లేదు. మార్క్స్ గతితార్కిక సంవిధానాన్ని కేవలం తలకిందులు చేయలేదు. ఆయన గతితార్కిక సంవిధానాన్ని విప్లవీకరించాడు. హెగెల్ రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ రైట్' పుస్తకం మీద తన విమర్శను ప్రస్తావిస్తూ, "దాదాపు ముప్పై సంవత్సరాల కింద నేను హెగెలియన్ గతితర్కంలోని నిగూఢ పార్శ్వాన్ని విమర్శించాను" అని మార్క్స్ చెప్పుకున్నాడు. స్పష్టంగా చెప్పాలంటే హెగెలియన్ గతితర్కంతో తన సంబంధాన్ని మార్క్స్ పునర్నిర్వచించుకున్న మౌలిక క్షణంలో ఆ విమర్శ వెలువడింది. జర్మనీలో 1830లలో 40లలో మోజుగా మారిన హెగెల్ ప్రతిపాదించిన గతితర్కం ఎటువంటి నిగూఢ రూపం పొందిందో దానికి మార్క్స్ అభ్యంతరం చెప్పాడు. దాన్ని సంస్కరించ డానికి పూనుకున్నాడు. తద్వారా "చారిత్రకంగా రూపొందిన ప్రతి రూపాన్ని పరివర్తనాస్థితిలో, చలనంలో ఉన్నదిగా" గుర్తించ గలిగేటట్లుగా గతితార్కిక సంవిధానాన్ని మార్చాడు. అందువల్ల మార్క్స్ గతితర్కాన్ని పునర్ నిర్మించాడు. సమాజపు "మార్పుచెందే అంశాన్ని" గ్రహించగలిగేలా గతితర్కాన్ని తయారు చేశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, గతితర్కం అనేది చలన, మార్పు, పరివర్తన ప్రక్రియలను అర్థం చేసుకోగలిగేలా, వివరించగలిగేలా ఉండాలి. అటువంటి గతితార్కిక సంవిధానం "ఏ ఒక్కదానికి మైమరిచిపోయేలా ఉండదు. సారాంశంలో విమర్శ నాత్మకంగా, విప్లవకరంగా ఉంటుంది" అని మార్క్స్ అన్నాడు. ఎందుకంటే, కచ్చితంగా అది అన్ని వాస్తవికమైన, జరగబోయే అవకాశం ఉన్న సమాజిక పరిణామాల హృదయంలోకి వెళ్లగలిగింది.

ఇక్కడ మార్క్స్ మాట్లాడుతున్నది గతితార్కిక సంవిధానాన్ని పునరన్వేషించే తన ఉద్దేశం గురించి. తద్వారా అది పెట్టుబడిదారీ విధానం లోని వివిధ అంతర్భాగాల మధ్య ఎప్పటికప్పుడు తలెత్తే చలనశీలమైన సంబంధాలను గ్రహించగలిగినదై ఉండాలి. తద్వారా ఆయన నిరంతర మార్పును, చలనాన్ని పట్టుకొనే ప్రయత్నం చేశాడు. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానపు నిరంతర చలనశీలత, క్రియాశీలతలను చూసి ఆయన ఎంతగానో మైమరిచాడు. మార్క్స్‌ను చదవడానికన్నా ముందే చాలామందికి ఒక అభిప్రాయం ఉంటుంది. ఆయన మొరటుగా, సంకుచితంగా మార్పులేని నిర్మాణాల గురించి ఆలోచించిన చింతనా పరుడని ఆ అభిప్రాయం. కాని, వాస్తవం అందుకు భిన్నమైంది. కాపిటల్ చదివితే మార్క్స్ అనే మనిషి ప్రతిక్షణం చలనం గురించి మాట్లాడు తుండడం కనబడుతుంది. చలన క్రమం గురించి, ఉదాహరణకు, పెట్టుబడి చలనం గురించి ఆయన మాట్లాడుతూ ఉంటాడు. అందువల్ల మార్క్స్‌ను ఆయన ఉద్దేశానికి అనుగుణంగా చదవడం అంటే గతితర్కం అనే మాటకు ఆయన ఏ అర్థం చెబుతున్నాడో తెలుసుకోవడం.

అయితే, ఇక్కడ ఒక సమస్య ఉంది. మార్క్స్ గతితర్కం మీద పుస్తకమేమీ రాయలేదు. తన గతితార్కిక పద్ధతి ఏమిటో ఎక్కడా వివరించలేదు. అక్కడక్కడ చాలా సూచనలు మాత్రం ఉన్న మాట నిజం. కనుక మనం ఒక విచిత్ర స్థితికి చేరుతాం. మార్క్స్ ఉపయోగించిన గతితార్కిక సంవిధానాన్ని అర్థం చేసుకోవాలంటే కాపిటల్ చదవాలి. ఎందుకంటే ఆ సంవిధానాన్ని నిజంగా ఉపయోగించిన వనరు అదే. కాని, కాపిటల్‌ను అర్థం చేసుకోవాలంటే మీరు మార్క్స్ అవలంబించిన గతితార్కిక సంవిధానాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. అంటే, కాపిటల్‌ను జాగ్రత్తగా చదువుతూ పోతే, క్రమక్రమంగా ఆయన సంవిధానం ఎలా పనిచేస్తుందో మీకు అవగాహన కలుగుతుంది. మీరు ఇంకా చదివిన కొద్దీ ఒక పుస్తకంగా కాపిటల్ మరింత బాగా అర్థమవుతుంది.

మన విద్యా విధానానికి సంబంధించి అనేక విచిత్రమైన విషయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి, మీరు ఒకానొక విద్యశాఖలో ఎంత మెరుగైన శిక్షణ పొందితే, అంతగా గతితార్కిక సంవిధానానికి దూరమైపోతారు. నిజం చెప్పాలంటే చిన్నపిల్లలు చాలా గతితార్కికంగా ఆలోచిస్తారు. వాళ్లు ప్రతిదాన్నీ చలనంలో చూస్తారు. వైరుధ్యాలున్నాయని గుర్తిస్తారు. పరివర్తనలు జరుగుతున్నాయని తెలుసుకుంటారు. కాని, చిన్నారి పిల్లలను మంచి గతితార్కిక వాదులు కాకుండా చేయడానికి మనం బృహత్తర ప్రయత్నాలతో శిక్షణ ఇస్తూ ఉంటాం. మార్క్స్ చేయదలచినదల్లా మనిషిలో సహజాతంగా ఉండే గతితార్కిక సంవిధాన శక్తిని మళ్లీ కనిపెట్టడమే. తద్వారా మన చుట్టూ ఉన్న ప్రతి విషయం ఒక క్రమంలో ఎలా ఉన్నదో, ప్రతిదీ చలనంలో ఎలా ఉన్నదో మనకు అర్థం చేయించడానికి ఆయన ప్రయత్నించాడు. ఆయన కేవలం శ్రమ గురించి మాట్లాడలేదు. శ్రమ క్రమం గురించి మాట్లాడాడు. ఆయన దృష్టిలో పెట్టుబడి అనేది ఒక వస్తువు కాదు. అది ఒక క్రమం. అది చలనంలో మాత్రమే ఉనికిలో ఉంటుంది. ఆ చలనం ఆగిపోయిందంటే విలువ అదృశ్యం అయిపోతుంది. మొత్తం వ్యవస్థే కుప్పకూలిపోతుంది. న్యూయార్క్‌లో 2001 సెప్టెంబర్ 11న జరిగిన ఘటనల తర్వాత ఏం జరిగిందో ఒక్కసారి చూడండి. ప్రతి ఒక్కటీ స్తంభించిపోయింది. విమానాలు ఎగరడం ఆగిపోయింది. వంతెనలు, రహదారులు మూసి వేయబడ్డాయి. ఇలాగే ఏదీ కదలకుండా ఉండిపోతే పెట్టుబడిదారీ విధానం కుప్పకూలిపోతుందని మూడు రోజులు గడిచేసరికి ప్రతి ఒక్కరూ గుర్తించారు. అందువల్ల హఠాత్తుగా మేయర్ జ్యూలియాని, అధ్యక్షుడు బుష్ జనాన్ని రోడ్లమీదికి రమ్మని, క్రెడిట్ కార్డులు ఉపయోగించమని, సరుకులు కొనమని, బ్రాడ్‌వేకు వెళ్లమని, రెస్టారెంట్‌లలో తినమని విజ్ఞప్తులు చేయడం మొదలుపెట్టారు. అమెరికన్‌లు మళ్లీ విమానాలలో తిరగడం మొదలుపెట్టాలని ప్రోత్సహిస్తూ విమానయాన పరిశ్రమ ఇచ్చిన ఒక టి.వి. ప్రకటనలో స్వయంగా బుష్ పాల్గొన్నాడు.

కదలకుండా ఉండిపోతే పెట్టుబడిదారీ విధానం అనేది శూన్యం. మార్క్స్ ఈ కదలికను సంపూర్ణంగా ప్రశంసించాడు. పెట్టుబడికి ఉన్న ఈ పరివర్తనా చలనశీలత ఎక్కడ నుంచి వచ్చిందో కనిపెట్టడానికే ఆయన ప్రయత్నించాడు. అందువల్ల పెట్టుబడిదారీ విధానాన్ని ఒక స్థిర నిర్మాణంగా వర్ణించిన జడాత్మక ఆలోచనాపరుడిగా ఆయనను చూస్తే చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. ఆయన జడాత్మక ఆలోచనా పరుడు కాదు. కాపిటల్ పుస్తకంలో ఆయన చేయడానికి ప్రయత్నించిందల్లా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లోపల అంతర్గత నిర్మాణంగా చలనాన్ని ప్రవేశపెట్టిన భావనాత్మక పరికరం, కట్టుబడి ఏమిటో కనిపెట్టడం దాన్ని వివరించడానికే ఆయన ప్రయత్నించాడు. తత్ఫలితంగా ఆయన భావనలలో చాలా భాగం విడివిడిగా ఉండే సూత్రాల రూపం ధరించలేదు. సంబంధాల రూపంలో మాత్రమే వ్యక్తమయ్యాయి. అవన్నీ కూడా మార్పుకు దారితీసే ఆచరణలే.

అందువల్ల మార్క్స్‌ను ఆయన ఉద్దేశాల ప్రకారం అర్థం చేసుకోవడానికి కాపిటల్‌లో ఉపయోగించిన గతితార్కిక సంవిధానాన్ని అర్థం చేసుకోవడం, ఆమోదించడం చాలా ముఖ్యం. కొంతమంది మార్క్సిస్టులతో సహా చాలామంది దీన్ని అంగీకరించరు. తమను తాము అనలిటికల్ మార్క్సిస్టులమని చెప్పుకునే వాళ్లు, ఉదాహరణకు, జి.ఎ. కొహెన్, జాన్ రోమర్, రాబర్ట్ బ్రెన్నర్ వంటి ఆలోచనాపరులు గతితర్కాన్ని తిరస్కరిస్తారు. వాళ్లు గతితర్కాన్ని 'చెత్త'గా పిలిచి తమను తాము 'చెత్తలేని మార్క్సిస్టులం' అనుకుంటారు. మార్క్స్ చేసిన వాదన మొత్తాన్ని ఒక విశ్లేషణాత్మక ప్రతిపాదనల వరుసగా మార్చడానికి ప్రయత్నిస్తారు. అలాగే మార్క్స్‌ను పాజిటివిస్ట్ పద్ధతిలో చూసే ధోరణి ఆయన సిద్ధాంతాన్ని అనుభవంలో దొరికే సమాచారంతో పరీక్షకు పెట్టాలని అనుకుంటుంది. ఈ రెండు సందర్భాలలోనూ గతితర్కం విస్మరణకు గురవుతుంది. ఆ రెండు ధోరణులూ తప్పు అని నేను వాదించబోవడం లేదు. బహుశా వాళ్లు ఒప్పే కావచ్చు. కాని, మార్క్స్ సొంత ఉద్దేశాలు గతితార్కికమైనవి. అందువల్ల కాపిటల్‌ను తప్పనిసరిగా గతితార్కికంగా అధ్యయనం చేయడం మన బాధ్యత.

ఇక చివరి అంశం. మార్క్స్‌ను ఆయన చెప్పిన సొంత ఉద్దేశాల మీద చదవడం మన లక్ష్యం. కాని, ఈ పనిలో నేను మీ వెంట ఉన్నాను గనుక బహుశా ఆ ఉద్దేశాలు నా ప్రయోజనాలతో, నా అనుభవాలతో ప్రభావితం అయి ఉంటాయి. నా విద్యారంగ జీవితంలో అత్యధిక భాగం నేను మార్క్సియన్ సిద్ధాంతాన్ని పెట్టుబడిదారీ విధానం కింద జరిగే పట్టణీకరణను, అసమాన ప్రాంతీయాభివృద్ధిని, సామ్రాజ్యవాదాన్ని అధ్యయనం చేయడానికి ఉపయోగించాను. అందువల్ల సహజంగానే నేను కాపిటల్‌ను చదివే పద్ధతి మీద ఆ అనుభవం ప్రభావం ఉంది. మొట్టమొదట నా అనుభవం ఆచరణాత్మక మైనది. తాత్వికమైనదో, పూర్తిగా సైద్ధాంతికమైనదో కాదు. పెట్టుబడిదారీ విధానం తయారు చేసిన మహానగరాలలో దైనందిన జీవితం గురించి కాపిటల్ ఎలా విశ్లేషిస్తుంది అనేది అర్థం చేసుకోవడమే నా ప్రయత్నం. ఈ పుస్తకంతో నా సంబంధం నడుస్తున్న గత ముప్పై సంవత్సరాలలో భౌగోళికంగానూ, చారిత్రకంగానూ, సామాజిక రంగంలోనూ ఎన్నో మార్పులు జరిగాయి. నిజానికి నేను ప్రతి సంవత్సరం కాపిటల్ బోధించాలని అనుకోవడానికి ఒక కారణం అదే. ఇప్పుడు కొత్తగా కాపిటల్ చదివితే ఏమైనా కొత్త విషయాలు ఉంటాయా? ఇదివరకు నేను గుర్తించనివి ఏమైనా ఉంటాయా? భూగోళం, చరిత్ర, మనుషులు మారుతున్న కొద్దీ కొత్త సైద్ధాంతిక అవగాహనల కోసమే నేను మళ్లీ మళ్లీ మార్క్స్ దగ్గరికి వస్తూ ఉంటాను. మార్గదర్శకత్వం కోసం కాదు. ఈ క్రమంలో ఆ పుస్తకం గురించిన నా అవగాహనకు ఎన్నో సవరణలు చేసుకున్నాను. కనీవినీ ఎరగని సమస్యలూ, సంక్షోభాలూ మన చారిత్రక మేధో వాతావరణానికి సవాళ్లు విసురుతూ ఉంటే, కాపిటల్‌ను మనం అధ్యయనం చేసే పద్ధతి కూడా మారుతూ, అన్వయించుకుంటూ ఉండాలి.

అత్యవసరమైన ఈ పునర్నిర్మాణ, పునర్ వ్యాఖ్యాన క్రమం గురించి కూడా మార్క్స్ మాట్లాడతాడు. 'బూర్జువా సిద్ధాంతం ప్రపంచాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో 18వ శతాబ్దంలో అర్థం చేసుకుంది. ఆ తర్వాత

అధికారంలో ఉన్న వర్గాలు ఉద్దేశపూర్వకంగానే మూఢాచారాలను, మత విశ్వాసాలను కొనసాగిస్తాయనీ, కార్యకారణ వివేచన లేకుండా చేయడమే వాటి లక్ష్యమనీ అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ప్రాచీన మతాలకు మద్దతు

ప్రాచీన సుమేరియన్, ఈజిప్ట్ నాగరికతల్లో దేవాలయవ్యవస్థలూ, అర్చకవర్గాలూ తమ బలాన్ని పెంచుకున్నాయి. అక్షరాస్యత మొదలయిన యుగంలో అది పూజారివర్గాలకే పరిమితం అయి ఉండేది. గ్రహణాలూ, రుతువులనుబట్టి కురిసే వర్షాలూ, నైల్ నదికి కాలానుసారం వచ్చే వరదలూ వీటన్నిటి సమాచారమూ లెక్కకట్టి చెప్పగలిగిన అర్చకులు అదేదో దైవికశక్తి అని సామాన్యులను నమ్మించగలిగారు. విస్సన్న చెప్పిందే వేదమన్న పద్ధతిలో వీరు రోజువారీ జీవితాలను శాసిస్తూ, పాటు పడకుండా జీవించే మార్గానికి అలవాటుపడ్డారు. గుడ్డినమ్మకాలు పామరుల్లో ఎంత ఎక్కువగా వ్యాపిస్తే తమ అధికారం అంత పెరుగుతుందని వీరు త్వరలోనే గ్రహించారు. ఈనాటికీ పూజాది కార్యక్రమాల్లో ఇతరత్రా ఎంత అధికారం ఉన్నవారైనా పురోహితుడి అదిలింపులకు తల ఒగ్గినట్టే ఆధ్యాత్మికశక్తి పేరుతో అర్చకులు ప్రాచీన కాలంలోనే పెత్తనం చలాయించేవారు.

ఉత్పత్తి సంబంధాలూ, కుటుంబవ్యవహారాలూ, రాజకీయాలూ, నైతిక ప్రవర్తనా ఇలాంటి ఇహలోకపు విషయాలన్నిటిలోనూ, దేవతలూ, దెయ్యాల ప్రమేయం ఉంటుందని మతవిశ్వాసాలు నమ్మబలుకుతాయి. ఇటువంటి ఆర్థిక, తాత్వికచింతనలు రెండూ కలిసి సమాజంలోని సాంస్కృతిక దృక్పథాన్ని ప్రభావితం చేస్తాయి. మతధోరణులే మన అవగాహననూ, సత్ప్రవర్తననూ శాసిస్తాయని అనుకోవడం పరిపాటి. ఇదొక సంప్రదాయంగా ఏర్పడి తరవాతి తరాలకు సంక్రమిస్తుంది. సమాజంలో వర్గాలు ఏర్పడినప్పుడు ఆర్థికంగా ముందున్న వర్గాలే ఈ తాత్వికచింతనను నిర్దేశిస్తూ ఉంటాయి.

సమాజాల్లో ఆర్థికబలం ఉన్న వర్గాలదే అధికారం అవుతుంది. ఎటువంటి మతవైఖరి తమకు అనుకూలమో ఆ వర్గాలకు బాగా తెలుసు. సుమేరియన్, ఈజిప్ట్, ఇజ్రాయెల్ మొదలైన ప్రాచీన నాగరికతలలో కొన్నివేల ఏళ్ళ క్రితమే ఇటువంటి పరిణామాలు మొదలయాయి. ఆ కాలంనుంచీ అణగారిన వర్గాలన్నీ తాము గురవుతున్న దోపిడీకి తలఒగ్గి అదేదో దైవనిర్ణయమేనని నమ్ముతూ వచ్చారు. తమ కాళ్ళకు తామే బంధం వేసుకున్న పద్ధతిలో ఎన్నో శతాబ్దాలపాటు బడుగువర్గాలేవీ ఈ 'దైవశాసనా'లను ధిక్కరించే ప్రయత్నంకూడా చెయ్యలేదు. అలా చేస్తే దైవికశక్తులు ఆగ్రహిస్తాయని వారు నమ్మారు. ఇదంతా సహజమేననీ, సామాజికసంక్షేమానికి తప్పనిసరిగా యథాస్థితిని కొనసాగించగలిగిన నియమాలన్నీ ఇలాగే ఉంటాయనీ వారికి అనిపిస్తూ ఉండేది.

'పర'లోకం మాట ఎలాఉన్నా, 'ఇహ'లోకంలోని విషయాల గురించిన వైఖరి ఎలా ఉండాలో నిర్వచించవలసిన బాధ్యతకూడా మతాధికారులకు ఉండేది. సమాజంలోని వ్యక్తులు పరస్పరం ఎలా సహకరించుకోవాలో, ఎటువంటి సాంఘిక నియమాలకూ, కట్టుబాట్లకూ లోనవాలో వారే చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. విభిన్న వ్యక్తులూ, విభిన్న వ్యక్తిత్వాలతో కూడిన సమాజం సజావుగా నడవాలంటే కొంత క్రమశిక్షణ అవసరమవుతుంది. స్థిరజీవితాలు గడిపే వ్యవసాయ

చరిత్ర ముందుకు నడిచి ఆ సిద్ధాంతాన్ని, ఆ సిద్ధాంతపు సూత్రాలను అసంబద్ధం చేసేసింది' అని ఆయన అన్నాడు. పరిస్థితులు మారిన కొద్దీ భావాలు మారవలసి ఉంటుందని, పునర్నిర్మాణానికి గురికావలసి ఉంటుందని ఆయన అన్నాడు. పెట్టుబడిదారీ ప్రపంచం 1850లలో, 60లలో వెలుగులీనుతూ ఉండగా ఆయన అర్థం చేసుకున్నాడు, వ్యాఖ్యానించాడు. కాని, ఆ ప్రపంచం కూడా మారిపోయింది. అందువల్ల ఒక ప్రశ్న ఎల్లప్పుడు అడగవలసి ఉంది. మన సొంత కాలానికి ఈ పుస్తకం ఎంత వరకు, ఏ పద్ధతిలో అన్వయిస్తుంది? నా ఉద్దేశంలో దురదృష్టవశాత్తూ, గత ముప్పై సంవత్సరాలలో ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానపు నయా ఉదారవాద ప్రతీఘాత విప్లవం ప్రపంచాన్ని చాలా మార్చేసింది. బ్రిటన్‌లో 1850లలో, 60లలో మార్క్స్ అతి ప్రతిభావంతంగా వినిర్మించిన పరిస్థితులను పునర్నిర్మించింది. అందువల్ల ఈ పుస్తకంలో ఇవాళ్టి ప్రపంచానికి కాపిటల్ ఎంతవరకు ఉపయోగకరమైనదో, ఎక్కడెక్కడ ఆనాటి పరిస్థితులకు ఆ పుస్తకం తగినదిగా ఉందో నా వ్యాఖ్యలు చేశాను.

ఆయినా మొత్తంగా చెప్పాలంటే, కాపిటల్‌ను మీ అంతట మీరే చదవాలని నా కోరిక. అంటే, మీకే ప్రత్యేకమైన మేధో, సామాజిక, రాజకీయ అనుభవం నుంచి ఆ పుస్తకం చదవడానికి ప్రయత్నించండి. మీకే వీలైన పద్ధతిలో దాన్నుంచి నేర్చుకోండి. ఆ పుస్తకంతో మాట్లాడే క్రమంలో, ఆ పుస్తకం మళ్లీ మీతో మాట్లాడడానికి అనుమతించే క్రమంలో మీ అనుభవం అద్భుతంగా ఉంటుందని నా ఆకాంక్ష. అర్థం చేసుకోవడానికి అసాధ్యంగా కనబడే ఆ పుస్తకాన్ని అర్థం చేసుకునే క్రమంలో ఆ పుస్తకంతో సంభాషణ జరపడమే గొప్ప కసరత్తు. ప్రతి పాఠకుడూ, పాఠకురాలూ కాపిటల్‌ను తన జీవితానికి అనువదించుకోవలసి ఉంది. ప్రపంచం అనుక్షణం మారుతూ ఉంది గనుక, ఇదే అంతిమమైన, ఇదే నిర్దుష్టమైన అధ్యయనం అని చెప్పేందుకేమీ లేదు. బహుశా మార్క్స్ మాటల్లోనే చెప్పాలంటే, "ఇదుగోండి బంతి. దీని వెంట పరుగెత్తండి." వీ

సమాజాలు ఏర్పడ్డాక దీని ప్రాముఖ్యత పెరిగింది. ప్రజల మనోభావాలను మతపరంగా శాసించగలిగిన అర్చకవర్గం సమాజంలో బలమూ, రాజకీయ అధికారమూ ఎటువంటివారు హస్తగతం చేసుకుంటున్నారో గ్రహించి, వారికే వత్తాసుపలికే ధోరణిని అవలంబిస్తూవచ్చారు. రాజే దేవుడి అవతారమనీ, అతనికి తల ఒగ్గడం దైవనిర్ణీతమనీ బోధలు చెయ్యడం మన దేశంలోనే కాక పాత నాగరికతలన్నిటిలోనూ ఉండేది. ఎప్పుడో ఆటవిక సమాజాల్లో ఉన్నట్టుగా ప్రజాసంక్షేమం కోసం బాధ్యతలు చేపట్టిన కులపెద్దల కాలం ముగిసింది. గారడీలూ, తంతుల ద్వారా చికిత్సకులుగా, గణాచార్లుగా మొదలైన పూజారులూ, పాలకులూ అధిక సంఖ్యాకులచేత శరీర శ్రమ చేయించి వాటి ఫలాలను పొందుతూ అధికార వర్గాలుగా కొనసాగారు. తమ ఆధిపత్యం నిలుపుకునేందుకు ఎటువంటి నమ్మకాలనైనా జనబాహుళ్యంలో వ్యాప్తిచెయ్యడానికి వారు వెనకాడలేదు. దేవాలయాలకూ, రాజుకూ చెందిన ఆస్తులను దొంగతనం చేస్తే మరణశిక్ష విధించేవారు. వారికి చెందిన పశువులనో, గొర్రెలనో దొంగిలించడం పెద్ద నేరం. తగిన సాక్ష్యం లేకుండా బానిసలనుంచి వెండి బంగారాలు కొన్నవారు దొంగలుగా శిక్షకు పాత్రులయేవారు. బేబిలోనియాలో క్రీ.పూ. 1728నుంచి 1686దాకా రాజ్యంచేసిన హమ్మురబీ కాలంలోనే ఈ చట్టాలు అమలులోకి వచ్చాయి.

చరిత్రలో ఏ యుగంలోనైనా విజ్ఞాన, సాంకేతికరంగాల్లో ప్రగతి కలిగినప్పుడల్లా ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ, వాటినిబట్టి సామాజిక సంబంధాల్లోనూ చెప్పుకోదగ్గ మార్పులు కలుగుతూ ఉండేవి. ప్రకృతినీ, ప్రపంచాన్నీ గురించిన అవగాహనలో కొత్త వైఖరి తలెత్తేది. పాత నమ్మకాలన్నీ కాలంచెల్లినవి గానూ, తప్పులతడకగానూ అనిపించేవి. కొత్త భౌతిక అవగాహన ఉత్పత్తి సంబంధాలను తారుమారుచేసి, ఒకప్పుడు శాశ్వతమనిపించిన పాతకాలపు భావనలను చెత్తబుట్టలోకి నెట్టేస్తూ ఉండేవి. ఉదాహరణకు గ్రీస్‌లో క్రీ.పూ. ఏడో శతాబ్దంనాటికే వర్తక వాణిజ్యాలు పెరగడంతో మనిషే కేంద్రంగా ఒక కొత్త తాత్వికచింతన మొదలయింది. అంతకుమునుపు దేవతలకూ, దెయ్యాలకూ ఉన్న ప్రాముఖ్యత తగ్గిపోయి భౌతికవాద దృక్పథం ఏర్పడింది. ఈ దశలోనే నిజమైన భౌతిక శాస్త్రాలకూ, ప్రకృతి పరిశీలనలకూ మూలాలు ఏర్పడ్డాయి. ఈ ధోరణివల్ల పండిన పంటలోనూ, సంపాదించిన డబ్బులోనూ కొంత శాతం దేవాలయాలకు సమర్పించడం శుద్ధదోపిడీయే నని కొందరు విమర్శించేంతదాకా వెళ్లింది.

సమాజంలో కూలీనాలీ చేసుకుని ఆహారోత్పత్తికీ, ఇతరరకాల ఉత్పాదకతకూ కాయకష్టం చేసేవారు నిత్యమూ తమకు కనబడుతున్న అసమానతను భరించాలంటే అదంతా చట్టబద్ధమేననీ, న్యాయ సమ్మతమేననీ వారికి అనిపించాలి. ఇటువంటి నమ్మకాలను నెలకొల్పడమే పూజారివర్గాల పని. ఒకవంక పాలకుల శౌర్య పరాక్రమాలను అతిశయోక్తులతో కీర్తిస్తూ, వారి అధికారానికి దైవికమైన అనుమతి ఉన్నట్టుగా ప్రజల్ని విశ్వసింపజేయడమే వారి ధ్యేయం. మరొకవంక తాము ఎంత బలవంతులైనా దైవానికీ, దేవుడికి అనుసంధానం కుదిర్చే పురోహితులకూ లోబడే ఉంటామని రాజులు బహిరంగంగా చాటేవారు. ఇటువంటి ప్రచారం యథాస్థితి కొనసాగడానికి తోడ్పడుతూ వచ్చింది.

సమాజం ఇతరత్రా ఎంత పురోగతిని సాధించినప్పటికీ పాతసిద్ధాంతాలు నమ్మదగినవేనని ఆధ్యాత్మికవర్గాలు చెపుతూనే ఉంటాయి. యూరప్‌లో మధ్యయుగాల్లో పోప్ వంటి మతాధికారులు క్రైస్తవ దేశాలను జెరూసలేంమీద క్రూసేడ్ మతయుద్ధాలు చెయ్యమని ప్రోత్సహించిన కాలంలో మతానిదే పైచెయ్యిగా ఉండేది. కాని సంస్కృతిక పునరుజ్జీవనం మొదలై, క్రైస్తవమతంలో చీలికలు ఏర్పడ్డాక ఆ మతాధికారుల బలం క్రమంగా తగ్గుతూవచ్చింది. నేటి పాశ్చాత్యదేశాల్లోని మతాధిపత్యం కేవలం కొన్ని సామాజిక సమస్యలకు పరిష్కారాలు సూచించడంతప్ప ఏమీచెయ్యడంలేదు. పైగా తమ మతాధికారుల్లోనే లైంగిక హింసకూ, ఇతర నేరాలకూ పాల్పడేవారు పట్టుబడుతున్న నేపథ్యంలో మింగలేక, కక్కలేక అవస్థలు పడుతోంది.

మనదేశంలో మటుకు ఆధ్యాత్మికవాదులు ఎన్ని జిత్తులకైనా పాల్పడుతూ వస్తున్నారు. పాత కాలపు తంతులకు బెదరని, ప్రభావితంకాని ఆధునికులను బుట్టలో వేసుకునేందుకు చిత్ర విచిత్రమైన వాదనలను తెస్తున్నారు. అత్యాధునిక పరికరాలద్వారా అంతరిక్షంలో ఎంతో దూరాన ఏదో గామా విస్ఫోటనం కనబడిందన్న వార్తకుకూడా ఏ భగవద్గీతలోనో సాక్ష్యం ఉందని నిరూపించడానికి వీరు విశ్వప్రయత్నం చేస్తూ ఉంటారు. వర్ణవ్యవస్థకూ, కులవ్యవస్థకూ వత్తాసుగా వీరు ఏ వేదాన్నో, మనుధర్మ శాస్త్రాన్నో, భగవద్గీతనో ఉదహరిస్తారు. కళ్ళకు కనబడుతున్న అన్యాయాన్ని ఎవరూ ఎదిరించే ప్రయత్నం చెయ్యకుండా పునర్జన్మ సిద్ధాంతాలనూ, కర్మను గురించిన ప్రతిపాదనలనూ తెస్తూ ఉంటారు. సైన్సును నమ్ముకుంటే లాభంలేదనీ, వైజ్ఞానిక ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయనీ, ప్రాచీన ప్రవచనాలు మాత్రం శాశ్వతమనీ చెపుతారు. సైన్సులో అంతిమసత్యాలేవీ ఉండవనీ, కొత్త సాక్ష్యాలు లభించినప్పుడల్లా అవసరమైతే ఉన్న సిద్ధాంతాలను సవరించుకోవడానికి విజ్ఞానం వెనకాడదనీ సామాన్యులకు అర్థంకాదు. జాతకాలూ, పూజలూ, శాంతులూ సమస్యలకు పరిష్కారాలు తెచ్చిపెట్టగలవనే నమ్మకం అధికారవర్గాలు బుద్ధిపూర్వకంగానూ, భావవాదులు అవివేకంతోనూ ప్రచారం చేస్తారు. సమాజాన్ని తమ చెప్పుచేతలతో ఉంచుకోవాలంటే హేతువాదాన్నీ, భౌతికవాదాన్నీ ఎవరూ నమ్మకుండా చెయ్యడమే ముఖ్యమని వీరికి బాగా తెలుసు.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త)

వీక్షణం పత్రికను వెబ్ పేజీల్లో కూడా చూడవచ్చు!

www.veekshanam.wordpress.com

మీ అభిప్రాయాలను, సూచనలను ఎప్పటికప్పుడు మాకు తెలియజేయండి!

తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న అన్వేషణలో మీరూ పాలుపంచుకోండి!

Email : veekshanam2003@gmail.com

స్పెక్ట్రమ్ మోసాలు

కేంద్ర టెలీ కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ 2జి స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు మంజూరు చేసిన 122 కంపెనీలలో 72 కంపెనీలు అర్హత ప్రమాణాలకు అనుగుణంగా లేవని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రకటించింది. టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రకటించిన అర్హత ప్రమాణాలు లేకున్నా 2008లో 72 కంపెనీలకు 2జి స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు మంజూరు చేశారని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

ముగిసిన కామన్‌వెల్త్ క్రీడలు

పందొమ్మిదో కామన్‌వెల్త్ క్రీడలు ఢిల్లీలో అక్టోబర్ 14న ముగిసాయి. ఈ క్రీడల్లో నిర్వహణ పరమైన లోపాలు, అవినీతి జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎనిమిది వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కేంద్ర నిఘా కమిషన్ (సివిసి) ఇప్పటికే తేల్చి చెప్పింది. నాలుగు సంవత్సరాల క్రితం మెల్‌బోర్న్‌లో జరిగిన క్రీడల్లో భారతదేశం 50 పతకాలు గెలుచుకొని నాలుగవ స్థానంలో నిలిచింది. ఈ క్రీడల్లో మన క్రీడాకారులు 38 స్వర్ణాలను, 27 రజతాలను, 36 కాంస్యాలను సాధించి, స్వర్ణాలను అత్యధికంగా సాధించిన దేశాల్లో మన దేశాన్ని రెండవ స్థానంలో నిలిపారు. జనాభాలో 2 శాతం మాత్రమే ఉన్న హర్యానా, మన దేశం సాధించిన 38 బంగారు పతకాల్లో 15 పతకాలను సాధించింది.

కాశ్మీర్‌లో కొనసాగుతున్న నిరసనలు

గత నెల 25న జరిగిన భద్రతా వ్యవహారాల కమిటీ తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా కాశ్మీరీ ప్రజలతో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ముగ్గురు మధ్యవర్తుల బృందాన్ని నియమించింది. అందులో జర్నలిస్టు దిలీప్ పద్గావ్‌కర్, సమాచార శాఖ కమిషనర్ ఎం.ఎం. అన్సారీ, విద్యావేత్త రాధా కుమార్‌లు ఉన్నారు. ఈ బృందం కాశ్మీర్‌లోని వివిధ వర్గాల, బృందాలతో చర్చలు జరుపుతుందనీ, అలాగే అందరూ ఈ బృందాన్ని కలిసి తమ అభిప్రాయాలను తెలియచేయాలనీ కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలిపారు. ఈమధ్య కొనసాగుతున్న ఆందోళనల కారణంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన వారి సంఖ్య వందకు పైగానే ఉంది. ఇప్పటికీ కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతూనే ఉంది.

స్విస్ బ్యాంకుల్లో మన డబ్బెంత?

స్విస్ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నల్లధనం ఎంత అనే అంశంపై దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దీనిపై స్పదించాల్సి ఉంది. నల్లధనం ఎంతో బయట పెట్టాల్సిందిగా ఇడిని కేంద్ర సమాచార కమిషన్ ఆదేశించింది. ఇంతవరకు దర్యాప్తులో కనుగొన్న విషయాలను ప్రజలకు తెలియపర్చాలని సూచించింది. సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) పరిధిలోకి తాము రామని, దర్యాప్తు వివరాలు బయట పెట్టలేమని ఇడి చేసిన వాదనను సమాచార కమిషన్ తోసిపుచ్చింది. నల్లధనం అవినీతితో కూడిన అంశం. ఎంత డబ్బు విదేశీ ఖాతాల్లో ఉందో ప్రజలకు తెలియనివ్వండని ఇడిని ఆదేశించింది.

అయోధ్య తీర్పుపై సుప్రీంకోర్టుకు...

ఆయోధ్యలోని వివాదస్పదమైన 2.77 ఎకరాల భూమిని మూడు భాగాలుగా విభజించాలని అలహాబాద్ హైకోర్టు బెంచ్ తీర్పునిచ్చింది. ఈ తీర్పును నిరాకరిస్తూ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు , విహెచ్‌పితో సహా పలు మత సంస్థలు సుప్రీం కోర్టుకు వెళ్లాలనుకుంటున్నాయి. దీంతో స్థల యాజమాన్య హక్కుపై కోర్టు వెలుపల పరిష్కారానికి తెరపడింది. అలహాబాద్ హైకోర్టు బెంచ్ ఇచ్చిన తీర్పును అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ మొదటి వారంలో సుప్రీం కోర్టులో సవాలు చేయాలని ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు నిర్ణయించింది.

గిడ్డంగుల్లో కుళ్లుతున్న ఆహార ధాన్యాలు

ప్రజలు ఆకలితో చనిపోతుంటే గిడ్డంగుల్లో పెద్ద ఎత్తున ఆహార ధాన్యం నిల్వలు కుళ్లిపోతుండడంపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి బాధ్యులైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ అంశాన్ని అత్యంత తీవ్రమైన అంశంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఏడువేల టన్నుల ఆహార ధాన్యం మాత్రమే భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో కుళ్లిపోయిందని ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ మోహన్ పరాశరన్ పేర్కొన్నారు. ఈ నష్టం పదేళ్లుగా కొనసాగుతోందనీ, ఇకనైనా ఈ వృథాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలనీ జస్టిస్ దల్వీర్ భండారి, దీపక్ వర్మలతో కూడిన ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్‌కు సూచించింది. పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం ఈ వ్యాఖ్యాలు చేసింది.

ఆకలి దేశాల్లో 67వ స్థానం

అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడతామని చెప్పుకుంటున్న మన దేశం ప్రపంచ దేశాల ఆకలి సూచీలో 67వ స్థానంలో ఉంది. అమెరికాకు చెందిన అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ (ఇఫ్ప్రి) మొత్తం 84 దేశాలలో 2010 సంవత్సరానికి ఆకలి సూచీని తయారు చేసింది. పిల్లల్లో పౌష్టికాహార లోపం, శిశు మరణాలు, తక్కువ కేలరీలు లభిస్తున్న జనాభా ఆధారంగా దీనిని తయారు చేస్తారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల్లో 42 శాతం మంది మనదేశంలో ఉన్నారని ఇఫ్ప్రి తెలిపింది. ఈ విషయాలను ఇఫ్ప్రి ఆసియా డైరెక్టర్ అశోక్ గులాటే అక్టోబర్ 10న ఢిల్లీలో వెల్లడించారు.

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు

బీహార్‌లో 293 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ఆరు విడతలుగా జరుగుతున్నాయి. అక్టోబర్ 21న మొదటి విడత పోలింగ్ మొదలైంది. నవంబర్ 20న చివరి విడత పోలింగ్‌తో ఓటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. రెండు, మూడు విడతల్లో పోటీ పడుతున్న అభ్యర్థులలో కోటీశ్వరుల సంఖ్య 104. 219 మంది నేరచరిత్ర కలిగి ఉన్నారు. వీరిలో 129 మంది హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. 'డెమోక్రటిక్ రీఫార్మ్ అసోసియేషన్', నేషనల్ ఎలక్షన్ వాచ్ అనే స్వచ్ఛంద సంస్థల అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి.

కర్ణాటకలో రాజకీయ బేరాలు

కర్ణాటకలో బిజెపి ఆపరేషన్ కమలం పేరిట ప్రతిపక్షం బలం తగ్గించి అధికారపక్షం బలం పెంచుకునేందుకు తమ ఎమ్మెల్యేలను కొనేందుకు ఒక్కొక్కరికి రు. 25 కోట్లు బిజెపి ఇవ్వజూపుతున్నదని జెడిఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి ఒక సిడిని విడుదల చేశారు. ఇందులో బిజెపి ఎమ్మెల్యే సురేష్ గౌడగా పరిచయం చేసుకున్న ఒక కంఠం, జెడిఎస్ ఎమ్మెల్యే గుబ్బి శ్రీనివాస్‌ను ప్రలోభపెడుతున్న సంభాషణ ఉందంటున్నారు.

దేశంలో పెరుగుతున్న కుబేరులు

అమెరికాకు చెందిన ఫోర్బ్ పత్రిక భారతదేశానికి చెందిన వంద మంది కుబేరుల జాబితాను 2010 సంవత్సరానికి రూపొందించింది. ఈ జాబితాలో వరుసగా రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ అగ్రస్థానంలో ఉంటున్నారు. ఆయన సంపద విలువ 2700 కోట్ల డాలర్లు. ముకేష్ తరువాతి స్థానాన్ని లక్ష్మీనివాస్ మిట్టల్ దక్కించుకున్నారు. వీ

బ్రిటన్‌లో ఆందోళనలు

బ్రిటిష్ ఆర్థిక మంత్రి జార్జి ఒస్‌బోర్నే ప్రకటించిన బడ్జెట్ కోతలకు నిరసనగా బ్రిటన్ అంతటా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ బడ్జెట్ కోతల వల్ల దాదాపు ఐదు లక్షల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ప్రయోజనాలు, సేవలను తొలగించే ఈ పొదుపు చర్యలు పేద ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆర్థికవేత్తలు తెలిపారు. సాధారణ పౌరులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని అన్నారు.

ఛావెజ్ పార్టీ విజయం

వెనిజూలాలో 165 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికలలో హ్యూగో ఛావెజ్ పార్టీకి 93 సీట్లు లభించాయి. సెప్టెంబర్ 27న ప్రకటించిన ఫలితాల ప్రకారం ప్రతిపక్ష సంకీర్ణ టేబుల్ ఫర్ డెమోక్రటిక్ యూనియన్‌కు 60 స్థానాలు, ఇతర ప్రతిపక్ష అభ్యర్థులకు రెండు స్థానాలు లభించాయి. అయితే ఛావెజ్ పార్టీ మూడింట రెండు వంతులు మెజారిటీ సాధించడంలో విఫలమయింది.

పెరూ రచయితకు సాహిత్య నోబెల్

పెరూ రచయిత మారియో వర్గాస్ లోసాకు నోబెల్ సాహిత్య బహుమతి లభించింది. 1936లో పెరూలోని అరెక్విపాలో ల్లోసా జన్మించారు. ఆయన 'కాన్వర్సేషన్ ఇన్ ది కెథడ్రల్', 'ది గ్రీన్ హౌస్' సహా ముప్పైకి పైగా నవలలు, నాటకాలు, వ్యాసాలు రచించారు. ఆయన రచనల్లో దాదాపు ఇరవైకి పైగా ఇంగ్లిష్‌లోకి అనువాదం అయ్యాయి. 1960 దశకంలో రచించిన 'ది టైమ్ ఆఫ్ ది హీరో' నవలకు ఆయనకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది.

తియానన్మెన్ అమరులకు శాంతి నోబెల్ అంకితం

నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న మొట్టమొదటి చైనీయుడు లీ జియవోబో తన నోబెల్ తియానన్మెన్ అమరులుకు అంకితం చేశారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు. 1989లో ప్రజాస్వామ్య పరిరక్షణకు తియానన్మెన్ స్క్వేర్‌లో ఉద్యమం చేస్తున్న ఆందోళనకారులను చైనా ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. ఈ సందర్భంగా ఎంతోమంది చనిపోయారు. వారందరికీ తన నోబెల్ శాంతి బహుమతిని జియవోబో అంకితం ఇచ్చారు. ఆయన భార్య లీ జియను ఉటంకిస్తూ అమెరికా నుంచి పని చేస్తున్న చైనా మానవ హక్కుల సంఘం (ఎచ్.ఆర్.ఐ.సి.) ఈ విషయాన్ని ప్రకటించింది. శాంతి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణకు అహింసాయుతంగా ఉద్యమం చేసి వారు తమ ప్రాణాలు కోల్పోయాలని జియవోబో వాఖ్యానించినట్లు లీ తెలిపారు. శాంతి బహుమతి ప్రకటించిన తరువాత జైలులో ఉన్న జియవోబోను కలిసి మాట్లాడి వచ్చిన ఆయన భార్యను కూడా చైనా అధికారులు గృహ నిర్బంధంలో ఉంచారని ఎచ్.ఆర్.ఐ.సి. తెలిపింది.

ఇరాకీల ఊచకోత

2004–08 సంవత్సరాల మధ్య అమెరికా దళాలు జరిపిన దాడులలో డెబ్బై అరవై ఆరు వేల మంది ఇరాక్ ప్రజలు చనిపోయారని వికీలీక్స్ వెబ్‌సైట్ తెలిపింది. రోడ్డుపైనున్న పౌరులను హెలికాప్టర్ల నుంచి తుపాకులతో కాల్చి చంపడం, పురిటి నొప్పులు పడుతున్న మహిళను త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లడానికి చెక్‌పోస్టును వేగంగా దాటుతున్న కారుపై బుల్లెట్ల వర్షం కురిపించడం, లొంగిపోవడానికి వస్తున్న వారిని కాల్చి చంపడం, వందలాది మంది నివాసం ఉండే భవనంపై ఒక్క మిలిటెంట్ ఉన్నా ఆ భవనం మొత్తాన్ని కూల్చేయడం ఇలా అమెరికా సైన్యాలు ఇరాక్‌లో ప్రజల ప్రాణాలు బలిగొన్నదని వికీలీక్స్ బయటపెట్టింది. జనవరి 2004 నుంచి డిసెంబర్ 2009 మధ్య ఇరాక్ యుద్ధంలో 1,09,032 మంది చనిపోయినట్లు సైనిక పత్రాల్లో వివరాలున్నాయి. మృతుల్లో సాధారణ పౌరులు 66,081 మంది. అంటే ప్రతిరోజు సగటున 31 మంది చనిపోయారు. ఇవి అధికారిక లెక్కలేననీ, నమోదు కానివి ఇంకా మరెన్నో ఉంటాయని తెలుస్తోంది.

ఫ్రాన్స్‌లో నిరసనలు

ఫ్రాన్స్‌లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయో పరిమితిని పెంచడాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. అధ్యక్షుడు నికొలస్ సర్కోజీకి, కార్మిక సంఘాలకు మధ్య తీవ్ర పోరు నడుస్తోంది. అధికారిక పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలనే ప్రభుత్వ ప్రణాళికలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు సమ్మె ప్రారంభించాయి. సమ్మెలో విద్యార్థులు, ట్రక్కర్లు కూడా పాల్గొనడంతో నిరసన తీవ్ర రూపం దాల్చింది. దీంతో రవాణా వ్యవస్థ, పాఠశాలలు, చమురు రిఫైనరీలకు తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. విమానాశ్రయాన్ని దిగ్బంధించడంతో విమానాల రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. ప్రభుత్వం చేపడుతున్న ఆర్థిక సంస్కరణల వల్ల ఉద్యోగ, కార్మికవర్గం భారీగా నష్టపోతోందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

చిలీ గని కార్మికుల వెలికితీత

చిలీలో అంటకామ ఎడారిలోని బంగారు – రాగి గనుల్లో ఆగస్ట్ 5న జరిగిన ప్రమాదంలో గనుల్లోని కొంతభాగం కుప్పకూలిపోవడంతో 33 మంది కార్మికులు గని లోపల చిక్కుకుపోయారు. కార్మికులను రక్షించేందుకు చిలీ నౌకాదళానికి చెందిన ఇంజనీర్లు ప్రత్యేకంగా ఒక లోహపు గొట్టాన్ని తయారు చేశారు. దీని సహాయంతో గని అడుగున 622 మీటర్ల లోతున చిక్కుకుపోయిన కార్మికులను వెలికితీశారు. దాదాపు 68 రోజుల పాటు వాళ్లు గనిలోపలే చిక్కుకున్నారు. అక్టోబర్ 13 నుంచి మొదలైన ఈ ఆపరేషన్ 14న రాత్రి పూర్తయింది. క్యాప్స్యూల్, వించ్ సిస్టమ్ ద్వారా కార్మికులకు ప్రాణహాని జరగకుండా బయటకు తీసుకువచ్చారు.

హైతీలో కలరా వ్యాధి

భూకంపం సంభవించిన తొమ్మిది నెలలు గడుస్తున్నా హైతీ ప్రజలు ఇంకా తేరుకోలేదు. సరైన మౌలిక సదుపాయలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. రాజధాని పోర్ట్ ఆఫ్ ప్రిన్స్ సమీపంలో తాత్కాలిక టెంట్‌లలో ఉంటున్న ఒక కోటీ ముప్ఫై లక్షల మంది హైతీ ప్రజలకు ఇప్పుడు కలరా వ్యాధి ముప్పు ఏర్పడింది. ఇప్పటి దాకా దాదాపు రెండు వందల యాభై మందికి పైగా ఈ వ్యాధితో మరణించారు. అధిక సంఖ్యలో ప్రజలు ఒకే దగ్గర ఉండడంతో తాగునీరు, పారిశుద్ధ్యం లోపించడంతో కలరా వ్యాధి వేగంగా వ్యాపించే అవకాశం ఉంది.

పాకిస్తాన్‌లో శరణార్థులు

జూలైలో వచ్చిన వరదల కారణంగా పాకిస్తాన్‌లో దాదాపు రెండు కోట్ల మంది ప్రజలు తమ సర్వస్వాన్ని కోల్పోయారు. ఇప్పటికీ డెబ్భై లక్షల మందికి నివాసం లేదు. ఇంకా చాలా మందికి సరైన మౌలిక సదుపాయాలు అందడం లేదు. పాకిస్తాన్‌ను ఆదుకోవడానికి ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ విరాళాలు అర్థించింది. 346 మిలియన్ డాలర్ల సహాయం అడగగా ఇప్పటి వరకు అందులో ఇరవై శాతం మాత్రమే అందింది. వరదలలో దాదాపు రెండు వేల మంది మరణించారు. కానీ, ఇప్పుడు సరైన తిండి, వసతి, పోషకాహార లోపం, వ్యాధుల వల్ల ఇంకా చాలా మంది మరణించే అవకాశం ఉందని అక్కడ వైద్య సహాయం అందిస్తున్న వారు అంటున్నారు.

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 సెప్టెంబర్ 2010 నుండి 20 అక్టోబర్ 2010 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1590)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్	1	5	–	24	22	8	6	2	3	3	2	2	2	1	18	30	–	–	–	–	–
హైదరాబాద్	–	–	–	6	5	–	1	–	1	6	3	10	–	–	33	21	–	–	–	6	–
కరీంనగర్	–	3	1	22	40	10	23	1	3	16	4	5	4	8	27	38	–	1	–	3	2
ఖమ్మం	–	–	–	13	11	5	13	3	2	7	5	3	1	10	39	31	–	1	–	–	–
మెదక్	–	4	–	11	16	4	13	1	3	1	6	3	–	15	30	21	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	6	16	2	4	4	1	4	2	1	4	–	21	29	–	–	–	–	–
వరంగల్	వివరాలు అందలేదు																				
చిత్తూరు	–	–	–	14	11	5	5	–	–	–	5	8	32	–	70	–	–	–	–	–	–
కర్నూలు	–	2	–	8	18	4	5	4	2	5	2	6	6	5	36	23	–	–	–	4	1
తూర్పు గోదావరి	–	1	–	10	17	–	6	8	1	1	1	2	1	7	35	24	–	–	–	4	–
గుంటూరు	–	1	–	4	12	6	5	7	–	–	5	9	1	8	19	10	–	1	–	2	1
నెల్లూరు	–	–	–	5	8	1	2	1	–	3	3	7	2	2	23	13	–	–	–	–	1
శ్రీకాకుళం	–	–	–	5	7	4	3	6	4	5	–	–	–	3	12	1	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	7	4	2	4	–	3	3	–	–	2	3	21	15	–	–	–	1	2
ప్రకాశం	–	4	–	–	–	11	25	–	5	5	–	3	–	–	48	10	–	–	–	–	3
మొత్తం	**1**	**20**	**1**	**135**	**187**	**62**	**115**	**37**	**28**	**59**	**38**	**59**	**55**	**62**	**432**	**266**	**–**	**3**	**–**	**20**	**10**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; వరంగల్ – ఎ.కుమార్; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; నెల్లూరు – బాలగురువయ్య; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. అరుణ; ప్రకాశం – ఎల్. సాంబశివరావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

వ్యాసరచనలో కృషి చేయదలిచారా?
రండి, వీక్షణం సహకారం తీసుకోండి!

ఒకరికి ఉండే భావాలను నలుగురితో పంచుకోవడానికీ, వివరించడానికీ, నిర్ధారించడానికీ, ప్రచారం చేసి వ్యాపింపజేయడానికీ, విశ్లేషించడానికీ, భిన్నమైన భావాలు గలవాళ్లతో వాదించడానికీ, చర్చించడానికీ, వాళ్ళను తమ భావాలవైపు ఆకర్షించడానికీ అత్యవసరమైనది వ్యాస ప్రక్రియ. వ్యాసం సమాచారాన్ని, వాస్తవికతను, వివరణను, వాదనలను, తర్కాన్ని, చర్చను, విశ్లేషణను, సూటిదనాన్ని ఆశ్రయిస్తుంది. అంటే వ్యాసం ద్వారా రచయితలు తాము చెప్పదలచుకున్న భావాలను భిన్నమైన అర్థం రావడానికి అవకాశం లేకుండా సూటిగా వివరించడానికి, చదువరులను ఒప్పించడానికి ప్రయత్నించవచ్చు. ఆధునిక వచనరచనా ప్రక్రియలన్నిటిలోకీ అతి ముఖ్యమైనదీ, ప్రభావశీలమైనదీ, సమర్థమైనదీ, ప్రయోజనకరమైనదీ వ్యాసప్రక్రియ.

తెలుగులో అత్యవసరమైన రాజకీయార్థిక, సామాజిక అంశాలను చర్చించడానికి ఏర్పడిన వేదిక, **వీక్షణం** సామాజిక శాస్త్ర పత్రికగా పూర్తిగా వ్యాసాలతోనే వెలువడుతున్నది. ప్రతినెలా పన్నెండునుంచి పద్నాలుగు వ్యాసాలతో గత తొమ్మిది సంవత్సరాలలో దాదాపు పదహారు వందల వ్యాసాలు ప్రచురించింది. ఈ వ్యాస రచయితలలో అప్పటికే వెయ్యి తిరిగిన, ఎన్నో వ్యాసాలు రాసినవారూ ఉన్నారు. **వీక్షణం** లోనే తమ మొదటి వ్యాసం అచ్చయి, వ్యాసరచనలోకి ప్రవేశించిన వారూ ఉన్నారు. వ్యాసరచయితలను తయారుచేసుకోవడంలో, ఉన్న వ్యాసరచయితల రచనాశైలిని మెరుగుదిద్దడంలో, వ్యాసరచనకు అవసరమైన నైపుణ్యం అందించడంలో తగిన సహకారం అందించడం తన బాధ్యతగా **వీక్షణం** భావిస్తున్నది. తగిన కృషి జరగకపోవడం వల్ల లోపాలబారినపడిన ఒక ముఖ్యమైన ప్రక్రియను మెరుగుపరిచే ప్రయత్నం ఇది. భవిష్యత్ వ్యాస రచయితలను తయారు చేసే ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా వ్యాసరచయితలకు, వ్యాసరచయితలు కాదలచుకున్నవారికి ఉపయోగపడే అధ్యయన తరగతిని **వీక్షణం** గత మూడు నెలలుగా నిర్వహిస్తున్నది.

ఈ కృషిలో భాగంగానే **కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు వ్యాసరచన పోటీని** నిర్వహించాలని వీక్షణం భావిస్తున్నది. విద్యార్థులు తమకు అభిరుచి ఉన్న ఏదైనా అంశం పైన ఎనిమిది ఫూల్ స్కేప్ పేజీలకు మించకుండా వ్యాసం రాసి వీక్షణం చిరునామాకు డిసెంబర్ 1 లోపు పంపించాలి. విజేతల వ్యాసాలు వీక్షణంలో అచ్చవుతాయి. విజేతలకు తగిన, విలువైన పుస్తకాల రూపంలో బహుమతులుంటాయి. వీటితో పాటు విజేతలు వీక్షణం వ్యాసరచయితలలో భాగస్తులవుతారు. వారికి అభిరుచి ఉన్న అంశాల మీద వీక్షణం కు క్రమం తప్పకుండా వ్యాసాలు రాసే అవకాశం దొరుకుతుంది.


వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com


VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 112 - November 2010
• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/10/2010 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10




ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న
వీక్షణం పబ్లికేషన్స్
సి.డి.ఆర్.సి. ప్రచురణలు



ముదునూరి భారతి
ఆర్.ఎస్. రావు




పుస్తకాల ఆవిష్కరణ
చర్చా సమావేశం





అందరూ
ఆహ్వానితులే

2010 నవంబర్ 12
శుక్రవారం
మధ్యాహ్నం 2 గం. నుంచి



స్థలం :
కాన్ఫరెన్స్ హాల్
స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
గచ్చిబౌలి, హైదరాబాద్



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao